

ఈనాడు

విజయవాడ 6-1-2019 ఆదివారం సిటీ సంపుటి 45 . సంచిక 147

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 8-00 పేజీలు 18+28+32 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi





సంక్రాంతి.. ప్రకృతి పండగ.

మనిషికీ మట్టికీ.. మనిషికీ ప్రకృతికీ.. ముఖ్యంగా మనిషికీ సూర్యుడికీ మధ్యనున్న అన్యోన్య సంబంధాన్నీ, అవినాభావ అనుబంధాన్నీ నొక్కిచెప్పే పండగ.

ఈ భూమి మీది ప్రతి జీవికీ ప్రత్యక్ష దైవమైన సూర్యుడి మకర ప్రవేశం.. రైతన్నలు కష్టించి పండించిన ధాన్యలక్ష్మి గృహప్రవేశం... ఈ రెండు శుభాల సంగమ సంరంభం సన్‌క్రాంతి!

అందుకే సంక్రాంతి అనగానే ఒక్కసారిగా మన కళ్ల ముందు పల్లె తల్లి మెదులుతుంది. గడపగడపకూ కళకళలాడుతూ వేలాడే కొత్త కంకుల సౌభాగ్యాలు గుర్తుకొస్తాయి.

పల్లెలు మన పునాదులు. దేశ ఆర్థిక రంగానికే కాదు.. మన సంస్కృతికీ, సామాజిక జీవితానికీ పట్టుగొమ్మలు. మారిన కాలంతో పాటే మనం పట్టణాలను నమ్ముకుని ఎంత పైపైకి ఎదిగినా.. ఎన్ని పదుల అంతస్తులెక్కినా.. మన తల్లి వేర్లు మాత్రం పల్లె ఒళ్లోనే ఉన్నాయి. మన భాష, మన భావం, మన సామెతలు, మన ఆలోచనలు, మన అనుబంధాలు, మన అనురాగాలు.. అన్నీ పల్లెపట్టుల్లో సంక్రాంతి ముగ్గుల్లా అందంగా ఆరబోసుకుని ఉన్నాయి.

అందుకే మనం వేర్లు తెగిన చెట్లం కాకుండా ఉండేందుకు.. మన పిల్లలకు ఆ పునాదులను పరిచయం చేసేందుకు.. వాళ్లను తీసుకువెళ్లి ఆ పల్లె ఒడిలో కూర్చోబెడదాం. నులి వెచ్చటి సూర్యకిరణ స్పర్శలో.. ఆ భోగిమంటల వెలుగులో.. వాళ్ల కళ్లు ఇంతింత చేసుకుని కోళ్లనూ, కాడెద్దు జోళ్లనూ చూస్తూ.. గడ్డివాములనూ, గంగిరెద్దులనూ పలకరిస్తూ.. మూలాలతో ముడివేసుకుంటూ.. ఆత్మీయతలను పెనవేసుకుంటూ.. పచ్చటి ప్రకృతితో మమేకమవుతుంటే.. అదెంత కన్నుల పండువ! దానికి ఈ సంక్రాంతిని మించిన సుముహూర్తం ఏముంటుంది..? ఈ ప్రకృతి పండగను మించిన పర్వదినం ఏముంటుంది..?

పల్లెకు పోదాం.. పండగ చేద్దాం 7లో





వెండి తెరపై తెలుగువెలుగు

తెలుగు నేతలు, క్రీడల్లో మెరిసిన తారలు వెండితెరపై మళ్లీ ప్రత్యక్షమవుతున్నారు. సినీ జగత్తులో సువర్ణాధ్యాయాన్ని లిఖించిన నట సార్వభౌముడు ఎన్టీఆర్ చరిత్ర దృశ్య కావ్యంగా ఆవిష్కృతమవుతోంది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రస్థానం 'యాత్ర'గా వెండితెరకు ఎక్కుతోంది. బ్రిటిష్‌వారి గుండెల్లో నిద్రపోయిన స్వాతంత్ర్యయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి త్వరలో 'సైరా' అంటూ వస్తున్నారు. ప్రస్తుతం మన మధ్యే ఉంటూ మణిపూసలుగా నిలుస్తున్న బ్యాడ్మింటన్ తారలు సైనా నెహ్వాల్, పీవీ సింధు, గోపీచంద్‌ల పాత్రలూ వెండితెరపై అలరించనున్నాయి.

- ఈ విశేషాల సమాహారం **ఈనాడు ఆదివారం** సంచికలో..



మా దగ్గరే ఉండండి

- విదేశీ విద్యార్థులకు ట్రంప్ విజ్ఞప్తి
- అమెరికా సంస్థల వృద్ధికి తోడ్పడాలని అభ్యర్థన

12లో

పండగ తర్వాత
సంపూర్ణ మాఫీ

- తేదీలను ముందుగానే ప్రకటిస్తాం
- సాగుకు 9 గంటల విద్యుత్తు
- మోదీ అబద్ధాలకు ఒక్క ఓటూ పడదు
- జగన్ కేసులను మొదటికి తెచ్చేందుకే హైకోర్టు విభజన
- జన్మభూమిలో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలు

రాజాం - న్యూస్‌టుడే

'కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవడానికి కేంద్రం, ఆర్బీఐ, బ్యాంకులు సహకరించకపోయినా.. ఎవరు వద్దన్నా.. రూ.24 వేల కోట్ల రుణమాఫీ చేశాం. ప్రభుత్వం వద్ద డబ్బుల్లేకున్నా.. 10% వడ్డీతో వారి రుణాలు చెల్లించే బాధ్యత తీసుకున్నాం. మిగిలిన రుణాలను సంక్రాంతి దాటాక పూర్తి స్థాయిలో మాఫీ చేస్తాం. ఏయే తేదీల్లో మాఫీ చేసేది ముందుగానే ప్రకటిస్తాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లా రాజాం నియోజకవర్గం పొగిరిలో శనివారం నిర్వహించిన 'జన్మభూమి-మా ఊరు' సభలో ఆయన మాట్లాడారు. వ్యవసాయానికి ఇకపై తొమ్మిది గంటల విద్యుత్తును అందిస్తానని చెప్పారు. వచ్చే ఏడాది ఖరీఫ్ నాటికి యాప్ ద్వారా వ్యవసాయ పనిముట్లు పొలానికి వస్తాయని చెప్పారు. నాగావళి, వంశధార, గోదావరి, కృష్ణా, పెన్నా నదులను అనుసంధానం చేస్తున్నామని, గోదావరి నీటిని శ్రీకాకుళం వరకు తెచ్చి.. వంశధారకు అనుసంధానం చేస్తామని వెల్లడించారు. '25 లక్షల మంది కౌలుదారులకు రూ.9,411 కోట్ల రుణాలు మంజూరు చేసిన ఘనత తమదే. 4.76 లక్షల మంది రైతులకు ట్రాక్టర్లు, కోత మిషన్లను రూ.1300 కోట్ల రాయితీతో అందించాం. ఇకపై (మిగతా 2లో)

> విశాఖలో జగన్‌పై దాడి కేసును కేంద్రం ఎన్ఐఏకి అప్పగించింది. ఇది కావాలని చేసిందే. జగన్ అభిమానినని, సానుభూతి వస్తుందనే ఈ పనిచేశానని దాడి చేసిన వ్యక్తే స్పష్టంగా చెప్పాడు. అలాంటి కేసునూ ఎన్ఐఏకి అప్పగించారంటే.. ఏం చెప్పాలో ఆలోచించండి.

పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యం

- మరోసారి దావోస్‌కి సీఎం చంద్రబాబు
- ఈ నెల 22 నుంచి 25 వరకు పర్యటన
- ప్రముఖ పారిశ్రామిక, వాణిజ్యవేత్తలతో ద్వైపాక్షిక సమావేశాలు

2లో



శ్రీకాకుళం జిల్లా రాజాం మండలం పొగిరి గ్రామంలో 85 ఏళ్ల వృద్ధురాలు కాములమ్మను ఆప్యాయంగా పలకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



కాంక్రీట్ రికార్డుకు సిద్ధం

పోలవరంలో అరుదైన రికార్డు ఆవిష్కరణకు రంగం సిద్ధమైంది. దుబాయ్‌లో ఒక టవర్ నిర్మాణానికి వేసిన కాంక్రీట్ రికార్డును అధిగమించేందుకు పోలవరంలో 24 గంటల్లోనే 30వేల ఘ.మీ. కాంక్రీట్ వేయనున్నారు. ఆదివారం ఉదయం 8గంటలకు పని ప్రారంభించి సోమవారం ఉదయం 8గంటలకు పూర్తిచేయనున్నారు. 2లో

కన్నూర్‌లో బాంబుల మోత!

- భాజపా-సీపీఎం కార్యకర్తల పరస్పర దాడులు
- 'అయ్యప్ప ఆలయంలోకి మహిళల ప్రవేశం'పై కేరళలో కొనసాగుతున్న ఉద్రిక్తత



గడ్డకట్టిన కశ్మీర్

- లోయకు రహదారి, ఆకాశమార్గాలు బంద్
- శ్రీనగర్‌లో 10 అంగుళాల మేర మంచు

12లో

బెంగళూరు భళా

ప్రొ కబడ్డీ ఫైనల్లో విజయం

3 నెలల పాటు అభిమానులను ఉర్రూతలూగించిన ప్రొ కబడ్డీ ఆరో సీజన్ తుదిపోరులో బెంగళూరు బుల్స్ జట్టు తొడకొట్టింది. పవన్ షెరావత్ మాయతో చివరి పంగాలో విజయం సాధించి తొలిసారి పీకేఎల్ ఛాంపియన్‌గా బెంగళూరు నిలిచింది. చివరి వరకూ అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో గుజరాత్ పరాజయం పాలైంది.



పూర్తి వివరాలు ఛాంపియన్‌లో

అఖిలేశ్‌పై సీబీఐ దర్యాప్తు!

- ఇసుక అక్రమ తవ్వకాల కేసులో తనిఖీలు
- తెలుగు ఐఏఎస్ అధికారి చంద్రకళ నివాసాలు సహా పలుచోట్ల సోదాలు

వివరాలు 12లో

కేంద్ర హామీల అమలుపై నిపుణుల నివేదిక

- రేపు విజయవాడలో విడుదల
- జయప్రకాశ్ నారాయణ్ కన్వీనర్‌గా కమిటీ అధ్యయనం

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు, అవి ఎంత వరకు అమలయ్యాయన్న అంశాలపై వాస్తవాల అధ్యయనానికి ప్రజాస్వామ్య పీఠం (ఫౌండేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్) ఏర్పాటు చేసిన స్వతంత్ర నిపుణుల బృందం నివేదికను సోమవారం విజయవాడలో విడుదల చేయనున్నారు. పదిహేను మంది నిష్ణాతులు నిష్పాక్షికంగా అధ్యయనం చేసి ఆ నివేదిక రూపొందించినట్లు లోక్‌సత్తా శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఫౌండేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ సంస్థకి లోక్‌సత్తా కన్వీనర్ జయప్రకాశ్ నారాయణ్ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. స్వతంత్ర నిపుణుల కమిటీకి ఆయన కన్వీనర్‌గా వ్యవహరించారు. ఆ నివేదికను తెలుగు రాష్ట్రాలతో సంబంధంలేని నలుగురు జాతీయ స్థాయి నిపుణులు.. కేంద్ర మాజీ మంత్రి డా. వై.కె.అలగ్, 13వ ఆర్థిక సంఘం సభ్యుడు ప్రొ.అతుల్‌శర్మ, 14వ ఆర్థిక సంఘం సభ్యుడు డా.ఎం.గోవిందరావు, మద్రాస్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ డైరెక్టర్ ప్రొ.కె.ఆర్.షణ్ముగం పరిశీలించి ఆమోదముద్ర వేసినట్టు లోక్‌సత్తా పేర్కొంది. నివేదికను సోమవారం సాయంత్రం విజయవాడ బెంజి సర్కిల్ వద్ద ఉన్న 'వేదిక' హాల్‌లో విడుదల చేయనున్నట్టు తెలిపింది.

పోలవరాన్ని సందర్శించనున్న డ్యాం ఆకృతుల కమిటీ

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జల సంఘం ప్రత్యేకంగానియమించిన డ్యాం ఆకృతుల కమిటీ ఆది, సోమవారాల్లో ప్రాజెక్టును సందర్శించనుంది. నిర్మాణ పురోగతి, పెండింగులో ఉన్న వివిధ ఆకృతులపై ఈ కమిటీ సమావేశంలో చర్చ జరగనుంది. కమిటీ ఛైర్మన్ పాండ్యా నేతృత్వంలో పోలవరం ఇంజినీర్లు, అధికారులు భేటీ కానున్నారు.

పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యం



- మరోసారి దావోస్‌కి ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు - అమరావతి

రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించడం, ప్రపంచదేశాల్లో ప్రత్యేక గుర్తింపు లభించేలా చూడటం, ఇక్కడి పెట్టుబడి అవకాశాలు, పారిశ్రామిక అనుకూల విధానాలను అగ్రశ్రేణి వాణిజ్య, పారిశ్రామికవేత్తలకు వివరించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మరోసారి దావోస్ వెళుతున్నారు. ఆయన వెంట 16మంది సభ్యులతో కూడిన భారీ ప్రతినిధి బృందం వెళుతోంది. ఈనెల 22 నుంచి 25 వరకు అక్కడ జరిగే 49వ ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్ చురుకైన పాత్ర పోషించనుంది. వరుసగా రెండేళ్లుగా ఏర్పాటు చేస్తున్నట్టే... ఈసారి కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకలాంజ్ ఏర్పాటు చేయనుంది. ఇందులో అగ్రశ్రేణి వాణిజ్య, పారిశ్రామిక ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, మేధావులు, విద్యావేత్తలతో ముఖ్యమంత్రి ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించనున్నారు. డబ్ల్యూఈఎఫ్‌లో ఈసారి కూడా 'టెక్నాలజీ ఫర్ టుమారో కాన్ఫరెన్స్'ని నిర్వహించనుంది. ఈసారి బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీ), ఐడియా వర్క్స్ సంస్థలతో కలసి ఈ సదస్సు నిర్వహిస్తోంది. అత్యుత్తమ శాస్త్రవేత్తలు, టెక్నాలజీల ఆవిష్కర్తల్లో 150 నుంచి 200 మంది వరకు హాజరవుతారని ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి మండలి సీఈఓ జాస్తి కృష్ణ కిశోర్ తెలిపారు. "వాళ్ల ఆవిష్కరణలను తెలుసుకునేందుకు, మన సాంకేతికతను వివరించేందుకు అదో అత్యుత్తమ వేదిక. ప్రపంచంలోని అత్యుత్తమ సాంకేతికతను, నవకల్పనలు తీసుకురావడమే ముఖ్యోద్దేశం. ఆంధ్రప్రదేశ్‌తో కలసి పనిచేయాల్సిందిగా వారిని ఆహ్వానిస్తాం. ప్రపంచవ్యాప్తంగా భారతదేశానికి, మన రాష్ట్రానికి గౌరవం పెంచేందుకు ఇలాంటి సదస్సులు తోడ్పడతాయి..." అని ఆయన పేర్కొన్నారు. పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయం (జెడ్‌బీఎన్ఎఫ్)పై సదస్సుకు శాస్త్రవేత్తలు, నిపుణులను ఆహ్వానించగా... జాతీయవాదంపై సదస్సుకి రిజర్వ్‌బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురామ్‌రాజన్ హాజరవనున్నారు. ఆకర్షణీయ నగరాలపై జరిగే సదస్సుకి పట్టణ ప్రణాళిక నిపుణులు, ఈ నగరాలకు అవసరమైన ఉత్పత్తులు తయారు చేసే సంస్థల సీఈఓలు హాజరవుతారు. అమరావతిని ఆకర్షణీయ నగరంగా తీర్చిదిద్దే ప్రక్రియలో పాలుపంచుకోవాల్సిందిగా వారిని రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించనుంది. ప్రముఖ సంస్థల సీఈఓలతో ప్రత్యేక సమావేశాన్ని (సీఈఓల ఫోరం) నిర్వహించనుంది. దీనికి సింగపూర్ ఆర్థిక మంత్రి చంద్రశేఖరన్, ఆనంద్ మహీంద్రా వంటి పారిశ్రామిక ప్రముఖులు ప్యానలిస్ట్‌లుగా హాజరవనున్నారు.

బ్రాండింగ్‌లో మనకు మించినవాళ్లు లేరు: కృష్ణకిశోర్

"దావోస్‌కి వివిధ దేశాల అధినేతలు, ప్రపంచంలోని ప్రముఖ సంస్థల యజమానులు, సీఈఓలు, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన విశ్వవిద్యాలయాల వైస్‌ఛాన్స్‌లర్లు, వివిధ దేశాల మంత్రులు, శాస్త్రవేత్తలు... ఇంకా వివిధ రంగాల ప్రముఖులు హాజరవుతారు. ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచం గుర్తించేలా చేయగలిగాం. బ్రాండింగ్‌లో మనకు మించిన వారు లేరు. ఈ విషయాన్ని ప్రముఖ బ్రాండింగ్ గురు అమితాబ్‌కాంత్ స్వయంగా చెప్పారు. భారతదేశానికి వచ్చేవారంతా మొదట ఆంధ్రప్రదేశ్ గురించే అడుగుతారని, అంత గొప్పగా చేశారని డీఐపీపీ సెక్రటరీ రమేష్ అభిషేక్ బహిరంగంగా కొనియాడారు. మనం ఏర్పాటు చేసే భోజనం చాలా మంది ఇష్టంగా తింటారు. శ్రీలంక ప్రధాని కూడా ప్రత్యేకంగా మన లాంజ్‌కి భోజనానికి వచ్చారు..." అని కృష్ణకిశోర్ వివరించారు.

40కి పైగా సమావేశాలు..!

ముఖ్యమంత్రి చంద్రబాబు బృందం దావోస్ పర్యటనలో భాగంగా 40కిపైగా అత్యున్నతస్థాయి సమావేశాల్లో పాల్గొననుంది. డబ్ల్యూఈఎఫ్ వార్షిక సమావేశానికి హాజరై ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడి అవకాశాలను వివరిస్తుంది. ఒక పక్క ముఖ్యమంత్రి పలువురు ప్రముఖులతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహిస్తున్న సమయంలో... ఆయన వెంట వెళ్లిన అధికారులు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో సమాంతరంగా భేటీ అవుతారు. మౌలికవసతులు, ఆరోగ్యం, ఔషధాలు, పర్యాటకం, బ్యాంకింగ్, ఆర్థిక, తయారీ, విద్య... తదితర రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు, ఆధునిక సాంకేతికతను ఆకర్షించడం లక్ష్యంగా ఇవి జరుగుతాయి. 2018లో మన లాంజ్... ఐదు అత్యుత్తమ వాటిల్లో ఒకటిగా నిలిచిందని కృష్ణకిశోర్ తెలిపారు. ప్రతి రోజు వెయ్యి మందికి పైగా సందర్శించే వారన్నారు. గత మూడేళ్లలో చంద్రబాబు సారథ్యంలో రాష్ట్ర ప్రతినిధుల బృందం కుదుర్చుకున్న ఒప్పందాల్లో భాగంగా రాష్ట్రంలో రూ. 10వేల కోట్లతో ప్రాజెక్టులు మొదలయ్యాయని, మరో రూ.20వేల కోట్ల పెట్టుబడుల ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు.

పండగ తర్వాత సంపూర్ణ మాఫీ



రాజాం మండలం పొగిరి గ్రామంలో ట్రాక్టర్‌పై నుంచి విజయ సంకేతం చూపుతున్న చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

ట్రాక్టరు కావాలంటే.. యాప్ కొడితే చాలు. మీ స్మార్ట్‌ఫోన్‌లో ఒక బటన్ నొక్కితే.. మిషన్ వచ్చే ఏర్పాటు చేస్తాను. తక్కువ ఖర్చుతో పనవుతుంది...' అని వివరించారు. ప్రతి ఇంటికి ఒక స్మార్ట్‌ఫోన్ ఇస్తానన్నారు. 'డ్వాక్రా సంఘాలే నా శక్తి. వారే నా మానస పుత్రికలు. వాళ్లే ఈ ప్రభుత్వాన్ని ఆశీర్వదించారు. ఎప్పుడూ ఎల్లవేళలా వారికి అండగా ఉంటాను...' అంటూ కొనియాడారు.

మోదీకి ప్రజలు గుణపాఠం చెబుతారు

'ఒకప్పుడు నరేంద్రమోదీ మాటలగారడీతో ఓట్లు పడ్డాయి. ఇప్పుడు ఆయన చెప్పే అబద్ధాలతో ఒక్క ఓటు పడదు. ప్రజలు గుణపాఠం చెబుతారు. అసత్యాలను పదే పదే పలికి మభ్యపెట్టాలని చూస్తున్నారు...' అని చంద్రబాబు పేర్కొన్నారు. దీనికి అవునంటే గట్టిగా చప్పట్లు కొట్టాలంటూ.. ప్రజలతో చప్పట్లు కొట్టించారు. రాష్ట్ర అధికారాలను హస్తగతం చేసుకుంటున్నారని ఆరోపించారు. 'మోదీ పరిపాలన అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమైంది. యుద్ధ విమానాల కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడ్డారు. ముస్లిం మైనార్టీలపై తలాక్ తెచ్చి.. వాళ్లపై కేసులు పెడతామంటూ కుటుంబవ్యవస్థను సర్వనాశనం చేసే స్థాయికి దిగజారారు. షెడ్యూల్డ్ కులాలపైనా దాడులు పెంచుతున్నారు. జాతీయస్థాయిలో నదుల అనుసంధానం చేసి నీటి సమస్యను పరిష్కరించాల్సిన కేంద్రం...కర్ణాటక, తమిళనాడులో నీటి సమస్యలు సృష్టించి.. రెండు రాష్ట్రాల మధ్య విరోధం పెడుతోంది. మనకు, తెలంగాణాకు మధ్య విభేదాలు సృష్టిస్తోంది. విభజన చట్టాన్ని అమలు చేయాలి. ప్రత్యేకహోదా ఇవ్వాలి. అన్ని రాష్ట్రాలతో సమానంగా పైకి వచ్చే వరకు చేయూతనివ్వాలని డిమాండ్ చేస్తే.. అణగదొక్కే పరిస్థితికి వచ్చారు...' అని సీఎం చెప్పారు.

ఓట్ల కోసం మళ్లీ డబ్బు ఖర్చు చేయాలా?

'జనం కోసమే మేం కష్ట పడుతున్నాం. వేదిక మీదున్న వారంతా ప్రజల అభివృద్ధికే కష్టపడుతున్నారు. ఇంత చేస్తున్నప్పుడు ఎన్నికల్లో ఓట్ల కోసం మళ్లీ డబ్బు ఖర్చు చేయాల్సిన అవసరం ఏముంది...' అని చంద్రబాబు పేర్కొన్నారు. 'బ్యాంకులను దోపిడీ చేసిన వారంతా మోదీ హయాంలో విదేశాలకు వెళ్లిపోయారు. మళ్లీ వాళ్లను తీసుకొస్తామని ఇప్పుడంటున్నారు. అగ్రిగోల్డ్ వ్యవహారం కోర్టులో ఉన్నా తెదేపా ప్రభుత్వం గట్టిగా పోరాడుతోంది. బాధితులకు అండగా ఉంటాం. మేము న్యాయంగా ఆలోచిస్తూ జనం డబ్బులు వారి చేతికే అందే పరిస్థితి తెస్తున్నాం. ఈ ఉదాహరణతోనే... మోదీ పాలనకు.. మన పాలనకు తేడా తెలుస్తుంది...' అని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు.

కేసుల బూచితో మోదీకి జగన్ సరెండర్

'ఇక్కడ కోడి కత్తి పార్టీ ఉంది. ఆ కేసును కేంద్రం నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్ఐఏ)కి అప్పగించింది. ఇది కావాలని చేసిందే. విశాఖలో జగన్‌పై దాడి చేసిన వ్యక్తి షెడ్యూల్డ్‌వర్గానికి చెందిన వారు. నేను జగన్ అభిమానినని. సానుభూతి వస్తుందనే ఈ పనిచేశానని.... ఆయన చాలా స్పష్టంగా చెప్పాడు. అలాంటి.. కోడి కత్తి కేసును కూడా.. ఎన్ఐఏకి అప్పగించారంటే.. ఏం చెప్పాలో ఆలోచించండి. ఆ కేసు కోర్టులో ఉంది. మొత్తం రికార్డును మీ ముందు ఉంచుతాం. మీరు ఏది చెబితే అది చేయమంటాం... అని మేం చెబితే.. కాదూ.. మేమే విచారణ చేస్తామని.. రాష్ట్ర అధికారాన్ని హస్తగతం చేసుకునే విధంగా కేంద్రం ప్రవర్తిస్తోంది. ఇదెక్కడి న్యాయం...' అని చంద్రబాబు ప్రశ్నించారు. జగన్మోహన్‌రెడ్డి రూ. 43 వేల కోట్ల అవినీతి చేశారని... సీబీఐ నివేదిక ఇస్తే ఏడాదిలోగా చర్యలు తీసుకుంటామన్న నరేంద్రమోదీ.. ఏ చర్యలూ చేపట్టలేదు. జగన్...మోదీకి పూర్తిగా సరెండరయ్యారు. సీబీఐ కేసుల్ని చూపించి.. మేం చెప్పినట్లు చేయకపోతే.. జైలుకు పంపిస్తామనడంతో... భయపడిపోయే పరిస్థితికి వచ్చారు. ఇది ఎంత దుర్మార్గమో మీరే ఆలోచించాలి. మరో పది రోజులు ఉంటే మొత్తం పూర్తయ్యే కేసును.. మొదటికి తెచ్చేందుకే హైకోర్టును విభజించారు...' అని పేర్కొన్నారు.

'చుక్కల భూముల'కు 25లోగా పరిష్కారం

ఈనాడు డిజిటల్, అమరావతి: చుక్కల భూముల సమస్యను ప్రభుత్వమే సుమోటోగా తీసుకుని ఈ నెల 25లోగా పరిష్కరిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఆ దిశగా అధికారులు ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని ఆదేశించారు. జన్మభూమిపై శనివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ప్రగతికి రథాలు ప్రజలు, ఉద్యోగులేనన్నారు. ముప్ఫై, నలభై ఏళ్లు హైదరాబాద్‌తో ఉన్న అనుబంధాన్ని వదులుకుని ఉద్యోగులు, లాయర్లు ఇక్కడికి వచ్చారని, వారు నిలదొక్కుకునేందుకు ప్రభుత్వంఅండగా ఉంటుందని చెప్పారు. సొంతిల్లు లేని ప్రతి ఉద్యోగికి గృహ వసతి కల్పిస్తామన్నారు. జన్మభూమి-మా ఊరు ఆరోవిడతలో ప్రజల భాగస్వామ్యం పెరిగి ఫిర్యాదుల సంఖ్య సగానికి తగ్గడం నాలుగున్నరేళ్ల మన శ్రమకు ఫలితమని వ్యాఖ్యానించారు. ప్రతి గ్రామంలో, వార్డులో చేసిన అభివృద్ధి.. ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందుతున్న తీరే ఇందుకు కారణమని చెప్పారు.

పెద్ద కొడుకులా సీఎం అండగా నిలిచాడు


85 ఏళ్ల వృద్ధురాలు కాములమ్మ

శ్రీకాకుళం జిల్లా రాజాం మండలం పొగిరి గ్రామంలో శనివారం తన పర్యటన సందర్భంగా 85 ఏళ్ల స్థానిక వృద్ధురాలు ఏనుగుతల కాములమ్మతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై ఆయన ఆరా తీశారు. కొన్ని మాటలు ఆమెకు వినిపించకపోవటంతో చెవిలో చెప్పారు. ప్రతి నెలా అందిస్తున్న రూ. వెయ్యి పింఛనుతో పెద్ద కొడుకులా అండగా నిలిచావంటూ సీఎంనుద్దేశించి ఆమె వ్యాఖ్యానించడంతో చంద్రబాబు మురిసిపోయారు. కాములమ్మ భర్త, నలుగురు కుమారులు చనిపోయిన నేపథ్యంలో ఆమె యోగక్షేమాలను చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. కాములమ్మకు ఆర్థిక భరోసాగా రూ. 50 వేలు ఇవ్వాలంటూ అక్కడే ఉన్న కలెక్టర్ ధనంజయరెడ్డిని ఆయన ఆదేశించారు.

కాంక్రీట్ రికార్డుకు సిద్ధం



పనుల కోసం సిద్ధం చేసిన కాంక్రీట్ క్రషర్, బ్లాచింగ్ ప్లాంట్‌లు



గోదావరి మధ్యలో అతిథుల కోసం వేసిన గుడారాలు

పోలవరం, కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: బహుళార్థ సాధక ప్రాజెక్టు పోలవరం నిర్మాణంలో మరో అరుదైన రికార్డు ఆవిష్కరణకు రంగం సిద్ధమైంది. దుబాయ్‌లో ఒక టవర్ నిర్మాణానికి 2017 మేలో 36గంటల్లో 21,580 ఘనపు మీటర్ల(ఘ.మీ.) కాంక్రీట్ వేశారని, ఇప్పుడా రికార్డును అధిగమించేందుకు 24 గంటల్లోనే 30వేల ఘ.మీ. కాంక్రీట్ వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అధికారులు చెబుతున్నారు. ప్రాజెక్టు పనుల్లో భాగంగా మూణ్నెల్ల కిందట 24 గంటల్లో 11,158 ఘ.మీ. కాంక్రీటు వేశారు. మళ్లీ గత నెలలో 11,289 ఘ.మీ. కాంక్రీట్ పనులు చేసి ఆ రికార్డును అధిగమించారు. ఇప్పుడు ఏకంగా 30వేల ఘ.మీ. కాంక్రీటు వేసేందుకు గుత్తేదారు సంస్థ నవయుగ ఆధ్వర్యంలో అధికారులు సర్వం సిద్ధం చేశారు.

ప్రస్తుతం ప్రాజెక్టులో గంటకు 3,770 మెట్రిక్ టన్నుల కంకర తయారు చేసే క్రషర్లున్నాయి. సిమెంటు, ఇసుక, ఇతర రసాయన మిశ్రమాలు కలిపే బ్లాచింగ్‌ప్లాంట్లలో గంటకు 1560ఘ.మీ. కాంక్రీట్ కలిపేలా సన్నద్ధం చేశారు. ఆదివారం ఉదయం 8గంటలకు స్పిల్‌ఛానల్‌లో పని ప్రారంభించి సోమవారం ఉదయం 8గంటలకు 30వేల ఘ.మీ. పైబడి కాంక్రీట్ వేసి రికార్డు సాధించాలనుకుంటున్నారు. అదే పనిని మరికొన్ని గంటల పాటు కొనసాగించే ఆలోచనతో ఉన్నారు.

రికార్డు సాధించాకే సంబరాలు

గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్సు సిబ్బంది అనుమతి ఇచ్చిన వెంటనే ఆదివారం ఉదయం స్పిల్‌ఛానల్‌లో కాంక్రీట్ వేసే పనిని ప్రారంభించేందుకు అవసరమైన యంత్రసామగ్రినంతా ఇప్పటికే సమకూర్చారు. శనివారం రాత్రికే గిన్నిస్ ప్రతినిధులు, అధికారులు పోలవరం ప్రాజెక్టుకు చేరుకుని ఏర్పాట్లను పరిశీలించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం ప్రణాళిక ప్రకారం కాంక్రీట్ పనులు ప్రారంభిస్తామని జలవనరుల శాఖాధికారులు తెలిపారు. రికార్డు సాధించిన అంశంపై లండన్ నుంచి ప్రకటన వచ్చాక ప్రాజెక్టులో సంబరాలు చేసుకునేందుకు నవయుగ సంస్థ ప్రతినిధులు ఏర్పాట్లు చేసుకున్నారు.

నిర్విరామంగా కొనసాగిస్తాం

పోలవరం ప్రాజెక్టులో మరో రికార్డు సాధించే దిశగా పనులు ముమ్మరంగా చేస్తున్నాం. స్పిల్‌ఛానల్‌లో 30వేల ఘనపు మీటర్ల కాంక్రీట్ వేసే పనిని 24 గంటలపాటు నిర్విరామంగా కొనసాగించాలన్న సంకల్పంతో ఉన్నాం. దీనికి దైవసంకల్పం తోడవ్వాలి.

– సీఈ శ్రీధర్, ఈఈ డి.శ్రీనివాస్

30వేల ఘ.మీ. కాంక్రీట్‌కు కావాల్సినవి..

సిమెంటు : ఏడువేల టన్నులు
ఇసుక : 22వేల టన్నులు
కంకర : 36వేల టన్నులు

మానవ వనరులు

కార్మికులు : 3,600 మంది
సాంకేతికేతర సిబ్బంది : 720
సాంకేతిక సిబ్బంది : 500
వివిధ హోదాల్లోని ఇంజినీర్లు : 21 మంది

గ్రహం అనుగ్రహం

6–1–2019 ఆదివారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం
హేమంత రుతువు; పుష్య మాసం; శుక్ల పక్షం
పుష్య శుక్ల పాడ్యమి: పూర్తి
పూర్వాషాఢ నక్షత్రం: సా. 5.08 తదుపరి ఉత్తరాషాఢ
అమృత ఘడియలు: మ. 11.56 నుంచి 1.40 వరకు
వర్జ్యం: రా. 1.54 నుంచి 3.39 వరకు
దుర్ముహూర్తం: మ. 4.08 నుంచి 4.52 వరకు
రాహుకాలం: మ. 4.30 నుంచి 6.00 వరకు
సూర్యోదయం: ఉ.6-36; సూర్యాస్తమయం: సా.5-36

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
కడప	14.0	32.0
అనంతపురం	14.2	31.0
హైదరాబాద్	14.8	30.0
శ్రీకాకుళం	15.0	25.0
తిరుపతి	16.0	29.6
కర్నూలు	16.2	31.5
రాజమహేంద్రవరం	16.5	31.0
గుంటూరు	16.8	28.7
విజయవాడ	17.8	28.5
విశాఖపట్నం	18.0	27.2
తాడేపల్లిగూడెం	18.2	27.0
నరసాపురం	18.6	28.1
ఒంగోలు	19.9	29.7
నెల్లూరు	20.0	30.0

పోలవరానికి అవార్డులిస్తారు.. నిధులివ్వరా?

- ముఖ్యమంత్రి చంద్రబాబు ఆక్షేపణ

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టు పనితనానికి కేంద్ర సంస్థలు అవార్డులిస్తున్నా... ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడానికి అడ్డంకులు పెడుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆక్షేపించారు. ఆర్థికలోటున్నా సమర్థతతో పనులు చేసి సాధించిన ప్రగతికి గుర్తింపుగా, తమ కష్టాన్ని గుర్తించి కేంద్ర జలవిద్యుత్తు సంస్థ (సీబీఐపీ) అవార్డు ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. దిల్లీలో కేంద్ర సహాయమంత్రి ఆర్ కె సింగ్ నుంచి శుక్రవారం ఈ అవార్డును మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అందుకున్నారు. శనివారం ముఖ్యమంత్రిని ఆయన నివాసంలో కలిసి దీనిని చూపించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రతి సోమవారాన్ని పోలవారంగా మార్చుకున్నామని, 84సార్లు సమీక్షించామని, 29సార్లు ప్రాజెక్టును సందర్శించడంతో పురోగతి సాధించామని వివరించారు. ఇప్పటివరకు రూ.15,380 కోట్లను రాష్ట్రం ఖర్చు చేసిందన్నారు. సవరించిన అంచనా వ్యయాన్ని కేంద్రం ఆమోదించేలా జలవనరులశాఖ కృషి చేయాలని చెప్పారు. కేంద్ర అధికారులను కలిసి అంచనాల ఆమోదంపై విజ్ఞప్తి చేశానని మంత్రి దేవినేని ఆయనకు వివరించారు. సీఎంను కలిసిన వారిలో ఇంజినీర్ ఇన్ చీఫ్ ఎం.వెంకటేశ్వరరావు, సీఈ శ్రీధర్, భూగర్భజలశాఖ సంయుక్త సంచాలకుడు వరప్రసాద్, డీఈ బాలకృష్ణ ఉన్నారు.



సీఎం చంద్రబాబుకు అవార్డును చూపిస్తున్న మంత్రి దేవినేని ఉమా. పక్కన ఇంజినీర్ ఇన్ చీఫ్ వెంకటేశ్వరరావు, సీఈ శ్రీధర్, డీఈ బాలకృష్ణ

తెలుగు నేర్చుకోవాలనుకున్నా!


ఈనాడు 1869 - 2019 మహాత్ముడి 150వ జయంతి వేడుకలు

దక్షిణాఫ్రికాలో తాను చేపట్టిన సత్యాగ్రహ ఉద్యమంలో పెద్దఎత్తున పాల్గొన్నందుకు తెలుగు, తమిళులపై గాంధీజీ ఎప్పుడూ ప్రత్యేక అభిమానం, వాత్సల్యం చూపిస్తుండేవారు. అంతేకాదు, ప్రత్యేకించి తాను ఆ రెండు భాషలూ నేర్చుకోవాలని కూడా బలంగా అభిలషించినట్లు తన 'ఆత్మకథ'లో ఇలా రాసుకున్నారు....

"నాకు తమిళంగానీ, తెలుగుగానీ తెలియకపోవటం ఇప్పటికీ పెద్ద లోపంగానే అనిపిస్తోంది. దక్షిణాఫ్రికాలో ఉన్నప్పుడు ద్రావిడులు నాపై కురిపించిన ప్రేమామృతం నా మనసులో ఎప్పటికీ చల్లగా జాలువారుతూనే ఉంటుంది. నాకు ఎవరైనా తమిళ మిత్రుడుగానీ, తెలుగు మిత్రుడుగానీ కనబడినప్పుడు దక్షిణాఫ్రికాలో తెలుగు, తమిళ స్నేహితులు చూపించిన విశ్వాసం, పట్టుదల, నిస్వార్థ త్యాగం వంటివన్నీ ఒక్కసారి గుర్తుకొస్తాయి. నిజానికి వారిలో అధిక సంఖ్యాకులు నిరక్షరాస్యులు. అయినా ఆ యోధుల సహాయంతోనే ఆ సంగ్రామం కొనసాగింది. ఆ సజ్జనుల హృదయాలను చూరగొనటానికి వారి భాష నాకు రాకపోవటం ఎంత మాత్రం ఆటంకం కాలేదు. వాళ్లంతా నాతో వచ్చీరాని హిందీలోనో, ఇంగ్లిషులోనో మాట్లాడటానికి ప్రయత్నించేవారు. వారి ప్రేమాభిమానాలను చూసిన తర్వాత వారి కోసం తప్పకుండా తెలుగు, తమిళం నేర్చుకోవాలన్న కోరిక బలంగా కలిగింది. తమిళం కొద్దిగా నేర్చుకోగలిగాను. భారత్‌కు తిరిగి వచ్చాక తెలుగు నేర్చుకోవాలని చాలా ప్రయత్నించానుగానీ అక్షరాలను దాటి ముందుకు పోలేకపోయాను. అందుకే కొంతైనా హిందీ నేర్చుకోమని ద్రావిడ భాషల వారిని కోరుతున్నాను. దక్షిణాఫ్రికాలో ఇంగ్లిషు మాట్లాడలేని వాళ్లే తడబడుతూ, తప్పులతోనైనా హిందీ మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇంగ్లిషు మాట్లాడేవారు ఆ కాస్త ప్రయత్నం కూడా చెయ్యటం లేదు. అందువల్ల ఇంగ్లిషు తెలిసి ఉండటమన్నది.. మన భాషలను మనం నేర్చుకునేందుకు పెద్ద ఆటంకంగా తయారవుతోందేమోనన్న ఆందోళన కలుగుతోంది. ఇప్పటికైనా మన భాషలను మనం నేర్వటం అవసరమన్నది నా ఆకాంక్ష.

– మహాత్మా గాంధీ

ఇదీ సంగతి!



నేను ఇలాగే వెళ్లి బ్యాంకు వాళ్లను అప్పు అడిగాను సార్, వాళ్లు ఇచ్చారు. తప్పు నాదెలా అవుతుంది?

ఉక్కుపై నిలదీసే ధైర్యం జగన్‌కు లేదు

- కడపలో 'జన్మభూమి-మా ఊరు' కార్యక్రమంలో లోకేశ్

కడప, ఈనాడు: 'కేసుల మాఫీ కోసం జగన్ ప్రధాని ముందు మోకరిల్లుతున్నారు. విభజన చట్టం హామీలపై కేంద్రం మొండిచేయి చూపినా ప్రశ్నించకపోవడం దారుణం. కడప ఉక్కుపైనా నిలదీయకపోవడం వైకాపా కుమ్మక్కు రాజకీయాలకు అద్దం పడుతోంది' అని మంత్రి లోకేశ్ విమర్శించారు. కడపలో శనివారం జరిగిన ఆరో విడత జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో భాగంగా రాయచోటి నియోజకవర్గంలో పర్యటించారు. పలు సభల్లో ప్రసంగించారు. జగన్ కేసుల మాఫీ కోసం ప్రయత్నిస్తున్నారని.. పవన్ కల్యాణ్ మాటలకే పరిమితమయ్యారని దుయ్యబట్టారు. బీజేపీ అంటే భారతీయ జగన్, పవన్ పార్టీ అని నిర్వచించారు. మోదీని గద్దె దింపే వరకూ చంద్రబాబు విశ్రమించరన్నారు. మోదీకి ఆంధ్రా అంటే అసూయ అని. . ఇక్కడి అభివృద్ధి, సంక్షేమం చూసి ఓర్వలేక



కడప జిల్లా లక్కిరెడ్డిపల్లె సభలో ప్రసంగిస్తున్న మంత్రి లోకేశ్

పోతున్నారని ధ్వజమెత్తారు. రానున్న ఎన్నికల్లో దేశ ప్రధాని అభ్యర్థిని ఎంపిక చేసేది చంద్రబాబే అని తేల్చిచెప్పారు. ఎన్నికలకు కులం, మతం, ప్రాంతాల పేరుతో చిచ్చు పెట్టేందుకు కొన్ని పార్టీలు కుట్రలు చేస్తున్నట్లు వివరించారు. జగన్‌ను భారీ మెజారిటీతో గెలిపించినా పులివెందులకు కృష్ణా జలాలను అందించి అక్కడి ప్రజలకు మేలు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని లోకేశ్ పేర్కొన్నారు. త్వరలో రుణమాఫీ పెండింగ్ బకాయిలు జమ చేయనున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు సీఎం రమేష్, కేంద్ర మాజీ మంత్రి సాయిప్రతాప్, తెదేపా జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, నేతలు రమేష్ కుమార్‌రెడ్డి, సుగవాసి ప్రసాదు, కలెక్టరు హరికిరణ్ పాల్గొన్నారు. అనంతరం లోకేశ్ తిరుపతి బయల్దేరి వెళ్లారు.

మోదీ ధోరణి ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు

ఈనాడు, అమరావతి: 'ఆంధ్రా ఎదురు తిరిగితే అణిచేస్తామన్న ప్రధాని మోదీ ధోరణి ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు' అని మంత్రి లోకేశ్ శనివారం ట్విటర్ వేదికగా వ్యాఖ్యానించారు. హోదా కోసం మోదీని నిలదీయడం తప్పా? హక్కుల పరిరక్షణ కోసం కేంద్రంపై పోరాటం చేయడం నేరమా? అని మంత్రి ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబును భాజపా నాయకులు అసభ్య పదజాలంతో తిడుతుంటే సుదీర్ఘ అనుభవం కలిగి దేశానికి పెద్దన్నగా ఉండాల్సిన ప్రధాని నవ్వుతూ ఆస్వాదించడం దేనికి సంకేతమని లోకేశ్ ప్రశ్నించారు.

రూ.150 కోట్లతో మూడు నగరాల్లో ప్రింటింగ్, ప్యాకింగ్ యూనిట్లు

ఈనాడు, అమరావతి: గుంటూరు, విశాఖపట్నం, తిరుపతి నగరాల్లో రూ.150 కోట్ల పెట్టుబడితో ప్రింటింగ్, ప్యాకింగ్ యూనిట్ల ఏర్పాటుకు దేశంలోనే పేరొందిన కళాజ్యోతి ప్రింటింగ్ కంపెనీ ముందుకొచ్చింది. వీటి ఏర్పాటుతో ప్రత్యక్షంగా 400 మందికి, పరోక్షంగా 800 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో శనివారం ఉండవల్లిలో సంస్థ డైరెక్టర్ అలపాటి రామనాథ్, రాష్ట్ర ఆర్థికాభివృద్ధి మండలి సీఈవో జాస్తి కృష్ణ కిశోర్‌తో అవగాహన ఒప్పందం చేసుకున్నారు. 1946లో ఏర్పాటై ఆఫ్‌సెట్ ముద్రణలో ఎంతో ప్రాచుర్యం కలిగిన ఈ సంస్థ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడంపై ఈడీబీ సీఈవో కృష్ణకిశోర్ ఆనందాన్ని వ్యక్తం చేశారు.



ముఖ్యమంత్రి సమక్షంలో ఒప్పంద పత్రాలు చూపిస్తున్న ఈడీబీ సీఈవో కృష్ణకిశోర్, కళాజ్యోతి డైరెక్టర్ అలపాటి రామనాథ్

నేడు సైనిక పాఠశాల ప్రవేశ పరీక్ష

విజయనగరం కోట, కలికిరి, న్యూస్‌టుడే: విజయనగరం జిల్లా కోరుకొండ, చిత్తూరు జిల్లా కలికిరి సైనిక పాఠశాలలలో ఆరు, తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి ఆదివారం ప్రవేశ పరీక్ష జరగనుంది. హాల్‌టిక్కెట్లు పొందిన వారు ఉదయం తొమ్మిది గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని కోరుకొండ సైనిక్ స్కూల్ ప్రిన్సిపల్ కల్నల్ రుద్రాక్షఅత్రి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు 85100 55577, 85100 44411 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

గడువు పొడిగింపు

ఈనాడు, అమరావతి: ఉద్యానవన అధికారి (హార్టికల్చర్ ఆఫీసర్) పోస్టుల భర్తీ దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 18వ తేదీ వరకు పొడిగించారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శనివారం ఓ ప్రకటన జారీ చేసింది.

యువ న్యాయమూర్తి ఐశ్వర్య ఆకస్మిక మృతి

నరసరావుపేట లీగల్, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా నరసరావుపేట పట్టణంలో మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్న యువ న్యాయమూర్తి పి. ఐశ్వర్య(26) ఆకస్మికంగా మృతి చెందారు. ఆమె 2018 ఏప్రిల్‌లో మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం మొదటి కోర్టుతో పాటు మరో మూడు కోర్టులకు ఇన్‌ఛార్జి న్యాయమూర్తిగా వ్యవహరిస్తున్నారు. శుక్రవారం కోర్టుకు హాజరైన ఆమె బెంచ్ ఎక్కుతుండగా ఒక్కసారిగా తూలి కింద పడిపోయారు. వెంటనే సిబ్బంది ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షల అనంతరం ఇంటికి వెళ్లిపోయారు. శనివారం ఉదయం తన తల్లికి కాఫీ అందజేస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధరించారు. చిత్తూరు జిల్లా చంద్రగిరికి చెందిన ఐశ్వర్య న్యాయమూర్తిగా ఎంపికై కొంతకాలం పిడుగురాళ్లలో విధులు నిర్వహించి బదిలీపై నరసరావుపేటకు వచ్చారు. ఈమె తండ్రి దివంగత రమణయ్య నరసరావుపేట సబ్‌కోర్టులో జడ్జిగా వ్యవహరించారు. ఐశ్వర్య మృతికి ఏపీపీ పంగులూరి ఆంజనేయులుచౌదరి, ఏజీపీలు జి.సుధీర్‌కుమార్, సీతారామయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షులు జీవీఎస్ ప్రసాద్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది సంతాపం తెలిపారు. సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.



ఐశ్వర్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న సభాపతి కోడెల, ఐశ్వర్య (పాతచిత్రం)

ఈనాడు

అతిచేస్తే... అంతే!

తానొకటి తలిస్తే దైవం మరొకటి తలుస్తుందన్న సామెత చాలా పాతదే అయినా నిత్యం అనుభవంలోకి వస్తూనే ఉంటుంది. అర్జునుడి మీద ద్వేషంతో అశ్వసేనుడనే నాగకుమారుడు సర్పముఖ బాణం రూపంలో కర్ణుడికి గొప్ప ఆయుధంగా మారాడు. అలా అర్జునుణ్ని సంహరించాలన్నది అతడి ఆలోచన. కురుక్షేత్ర సంగ్రామంలో అందుకు అవకాశం చిక్కింది. 'జనులు విహ్వలులగునట్టి ఘన రవంబు దిశలయందు ఆకసమున దీటుకొనగ...' నాగాస్త్రం పుట్టించిన భీకర ధ్వనికి భూనభోంతరాళాలు దద్దరిల్లాయి, జనం భయకంపితులయ్యారని తిక్కన వర్ణించాడు. తీరా ఆ బాణం గతితప్పి అర్జునుడి కిరీటాన్ని మాత్రం నేల పడగొట్టింది. కారణం ఏమంటే 'పలుదెస మంటలు ప్రబ్బగ అలుము స్ఫురణమునను నిగుడు అయ్యస్త్రంబున్ జలజాక్షుండగని, పంచాంగుళ మాత్రము రథము ధరణి గ్రుంగ అదుముడున్...' నిప్పులు చిమ్ముతూ వస్తున్న నాగాస్త్రాన్ని గమనించి కృష్ణుడు తక్షణమే రథాన్ని అయిదంగుళాల లోతుకు నేలలోకి అదిమేశాడు. బాణం గురితప్పింది. వృథా అయిపోయింది. దేవేంద్రుడు కానుకగా ఇచ్చిన శక్తి ఆయుధం విషయంలోనూ అదే జరిగింది. కర్ణుడు తన సహజ కవచ కుండలాలను నిస్సంకోచంగా దానం చేసేసరికి విచలితుడైపోయిన ఇంద్రుడు తిరుగులేని శక్తి ఆయుధాన్ని కర్ణుడికి ప్రసాదించాడు. దానితోనైనా అర్జునుణ్ని మట్టు పెట్టాలని కర్ణుడు ఎంతో ఆశపడ్డాడు. తీరా భీముడి కొడుకైన ఘటోత్కచుడు కౌరవసేనను ఊచకోత కోస్తుంటే గత్యంతరం లేక 'వైరి వినాశన క్రియకు వాసవుడిచ్చిన' అంత గొప్ప ఆయుధాన్నీ వాడిపై ప్రయోగించక తప్పలేదు. 'దనుజేంద్రుని ఉరము పగిల్చి కొనుచు దుర్జయగతి వీపునవెడలి శక్తి ఎగసెన్ వినువీధికిన్' అని ద్రోణపర్వం వర్ణించింది. 'విధిబలీయం' అనే మాటకు అర్థం అదే.

విధికి స్వపర భేదాలుండవు. పరమేశ్వరుణ్ని మెప్పించి మరీ సాధించిన దివ్యాస్త్రం పాశుపతం విషయంలో అర్జునుడికి చుక్కెదురైంది. సైంధవుడి తల తెగార్చి నేలపై పడకుండా సరాసరి సైంధవుడి తండ్రి వృద్ధక్షత్రుడి ఒడిలో పడేలా విసిరేయడం అది పనికొచ్చింది. 'ఈ తల పుడమిం పడనీక ఆతని తొడమీద (తండ్రి ఒడిలో) వైచునది, ఆ పని విఖ్యాతంబుగ పాశుపతము చేతనే యగుగాక!' అని కృష్ణుడే సూచించాడు. భస్మాసురుడికి పరమశివుడు అనుగ్రహించిన వరం తిరిగి ఆయన ప్రాణాల మీదకే తెచ్చిందని భాగవతం చెప్పింది. భస్మాసురుడి అసలు పేరు వృకుడు. శివుడి కోసం వాడు కేదారక్షేత్రంలో హోమం చేశాడు. 'గండగొడ్డంట తన మస్తకంబు దునుముకొనగ బూనె'... గొడ్డలితో తన తల నరికి అగ్నిగుండానికి సమర్పించబోయాడు. శివుడు ప్రత్యక్షం అయ్యాడు. 'మత్పాణితలము(నా చేయి) ఎవ్వని తలమీద నిడిన- వాడు మస్తకము నూరు వ్రయ్యలై(ముక్కలై) మడియు(చావు) వలయు' అని వరం కోరాడు. శివుడు సరే అన్నాడు. ఆ వరప్రభావం ఎలాంటిదో చూడాలని వృకుడు 'ఆహర మస్తకమున కపసాహసమున చేయువెట్ట' పరమ శివుడు పరుగులు తీశాడు. ఈ పురాణగాథల సారాంశం ఒకటే- ప్రతీ అనుకున్నది అనుకున్నట్లుగా జరిగిపోదు. క్షీరసాగరమథనం అమృతం కోసం జరిగింది. మధ్యలో కాలకూట విషం ఆవిర్భవించలేదూ! అలా, ఆధునిక పరిశోధనల్లో వినూత్న ఆవిష్కరణల్లో సైతం అపశ్రుతులు ఉంటూనే ఉంటాయి. ఫలితాలు వక్రిస్తాయి. మంచిని సైతం దారి తప్పుతాయి. స్వాతిచినుకు ముత్యపుచిప్పలో పడినప్పుడే ఆణిముత్యం అవుతుంది. ఇసుకలోనో బురదలోనో పడితే వ్యర్థం అవుతుంది. 'ఆయుధం ఎంతటిదైనా ప్రమాదంలేనిది, అది అవివేకి చేతిలో పడేదాకా' అని అన్న సామెత. బ్రహ్మశిరోనామకాస్త్రం అశ్వత్థామ చేతిలో దుర్వినియోగం అయింది, అర్జునుడి చేతిలో కాలేదు.

అంతర్జాలం చరవాణి ముఖపుస్తకం... వంటివన్నీ ఆధునిక సాంకేతిక పరిశోధనల అమృతఫలాలు. అవి బ్రహ్మాస్త్రాల వంటివి. వాటితో అద్భుతాలు సాధించవచ్చు. కాకపోతే, బ్రహ్మాస్త్రాలను ఆలోచనాపరులైన అర్జునులే సద్వినియోగం చేయగలరు తప్ప- ఆవేశపరులైన అశ్వత్థామలవల్ల కాదు. నైపుణ్యం- చేయగలిగింది చేస్తుంది. వివేకం- చేయవలసింది చేస్తుంది. వారిద్దరి మధ్య అదే తేడా. ఆవిష్కరణల లక్ష్యాలు ఇప్పటికే గతితప్పి 'చెప్పులోని రాయి చెవిలోని జోరీగ కంటి లోన నలుసు కాలి ముల్లు'లా తయారయ్యాయని సామాజికవేత్తల ఫిర్యాదు. ఫేస్‌బుక్(ముఖ పుస్తకానికి) ఉపాధ్యక్షుడిగా విరివిగా వ్యవహరించిన చమత్ పలిహపితియ వారిలో ఒకరు. 200కోట్లమందిని ఫేస్‌బుక్‌కు పరిచయం చేసినందుకు తాను చాలా పశ్చాత్తాపపడుతున్నానని ఇప్పుడు వాపోతున్నాడాయన. నాగాస్త్రాల శక్తి ఆయుధాలు హాని చేయకుండా కృష్ణుడు కాపాడాడు. 'జంబూఫలంబని (నేరేడుపండులా) సర్వంకషమున్ మహావిషమునాహరించె...' శివుడు కాలకూట విషాన్ని గుటుక్కున తన గొంతులోకి నెట్టాడు. దానికి కారణం ఏమిటో పోతన చెప్పాడు. 'ఉదరము లోకంబులకు సదనం బగుట ఎరిగి... కడుపులో ఉన్న లోకాలకు హాని జరక్కూడదని' అన్నాడు. 'అలా చక్కదిద్దే సూత్రం నా దగ్గర లేదు. నేను చేయగలిగిందల్లా వాటికి నేను చాలా దూరంగా ఉండటమే' అని చమత్ అంటున్నాడు. 'ఫేస్‌బుక్‌లోని అనుసంధానాలన్నీ అనుబంధాలనుకోవడం వట్టి భ్రమ' అని దాని వ్యవస్థాపకుల్లో ఒక ముఖ్యుడు సీన్ పార్కర్ అంటున్నారు. కాబట్టి అవి భస్మాసుర హస్తాలు కాకుండా కాపాడుకోవలసిన బాధ్యత మనమీదే ఉంది. 'అతి సర్వత్ర వర్జయేత్' అని మన పెద్దలు ఏనాడో చెప్పారు.



ప్రగతి లేని పరుగు

పరిశోధన-అభివృద్ధిలో మనమెక్కడ?



డాక్టర్ ఎస్.అనంత్

ఒకప్పుడు చైనా, దక్షిణ కొరియాలు భారతదేశం లానే పేద దేశాలు. ఇప్పుడవి శాస్త్ర సాంకేతిక రంగాల్లో అమెరికా, ఐరోపాలకే గట్టిపోటీ ఇస్తున్నాయి. పరిశోధన-అభివృద్ధి (ప-అ)కి అగ్రాసనం వేసి సైన్స్, టెక్నాలజీల్లో వినూత్న వస్తుసేవలతో ప్రపంచ విపణులను కొల్లగొడుతున్నాయి. 2018లోనైనా భారత్ పరిశోధన-అభివృద్ధిలో ముందడుగు వేసిందా అంటే గట్టిగా అవునని చెప్పలేని పరిస్థితి నెలకొంది. నిజం చెప్పాలంటే ఈ విషయంలో 2018 సంవత్సరాన్ని భారత నాయకత్వం వృథా చేసింది. 2019లో మాత్రం అభివృద్ధి-పరిశోధనను చురుకుగా ముందుకు తీసుకెళ్లాలి. ఎందుకంటే కొత్త సంవత్సరంలో అనేక మంది అంతర్జాతీయ నాయకులు, వ్యాపారవేత్తలు సమావేశమై ప్రజల ఆర్థిక, రాజకీయ, సాంఘిక జీవనాల్లో శాస్త్ర సాంకేతికత తీసుకొస్తున్న మార్పులను ఎలా నిబాయించాలనే అంశంపై చర్చించనున్నారు. ప్రస్తుత విజ్ఞానాధారిత సమాజంలో సాంకేతికత, డేటా (విస్తృత సమాచార నిధి) చాలా కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ రంగాల్లో పోటాపోటీగా, అగ్రగాములకు దీటుగా నిలవాలన్న తపన, కృషి లేనిదే అన్ని విధాలా వెనకబడిపోక తప్పదు. ఆ తపన, కృషి లేకపోవడం వల్ల మనం పరిశోధన-అభివృద్ధి రంగంలో ఉన్నచోటే ఉండి వేగంగా పరుగెడుతున్నామే తప్ప ముందుకు దూసుకెళ్లలేకపోయాం. 'ప-అ'కి తగినన్ని నిధులు కేటాయించి నూతన ఆవిష్కరణలు చేసి వివిధ రంగాల్లో ప్రపంచంలోనే అగ్రగాములుగా నిలిచే సంస్థలను జపాన్, దక్షిణ కొరియా, చైనాలు స్థాపించగలిగాయి. చిన్నాపెద్దా పరిశ్రమలు, వ్యాపారాలను విస్తరించి కోట్లలో కొత్త ఉద్యోగాలు సృష్టించగలిగాయి.

నైపుణ్యాలకు సాన

భారత్‌లో కేంద్ర, రాష్ట్రాలనే కాదు... ప్రభుత్వ ప్రైవేటు రంగ సంస్థలు, ఉన్నత విద్యాసంస్థలూ 'ప-అ'కి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదు. ప్రభుత్వం మాత్రం పెట్టుబడులు పెంచుతున్నామని చెబుతోంది. కానీ, ద్రవ్యోల్బణ ప్రభావాన్ని, కోల్పోయిన అవకాశాలను దృష్టిలో ఉంచుకుంటే ఆ పెంపు అసలు లెక్కలోకే రాదు. 2004-05లో 'ప-అ'కి రూ.24,117 కోట్లు కేటాయించిన కేంద్రం, 2014-15లో ఆ మొత్తాన్ని రూ.85,326 కోట్లకు పెంచింది. ఈ కేటాయింపు 2016-17కల్లా రూ.1,04,864 కోట్లకు పెరిగినా అదేదో అద్భుతమైనదని భ్రమపడనక్కర్లేదు. ఇది మన స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో కేవలం 0.63 శాతానికి సమానం. అదే 1996 జీడీపీలో 0.56 శాతాన్ని 'ప-అ'పై వెచ్చించిన చైనా, 2016లో 2.07 శాతాన్ని వ్యయీకరించింది. భారత్‌లో కేంద్ర ప్రభుత్వమే 'ప-అ'కి హెచ్చు నిధులను కేటాయిస్తోంది. 2014-15లో 'ప-అ' మొత్తం వ్యయంలో కేంద్ర వాటా 45.1 శాతమైతే, రాష్ట్రాల వాటా 7.4 శాతమే. ఉన్నత విద్యా రంగం 3.9 శాతాన్ని, ప్రభుత్వ రంగ సంస్థలు 5.5 శాతం, ప్రైవేటు సంస్థలు 38.1 శాతం నిధులను వెచ్చించాయి. జీ-20 దేశాల్లో 'ప-అ' వ్యయంలో 50 శాతానికి పైగా నిధులను ప్రభుత్వమే వెచ్చించింది ఒక్క భారతదేశమే. మిగతా దేశాల్లో పరిస్థితి దీనికి పూర్తి భిన్నం. అక్కడ ప్రైవేటు రంగమే అత్యధిక నిధులు వ్యయీకరిస్తోంది. అమెరికాలో 72 శాతం నిధులను ప్రైవేటు సంస్థలు వెచ్చిస్తుంటే, జర్మనీలో 68, చైనాలో 77, జపాన్, దక్షిణ కొరియాల్లో 78, బ్రిటన్‌లో 66, రష్యాలో 59 శాతం నిధులను ప్రైవేటు రంగం వెచ్చిస్తోంది. భారత్‌లో ఇది 44 శాతమే. 'ప-అ'పై ఉన్నత విద్యాసంస్థలు చేసే వ్యయం భారత్‌లో కేవలం నాలుగు శాతం. ఇతర దేశాల్లో విశ్వవిద్యాలయాలు, ఇతర ఉన్నత విద్యా సంస్థలు 'ప-అ'పై వెచ్చించే నిధులు- కెనడా (40), ఆస్ట్రేలియా (30), ఇటలీ (29), స్పెయిన్ (28), బ్రిటన్ (26), మెక్సికో (26 శాతం)గా ఉన్నాయి. 'ప-అ'పై నిధుల వెచ్చింపును పెంచేట్లు కొత్తా పాత ఉన్నత విద్యాసంస్థలపై ఒత్తిడి తీసుకురావాలి. ఉన్నత విద్యాసంస్థలపై పూర్తి అజమాయిషీ ఉండాలనే ఆరాటంతో ప్రభుత్వం రాజకీయ సంబంధాలున్నవారిని నియంత్రణాధికారులుగా నియమిస్తోంది. మేధావులను, విజ్ఞాన ఖనులకు అజమాయిషీ అప్పగిస్తే ఎంతో గొప్ప ఫలితాలు వస్తాయని గమనించడం లేదు. మన ప్రభుత్వాలు, కంపెనీలు, విద్యా సంస్థలు, విధానకర్తలు 'ప-అ'పై వ్యయాన్ని పెట్టుబడి బరువుగా చూస్తున్నాయే తప్ప దీర్ఘకాలిక అవసరంగా పరిగణించడం లేదు. అందుకే మార్కులకు, సాంకేతిక దిగుమతులకు ప్రాధాన్యమిస్తూ కాలం గడిపేస్తున్నాం. పోనుపోను సాంకేతిక రంగంలో చిన్నాచితకా సేవలతో సరిపెట్టుకుంటూ సాంకేతిక దిగ్గజాలకు వలస రాజ్యంగా మారిపోతున్నాం.

చదువుల్లో సృజనాత్మకత



మన ఉన్నత విద్యా సంస్థలు బుద్ధిగా పనిచేసే ఉద్యోగులను తయారు చేస్తున్నాయే తప్ప వినూత్నంగా ఆలోచిస్తూ చొరవగా దూసుకెళ్లే పరిశోధకులను, నిపుణులను సిద్ధం చేయలేకపోతున్నాయి. పేరుకు మాత్రం ప్రపంచంలో అత్యధికంగా పీహెచ్‌డీ విద్యార్థులు ఉన్న దేశాల జాబితాలో భారత్ నాలుగో స్థానం ఆక్రమిస్తోంది. 2014లో అమెరికా 67,449 మంది, జర్మనీలో 28,147, బ్రిటన్‌లో 25,020 మంది పీహెచ్‌డీ విద్యార్థులు ఉండగా, భారత్‌లో వారి సంఖ్య 24,300 అని ఓఈసీడీ అధ్యయనం తెలిపింది. కానీ, మనం రాశిలో మిన్న, వాసిలో తీసికట్టు. ఇకనైనా విజ్ఞాన తృష్ణకు, పరిశోధన తపనకు, విశ్లేషణ శక్తికి ప్రాధాన్యమివ్వనిదే నవీన యుగంలో మనం వెనకబడిపోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వమూ ఈ విశిష్ట గుణాలకు ప్రాముఖ్యమివ్వడం లేదు. విద్యారంగంలో ప్రైవేటీకరణకు, అధిక నియంత్రణకు ద్వారాలు తెరిచి చేతులు దులిపేసుకుందే తప్ప మెరికల్లాంటి పరిశోధక విద్యార్థులు తయారవుతున్నారా లేదా అన్నది పట్టించుకోవడం లేదు. ప్రైవేటు విద్యాసంస్థలకు లాభాల కోసం అధిక ఫీజులు దండుకోవడం మీద ఉన్న ఆసక్తి, దీర్ఘకాలంలో దేశ శ్రేయస్సుకు తోడ్పడే సృజన, ప్రజ్ఞను పెంపొందించడం మీద లేదు. అవి పరిశోధన-అభివృద్ధిపై చూపుతున్న శ్రద్ధ అంతంత మాత్రమే. ప్రభుత్వం దీన్ని ఇక సాగనివ్వకూడదు.

చైనా చూపిన బాట



చైనా ప్రభుత్వం స్వదేశంలో పరిశోధన చేపట్టదలచిన ప్రవాస చైనీయులకు లక్షన్నర నుంచి నాలుగున్నర లక్షల డాలర్ల వరకు రాయితీలు ఇచ్చి, వారు ప్రపంచంలో మేటి వ్యాపార సంస్థలను స్థాపించడానికి తోడ్పడింది. అంతేకాదు, అమెరికా విశ్వవిద్యాలయాలకు దీటైన వేతనాలను చైనా విశ్వవిద్యాలయ ఆచార్యులకు ఇచ్చి 'ప-అ'ని ప్రోత్సహించింది. ఫలితంగా నేడు పాశ్చాత్య దేశాల నుంచి చైనాకు తిరిగివస్తున్న చైనీయుల్లో 11.09 శాతానికి ఉన్నత స్థాయి డాక్టరేట్ పట్టాలు ఉన్నాయి. వారు స్వదేశంలో అత్యాధునిక పరిశోధన కేంద్రాలను, కంపెనీలను నెలకొల్పారు. దీంతో నేడు విదేశాలకు వలస వెళుతున్న చైనీయులకన్నా స్వదేశానికి తిరిగొస్తున్న చైనీయుల సంఖ్యే ఎక్కువ. 2011లో విదేశాలకు వెళ్లే చైనీయ విద్యార్థుల సంఖ్య 37.61 శాతం పెరగ్గా, 2016లో స్వదేశానికి తిరిగొచ్చినవారి సంఖ్య 57 శాతం పెరిగింది. ఈ ప్రతిభావంతులు పెట్టిన పరిశ్రమలు, వ్యాపారాలు ప్రపంచ విపణిలో చైనాకు పోటీ సత్తాను పెంచాయి.

అనుకరణలతో సరి...

విదేశాలకు వలసపోయి రాణిస్తున్న నిపుణులను స్వదేశానికి తీసుకురావడానికి ప్రోత్సాహకాలు, సౌకర్యాలు, సానుకూల వాతావరణం కల్పించేది పోయి, రిజర్వు బ్యాంకు, నీతి ఆయోగ్, ఆర్థిక శాఖలకు అధిపతులుగా, కార్యదర్శులుగా పనిచేయడానికి విధానకర్తలను దిగుమతి చేసుకుంటూ పొద్దుపుచ్చుతున్నాం. స్వదేశీ నిపుణుల సేవలను ఉపయోగించుకోవడంలో చైనా, దక్షిణ కొరియాల నుంచి మనం నేర్చుకోవలసింది చాలా ఉంది. పదేళ్ల క్రితం మేడిన్ చైనా 2025 పథకాన్ని చేపట్టిన బీజింగ్ విదేశాలకు వెళ్లి పెద్ద చదువులు చదివి అక్కడే ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడిన చైనీయులను స్వదేశానికి తిరిగి రప్పించడానికి పట్టుదలగా కృషి చేసింది. వారిని నవీకరణ అవసరమైన రంగాలన్నింటిలో కొత్త సంస్థలు స్థాపించేలా ప్రోత్సహించింది. అదే భారతదేశానికి వస్తే, ఇక్కడి నిపుణులు పాశ్చాత్య దేశాల్లో విజయవంతమైన వ్యాపార నమూనాలను అనుకరించడంతో సరిపెట్టుకొంటున్నారు. వారు ప్రధానంగా సేవారంగానికే పరిమితమవుతున్నారు. కృత్రిమ మేధ, రోబోటిక్స్, మెషీన్ లెర్నింగ్ వంటి అధునాతన విభాగాల్లో చైనా అమెరికాను మించిపోయే అవకాశం ఉందని మేధావులు అమెరికా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అందుకు తగ్గట్టే చైనా నుంచి అధునాతన ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు నానాటికీ పెరుగుతున్నాయి. 2016లో మొత్తం చైనా ఎగుమతుల్లో అవి 25 శాతం ఆక్రమించాయి. 1998లో ఈ తరహా ఎగుమతులు లేనేలేవంటే చైనా అద్భుత పురోగతిని అంచనా వేయవచ్చు. భారత్ మొత్తం ఎగుమతుల విలువ (30,000 వేల కోట్ల డాలర్ల) కంటే చైనా హైటెక్ ఎగుమతుల విలువే (49,200 కోట్ల డాలర్లు) ఎక్కువ.

మన కంపెనీలు ప్రభుత్వంలో తమకున్న పలుకుబడితో భూములు, బ్యాంకు రుణాలు, ఇతర రాయితీలను సంపాదించి తక్కువ సాంకేతిక పరిజ్ఞానం అవసరమైన వస్తుసేవలను అందిస్తూ వేగంగా లాభాలు ఆర్జించాలని ఆరాటపడుతున్నాయే తప్ప పరిశోధన, అభివృద్ధికి పెద్దపీట వేసి హైటెక్ దిగ్గజంగా భారత్‌ను నిలపాలన్న ఉత్సాహం, పట్టుదల వాటిలో కనిపించవు. ఇది యూనికార్న్ (రూ.7,000 కోట్ల కన్నా ఎక్కువ విలువైన) అంకుర సంస్థలకూ వర్తిస్తుంది. ఈ సంస్థలు పాశ్చాత్య దేశాల్లో విజయవంతమైన వ్యాపార నమూనాలను అనుకరించి విజయం సాధించాయే తప్ప నవీకరణను సాధించలేదు. వాటిలో కొన్నింటిని విదేశీ బహుళజాతి సంస్థలు స్వాధీనం చేసుకున్నాయి కూడా. నవీకరణ పథంలో ఇకనైనా భారత్ పరుగు ప్రారంభించాలి!

(రచయిత- ఆర్థిక రంగ విశ్లేషకులు)



ఎ.సూర్యప్రకాశ్

సమగ్ర సమీక్షకు సమయమిదే!

ఇరవై అయిదేళ్ల క్రితం పార్లమెంటు సభ్యుల స్థానిక అభివృద్ధి పథకం (ఎంపీ లాడ్స్) ప్రారంభమైనప్పుడు ఎమ్‌పీలు తమ నియోజకవర్గాల అభివృద్ధికి దీన్ని సద్వినియోగం చేసుకుంటారని ఎందరో ఆశించారు. స్థానిక ప్రజల అవసరాలను తీర్చడానికి సామాజిక ఆస్తుల నిర్మాణం ఊపందుకొంటుందని భావించారు. కానీ అవినీతి, ఆశ్రిత పక్షపాతం, నిబంధనల ఉల్లంఘన వల్ల ఎంపీలాడ్స్ వివాదాల ఊబిలో కూరుకుపోయింది. వీటికితోడు ఈ పథకం అమలులో పారదర్శకత లోపించింది. ఎంపీలాడ్స్ కింద చేపట్టిన ప్రాజెక్టుల గురించి బొత్తిగా సమాచారం లేదని కేంద్ర సమాచార కమిషన్ కనుగొంది. పార్లమెంటు సభ్యులు తమ తమ నియోజకవర్గాల్లో మార్గదర్శక సూత్రాలకు లోబడి అభివృద్ధి కార్యకలాపాలు చేపట్టడానికి ఈ పథకం కింద ఏటా ఒక్కో ఎంపీకి తలా అయిదు కోట్ల రూపాయల చొప్పున నిధులు అందిస్తున్నారు. ఈ కేటాయింపులన్నీ కలిసి ఏడాదికి రూ.4,000 కోట్లుగా లెక్కతేలుతున్నాయి. ఈ నిధులు జిల్లా కలెక్టర్లకు అందుతాయి. ఎంపీలు తమ తమ నియోజకవర్గాల్లో సూచించిన అభివృద్ధి పథకాలకు నిధులు విడుదల చేసి అమలయ్యేలా చూడటం కలెక్టర్ల బాధ్యత. కానీ, ఎంపీలాడ్స్ అమలులో జవాబుదారీతనం, పారదర్శకత లోపించాయని పలు సమీక్షల్లో తేలింది. రాజ్యాంగం అమలుపై జాతీయ సమీక్షా సంఘం, రెండో పాలన సంస్కరణల సంఘం, కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ (కాగ్) గతంలోనే ఈ మాట చెప్పాయి. తాజాగా కేంద్ర సమాచార సంఘమూ ఎంపీలాడ్స్ తీరుతెన్నులపై కఠిన వ్యాఖ్యలు చేసింది. ఇలా అన్నివైపుల నుంచి విమర్శలు ఎదురవుతున్నా ఎంపీలాడ్స్ పేరిట నిధుల దుర్వినియోగాన్ని అరికట్టి లోపాలను తొలగించడానికి పార్లమెంటు ప్రయత్నించకపోవడం చిత్రం. పోనీ, ఈ పథకాన్ని రద్దు చేద్దామంటే ఎంపీలు ససేమిరా ఒప్పుకోరు. ఈ నేపథ్యంలో ఎంపీలాడ్స్ పథకంలో మరింత పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడానికి లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ అధ్యక్షులు కలిసి సముచిత చట్టబద్ధ ప్రాతిపదికను ఏర్పరచాలని కేంద్ర సమాచార కమిషనర్‌గా మాడభూషి శ్రీధరాచార్యులు సిఫార్సు చేశారు. ఎంపీలాడ్స్ అమలుపై సమాచారం కోరుతూ విష్ణుదేవ్ భండారీ, రామ్ గోపాల్ దీక్షిత్‌లు పెట్టిన దరఖాస్తులను పురస్కరించుకుని ఆయన ఆ మేరకు స్పందించారు.

నిబంధనలు లోపభూయిష్టం

ఎంపీలాడ్స్ పథకం అమలుకు నిర్దేశించిన విధానం మిగతా అన్ని పథకాల్లో ప్రభుత్వ పనితీరుకు పూర్తి వ్యతిరేకంగా ఉందని ఆయన పేర్కొన్నారు. సాధారణంగా ప్రభుత్వం ఏదైనా పథకాన్ని ప్రకటించిందీ అంటే మొదట దానికింద ఏయే పనులను ఎలా చేపట్టేదీ ప్రతిపాదించాలి. అవి అమలు చేయదగినవని నిర్ధారించాలి. ఆ తరవాతే నిధులు విడుదలవుతాయి. ప్రభుత్వ పథకాల్లో ఆర్థిక క్రమశిక్షణ పాటించేలా పార్లమెంటు జాగ్రత్తలు తీసుకొంటుంది. పార్లమెంటు అనుమతి లేకుండా ఒక్క రూపాయైనా ఖర్చుపెట్టే వీలులేదు. కానీ, 1993లో ప్రవేశపెట్టిన ఎంపీలాడ్స్‌లో అంతా తలకిందులుగా జరుగుతుంది. ఈ పథకానికి మొదట నిధులు విడుదలవుతాయి. తరవాత ఏయే పనులు చేపట్టాలో ఎంపీ సిఫార్సు చేస్తారు. అది ఆచరణ సాధ్యమని తేల్చుకున్నాక జిల్లా యంత్రాంగం అమలు చేస్తుంది. ఇకనైనా ఎంపీలాడ్స్ నిధులు సక్రమంగా వ్యయమయ్యేలా చూడటానికి విధివిధానాలను రూపొందించాలి. పూర్తిగా పార్లమెంటు సభ్యుడి ఇష్టాయిష్టాలనుబట్టి ప్రాజెక్టులను ఎంపిక చేయడం వల్ల అవినీతి ఆస్కారం కలుగుతోందని గ్రహించి లోక్‌సభ, రాజ్యసభాపతులు ముందుజాగ్రత్తలు తీసుకోవాలి. పార్లమెంటు సభ్యులు నిర్దిష్ట విధులను, పారదర్శకత బాధ్యతను



ఎంపీలాడ్స్- రావాల్సిన మార్పులు

శిరసా వహించాలని కేంద్ర సమాచార కమిషన్ సూచించింది. పార్లమెంటు సభ్యులు విధులను విస్మరించినా, నిబంధనలను అతిక్రమించినా చర్యలు తీసుకునే వీలుండాలన్నారు. ఎంపీలాడ్స్ కింద నిర్మించిన ఆస్తులంటూ కాగితాలపై చూపుతున్నా, తరవాత వాటి ఆచూకీ తెలియని సందర్భాలెన్నో ఉన్నాయి. ఎంపీలాడ్స్ కింద వ్యయానికి సంబంధించి ఇంతవరకు ఒక చట్టమే లేదు. పేరుకు కొన్ని మార్గదర్శక సూత్రాలున్నా వాటిని పాటిస్తున్న దాఖలా లేదు. ఎంపీలాడ్స్ నిధులను దుర్వినియోగం చేసే పార్లమెంటు సభ్యులపై శిక్షాత్మక చర్యలు తీసుకునే వీలూ లేదు.

ఎంపీలాడ్స్ నిధుల కోసం వచ్చిన దరఖాస్తులు, ఎంపీలు సిఫార్సు చేసిన పథకాలు, లబ్ధిదారుల గురించి పార్లమెంటు సభ్యులు పూర్తి సమాచారమివ్వాలని కేంద్ర సమాచార కమిషన్ కోరింది. ఎంపీలాడ్స్ పథకాలు, వ్యయాల గురించి ఓటర్లకు తెలియజెప్పాల్సిన బాధ్యత కూడా ఎంపీలదే. రాజకీయ పార్టీల వెబ్‌సైట్లలో పై పథకం కింద తమ ఎంపీలు చేపట్టిన పనుల వ్యయాల గురించి సమాచారం ఇవ్వాలి. తద్వారా పార్టీలు, ఎంపీల జవాబుదారీతనం పెంచాలని కేంద్ర సమాచార కమిషన్ సూచించింది. చాలామంది పార్లమెంటు సభ్యులు ఎంపీలాడ్స్ పథక నిధులను ప్రజా శ్రేయస్సుకు వెచ్చించడం లేదని కమిషన్ పేర్కొంది.

అమలులో ఉదాసీనత

16వ లోక్‌సభ 2014 మే నెలలో ప్రారంభమయ్యాక 2015 మే వరకు ఎంపీలాడ్స్‌కు రూ.1,757 కోట్లు కేటాయించారు. అందులో కేవలం 16 శాతాన్ని, అంటే రూ.281 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. అంటే దాదాపు రూ.1,487 కోట్ల రూపాయలను అభివృద్ధి పథకాలకు వెచ్చించనేలేదన్నమాట. దేశంలోని మొత్తం 543 లోక్‌సభా నియోజకవర్గాలకు 278 స్థానాల్లో (51 శాతం) ఎంపీలాడ్స్ కోసం ఒక్క రూపాయైనా ఖర్చుచేయలేదు. 223మంది పార్లమెంటు సభ్యులు కనీసం ఒక్క అభివృద్ధి పథకాన్నైనా సిఫార్సు చేయలేదు. ఈ పథకానికి కేటాయించిన నిధులు మురిగిపోవు. ఖర్చు కాకుండా మిగిలిపోయిన నిధులను మరుసటి సంవత్సర పద్దులో కలుపుతారు. ఎంపీల అలసత్వం వల్ల 2004 నుంచి 2018 ఫిబ్రవరి వరకు మొత్తం రూ.12,000 కోట్ల ఎంపీలాడ్స్ నిధులు ఖర్చుకాకుండా పేరుకుపోయాయి! ప్రజలకు ఉపయోగపడే పథకాల అమలుకు ఎంపీలు ముందుకు రాకపోవడం వల్ల అత్యధిక నిధులు పేరుకుపోయిన రాష్ట్రాల జాబితాలో ఉత్తర్ ప్రదేశ్ ప్రథమ స్థానం ఆక్రమిస్తోంది. తదుపరి స్థానాల్లో మహారాష్ట్ర, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ నిలిచాయి. నిధుల వినియోగంలో అగ్రగాములు- కేరళ, తమిళనాడు. మిగతా రాష్ట్రాలు వెనకబడి ఉన్నాయి. పరిస్థితి ఇంత అధ్వానంగా ఉంది కాబట్టే ఎంపీలాడ్స్ మీద నలువైపుల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఈ పథకం రాజ్యాంగబద్ధమేనని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా, దాన్ని నిలిపేయాలని రాజ్యాంగం అమలుపై ఏర్పాటు చేసిన జాతీయ సమీక్షా సంఘం సూచించింది. చట్టసభలు, ప్రభుత్వ బాధ్యతలు, అధికారాల మధ్య రాజ్యాంగం స్పష్టమైన విభజన పాటించింది. ఎంపీలాడ్స్ ఈ రాజ్యాంగ సూత్రానికి వ్యతిరేకమని సమీక్షా సంఘం పేర్కొంది. ఎంపీలు స్థానిక సంస్థల పరిధిలోకి వెళ్లకూడదనే నియమానికి ఎంపీలాడ్స్ భంగం కలిగించే ప్రమాదం నిత్యం పొంచి ఉంటుంది. అధికారాల విభజన అనే రాజ్యాంగ సూత్రానికి ఎంపీలాడ్స్ విరుద్ధం కాబట్టి దాన్ని రద్దు చేయాలని రెండో పాలన సంస్కరణల సంఘమూ సిఫార్సు చేసింది. పార్లమెంటు సభ్యులు అభివృద్ధి పథకాలను ఎంపిక చేయడమంటే ప్రభుత్వ అధికారాల్లోకి చొరబడటమే అవుతుందని స్పష్టీకరించింది.

కాగ్ సైతం పథకాన్ని గట్టిగా వ్యతిరేకించింది. ఎంపీలాడ్స్‌ను సమీక్షించిన రెండుసార్లూ లొసుగులను లోతుగా విశ్లేషించింది. అనేక విధాలుగా జరుగుతున్న మోసాలనూ ప్రస్తావించింది. ఎంపీలాడ్స్‌కు నిధులు బదలాయిస్తున్న తీరును సమీక్షించాలని కాగ్ సూచించింది. ఈ పథకం అమలుకు సంబంధించి ఎంపీల పనితీరులో పారదర్శకత లోపించడం అభిలషణీయం కాదు. కేంద్ర సమాచార కమిషన్ సూచనలను ఆలకించి పార్లమెంటు ఉభయ సభాపతులు ఎంపీలాడ్స్‌ను సమీక్షించడంలో ఆలస్యానికి తావివ్వకూడదు!

(రచయిత- ప్రసారభారతి ఛైర్మన్)

మూడూ మూడే

అంతర్యామి

లోకంలో మనిషి తన జన్మను సార్థకం చేసుకోవడానికి భగవంతుడు ఎన్నో మార్గాలు చూపాడు. ఆ మార్గాల్లో ఒకటి సాహిత్యం. లోకంలో సాహిత్యం ఎన్నో విధాలుగా ఉంది. గ్రంథరూపంలో కనిపించే సాహిత్యం అంతా శాశ్వతంగా ఉంటుందని చెప్పలేం. మౌఖిక రూపంలోనూ సాహిత్యం శాశ్వతంగా ఉంటుందని వేదాలు నిరూపించాయి. వేదాలను పుస్తకంలో చూసి వల్లెవేయరు. గురువు సమక్షంలోనే గురుముఖంగా వచ్చిన మంత్రాలను వల్లెవేసి నేర్చుకొంటారు. పూర్వకాలంలో ఏ విద్య అయినా నోటికి వస్తేనే ప్రయోజనం అని భావించేవారు. ఎవరైనా ప్రశ్న వేసినప్పుడు 'పుస్తకం చూసి చెబుతాను' అని సమాధానం చెబితే, అలాంటివారికి విద్య స్వాధీనం కాలేదని భావించేవారు. ఏ విద్య అయినా బుద్ధిలో నిక్షిప్తం అయితేనే శాశ్వతం.

సాహిత్యలోకంలో 'మఖలో పుట్టి పుబ్బలో మాడిపోయే' రచనలు ఎన్నో వస్తున్నాయి, పోతున్నాయి. వాటి పేర్లూ ఎవరికీ తెలియవు. తరతరాలుగా యావత్తు ప్రపంచాన్ని ప్రభావితం చేసిన, చేస్తున్న, చేయబోతున్న ఇతిహాసాలు కొన్ని ఉన్నాయి. అవే రామాయణ, మహాభారత, భాగవతాలు. చిన్నపిల్లవాడి నుంచి మరణోన్ముఖుడైన వృద్ధుడిదాకా నిత్యం పఠనీయంగా ఈ మూడు గ్రంథాలు నిలిచిపోయాయి.



వాల్మీకి రాసిన ఆదికావ్యం 'రామాయణం'. అసలు రామాయణం ఆవిర్భావానికి గల నేపథ్యం కారుణ్యం. ఒక వేటగాడు తన బాణాలతో చెట్టుమీదున్న క్రౌంచ పక్షుల జంటలో మగపక్షిని కొట్టిచంపిన దృశ్యాన్ని చూసిన వాల్మీకి హృదయంలో ఉప్పొంగిన కారుణ్యసాగరమే ఈ కావ్యానికి నాంది పలికింది. వాల్మీకి నోట అప్రయత్నంగా వెలువడిన 'మా నిషాద' అనే శ్లోకం నూతన ఛందస్సును లోకానికి పరిచయం చేసింది.

'అనుష్టుప్' అనే పేరుతో ప్రసిద్ధిగాంచిన ఈ ఛందస్సు వేద మంత్రంలా నేటికీ మారుమోగుతోందంటే వాల్మీకి హృదయం ఎంత మానవతామృత భాండమో తెలుసుకోవచ్చు. లోకంలో ఒక మానవుడు ఎలా ఉండాలో చెప్పిన విషయాలే రామాయణంలో ఉన్నాయి. అందుకే 'రాముడిలా ప్రవర్తించు, రావణుడిలా మసలకు' అనే ఉపదేశాలు వ్యాప్తిలోకి వచ్చాయి. అందుకే రామకథ చరితార్థమై శాశ్వత స్థానాన్ని పొందింది.



వేదాలను నాలుగు భాగాలుగా విభజించిన వేద వ్యాసుడు రచించిన 'మహాభారతం' లోకంలోని ప్రతి ఇంటిలోనూ జరిగే కుటుంబ కలహాలకు, సౌజన్య స్నేహాలకు ఆలవాలమై అనేక నీతులను అందిస్తోంది. దాయాదుల సంబంధాలు ఎలా ఉంటాయో, వాటి పరిణామాలు ఎంతటి దారుణాలను వాటిల్లజేస్తాయో భారతం సోదాహరణంగా చెబుతోంది. ఎన్నో పాత్రలు, ఎందరో మనుషులు, ఎన్నో విభిన్న మనోభావాలకు దర్పణం మహాభారతం. ధర్మమే జయిస్తుందని, అధర్మానికి నాశనం తప్పదని సూచించే ఈ ఉద్గ్రంథానికి 'జయం' అనే పేరూ ఉంది. కౌరవ, పాండవుల మధ్య జరిగిన దాయాదుల పోరులో ఎవరు ధర్మానికి నిబద్ధులై ఉన్నారో వారికే విజయం లభిస్తుందని తెలిపిన ఇతిహాసం ఇది. ధర్మం వైపే భగవంతుడూ నిలుస్తాడని చెప్పడానికి శ్రీకృష్ణుడి పాత్ర అద్దం పడుతోంది.




మూడోది భాగవతం. ఇది మోక్షసాధనంగా లోకంలో ప్రసిద్ధిగాంచింది. వేదాలను విభజించినా, బ్రహ్మసూత్రాలను రచించినా, మహాభారతాన్ని సృజించినా మనసులో ఇంకా ఏదో తెలియని అశాంతి, అసంతృప్తి ఉండటాన్ని గ్రహించి, అలాంటి అసంతృప్తి తొలగాలంటే శాశ్వత సత్యాన్ని తెలిపే భగవత్కథలనే వర్ణించాలని తలచిన వ్యాసుడు భాగవతాన్ని రచించి, మానసికంగా సేదదీరాడు. ఈ విశ్వంలో ఎన్నటికీ నశించకుండా శాశ్వతంగా నిలిచిఉండేది భగవంతుడేనని అతడి స్వరూప స్వభావాలను తెలుసుకోవడం ద్వారా ఈ జగత్తు అంతా అశాశ్వతమనే సత్యజ్ఞానాన్ని దృఢపరచుకోవడానికి వ్యాసుడు ఈ గ్రంథంలో దారులువేసి కృతార్థుడయ్యాడు. లోకాన్ని తరింపజేశాడు.

- డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ

ఆదాయం, ఆదర్శం.. ఆమె

ఇల్లాలు ఇంటికి వెలుగవుతోంది. ఇంటి నుంచి బయటకు రావడానికి భయపడే పరిస్థితులను అధిగమించిన మహిళ నేడు కుటుంబానికి ప్రధాన జీవనాధారంగా మారుతోంది. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను చక్కగా వినియోగించుకుంటూ మహిళలు ఆదాయాన్ని సముపార్జిస్తున్నారు. తమ ప్రతిభతో భర్తతో సమానంగా సంపాదించగలమని వారు నిరూపిస్తున్నారు. అందుకు అద్దంపడుతోంది ఎపిట్కో సర్వే.



- 11.49 లక్షల కుటుంబాల్లో నెలకు రూ.10వేల ఆదాయం
- 88% పట్టణ పేదల్లో మెరుగైన ఆర్థిక పరిస్థితి
- ప్రభుత్వ సాయాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ స్వయం ఉపాధి
- ఏపిట్కో తాజా సర్వేలో వెల్లడైన అంశాలు

1 ఆహార రంగం 48% — ఇందులో బేకరీ ఉత్పత్తులు, కేటరింగ్, పాల ఉత్పత్తులు, అల్పాహార, ఆహార కేంద్రాలు

2 వస్త్ర, చేనేత రంగం 39% — ఫ్యాషన్ డిజైన్, దుస్తుల తయారీ, కలంకారి, వస్త్ర వ్యాపారం

3 హస్త కళలు 5% — అగర్‌బత్తీల తయారీ, వెదురు ఉత్పత్తులు, వస్త్ర, జూట్ సంచుల తయారీ, పేపర్ ప్లేట్లు

4 సేవలు 8% — బ్యూటీ పార్లర్/సెలూన్, దోబీ/లాండ్రీ, పిండి మర, ఫొటో స్టాట్ సెంటర్, పుస్తక దుకాణం

రాష్ట్ర పారిశ్రామిక, సాంకేతిక కన్సల్టెన్సీ ఆర్గనైజేషన్ (ఎపిట్కో) తాజా సర్వేలో పట్టణ పేద మహిళల్లో 88 శాతం మంది నెలకు రూ.10 వేల ఆదాయాన్ని పొందుతున్నట్లు వెల్లడించింది. నాలుగేళ్ల వ్యవధిలో 74శాతం వృద్ధి నమోదైంది. రాష్ట్రంలోని 2లక్షల పట్టణ స్వయం సహాయక సంఘాలు ప్రభుత్వం నుంచి బ్యాంకు భాగస్వామ్య రుణం కింద రూ.11,805 కోట్లు, పసుపు కుంకుమ కింద (పెట్టుబడి నిధి) రూ.1,568.70 కోట్లు, సంస్థాగత సంస్థల నుంచి కార్పస్ రూ.1,400 కోట్లు, స్త్రీ నిధి కింద మరో రూ.550.75 కోట్లు అందుకున్నాయి. ప్రధానంగా నాలుగు రంగాల్లో మహిళలు ఆర్థికంగా దూసుకెళ్తూ అనేక మందికి ఉపాధి చూపిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.



ముగ్గుల డిజైన్లు రూపొందిస్తున్న మహిళలు

110 పట్టణాల్లో స్వయం, సహాయక సంఘాల సంఖ్య
2 లక్షలు

సంఘాల్లో మొత్తం సభ్యులు
20 లక్షలు

వివిధ పథకాల్లో సంఘాలకు ఇప్పటివరకు అందించిన సాయం
రూ. 14,085.52 కోట్లు

ఎపిట్కో తాజా సర్వే ప్రకారం ఏటా రూ.1.20 లక్షల ఆదాయాన్ని పొందుతున్న పట్టణ పేద కుటుంబాలు
13 లక్షలు

పట్టణ పేద కుటుంబాలు నెలకు రూ.10 వేల ఆదాయం సాధించేలా జిల్లాల వారీగా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం, ఇప్పటివరకు సాధించింది

జిల్లా	లక్ష్యం	సాధించింది	శాతం
చిత్తూరు	1,05,449	96,406	91.42
గుంటూరు	1,35,250	1,23,566	91.36
కృష్ణా	1,41,750	1,29,131	91.10
ప్రకాశం	73,179	65,906	90.06
అనంతపురం	96,246	86,195	89.56
కర్నూలు	1,13,012	1,00,688	89.09
పశ్చిమ గోదావరి	89,116	79,176	88.85
కడప	94,751	84,092	88.75
శ్రీకాకుళం	49,820	43,041	86.39
నెల్లూరు	76,631	66,150	86.32
తూర్పు గోదావరి	1,15,274	99,417	86.24
విజయనగరం	68,220	58,359	85.55
విశాఖపట్నం	1,37,132	1,17,060	85.36
మొత్తం	12,95,830	11,49,187	88.68

కూలీ నుంచి మగ్గాలు కొనేస్థాయికి..



'ఒకప్పుడు కూలీగా నేత చీరలు తయారీకి వెళ్లే దాన్ని. నేడు సొంత మగ్గాలపై ఇంటి వద్దనే నేత చీరలు తీసుకొస్తున్నాను. స్వయం, సహాయక సంఘంలో చేరాక బ్యాంకు భాగస్వామ్యం రుణం కింద సమకూర్చిన డబ్బును పెట్టుబడిగా పెట్టి మగ్గాలు కొన్నాను. తయారు చేసిన నేత చీరలను మెప్మా బజార్లలో విక్రయిస్తున్నా. జాతీయ డ్వాక్రా బజార్లలోనూ ఉచితంగా స్టాల్ కేటాయించి విక్రయించుకునే సౌకర్యం కల్పిస్తున్నారు. నైపుణ్యాలు పెంచుకునేలా ప్రత్యేకంగా శిక్షణ అందిస్తున్నారు. ఇప్పుడు ఆర్థికంగా పరిస్థితి మెరుగైంది'

– నాగమణి, రామాంజనేయ స్వయం, సహాయక సంఘ సభ్యురాలు, ప్రొద్దుటూరు, కడప జిల్లా

పట్టుదలను గుర్తించి ప్రోత్సహించారు..



'బ్యాంకు భాగస్వామ్య రుణంతో రాగి, ఇత్తడి వస్తువులు శుభ్రం చేసే 'క్లీనింగ్ లిక్విడ్ యూనిట్'ని ప్రారంభించాం. చక్కని ఫలితాలు సాధిస్తున్నాం. మొదట్లో తగిన పెట్టుబడి లేకపోవడంతో యూనిట్ పెట్టాలన్న ఆశ చాన్నాళ్ల వరకు నెరవేరలేదు. స్వయం, సహాయక సంఘంలో చేరాక పట్టుదలను గుర్తించి అధికారులు ప్రోత్సహించారు. మెప్మా బజార్లు, జాతీయ డ్వాక్రా బజార్లతో ఉత్పత్తులను పెట్టి విక్రయిస్తున్నాం. ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది'

– రాజు దుబా, శివాని మహిళా పొదుపు సంఘ సభ్యురాలు, జ్ఞానాపురం, విశాఖపట్నం

- ఈనాడు, అమరావతి

పురపాలికల్లో పాత ఇళ్ల మరమ్మతులకు రూ.10 వేలు

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్రంలోని పురపాలికల్లో వివిధ పథకాల కింద ఇదివరకే నిర్మించిన ఇళ్ల మరమ్మతులకు ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.10 వేల చొప్పున ఇవ్వనుంది. 1996-2004 మధ్య చేపట్టిన ఇళ్ల నిర్మాణానికి ఈ సాయాన్ని వర్తింపచేయనుంది. ఇందుకోసం రూ.20 కోట్లు కేటాయించింది. లబ్ధిదారుల ఎంపిక బాధ్యతను ఆయా పురపాలక అధికారులకు అప్పగించింది. సాయం పొందేందుకు లబ్ధిదారులు పురపాలక కార్యాలయాల్లో దరఖాస్తులు అందించవచ్చు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో ఇళ్ల నిర్మాణం ఎక్కువగా అపార్ట్‌మెంట్ల మాదిరి కాలనీలుగా చేపట్టారు. కాలనీల్లో చాలా ఇళ్లు మరమ్మతులకు గురయ్యాయని, సాయం అందించాలని ప్రజలు అక్కడి ప్రజాప్రతినిధులకు విన్నవించారు. ప్రజాప్రతినిధులు విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో సానుకూలంగా స్పందించారు. ఇప్పటికే 12,500 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆయా చోట్ల లబ్ధిదారుల ఇళ్ల మరమ్మతులను గుత్తేదారులతో చేపట్టనున్నారు. ఇంటి మరమ్మతుల వ్యయం రూ.10 వేలకు మించితే మిగతా మొత్తాన్ని పురపాలకశాఖ సాధారణ నిధుల నుంచి వెచ్చించనుంది.

దేశ భద్రతను మోదీ పణంగా పెట్టారు

పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి

సేవామందిర్(పరిగి), న్యూస్‌టుడే: రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు వ్యవహారంలో ప్రధాని నరేంద్ర మోదీ దేశభద్రతను పణంగా పెట్టారని ఏపీ పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి విమర్శించారు. అనంతపురం జిల్లా పరిగి మండలంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో నాడు రూ.520 కోట్లతో యుద్ధవిమానాల కొనుగోలుకు ఒప్పందం చేసుకోగా.. కేంద్రంలో ఎన్డీఏ అధికారం చేపట్టిన అనంతరం వాటిని రూ.16 వేల కోట్లకు కొనుగోలు చేశారని రఘువీరా చెప్పారు. ఇంత తీవ్రమైన విషయాన్ని ప్రధాని మోదీ గోప్యంగా ఉంచారని ఆయన ఆరోపించారు. తాము కేంద్రంలో తిరిగి అధికారంలోకి వస్తే ఏపీకి ప్రత్యేకహోదా అమలు చేస్తామని రాహుల్‌గాంధీ చెప్పారని ఆయన గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని 175 శాసనసభ స్థానాలు, 25 పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. తమతో పొత్తుకు ఏవైనా పార్టీలు ముందుకొస్తే ఆ విషయాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం చూసుకుంటుందని ఆయన చెప్పారు.

బాధ్యతలేని ప్రధాని ఎందుకు?

మాజీ ప్రధాని దేవేగౌడ వ్యాఖ్య



ఈనాడు డిజిటల్, బెంగళూరు: లోక్‌సభకు వచ్చి ప్రజలకు సమాధానం చెప్పని ప్రధానమంత్రి మనకెందుకని మాజీ ప్రధాని హెచ్.డి.దేవేగౌడ వ్యాఖ్యానించారు. ఆయన శనివారం బెంగళూరులో విలేకరులతో మాట్లాడుతూ మోదీపై మండిపడ్డారు. భారత్ కంటే విదేశాల్లోనే ఎక్కువగా గడుపుతున్న ప్రధాని మోదీ చివరికి లోక్‌సభనే మరిచిపోయారని ఎద్దేవా చేశారు. 'ప్రధాని ఉండేది లోక్‌సభలో మాట్లాడేందుకేనా?' అంటూ రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యానించటం సరికాదన్నారు. నాలుగున్నరేళ్ల దేశానికి ఏం చేశారో ధైర్యంగా చెప్పాల్సిన బాధ్యత ప్రధానిపై ఉందన్నారు.

వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయబోనని దేవేగౌడ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కేవలం జనగణమన గీతం వచ్చాక నిల్చోవటం కోసమే అయితే అక్కడి వరకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. బాధ్యత లేని పార్లమెంట్ సభ్యులుగా ఉండేందుకు ఇష్టపడనంటూ తన మనసులో మాట చెప్పారు. ఇటీవలి కాలంలో కర్ణాటకలో సంకీర్ణ ప్రభుత్వ భాగస్వామి కాంగ్రెస్‌పై మండిపడుతున్న దేవేగౌడ శనివారం తన అసహనాన్ని వ్యక్తం చేశారు. తమకు గౌరవం ఇవ్వాలని ఆయన కాంగ్రెస్‌కు మరోసారి సూచించారు.

1600 వైద్యులు, 900 నర్సుల పోస్టుల భర్తీకి చర్యలు: పూనం మాలకొండయ్య

అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే: 'దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆంధ్రప్రదేశ్‌లో పలు ప్రజారోగ్య పథకాలు అమలు చేస్తున్నాం. ఆయా పథకాలకు సంబంధించి ప్రభుత్వం చేపట్టిన సర్వేలో 96 శాతంపైగా ప్రజల నుంచి సంతృప్తి లభించింది. వీటికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ఇప్పటివరకు 36 పురస్కారాలూ లభించాయి. ప్రభుత్వ పనితీరుకు ఇదే నిదర్శనం' అని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య పేర్కొన్నారు. త్వరలో 1300 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, 300 వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల ప్రత్యేక వైద్యులు, మరో 900 ఏఎన్ఎం పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. వీటిని రెగ్యులర్ ప్రతిపాదికపై భర్తీ చేస్తామని.. రానున్న 45 రోజుల్లో సంబంధిత ప్రక్రియ పూర్తికి కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. శనివారం అనంతపురంలోని సర్వజనాసుపత్రిని ఆమె సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ శాఖ సహకారంతో రాష్ట్రంలోని 15 బోధనాసుపత్రుల్లో సౌర విద్యుత్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 7 వేల ఆరోగ్య ఉపకేంద్రాలను హెల్త్‌వెల్‌నెస్ కేంద్రాలుగా మారుస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం సర్కారు ఆసుపత్రుల్లో 61 డయాలసిస్ కేంద్రాలు కొనసాగుతున్నాయని.. మరో 25 ఆసుపత్రుల్లో కొత్త కేంద్రాలను త్వరలో ప్రారంభిస్తామని వెల్లడించారు. చిన్నారి ఎక్స్‌ప్రెస్ పేరిట అందుబాటులోకి తీసుకువస్తున్న వాహనాలను త్వరలో ముఖ్యమంత్రి ప్రారంభించనన్నట్టు పూనం మాలకొండయ్య వివరించారు.

హోదాతోనే యువతకు ఉపాధి

కేంద్ర హోంమంత్రికి విభజన హామీల సాధన సమితి విజ్ఞప్తి

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా వస్తే పరిశ్రమలు వచ్చి యువతకు ఉపాధి లభిస్తుందని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు విభజన హామీల సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్, సమితి ప్రతినిధులు తెలిపారు. దిల్లీలో హోంమంత్రిని శనివారం కలిసిన అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక హోదాతో పాటు విభజన హామీలు, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేకమైన నిధులు, బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. రాష్ట్ర సమస్యలపై హోంమంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. పార్లమెంట్ సమావేశాలు ముగిసే వరకు దిల్లీలోనే ఉండి పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కేంద్రమంత్రిని కలిసిన వారిలో ప్రొఫెసర్ జార్జ్ విక్టర్, సదాశివరెడ్డి, అప్పలనాయుడు, తాటికొండ నరసింహారావు, జి.వి.సత్యనారాయణరాజు, నర్సినాయుడు, నరేశ్ తదితరులున్నారు.

పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగార్హత పరీక్ష నేడే

ఈనాడు-అమరావతి: పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగార్హత పరీక్ష ఆదివారం జరగనుంది. ఆర్‌పీఎఫ్ (రైల్వే రక్షక దళం) పరీక్షకు హాజరయ్యే కొద్ది మంది అభ్యర్థులకు మాత్రం జనవరి 8న పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు అభ్యర్థుల మెయిల్‌కు సమాచారం పంపారు.

ఐఐడీటీకి ఒప్పంద ప్రాతిపదికన సిబ్బంది నియామకానికి ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: అంతర్జాతీయ డిజిటల్ టెక్నాలజీ సంస్థ(ఐఐడీటీ)కు ఇండియన్ బిజినెస్ స్కూల్ తరహాలో ఒప్పంద ప్రాతిపదిక సిబ్బంది నియామకానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డైరెక్టర్ జనరల్ సహా 8 పోస్టుల భర్తీకి అనుమతించారు.

'క్యాట్-2018' ఫలితాలు విడుదల

- 11 మందికి వంద పర్సెంటైల్

కోల్‌కతా: ప్రతిష్ఠాత్మక ఐఐఎమ్ విద్యాసంస్థల్లో అందించే మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (క్యాట్-2018) ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. పరీక్షలో 11 మంది అభ్యర్థులు వంద పర్సెంటైల్ (అత్యుత్తమ మార్కులు) సాధించారు. వీరందరిదీ సాంకేతిక విద్యా నేపథ్యమే. వీరిలో ఏడుగురు మహారాష్ట్రకు చెందినవారు. అభ్యాస పరీక్షలు (మాక్ టెస్టులు) ఎక్కువగా రాయడం వల్లే తాను అత్యుత్తమ ప్రదర్శన చేయగలిగానని 100 పర్సెంటైల్ సాధించిన ఐఐటీ-కాన్పూర్ విద్యార్థి రౌనక్ మజూమ్‌దార్ చెప్పారు. ఈ పరీక్షలో 21 మంది అభ్యర్థులు 99.99 పర్సెంటైల్‌ను దక్కించుకున్నారు. మెరుగైన ప్రదర్శన చేసినవారిలో అహ్మదాబాద్‌కు చెందిన కవల సోదరులు అనుభవ్ (99.99 పర్సెంటైల్), అభిషేక్ (99.97) ఉండటం విశేషం. ఐఐఎమ్-కలకత్తా శనివారం ఈ ఫలితాలను ప్రకటించింది. iimcat.ac.in వెబ్‌సైట్‌లో అభ్యర్థులు ఫలితాలను తెలుసుకోవచ్చు. నవంబర్‌లో నిర్వహించిన ఈ పరీక్షను దేశవ్యాప్తంగా 2లక్షలకుపైగా మంది రాశారు.

వరంగల్ ఎన్ఐటీ విద్యార్థుల హవా

క్యాట్ ఫలితాల్లో తెలంగాణలోని వరంగల్ జాతీయ సాంకేతిక సంస్థ(ఎన్ఐటీ) విద్యార్థులు ఆలిండియాలో అత్యధిక పర్సంటైల్‌తో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. నిట్‌లో బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్ చదువుతున్న నిపుణ్ అగర్వాల్ (99.92 పర్సంటైల్), బీటెక్ ట్రిపుల్‌ఈ విభాగానికి చెందిన ఇబాన్‌తరుణ్ కటకీ (99.85 పర్సంటైల్) స్కోర్‌తో క్యాట్-2018 ఫలితాల్లో ఆలిండియా ప్రథమ, ద్వితీయ ర్యాంకులను కైవసం చేసుకున్నారు. సివిల్ ఇంజినీరింగ్‌కు చెందిన సమీర్ అహ్మద్ (97.12), పార్థగోస్వామి (97.04), గౌరవ్‌మాలిక్ (96), తపస్‌దాస్ (95.9), సుజన్‌కరేగ్‌దార్ (95.17) అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. క్యాట్ ఫలితాల్లో ఉత్తమ స్కోర్ సాధించిన విద్యార్థులను నిట్ డైరెక్టర్ ఎన్‌వీ రమణారావు అభినందించారు.

సీపీయస్ రద్దు చేస్తా

- సాక్షరభారత్ సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తాం
- పాదయాత్రలో హామీ ఇచ్చిన వైఎస్ జగన్

సోంపేట – న్యూస్‌టుడే

అధికారంలోకి వస్తే ఉపాధ్యాయ, ఉద్యోగవర్గాలకు ఇబ్బందులు కల్గించే కాంట్రిబ్యూటరీ పింఛన్ విధానాన్ని(సీపీయస్) రద్దు చేస్తానని, సాక్షరభారత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తానని వైకాపా అధ్యక్షుడు వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలంలోని టి.శాసనాం, పాలవలస, కొర్లాం, బారువ, లక్కవరం కూడలి మీదుగా ప్రజాసంకల్ప యాత్ర సాగింది. ఆయా ప్రాంతాల్లో సీపీయస్ రద్దు సాధన కమిటీ ఉపాధ్యాయుల సమస్యను జగన్‌కు వివరించి వినతిపత్రం అందించారు. పాలవలస వద్ద సాక్షరభారత్ సమన్వయకర్తలు, ఇతర సిబ్బంది వినతిపత్రం ఇచ్చి తమ ఉద్యోగాలు కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరగా.. సమస్య తన దృష్టికి వచ్చిందని తప్పకుండా న్యాయం చేస్తానన్నారు. తాను అధికారంలోకి వస్తే అందరికీ పింఛన్లు అందజేస్తానని తనను కలిసిన వృద్ధులు, దివ్యాంగులకు హామీ ఇచ్చారు. తిత్లీ బాధితులు పరిహారం అందలేదని తెల్పగా కొద్దిరోజులు ఓపిక పడితే అందరి సమస్యలు తీరుస్తానని చెప్పారు. జగన్‌తో పాలకొండ ఎమ్మెల్యే కళావతి, ఇచ్ఛాపురం పురపాలక సంఘం ఛైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, వైకాపా పాతపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డిశాంతి, నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, వైకాపా నాయకులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం కొర్లాంలో పాదయాత్రలో జగన్‌తో కలిసి నడుస్తున్న వైకాపా జిల్లా మహిళా నాయకురాళ్లు

కేరళలో అరాచకం సృష్టిస్తున్న భాజపా

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

ఈనాడు, దిల్లీ: సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా శబరిమల వెళ్లే మహిళలకు ఆ రాష్ట్ర ప్రభుత్వం రక్షణ కల్పిస్తుంటే భాజపా, ఆర్ఎస్ఎస్ కలిసి కేరళలో అరాచకం సృష్టిస్తున్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆరోపించారు. దిల్లీలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మహారాష్ట్రలో శనిసింగనాపూర్ ఆలయంలో మహిళలకు ప్రవేశంపై సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తున్న భాజపా కేరళలో మాత్రం విరుద్ధంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. శబరిమలపై భాజపా నేతలకు భక్తి లేదని.. కేరళలో ఎల్డీఎఫ్ ప్రభుత్వాన్ని పడగొట్టడం పైనే వారి దృష్టని విమర్శించారు. సుప్రీంకోర్టు తలాఖ్‌పై ఇచ్చిన తీర్పును తమ పార్టీ ఆహ్వానించిందని. . కేంద్ర ప్రభుత్వం చట్టంలో నేరపూరిత అంశాలను చేర్చడంపై తాము అభ్యంతరం తెలుపుతున్నట్లు చెప్పారు. భాజపాతో విసిగిపోయి చంద్రబాబు నాయుడు బయటకు వచ్చారని.. భాజపాకు వ్యతిరేకంగా వచ్చే ప్రతి ఒక్కరిని కలుపుకొని వెళ్తామన్నారు. ఈ దేశంలో అత్యంత పెద్ద క్రిమినల్ భాజపా అధ్యక్షుడు అమిత్‌షా అని ఆయన ఆరోపించారు. సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసులో ఆయన ముద్దాయి అని విమర్శించారు. సాక్షులు లేకుండా చేసి కేసు నుంచి బయటపడ్డారన్నారు. కాంగ్రెస్ హయాంలో చిల్లర అవినీతి జరిగితే.. భాజపా టోకు (హోల్‌సేల్) అవినీతి చేస్తోందన్నారు. జగన్‌కు భాజపా పూర్తి మద్దతు ఉందని.. అందుకే కోడి కత్తి కేసు ఎన్ఐఏకు వెళ్లిందని ఓ ప్రశ్నకు ఆయన బదులిచ్చారు.

నదీజలాల ప్రక్షాళనకు 3 నదుల గుర్తింపు

మంగళగిరి, న్యూస్‌టుడే: నవ్యాంధ్రలోని 3 నదులను గుర్తించి కాలుష్యం నివారణకు తీసుకోవటానికి ప్రణాళికను ప్రభుత్వం రూపొందిస్తోంది. కృష్ణా, గోదావరి, నాగావళి నదులు కాలుష్యానికి గురికాకుండా చర్యలు తీసుకోవాలని భావిస్తోంది. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన నదీ పరిరక్షణ, ప్రత్యేక పర్యావరణ విజిలెన్స్‌టాస్క్‌ఫోర్సు కమిటీల సభ్యులు ఈనెలాఖరుకు ప్రణాళిక, కార్యాచరణ తయారు చేస్తారని ఏపీ కాలుష్యనియంత్రణ మండలి అధికారులు వెల్లడించారు.

ఈనాడు పెళ్లిపందిరి

అనువైన సంబంధాల ఎంపికలో మీ ఆత్మీయ బంధువు



వధువు కావలెను

కాపు 49" విడోయర్ M.A., LLB, లాయర్, స్వంత ఇల్లు వరుసకు లాయర్/జాబ్ వధువు కావలెను. CNB, ఫోటో, బయోడేటా వాట్సప్ ✆ 99480 17674, 91823 02700 (I)

వధువు కావలెను. బ్రాహ్మణ 5'8" ఎత్తు భరద్వాజ గోత్రం నెలకి ముప్పై వేలు శాలరీ 50 లక్షల ఆస్థి ఉన్న వరునికి Ph: 96768 23115 (I)

రెడ్డి (Now Hyd) 1992/5'11" B.Tech/ MS(US/75K)/ 25 CR. ★ 1988/5.11" BE/MS/US/100K/ H1B/I-140. 9505551788/ 9848221166 (A)

Kamma/ MS, Genl, M.Ch/ 5'8"/ 29/ 20 Cr ★ MD Genl/ 5'11"/ 28/ 20 Cr ★ MD, Peadia/ 5'11"/ 27/ 100 Cr ★ MD, Radio/ 5'8"/ 28/ 50 Cr. తుమ్మల సుజాత. ✆ 99632 32758. (B)

రెడ్డి 1989/ 6', B.Tech/ IIT/ Kharagpur/ 25 L.P.A/ Hyd ★ 1984/ 6'2" B.Tech /Pilot/ 24L.P.A/ Delhi 8885559579/ 9848221166 (A)

Kamma/ BE MS/ 6'/ 24/ 150 K/ 25 Cr ★ BE MS/ 5'10"/ 25/ 120 K/ 60 K ★ B.Tech, IIT, MBA, Ph.D/ 5'8"/ 29/ 200 K/ 10 Cr. తుమ్మల సుజాత. ✆ 98482 17771, 0866-2433788. (B)

రెడ్డి 1991/5'11" B.Tech/ M.Tech/ Business/ 25 L.P.A ★ 1990/ 5'11" B.Tech/ Sr. SWE/ Hyd/ 9L. P.A ✆ 7893333726/ 9848221166 (A)

Kamma/ B.Tech/ BITS/ 5'10"/ 27/ 24L PA/ 20 Cr ★ B.Tech, IIT/ 6'/ 27/ 48L PA ★ CA/ 5'10"/ 24/ 12L PA/ 2 Cr ★ B.Tech/ 6'/ 10L PA/ 25 Cr. తుమ్మల సుజాత. ✆ 81217 95786. (B)

కాపు/ కుల/ కట్న ప్రసక్తిలేని/ 35/ 6'/ Fr/ PG,/ MBA/ Sr. SWE/ Hyd/ 1 లక్ష P.M చాలా వెల్‌సెటిల్డ్ వరునికి/ అందమైన వధువు కావలెను/ చాలా అర్జెంట్ ✆ 9381534569 (A)

కమ్మ, 27, 5'9", B.Tech, MS, IIIT, SWE, MNC, 17 Lakhs PA, వెల్‌సెటిల్డ్ వరునికి సాంప్రదాయక కుటుంబానికి చెందిన వధువు కావలెను. 9866464906 (A)

కమ్మ/ USA/ 30 Y, 6', B.Tech (IIT) Fair $ 125K P/A H1B వీసా, 90 Cr వరునికి U.S. (or) India కమ్మ వధువు కావలెను. ✆ 73863 38574, 73960 13998. (B)

యాదవ: కట్నప్రసక్తిలేదు B.Tech/ C.Govt. Sr. ఆఫీసర్/ BHEL/ 1 Lakh P/M, 5'10" ఎత్తు, 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 8008939651 (A)

SC, మాల, హిందూ/ M.Tech, 28Y/ 5'8"/ డెల్ కంపెనీ/ SWE, Hyd/ 11L, PA అందమైన/ వరునికి తగిన/ వధువు కావలెను. ✆ 9705960270 (A)

గంగపుత్ర బెస్త: MSc/ Govt. గ్రూప్ - I ఆఫీసర్/ MPDO/ 60,000/- P.M. 5'11" ఎత్తు 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 9618007823 (A)

విశ్వబ్రాహ్మణ/ 27, 5'9"/ B.Tech, SWE/ 80K వెల్‌సెటిల్డ్ ఫ్యామిలి/ కలిగిన వరుడికి/ తగిన వధువు కావలెను. ✆ 7093044262/ 7661814929 (A)

రజక: కట్నప్రసక్తిలేదు. B.Tech/ C.Govt. Asst. మేనేజర్/ ఆంధ్రాబ్యాంక్/ 50,000/- P.M. 5'10" ఎత్తు, 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 9618008271 (A)

సూర్యవంశ క్షత్రియరాజులు Govt. ఉద్యోగం, 44 Y., 2వ పెళ్ళి వరుడునకు మంచి సాంప్రదాయబద్ధమైన, అందమైన వధువు కావలెను. కులప్రసక్తి లేదు. డైరెక్ట్. ✆ 96520 16569. (B)

క్రిష్టియన్ మాల: M.Tech/ C.Govt. ఆఫీసర్/ రైల్వేస్/ 80000/- P.M. 5'11" ఎత్తు, 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 9966760501 (A)

బలిజ 33సం॥, 5'.4" MSW వర్క్ at బెంగళూర్ 85 వేలు PM ఏదైన డిగ్రీ గల వధువు కావలెను. 9008979847. (E)

పద్మశాలి, B.Tech, Govt. బ్యాంక్ Asst. మేనేజర్ (రిజర్వ్ బ్యాంక్), 72,000/- PM, 5'10" ఎత్తు, 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 7288048678 (A)

ప్రైవేటు స్కూల్లో పనిచేస్తూ నెలకు 20,000/- సంపాదిస్తున్న అంగవైకల్యంగల అబ్బాయికి అమ్మాయి కావలెను. Direct Cont: 9985511791 (నో బ్రోకరేజి) (E)

గౌడ, B.Tech, IT, Govt. బ్యాంక్ మేనేజర్ (కెనరా బ్యాంక్), 50,000/- PM, 5'8" ఎత్తు, 28 సం॥ల వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9703978131 (A)

పద్మశాలి 2nd MBA/ Abroad/ 5'.11" 35 Yrs వరునకు తగిన వధువు కావలెను. కుల ప్రసక్తిలేదు. నో-బ్రోకర్స్. డైరెక్ట్ పార్టీస్ మాత్రమే. ✆ 9989705707. (C)

కాపు/ M.Tech, IIT/ C.Govt. ఇండియన్ ఎయిర్‌పోర్ట్ ఆఫీసర్/ 72000/-PM/ 5'10" ఎత్తు/ 28సం॥ల వరునికి తగిన వధువు కావలెను ✆ 8886512010 (A)

కమ్మ (కట్న ప్రసక్తి లేదు) 27/ 5'10"/ B.Tech MS/ USA/ SWE/ TCS 8L PM 15 Cr. ప్రాపర్టీ గల అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9246964555. (A)

క్రిష్టియన్‌మాల/ M.Tech/ C.Govt. Asst. మేనేజర్ (ONGC)/ 90,000/-PM/ 5'10" ఎత్తు/ 28సం॥ల వరునికి తగిన వధువు కావలెను ✆ 9581317506 (A)

విశ్వబ్రాహ్మణ (కట్న ప్రసక్తి లేదు) 27/ 5'10" B.Tech/ SWE/ Infosys 85,000/- PM అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9246151501. (A)

క్రిష్టియన్ మాదిగ/ B.Tech, Bits Pilani/ C.Govt. A.E (BHEL)/ 80,000/-PM/ 5'10" ఎత్తు/ 28సం॥ల వరునికి తగిన వధువు కావలెను ✆ 8886512010 (A)

కాపు 2వ పెళ్ళి 45 సం॥ 5'9", 50 కోట్ల ప్రాపర్టీ, సొంత వ్యాపారం గల వరునికి తగిన అందమైన వధువు కావలెను. నో బ్రోకర్స్ ✆ 9440331511 (A)

కుమ్మరి/ M.Tech, IIT/ Govt. టౌన్ ప్లానింగ్ ఆఫీసర్/ 1 Lakh. P.M/ 5'8" ఎత్తు/ 28సం॥ల వరునికి తగిన వధువు కావలెను ✆ 9989450693 (A)

కమ్మ – రెండోపెళ్లి - 38, 6' B.టెక్, MBA, 3L PM, 20 కోట్లు ★ 34, 5'8", B.టెక్, MBA బ్యాంక్ ఆఫీసర్ 5 కోట్లు ★ 42, 6' MBBS, MS, US డాక్టర్, డా॥ బొమ్మదేవర నాగకుమారి ✆ 9393276969 (A).

పద్మశాలి/ B.Tech, MBA/ C.Govt. క్వాలిటి కంట్రోల్ ఆఫీసర్ (FCI)/ 10 Lakhs. P.A/ 5'9" ఎత్తు/ 28సం॥ల వరుడికి వధువు కావలెను ✆ 9985395014 (A)

కాపు: 28, 5'8" B.టెక్ బ్యాంక్ ఆఫీసర్ ★ 27, 5'9" B.టెక్, MS, H1 వీసా ★ 29, 6', MBBS, MD (GM) సంప్ర॥ డాక్టర్ బొమ్మదేవర నాగకుమారి ✆ 9393276969 (A).

★ ★ ★

గౌడ/ B.Tech, MBA/ C.Govt. కస్టమ్స్ ఆఫీసర్/ 80,000/-PM/ 5'10" ఎత్తు/ 28సం॥ల వరునికి తగిన వధువు కావలెను ✆ 9052296834 (A)

బ్రాహ్మణ రెండవ పెళ్ళి/ వైదిక/ 40/ 5'.10"/ V.Fair/ M.Sc., M.A. LLB/ 1L P.M/ ఒక బాబు/ సొంత బిజినెస్/ పుష్యమి-4/ శ్రీవత్సస/ వెల్‌సెటిల్డ్/ మంచిగా చదువుకొన్న బ్రాహ్మణ వధువు పిల్లలు ఉన్నా (ఒకరు మాత్రమే) ఫరవాలేదు. మధ్యవర్తులు వద్దు. ✆ 99633 66044. (G)

కమ్మ 35, 5'10", SWE, UK P.R. 10L P.M. 45 Cr. ఆస్తి Fair వరుడికి కమ్మ వధువు కావలెను. (కట్నప్రసక్తిలేదు) (డైరెక్ట్) Ph: W.App: 9014817399 (A)

జంగం (లింగాయత్) డైవర్స్ / 38 సం॥ / APSRTC కండక్టరుకు రెండవ పెళ్ళి కొరకు తగిన వధువు కావలెను. డైరెక్ట్ సెల్: 63018 68623 (D)

★ ★ ★

కుల మత కట్నప్రసక్తి లేదు. 40 Y, 5'8" Pvt. Job చేస్తున్న వరునికి డైవర్సీ/ విడో/ లేటు, పిల్లలు లేని 40 Y వధువు కావలెను. ✆ 99496 43105. (B)

'పెళ్ళిపందిరి' ప్రకటనలు పాఠకులకు అనుకూలంగా వర్గీకరించి ప్రచురింపబడతాయి. ఈ విషయంలో ఎట్టి కంప్లయింట్లకు ఆస్కారం లేదు.

సంస్కారమే సంసారానికి సంజీవని!



పెళ్లికి పునాది నమ్మకమే. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత దంపతులిద్దరిపైనా ఉంటుంది. భాగస్వామి ఫోన్‌ల తనిఖీ చేయడం, బీరువాలు, సొరుగులు తనిఖీ చేయడం వంటివి కల్పితంగా మన అభద్రతను వెల్లడించేవే. బయటకు వెళ్లినప్పుడల్లా అనుమానంగా చూడడం, ఆలస్యంగా వస్తే అపార్థం చేసుకోవడం, తగాదాకు దిగడం నమ్మకానికి తూట్లు పొడిచేవే. అతను ఎవరైనా మహిళతో మాట్లాడితే లేదా ఆమె పరపురుషుడితో మాట్లాడుతూ కన్పిస్తే లేని పోనివి ఊహించుకుని గొడవకు దిగడం మనం ఎంతో పవిత్రమనుకునే భార్యాభర్తల బంధాన్ని ఎగతాళి చేయడమే.

కాలం మారింది. ఒకప్పుడు పొద్దున్నేలేచి ఆఫీసుకు వెళ్లి రాత్రిపూట ఇళ్లలో ఉండడం సహజం. ఇప్పుడో అంతర్జాతీయ కంపెనీల్లో ఉద్యోగాలు నియామకాలు పెరిగాక రాత్రి పగలుకు తేడా లేకుండా పోయింది. ఆడా మగా కలిసి పనిచేయడం కలిసి కాఫీలు తాగడం, భోజనాలు చేయడం సాధారణం. అలాగే కంపెనీ తరఫున క్యాంపులకు వెళ్లడం, వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడం తప్పనిసరి. దీన్ని నవదంపతులు అర్థంచేసుకోవాలి.

భార్యను భర్తా, భర్తను భార్యా అనుక్షణం అనుమానిస్తూ పోతే ఇంకా ఆ బంధం ఎలా నిలబడుతుంది? ఇరువైపులా పెద్దలు కూడా తమ పాతకాలపు భావజాలాల్లో పరిభ్రమిస్తూ ప్రతి చిన్న విషయాన్ని భూతద్దాల్లో చూస్తూ అటో పుల్లా ఇటో పుల్లా వేసి వారి నడుమ రాజుకుంటున్న అగ్నిని మరింత ఎగదోయడం ఎంత మాత్రం తగదు. వాళ్లు పిల్లలు- వయసులో ఉన్నారు. ఆలోచనా రాహిత్యంతో నిర్ణయాలు తీసుకుంటారు. అదుపు లేని ఆవేశకావేశాలతో ప్రవర్తిస్తారు. సూటి పోటి మాటలతో పరస్పరం దాడులు చేసుకుంటున్నారు. అప్పుడు పెద్దలు చేయాల్సిన పనేమిటి? తామూ వారిలాగే వ్యవహరిస్తే ఇంకా పెద్దరికానికి అర్థం ఏముంటుంది? కనుక నవదంపతుల్ని తిరిగి కలపడంలో పెద్దలకు 'పెద్ద' బాధ్యతే ఉంది, ఉంటుంది.

పెళ్లయిన తొలినాళ్లలో దంపతులు చిలకాగోరింకల్లా కలిసి తిరగడం చూసేవారికి కూడా బాగుంటుంది. కానీ దంపతులకే కొంతకాలానికి ఒక రకమైన విసుగు జనిస్తుంది. స్నేహను కోల్పోయామన్న భావన కలుగుతుంది. మిత్రుల్ని ఇతర కుటుంబసభ్యులకు దూరమవుతున్నామన్న ఆలోచన మొగ్గ తొడుగుతుంది. మెల్లమెల్లగా చిరాకులు.. పరాకులు మొదలవుతాయి. ఇక్కడే కొంచెం నేర్పు, ఓర్పు ప్రదర్శించాలి. భర్త/భార్య తన స్నేహితులతో ఏ సినిమాకో వెళ్తానంటే కాదనరాదు. అలాగే తన అభిరుచులకు అనుగుణంగా ఏదైనా సాహితీసభలకు వెళ్లాలనుకున్నా హాయిగా వెళ్లే వాతావరణం కల్పించుకోవాలి. అయితే పెత్తనం చేసినట్టుగాకాక ప్రేమగానే వారికి ఈ అవగాహన కలిగించాలి. భిన్నాభిప్రాయాలు ఉండడం తప్పుకాదు. కానీ వాటిని వ్యక్తీకరించేటప్పుడే ఎదుటి వ్యక్తి మనసు నొప్పించకుండా ఒప్పించే విద్య తెలిసినప్పుడు సాధారణంగా ఏ నవదంపతుల నడుమా కలతలు కల్లోలాలు అంకురించవు. ఈ విద్యను జీవితభాగస్వాములిద్దరూ అభ్యసించాలి. ఈ విద్యను పెళ్ళయ్యేకకాక చిన్నప్పటినుంచి కుటుంబ సంస్కారం ద్వారా అలవరచుకుంటే అసూయ, అభద్రత వంటి జబ్బులుండవు. ఆ కుటుంబ సంస్కారం నేర్పాల్సింది పెద్దలు. నవదంపతులైనా ఈ సంస్కారం విషయంలో తమ బిడ్డలకు ఉచితానుచితాల గురించి తెలియచెప్పడం మరువరాదు.

- చంద్రప్రతాప్

> తెలిసో తెలియకో ఎప్పుడో ఓసారి ఓ వ్యక్తి మనసును మీరు దారుణంగా గాయపరిస్తే- పెదాలమీద చిరునవ్వులు తొణుకుతున్నా మిమ్మల్ని చూసినప్పుడల్లా ఆ బాధ తాలూకు గాయాలు ఆ వ్యక్తి మనసును కెలుకుతూనే ఉంటాయి

ఈ కథనాలపై మీ అభిప్రాయాలు, సూచనలు **pelli@eenadu.net** కు మెయిల్ చేయండి.

కమ్మ 33Y /5'10" MS/ SWE/ US/ 70K. P.A/ 1 Cr ఆస్తి Share గల వరుడికి 1వ/ 2వ తగిన వధువు కావలెను. Ph: 9618226996 (A)

విశ్వబ్రాహ్మణ/48y/5'5"/Fair/B.Com/LIC ఏజెంట్, బిజినెస్/25000 pm/గల వరుడుకు విశ్వబ్రాహ్మణ, OC క్యాస్ట్ గల వధువు అర్జెంటుగా కావలెను. బ్రాహ్మణులకు ప్రాధాన్యత. ✆ 89770 48480 (I)

బలిజ, 30 yrs, ఎత్తు 6, రంగు ఎరుపు, బి.కాం. కంప్యూటర్స్, స్వంత వ్యాపారం చేయుచున్న 20 లక్షల ఆస్థి నెలకు 1 లక్ష ఆదాయం కలిగిన వరునికి వధువు కావలెను. నో బ్రోకర్స్, డైరెక్ట్, కాంటాక్ట్. ✆ 89784 21289 (I)

కమ్మ/Govtజాబ్/రిటైర్డ్/ ఫెన్షన్ 75వేలు/5.8 ఆరోగ్యకరమైన భార్య చనిపోయిన Aged వరుడు సంప్రదాయమైన వధువు కావలెను. ✆ 98857 64947 (I)

కమ్మ 28/ M.Tech, 5'3", V.Fair, 1 కోటి ప్రాపర్టీ గల అందమైన రూపవతికి Any SWE/ బిజినెస్ వారు డైరెక్టుగా సం॥. ✆ 78429 45655. (B)

దేవాంగ/ 27/ 5'9" ఎరుపు, బ్యాంక్ జాబ్, ఆస్తి గల వరునికి సంప్రదాయ కుటుంబపు వధువు కావలెను. కుల, కట్న ప్రసక్తి లేదు. డైరెక్ట్. ✆ 97043 78800. (B)



వరుడు కావలెను

అనాథ/ అమ్మలేక నాన్న ఉన్న వరులకు Free గా సంబంధాలు కుదుర్చబడును. మా దగ్గర B.Tech/ M.Tech చదివిన వధువులు కలరు. సున్నిముస్లిం/ దూదేకులు మంచి జాబ్ చేస్తున్న వరులు కావలెను. ఫోటో, బయోడేటా మెయిల్ to: sbkmarriages@gmail.com

Kamma/ B.Tech, IIT, Ph.D./ 5'5"/ 23/ 80 K/ 15 Cr ★ B.Tech, IIT, MS/ 5'5"/ 24/ 150 K/ 20 Cr ★ BE MS/ 5'6"/ 23/ 110K/ 5 Cr ★ BE MS/ 5'7"/ 24/ 3 Cr. తుమ్మల సుజాత. ✆ 98482 17771. (B)

Kamma/ MD Derma/ 5'5"/ 26/ 20 Cr ★ MS Gynec/ 5'7"/ 24/ 15 Cr ★ MD, Genl/ 5'5"/ 26/ 20 Cr ★ MD, Radio/ 5'5"/ 24/ 15 Cr. తుమ్మల సుజాత. ✆ 99632 32758, 0866-2431721. (B)

Kamma/ B.Tech/ NIT/ 5'5"/ 22/ 15 Cr ★ B.Tech, IIT/ 5'5"/ 23/ 12L PA/ 10 Cr ★ B.Tech/ 5'7"/ 24/ Accenture/ 20 Cr ★ B.Tech/ 5'5"/ 25/ 60 Cr. తుమ్మల సుజాత. ✆ 81217 95786. (B)

మాల, క్రిష్టియన్, 28, 5.6, MBBS, MS గైనకాలజిస్ట్ వధువుకు మెడికల్ PG/ గ్రూప్-2 వరుడు కావలెను. డైరెక్ట్ సంప్రదించండి. ✆ 95024 81380. (L)

కాపు, ఓన్లీడాటర్, 25, 5'5", Fr, B.Tech, SWE, CTS, 40,000 PM. సాంప్రదాయక కుటుంబానికి చెందిన వధువుకు తగిన వరుడు కావలెను. 9290022700 (A)

విశ్వబ్రాహ్మణ, 25, 5'4", Fr, B.Tech, SWE, Amazon, 35,000 PM, సాంప్రదాయక కుటుంబానికి చెందిన వధువుకు తగిన వరుడు కావలెను. 9959354361 (A)

పెరిక: B.Tech/ C.Govt. Po/ ఆంధ్రాబ్యాంక్/ 40,000/- P.M., 5'5" ఎత్తు, 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618007652 (A)

క్రిష్టియన్ మాదిగ: B.Tech/ C.Govt.Asst. మనేజర్/ పంజాబ్ నేషనల్ బ్యాంక్/ 45,000/- P.M., 5'4" ఎత్తు, 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9908222406 (A)

బ్రాహ్మణ, 30, 5'3", 10th ★ 37, 5'4", 10th ★ ఇంటర్ వధువులకు వరులు కావలెను. పూజారి అయినా OK ★ 1st, 2nd, లేటు వివాహాలకై ప్రత్యేకం ✆ 8374994855 (వాట్సప్) (A)

విశ్వబ్రాహ్మణ, 23, 5'3", B.Tech, IT, SWE, Hyd, 25,000/- PM, చాలా అందమైన వధువుకు సాంప్రదాయ కుటుంబపు వరుడు కావలెను. ✆ 9676812525 (A)

బ్రాహ్మణ, రెండోపెళ్లి, 33, 5'3", V.Fair, MCA, Pvt. జాబ్, 25,000/- PM, పిల్లలులేని చాలా అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9030056547, 8309527614 (A)

ముదిరాజ్, ఏకైక కుమార్తె, B.Tech, C.Govt. బ్యాంక్ PO (IOB), 35,000/- PM, 5'4" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9052296834 (A)

యాదవ, ఏకైక కుమార్తె, B.Tech, C.Govt. బ్యాంక్ PO (ఇండియన్ బ్యాంక్) 35,000/- PM, 5'4" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9581317506 (A)

గౌడ, B.Tech, NIT, Govt. AEE (జెన్‌కో), 50,000/- PM, 5'4" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9989450693 (A)

మాల, B.Tech, C.Govt. ఎలక్ట్రికల్ ఇంజనీర్ (NTPC), 40,000/- PM, 5'4" ఎత్తు, 24 సం॥ల వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ గల వధువుకు వరుడు కావలెను. ✆ 9703794175 (A)

మున్నూరుకాపు, B.Tech, Govt. AE (ఇరిగేషన్ Dept) 40,000/- PM, 5'4" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 8096493963 (A)

రెడ్డి, M.Tech, C.Govt. JE (రైల్వే), 38,000/- PM, 5'4" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 8886957298 (A)

క్రిష్టియన్ మాదిగ, B.Tech, IIT, Govt. AE (ట్రాన్స్‌కో), 22,000/- PM, 5'4" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9985395014 (A)

బ్రాహ్మణ 28y, 5'4", డిగ్రీ, Pvt జాబ్, వాదులసాగోత్రం, రిక్వైర్‌మెంట్, ఎనీవెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ, Govt. Pvt జాబ్, పురోహితం OK. ✆ 7288035683/ 7997428563 (A)

కులపట్టింపులేదు బ్రాహ్మణ 25y/ 5'5"/ ఫెయిర్ ఇంటర్/ 1st మ్యాచ్/ బిజినెస్/ సొంత ఇల్లు కల్గిన అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. (పురోహితం OK) ✆ 8897587959 (A)

34Y/5'5"/V.Fair/డైవర్సీ/MBBS,MD, DVL/ సొంతక్లీనిక్ అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. (SC, STకులాలు తప్ప) అన్ని కులములవారు ✆ 99490 02120 (I)

కాపు 32 సం॥, 5'3" గుడ్‌లుకింగ్ గల సాంప్రదాయ కుటుంబంనకు చెందిన డైవర్స్ తీసుకున్న వధువుకు కాపు వరుడు కావలెను. ఏనుగుల కోటేశ్వరరావు ✆ 70363 69904 (I)

కమ్మ/ కుల ప్రసక్తి లేదు/ 51/ 5'3"/ విడో/ సబ్ రిజిస్ట్రార్/ Very Fair/ ఇద్దరు ఆడపిల్లలు పెళ్లై అమెరికాలో సెటిల్డ్/ సొంత ఇల్లు/ మహిళకి వరుడు కావలెను. ✆ 88971 92862 (D)

హైదరాబాద్/ కాపు/ 45/ 5'3"/ SBI మేనేజర్/ విడో/ Very Fair/ పిల్లలు లేరు/ సొంత ఇల్లు/ 14 ఎకరాల భూమిగల మహిళకి వరుడు కావలెను. ✆ 88971 92862 (D)

బ్రాహ్మణ 21 B.Sc, 24 B.Tech, SWE, Infosys 4L, 27 MA wkg ★ 26, B.Tech, MS (US) SWE $ 67K PA ★ 29, M.Sc 3L ✆ 9494096081 (A).

రెడ్డి 1990/5.3" B.Tech/MBA/Fair/ 60 కోట్ల ఆస్తి ★ 1996/5'6" B.Tech/(IT)/3L. P.A/ V.Fair. నవీన్‌రెడ్డి M.B ✆ 9848221166/ 8885559579 (A)

రెడ్డి/ (Nellore) 1989/5'4", MBA/6L. P.A/25 కోట్ల ఆస్తి ★ 1993/5'3" B.Tech (OSM)/ 9L. P.A/ Gurgaou ✆ 9505551788/ 8885559579 (A)

రెడ్డి (Divorce) 1991/5'4" B.Tech (Bits)/ MBA/ ISB/ 20L. P.A ★ 1991/5'3 1/2" B.Tech/ ఆస్ట్రేలియా P.R/ 5.6K/ ఫేర్ 7893333726/ 8885559579 (A)

ఆర్యవైశ్య/ 28/ 5'3"/ 10th ★ 32/ 5'3"/ ఇంటర్ ★ 36/ 5'4"/ 10th. కట్నాలు ఇచ్చుకోలేని వధువులకు వరులు కావలెను. బిజినెస్ అయినా O.K. ✆ 7288942198 (A)

రెడ్డి/ 23/ 5'5", B.Tech (CSE) SWE, Amazon 40,000/-PM 10Cr. ప్రాపర్టి గల అందమైన వధువుకు ఇండియా/ అబ్రాడ్ వరుడు కావలెను ✆ 8019864386 (A)

కాపు/ డైవర్సీ/ కుల ప్రసక్తిలేని/ 29/ 5'3"/ Fr/ M.Sc/ Sr. SWE/ Hyd/ 40,000/-PM/ చాలా వెల్‌సెటిల్డ్/ అందమైన/ సాంప్రదాయ కుటుంబపు వధువుకు వరుడు కావలెను ✆ 9705844329 (అర్జెంట్) (A)

పద్మశాలి/ 25/ 5'4"/ ఇంటర్ ★ 28/ 5'4"/ B.Com ★ 31/ 4'3"/ MBA. వధువులకు వరులు కావలెను ★ కట్నకానుకలు ఇవ్వలేనివారికి, 1st, 2nd. లేటు పద్మశాలిలకై ప్రత్యేకం ✆ 7286042215 (A)

బ్రాహ్మణ/ 25/ 5'3"/ 8th ★ 29/ 5'4"/ 10th ★ 22/ 5'3"/ 10th. కట్నాలు ఇచ్చుకోలేని వధువులకు వరులు కావలెను. పురోహితం అయినా O.K. బ్రాహ్మణలకు ప్రత్యేకం. ✆ 8106446865/ 7674078296 (A)

కమ్మ/ USA/ 30Y, 5'7", MS, Fair, Research, Scientist H1B వీసా 40 Cr వధువుకి తగిన US కమ్మ వరుడు కావలెను. ✆ 73863 38574, 73960 13998. (B)

బ్రాహ్మణ్స్/ 25, 5'5" డిగ్రీ/ 28, 5'5"/ ఇంటర్, అందమైన/ వధువులకు వరుడు కావలెను. పురోహితం & జాబ్ & B.Tech & బిజినెస్. ✆ 8978691424/ 040-48542181 (A)

విశ్వబ్రాహ్మణ/ 24Y, 5'4"/ B.Tech, SWE 40K వెల్‌సెటిల్డ్/ ఫ్యామిలి కలిగిన/ వధువుకు/ వరుడు కావలెను. ✆ 7093044262/ 7661814929 (A)

వైశ్య/ 23Y, 5'4"/ V.Fair/ B.Tech, SWE/ 20K PM అందమైన/ సాంప్రదాయపు/ వధువుకి తగిన/ వరుడు కావలెను. ✆ 9059158811 (A)

SC మాదిగ 23/ 5'5" ఫెయిర్ B.Tech సివిల్ Asst. కమిషనర్ టాక్స్ ఆఫీసర్ (ACTO) 40 వేలు P/M అందమైన సాంప్రదాయక కుటుంబపు వధువుకు వరుడు కావలెను. ✆ 9948005247. (A)

కుల పట్టింపు లేదు/ విడో/ 42/ 5'4"/ మున్సిపాలిటీ ఆఫీస్‌లో జాబ్/ 79000 PM/ సొంత విల్లాస్ & దానిమ్మ తోటలు/ వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. ✆ 7893865057. (A)

రెడ్డి 24/ 5'5"/ B.Tech/ SWE/ CTS 35,000/- PM V. Fair అందమైన సాంప్రదాయ కుటుంబం వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9246333320. (A)

కమ్మ 23 5'5" ఫెయిర్ B.Tech ఇన్‌కంటాక్స్ ఆఫీసర్ 35 వేలు P/M అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకి వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. (SWE or Govt.) ✆ 9533855373. (A)

వెలమ, 24, 5'5", B.Tech, SWE, CTS, 35,000/- PM, V.Fair, అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9246555529 (A)

నాయుడు, రెండవ సంబంధం, కుల, ఆస్తి పట్టింపులేదు. 30Y, 5'4", ఫిష్ ఎక్స్‌పోర్ట్ బిజినెస్, 8 Cr ప్రాపర్టీ గల అందమైన వధువుకు 1వ, 2వ వరుడు కావలెను. ✆ 8897055133 (A)

ముదిరాజ్, 24, 5'5", B.Tech, SWE, Infosys, 35,000/- PM, V.Fair, అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9246171703 (A)

యాదవ, BDS, 1994, 5'1", V.F., Well Settled అమ్మాయికి MBBS (or) Any PG చేసే డాక్టర్స్ వరుడు కావలెను. అర్జెంట్ డైరెక్ట్. ✆ 8374866588 (A)

పద్మశాలి, 24, 5'5", B.Tech, SWE, Wipro, 35,000/- PM, V.Fair, అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9246191907 (A)

కులపట్టింపులేదు, విడో, 36, 5'4", HDFC బ్యాంక్ మేనేజర్, 80,000/- PM, సొంత ఇల్లు, రెంట్ 50,000/- PM, 10 Cr ఆస్తి గల ఏకైక వధువుకు వరుడు కావలెను. ✆ 8008039109 (A)

కుల ఆస్తి పట్టింపు లేదు/ చౌదరి విడో/ 32/ 5'4"/ MBA/ Fair, C-Food బిజినెస్/ 22Cr ఆస్తి గల ఏకైక వధువుకి 1వ, 2వ వరుడు కావలెను వాట్సప్: 9666583973 (A)

కుల, ఆస్తి ప్రసక్తి లేదు/ చౌదరి విడో/ 34/ 5'5"/ B.Ed/ Very Fair Own రెస్టారెంట్/ 19Cr ఆస్తిగల వధువుకు వరుడు కావలెను. వాట్సప్: 9705745583 (A)

రెండో పెళ్ళి/ కుల పట్టింపులేదు/ 5'4"/ 5'3"/ Govt/ 90 వేలు/ ఒక కోటి & 45/ 5'2"/ Govt/ 60 వేలు/ 80 లక్షలు/ 36/ 5'4"/ 30 వేలు/ 50 లక్షలు/ "మా సేవ" ✆ 9291503949 (A)

క్రిష్టియన్ 30 సం॥లు డైవర్సీ అందమైన వధువుకు స్థిరపడిన క్రైస్తవ వరుడు కావలెను. సంప్రదించండి. నో బ్రోకర్స్ ✆ 6300947425 (A).

కాపు: 24, 5'4" B.Tech, S/W/E విప్రో Hyd నెలకు 50,000/- వేలు జీతం చాలా అందమైన ఫేర్ వధువుకు తగిన వరుడు కావలెను. అర్జెంట్ ✆ 8499011133 (A).

★ ★ ★

కాపు/లేట్ మ్యారేజ్ 28/5'.5" డిగ్రీ విడో 32/5'.5" (పిల్లలు లేరు) డిగ్రీ చదివిన అందమైన ఒంటరి వధువుకి కుల, ధన ప్రసక్తిలేని వరుడు కావలెను. వాట్సాప్ నెం: 7674992710. (C)

★ ★ ★

కమ్మ/30సం॥/5.6/ఎరుపు/USA/SWE/అందమైన వధువుకు వరుడు కావలెను. No Caste ✆ 83330 55051, 91608 03575 (I)

కమ్మ/విడో/M.Sc/5.6/ఫెయిర్/సొంత ఇల్లు, పొలం కలిగి ఉన్న వధువునకు స్థిరపడిన Aged వరుడు కావలెను. ✆ 96664 45496 (I)

నాయిబ్రాహ్మణ 24 సం॥ Govt. టీచర్‌గా పనిచేయుచున్న వధువుకు కృష్ణా జిల్లాలో Govt. టీచర్‌గా పనిచేస్తున్న అదే కులానికి చెందిన వరుడు కావలెను. సెల్: 98486 08260. (B)



వివాహ వేదిక

20 సం॥లు అనుభవం కల్గిన బ్రాహ్మణ వివాహ వేదిక శ్రీ సత్యసాయి వివాహవేదిక ✆ 9849414098/ 040-66317515, www.satyasaivivahavedika.com (A)

వాసవి – విజయవాడ (రి) వారి ఆర్యవైశ్య వధూవరుల వివాహ పరిచయ వేదిక మరియు పునర్వివాహ పరిచయ వేదిక 26-1-2019 తేదీన I.V.ప్యాలెస్, విజయవాడ నందు జరుగును. వివరాలకు ✆ 99895 00130, 81064 54284 (B).

కాపు డాక్టర్స్, ఇంజనీర్స్, ఎంప్లాయీస్, బిజినెస్, USA, ఇండియా పెళ్ళి సంబంధాలకు సంప్ర॥ P.V.K. రావు, తాడేపల్లిగూడెం. W.G.Dt. ✆ 94407 79840, 91826 43397. (M)

Since 1989 శ్రీకన్య వివాహ వేదిక. అన్నికులాలు & కులాంతర ✆ 27619998, USA- 0012019783065. సఫిల్‌గూడ- 9502806869, వాట్సప్- 9849027778. వేల్పుల భిక్షపతి (A)

రెడ్డి కులస్తులకు తక్కువ సమయంలో ఉన్నతమైన వివాహ సంబంధాలు 1వ, 2వ, లేట్ సంబంధాలు కుదర్చబడును. దండెం మ్యారేజ్ బ్యూరో. ✆ 6303738265 (A)

కమ్మ ప్రత్యేకం. డాక్టర్స్ దేశ, విదేశ హైరేంజ్ మ్యాచెస్. IAS, IPS, IRS. గోకుల్ మ్యారేజ్ లైన్స్, గుదె వెంకటప్పయ్య చౌదరి ✆ 9440153991. ఆఫీస్: కానూరు, విజయవాడ (A)

" **ముదిరాజ్ విదేశ** సంబంధాల పరిచయ వేదిక " విదేశాల్లోని తమ పిల్లలకు సంబంధాలు వెదుకుతున్న విదేశాలకు తమ పిల్లల్ని ఇవ్వాలనుకుంటున్న వారు సంప్రదించండి. ముదిరాజ్ సేవాసంఘం ముదిరాజవాణి స్వచ్ఛంద పరిణయ పరిచయ వేదిక కాల్, వాట్సప్ ✆ 9441455277 (A).

CNB/ 2 వ, లేట్ వయస్సుతో నిమిత్తం లేకుండా 5 వేల ప్రొఫైల్స్ కలవు. ఖచ్చితంగా సంబంధం కుదుర్చబడును. కేవలం సర్వీస్‌ఛార్జ్ మాత్రమే Hyd ✆ 9440937900 (A).

P.Supriyareddy, Rich Reddy Boys & Girls India & Abroad matches, All Emp/ Govt, Pvt, SWE, Doc's, Business, Divorcees from all regions. Contact: Srinagar Colony, Hyd. Ph: 040-23544820, 23545762, Email: palletisupriyareddy@gmail.com (A).

కేవలం యాదవ, కుర్మ వివాహసంబంధాలకై గోకుల్ మ్యారేజెస్, పద్మజాయాదవ్ www.gokulmarriage.com Hyd: 9440831748. Gunt: 9440759945, VSP: 9441735157 (A)

Whatsapp your Photo & Biodata to 9347262769. We will send the suitable Matches www. pellisandadi.com Estd. 1991 (A)

సెకండ్ మ్యారెజ్‌లకు మాత్రమే శ్రీబాలాజీ మ్యారేజ్ బ్యూరో అన్నికులాలవారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. ✆ 9885144375/ 8555980066 (A)

గమనిక

పెళ్ళిపందిరి ప్రకటనలకు ప్రతి స్పందించేముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. వధువు/వరుడి హోదా, వయస్సు, ఆదాయం గురించిన వివరాలకు సంబంధించి ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిమ్‌లతో మరియు మీరు చేసుకునే ఆర్థిక లావాదేవీలతో (వధువు/వరుడు పూర్తి వివరాల కోసం డబ్బు డిపాజిట్ చేయడం/ట్రాన్స్‌ఫర్ చేయడం వగైరా) ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధంలేదు. "భవిష్యత్‌లో కలగబోయే సంతానానికి ఎలాంటి జన్యుపరమైన వైకల్యాలు లేకుండా నివారించుకునేందుకు జీవిత భాగస్వామిని ఎంచుకునే ముందు ఆరోగ్యపరీక్ష చేయించవలసినదిగా కూడా సూచించడమైనది". పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

శుభ మ్యారేజ్‌బ్యూరో, బ్రాహ్మణ, వైశ్యులకు మాత్రమే 1వ, 2వ సంబంధములు చూడబడును. 6 నెలలు లోపు కుదర్చబడును. ✆ 79972 73286, 93460 64231. (B)

అన్ని కులముల/ మతముల వారికి/ 1వ, 2వ పెళ్ళిసంబంధములు/ 10 రోజుల్లో/ చూడబడును. ✆ 9951618797, 8919080864 Whatsapp (A)

15 రో॥ అన్ని కులాలవారికి మీకు తగిన సంబంధాలు చూపించగల అతిపెద్ద సంస్థ రోహిణి. info@rohinimarriages.com ✆ 94920 33897, 94418 29644, 94407 85888 - Whatapp. (B)

కేవలం మాలమాదిగ హిందూ & క్రిష్టియన్, IT, Govt, Pvt 1వ, 2వ, లేట్, డైవర్సి, A.P, తెలంగాణలో దేశ, విదేశ సంబంధాలకు సంప్ర: నో కమీషన్ Ph: 9100474440 (A).

మాల, మాదిగ: IAS, IPS, IRTS, MBBS, M.D.M.S, USA, Govt.Jobs, SWE, 78930 13265. (N).

కాపు: సాఫ్ట్‌వేర్ ఇంజినీర్స్, డాక్టర్స్, ఎంప్లాయిస్, ఇండియా, అబ్రాడ్, హై స్టేటస్ మ్యాచ్‌ల కొరకు సంప్ర: ✆ 98665 21319. (B)

రెడ్డిస్ రెడ్డిస్: డాక్టర్స్/ సాఫ్ట్‌వేర్స్/ బిజినెస్‌మేన్ & అందరికి, ఆంధ్ర/ తెలంగాణ/ సీమా/ కర్ణాటక & విదేశి రెడ్డిస్ సంబంధాలు ఫాస్ట్‌గా కుదుర్చబడును ✆ 9100404026 (A)

డాక్టర్స్ డాక్టర్స్ 6000 ప్రొఫైల్స్ అన్ని కులాల MBBS/ MD/ MS/ DM/ MCH/ BDS/ MDS, బిజినెస్‌లకు 1వ, 2వ ఇండియా & విదేశాల సంబంధాలు ఫాస్ట్‌గా కుదుర్చబడును మా బ్రాంచీలు వైజాగ్, హైదరాబాద్ ✆ 9966808059 (A)

యాదవ వధువు, వరుల సంబంధాలకై సంప్ర॥ For Quick Marriage ★ Sai Kumar ✆ 7702262508/ Blue Trend Matrimonial (P) Ltd (A)

పద్మశాలి వధువు వరుల సంబంధాలకై సంప్ర॥ For Quick Marriage ★ Shyam ✆ 9000487865/ Blue Trend Matrimonial (P) Ltd (A)

Mala (SC) Free మాల మహానాడు ఆధ్వర్యంలో వివాహసంబంధాల సెటిల్‌మెంట్ కొరకు సంప్రదించండి. ✆ 9030142666/ 9010922444 (A)

బ్రాహ్మణ వధువు, వరుల సంబంధాలకై సంప్రదించండి. S.N.శర్మ Hyd. ✆ 9248600342, 8019207503, brahmininformationmatri@gmail.com (A).

ఆర్యవైశ్య వధూవరుల సంబంధాలకై సంప్రదించండి. Hyd Ph: 8465834874, (W) 9491376774. teluguaaryavysyainfo@gmail.com (A).


ఓన్లీ అబ్రాడ్స్ (క్రిష్టియన్స్) (5 వేలు ప్రొఫైల్స్) అన్ని కులాల వారికి డాక్టర్స్, సాఫ్ట్‌వేర్స్, MS (Eng), హైరిచర్స్ బిజినెస్ & ఆల్ 1వ, 2వ, లేటు సంబంధాలు ఫాస్ట్‌గా చూడబడును. ✆ 8185043702 (A)

స్పెషల్లీ కాపు/రెడ్డిస్: డాక్టర్స్, సాఫ్ట్‌వేర్స్, అబ్రాడ్స్, బిజినెస్ & అందరికి AP/ తెలంగాణ/ కర్ణాటక & దేశ, విదేశీ సంబంధాలు ఫాస్ట్‌గా కుదుర్చబడును. ✆ 9121010959 (A)

★ ★ ★

సేవలు ఇక్కడ.. సేవా పన్ను అక్కడ

- రాష్ట్రానికి సమకూరని పన్నుల ఆదాయం
- ఐజీఎస్‌టీ రూపంలో ఇతర రాష్ట్రాలకు జమ
- సేవా రంగంపై అధ్యయనంలో వెల్లడి



ఈనాడు – గుంటూరు

రాష్ట్రంలో సేవా రంగంలో (సర్వీస్ సెక్టార్) ఆదాయం పొందుతున్న వివిధ కంపెనీలు రాష్ట్ర పరిధిలో సేవా పన్ను చెల్లించడం లేదు. తమ కేంద్ర కార్యాలయాలు (హెడ్ ఆఫీస్) వేరే రాష్ట్రాల్లో ఉన్నాయంటూ.. ఆ మొత్తాన్ని తొలుత ఆయా రాష్ట్రాలకు జమచేస్తున్నట్లు తాజాగా రాష్ట్ర వాణిజ్య పన్నుల (సీజీఎస్‌టీ) అధికారుల అధ్యయనంలో వెల్లడైంది. ఇలా జమచేస్తున్న పన్ను మొత్తం లోనూ చాలా ఎగవేతలు ఉంటున్నట్లు కూడా అధికారులు గుర్తించారు. దీని వల్ల రాష్ట్రానికి సకాలంలో రావల్సిన పన్నుల ఆదాయం రాకుండా పోతోంది. కేంద్రం నుంచి తిరిగి పొందాల్సి వస్తోంది. ఇప్పటికే ఇలా రూ.వెయ్యి కోట్ల ఆదాయం కేంద్రం నుంచి రావాల్సి ఉందని ఇటీవల రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు ప్రకటించిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, తిరుపతి, రాజమహేంద్రవరం తదితర ప్రధాన నగరాల్లో ఓలా క్యాబ్, ఉబర్, రెడ్ బస్, భాభా తదితర సంస్థలు ప్రైవేటు కార్లు, బస్సుల్లో పెద్ద ఎత్తున ప్రజలను ఒక చోట నుంచి మరో చోటకు చేరవేస్తున్నాయి. ఈ సంస్థల కేంద్ర కార్యాలయాలు దిల్లీ, ముంబయి, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు తదితర నగరాల్లో ఉన్నాయి. మరోవైపు, జీఎస్‌టీ చట్టంలో ఎక్కడైతే టికెట్ బుక్ చేస్తారో (ప్లేస్ ఆఫ్ బుకింగ్) అక్కడే పన్నులు చెల్లించాలని స్పష్టంగా ఉంది. అందుకు భిన్నంగా వివిధ సంస్థలు ఇంటిగ్రేటెడ్ గూడ్స్ సర్వీస్ ట్యాక్స్ (ఐజీఎస్‌టీ) విభాగంలో పన్నులు తొలుత ఆయా రాష్ట్రాలకు చెల్లిస్తున్నాయి. ఫలితంగా ఆ ఆదాయం కేంద్రం నుంచి రాష్ట్రానికి ఎప్పటికి వస్తుందో తెలియని పరిస్థితి.

11 మంది జోన్ల అధ్యయనం

గుంటూరు డివిజన్ ఎస్‌జీఎస్‌టీ జాయింట్ కమిషనర్ పి.రాజాబాబు రాష్ట్రంలో రవాణా రంగం ద్వారా అందే సేవా పన్ను అధ్యయనం చేశారు. ఈ క్రమంలో సేవా రంగంలో పన్ను సంస్థల తీరుపై అధ్యయనం చేయాలని గుర్తించి ఉన్నతాధికారులకు నివేదించారు. దీంతో రాష్ట్రంలో 11 మంది జాయింట్ కమిషనర్లకు ఒక్కో రంగాలు అప్పగించి ఆ రంగంలో ఉండే సేవా పన్ను జమ అవుతోందా? లేదా? చూడాలని రాష్ట్ర కమిషనర్ శ్యామలరావు ఆదేశించారు. ఈ అధ్యయనం ప్రస్తుతం తుది దశకు చేరింది. ఈ సేవ ద్వారా రాష్ట్రంలో సేవలు అందించే కంపెనీలు అందుకు సంబంధించిన పన్ను మొత్తాన్ని రాష్ట్రంలోనే చెల్లించాలని స్పష్టంచేస్తూ తాఖీదులు జారీచేయాలని అధికారులు నిర్ణయించారు.

★ ఆర్టీసీ బస్సుల్లోని టీవీల్లో ప్రచురించిన ప్రకటనలతో పాటు, బస్సులపై కొన్ని కంపెనీలు వాల్ పెయింటింగ్ రూపంలో ప్రకటనలు ఇస్తున్నాయి. ఈ సేవలపై సంబంధిత ప్రకటనల కంపెనీలు సేవా పన్ను చెల్లించాలి. ఈ మొత్తాన్ని ఆయా ప్రకటనల సంస్థ నుంచి రాబట్టి తిరిగి రాష్ట్రానికి జమచేసేలా కోరుతూ ఏపీఎస్‌ఆర్టీసీకి పన్నుల చెల్లింపుల నోటీసులు జారీచేయనుంది.

★ సేవా రంగంలో ఉన్న కంపెనీలు రెండేళ్ల ఆడిట్ నివేదికలు, వ్యాపార లావాదేవీలు తదితర లెక్కలను (ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్లు) సైతం సమర్పించాలంటూ ఆయా కంపెనీలకు అధికారులు లేఖలు రాయనున్నారు.

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

ఈనాడు – హైదరాబాద్: సంక్రాంతి రద్దీని దృష్టిలో ఉంచుకుని సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య రాయనపాడు (విజయవాడ) మీదుగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే ప్రకటించింది. 12 ప్రత్యేక సర్వీసులు అందుబాటులోకి వస్తాయని తెలిపింది. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నానికి 14, 17, 18, 21 తేదీల్లో నాలుగు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు ప్రకటించింది. విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్‌కు 9, 11, 13, 16, 17, 20 తేదీల్లో ప్రత్యేక రైళ్ల ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. **ప్రయోజనం అంతంతమాత్రం!:** ప్రత్యేక రైళ్లను ప్రకటించినా అందులో చాలావరకు పండక్కి విశాఖపట్నం వైపు వెళ్లే ప్రయాణికులకు ఉపయోగపడవని ప్రయాణికులు అంటున్నారు. తాజాగా ప్రకటించిన వాటిలో రెండు రైళ్లు మాత్రమే 10-13 తేదీల మధ్య విశాఖపట్నం వైపు వెళ్లే ప్రయాణికులకు ప్రయోజనకరం. 10, 12 తేదీల్లో సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నానికి రెండు రైళ్లు ఉన్నాయి. ఛార్జీలు భారీగా ఉండే సువిధ ప్రత్యేక కావడం గమనార్హం. మిగిలినవి సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య ఉండే రద్దీని దృష్టిలో ఉంచుకొని కొంతకాలంగా నడుపుతున్నవేనని తెలిసింది. సంక్రాంతికి వెళ్లేవారికి ఈ రైళ్లు ఉపయోగపడవనేది.. ప్రయాణికుల అభిప్రాయం.

నేటి నుంచి డీఎస్సీ సంగీత నైపుణ్య పరీక్షలు

ఈనాడు, అమరావతి: డీఎస్సీ-2018 మ్యూజిక్ ఉపాధ్యాయులకు ఈనెల 6 నుంచి 12 వరకు విజయవాడ దుర్గాపురంలోని మంటసాల వెంకటేశ్వర ప్రభుత్వ సంగీత కళాశాలలో సంగీత నైపుణ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు కమిషనర్ సంధ్యారాణి తెలిపారు. అభ్యర్థులు ఏ రోజున సంగీత పరీక్షకు హాజరుకావాలో వివరాలను పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. ఈనెల 6న కాన్వొకేషన్, ఇతరాత్రా పోటీ పరీక్షకు హాజరయ్యే వారి హాల్‌టికెట్లను ఉంచామని, మ్యూజిక్ అభ్యర్థులకు 12న, భౌతికసామర్థ్య పరీక్షలను 11న పురుషులకు, 13న మహిళలకు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

సంక్రాంతి.. పెద్ద పండగ!
తెలుగువాళ్లంతా గాదెలు నిండిన ఆనందంతో.. గుండెల నిండుగా నాలుగు రోజులు సంతోషంతో జరుపుకునే అపురూపమైన ప్రకృతి పండగ!

సన్‌తోష కిరణాలు!




పల్లెకు పోదాం.. పండగ చేద్దాం



ప్రకృతికీ, మనకూ మధ్యనున్న అవినాభావ సంబంధాన్ని.. ఊరంతా కలిసి.. సకల జనులూ ఎంతో సంబరంగా, మరెంతో కళాత్మకంగా వ్యక్తీకరించుకునే నిండైన పండగ! మన ప్రకృతి, మన పంటలు, మన పశువులు.. మన సంపదలు, మన కళలు, మనవైన ప్రత్యేక వంటలు... ఇలా ఎన్నో అంశాలను పెనవేసుకున్న పండగ కాబట్టే పల్లెపట్టులన్నీ ఈ పండగకు మెరిసిపోతాయి. ఇళ్లన్నీ కొత్త అల్లుళ్లతో, కొత్త శోభతో కళకళలాడిపోతుంటాయి. మన పిల్లలకు ఇవన్నీ పరిచయం చేయటానికి ఇంతకు మించిన అద్భుత అవకాశం ఉండదు.







భోగితో మొదలు.. ముక్కనుమతో ముగింపు!

ఇల్లు చేరిన భోగభాగ్యాలకు గుర్తుగా ఇంటి ముందు భోగి మంటలతో.. పిల్లలందరికీ భోగిపండ్లు పోయటంతో.. భోగి రోజున ఆరంభమయ్యే సంబరాలు.. ప్రధాన సంక్రాంతి పండగ రోజునే కాదు.. ఆ తర్వాత కనుమ, ముక్కనుమల వరకూ విస్తరిస్తాయి!

బంగారంలాంటి పంటపొలాల్నీ, కడుపు నింపే దిగుబడినీ తలచుకుని సంబరపడే రైతన్న శ్రమకు, సంపదకు గొప్ప స్థానమిచ్చే పండగ ఇది. బీదాగొప్పా తేడా లేకుండా.. ఇంటిల్లిపాదీ ఒకచోట చేరి ఆనందంగా జరుపుకొనే పండగ కాబట్టే.. సంక్రాంతి వచ్చిందంటే ఊళ్లలో ఎక్కడ లేని సందడీ మొదలవుతుంది. ఎక్కడెక్కడో స్థిరపడిన వారు సైతం సకుటుంబ సపరివార సమేతంగా పల్లెకు చేరుకుని సంతోషంగా పండుగ చేసుకోవడం ఆనవాయితీ. ముగ్గులు, గొబ్బెమ్మలు, బొమ్మల కొలువులు, భోగిపళ్లు, భోగి మంటలు, అరిసెలు, అల్లుళ్లు, గంగిరెద్దులు, కొత్త ధాన్యాలు, హరిలో రంగ హరి.. ఇలా ఎన్నెన్నో..! ఎనెన్నో విశిష్ఠ సంప్రదాయాలు, ఆచారాలకు నెలవు ఈ పండుగ.



● భోగి.. తొలినాటి శోభకు అద్దం పడుతుంది. ఇళ్ల ముందు సరదాగా మంటలు వేస్తూ.. వాటి చుట్టూ వెచ్చ కాగుతూ.. నాట్యాలు చేస్తూ.. ఆనందంగా ఆరంభమయ్యే రోజు ఇది! ఇంట్లోని పిల్లలందరికీ రేగుపండ్లు, అక్షతలు.. పూలు కలిపి నెత్తిన పోస్తూ.. బాలారిష్టాలేవైనా ఉంటే తొలగిపోవాలని ఆశీర్వదించే భోగిపండ్ల ఘట్టం.. పిల్లలకు వినోదాన్నీ, పెద్దలకు గొప్ప తృప్తినీ పంచుతుంది. నెత్తిన పడే రేగుపళ్లు, చిల్లర పైసలను పట్టుకునేందుకు పిల్లలు చేసే అల్లరి పెద్ద హైలైట్!

పెద్దల పండుగ

సంక్రాంతి పశువులకే కాదు.. మన జీవానికి ఆధారాన్నిచ్చిన పెద్దలను, తరతరాల వారినీ తల్చుకుని..వారికి పూజలు అందించటం, వారి పేరిట వాయినాలూ, దానాలూ చేయటం ద్వారా కృతజ్ఞతలు చెప్పుకునే రోజు కూడా!

కనుమ.. రైతు సంతోషం కనుమా..!

మన మనుగడకు సహకరించే పశువులకు కృతజ్ఞతలు చెప్పుకునే రోజుది! అందుకే రైతన్నలంతా పశువులనూ, వాటి కొట్టాలనూ శుభ్రంగా కడిగి.. పశువుల కొమ్ములకు రకరకాల రంగులద్ది.. వాటిపైన వయ్యారంగా బంతిపూలు గుచ్చి.. వాటిని పూజించి మురుసుకునే అద్భుత సందర్భానికి తెర తీస్తుంది కనుము. వాటి సహకారంతోనే మన బతుకు పండుతుందని గుర్తు చేసుకునే రోజిది. అంతే కాదు, ఇంటి వాకిట కట్టిన కంకుల కోసం వచ్చి కిచకిచలాడుతూ గింజలు తినిపోయే పక్షులను చూడటం ఒక సౌందర్యాత్మక దృశ్యం. ఈ రోజు పశువుల కొట్టాల్లోనే పొంగలి వండి నైవేద్యం పెడతారు. ఆ పొంగలిలో పసుపు, కుంకుమ కలిపి పొలాల్లో 'పొలి' చల్లుతారు. పండి ఉన్న పంట పొలాలకు గుమ్మడికాయ పగులగొట్టి దిష్టితీస్తారు. పొంగలిని పశువులకు తినిపిస్తారు. చేలల్లో ఉన్న కొత్త పంటను ఈ రోజే ఇళ్లకు తీసుకువస్తారు. సాయంత్రం పశువుల్ని అలంకరించి మేళతాళాలతో ఊరేగిస్తారు. ఇక తిండి తిప్పలంటారా.. 'కనుము రోజు మినుము తినాలన్న' సామెత ఉండనే ఉంది! రకరకాల మాంసాలతో పిండి వంటలతో ఇళ్లన్నీ ఘుమఘుమలాడిపోవటం ఖాయం!

ముక్కనుమ

సంక్రాతి సంబరాల్లో చివరి రోజైన నాలుగో రోజు ముక్కనుమ. పండగకు కొనసాగింపుగా.. ఊరూవాడా అంతా తిరిగి.. దొరికినన్ని కాయగూరలన్నీ పోగుచేసి.. రకరకాల ముక్కలతో వండే దప్పళాలు.. రకరకాల మాంసాలతో పండగ వాతావరణాన్ని కొనసాగిస్తారు. ఇక కొందరైతే రథం ముగ్గు వేసి .. దాని తాడును పక్కింటి వాళ్ల రథానికి కలుపుతూపోగా.. పోగా.. ఆ రథాల తాళ్లతో ఊరంతా అందంగా అల్లుకున్న పొదరిల్లులా మారిపోతుంది.

నమో సూర్యాయ!

రాశికి 30 రోజుల చొప్పున సూర్యుడు 12 రాశులలో సంచరిస్తూ.. ఒక రాశి నుంచి మరో రాశిలోకి ప్రవేశించడమే సంక్రాంతి లేదా సంక్రమణం. ధనూరాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించే శుభ సందర్భాన్నే సంక్రాంతి పర్వదినంగా భావిస్తాం. సరిగ్గా జనవరి 13, 14 తేదీల్లో సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశిస్తాడు. మనకు ఏడాదికి పన్నెండు సంక్రాంతులు వస్తాయి. కానీ అన్నింటికన్నా సుదీర్ఘమైన పుణ్యకాలం ప్రారంభమయ్యేది మకర సంక్రాతి తర్వాతే. క్రాంతి అంటే వెలుగు. సంక్రాంతి అంటే కొత్త వెలుగు. అందుకే సంక్రాంతి కేవలం పండుగే కాదు, గొప్ప సదాచారం కూడా.



అద్భుత కిరణ స్పర్శ

సూర్యుడు మకర రాశిలో ప్రవేశించే 'సన్'క్రాంతి ఘడియలు.. ఈ భూమ్మీద మన జీవం, ప్రాణం, ఆరోగ్యం.. సమస్తం శక్తిస్వరూపుడైన ఆ సూర్యభగవానుడితోనే ముడిపడి ఉన్నాయని అనాదిగా మనం గుర్తు చేసుకుంటూ.. కొత్త ఉత్తేజాన్ని ఆవాహన చేసుకుంటున్న పర్వదిన ఘడియలు! ప్రపంచం మొత్తానికీ సూర్యుడే శక్తి కేంద్రం. ఆ కిరణ స్పర్శ లేకపోతే లేకపోతే మన మనుగడే కష్టం. రెండుమూడు రోజులు మన కంటికి సూర్యుడు కనబడకపోతే జీవితం నిరాసక్తంగా, మందకొడిగా, చైతన్య రహితంగా తయారవుతుంది. నిద్ర-మెలకువలను నియంత్రించేదీ, మనలో ఉత్సాహాన్ని ప్రేరేపించేదీ, కీలక విటమిన్లను అందించేదీ సూర్యుడి వెలుగే. మనమూ, మన పిల్లలూ నెలల తరబడి ఎండ ముఖం చూడకుండా కాలం గడిపేస్తున్న ఈ కృత్రిమ కాలంలో.. ఈ పండుగ ప్రాముఖ్యం మరింత పెరుగుతోందని వేరే చెప్పాలా!

కోడి పందేలు, ఎద్దుల పోటీలు

కనుమ రోజే కొన్ని ప్రాంతాల్లో కోడి పందేలు, ఎద్దుల పోటీలు అలరిస్తాయి. మొదట్లో సరదా కోసం ఆరంభమైన ఈ పందేలు రాన్రానూ జూదంగా మారి.. ఈ సమయంలో పెద్ద చర్చనీయాంశంగానూ తయారయ్యాయి.

అబ్బురపరిచే గొబ్బెమ్మలు

ఆవు పేడతో గొబ్బెమ్మలు సంక్రాంతి స్పెషల్! రంగురంగుల రంగవల్లుల మధ్యలో గొబ్బెమ్మను ఉంచి.. పసుపు కుంకుమ, పూలతో అలంకరించి.. దానిపై చిరుధాన్యాలు చల్లటం.. తెల్లవారు జామున పెట్టిన గొబ్బెమ్మలను అసుర సంధ్యవేళ తీసి.. పిడకలు చేస్తారు. నెల రోజుల పాటు పెట్టిన గొబ్బెమ్మల పిడకలను పండుగ రోజు పొయ్యి కింద పెట్టి ఆ మంటతో పాయసం చేస్తారు.

సందడిగా పతంగులు

సంక్రాంతి సీజన్ వచ్చిందంటే తెలంగాణలో ఎక్కడచూసినా పతంగుల రెపరెపలు కనిపిస్తాయి. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా చిన్నాపెద్దా అంతా చెర్కాలు, డోరీ పతంగులతో సందడి చేస్తారు. ఈ వాతావరణం పండుగకు నెల రోజుల ముందు నుంచే ప్రారంభమవుతుంది. ఊర్లో ఎవరు పెద్ద గాలి పటం ఎగురవేశారు.. ఎవరు ఎన్ని పతంగులకు పేంచీ (తెంపేయడం) వేశారనేది ఓ పోటీలా సాగిపోతుంటుంది.

అరిసెలు.. సకినాలు.. నువ్వులుండలు..

సంక్రాంతి పండుగ వస్తే ఇంట్లో నేతిఅరిసెలు ఘుమఘుమలాడాల్సిందే. కొత్త బియ్యంతో అరిసెలు చేస్తారు. ఈ పిండి వంటల సమయంలో ఇరుగు పొరుగు మహిళలు వచ్చి వీటిని తయారు చేయడంలో సహకరిస్తుంటారు కూడా. తెలంగాణ సుప్రసిద్ధ పిండి వంటకాల్లో ఒకటైన సకినాలను సంక్రాంతికి ప్రతి ఇంట్లోనూ చేస్తుంటారు. సకినాలను చుట్టడం ఓ కళ. కొందరు మహిళలు ఇందులో సిద్ధహస్తులుగా ఉంటారు. పద్ధతి ప్రకారం చేసిన సకినాలు కరకరలాడుతూ కమ్మగా ఉంటాయి. ఇక పండుగ సందర్భంగా చేసే తీపి పదార్థం నువ్వుల ఉండలు. బెల్లం, నువ్వులతో చేసే ఈ ఉండలను పర్వదినాన పెద్దలు చిన్నవారికి ఇచ్చి 'నువ్వులుదిని నూరేళ్లు బతుకు..' అని దీవిస్తుంటారు.

బొమ్మరిళ్లు..

కొన్ని ప్రాంతాల్లో సంక్రాంతి సందర్భంగా తమ చిన్నారుల కోసం ఇంటి ప్రాంగణంలో బొమ్మరిల్లు నిర్మిస్తుంటారు. ఒక వరుస ఇటుకలతో దీన్ని అందమైన పొదరిల్లుగా తీర్చిదిద్దుతారు. అందులోనే చిన్న పొయ్యి, ఇతర ఏర్పాట్లు అచ్చంగా ఓ ఇంట్లో ఉన్నట్లు చేస్తారు. సంక్రాంతి రోజున సాయంత్రం ఇరుగు పొరుగు ఇళ్లలోని చిన్నారులంతా అక్కడికి చేరుకొని 'చిరు'తిళ్లతో సందడి చేస్తారు.

పాలపొంగులు..

సంక్రాంతి రోజున ఇంటి ప్రధాన గుమ్మం ముందు పాలు పొంగించడం కొన్ని చోట్ల పరిపాటి. ముందుగా ఆ ప్రాంతాన్ని జాజు, సున్నంతో అలికి.. చుట్టూ గొబ్బెమ్మలు పెట్టి ఓ దారం కడతారు. ఓ వైపున దేవుడి పటం పెట్టి.. మధ్యలో పిడకలపై గురిగి పెట్టి అందులో పాలు పొంగిస్తారు. పాలచుట్టూ కూరగాయలు, మిర్చీ ఇతర పదార్థాలు నివేదిస్తారు.

నోములు..

సంక్రాంతి పండుగకు ఏదైనా ఓ నోము నోచుకోవడం కొన్ని ప్రాంతాల్లో కనిపిస్తుంది. ఇరుగు పొరుగువారు, స్నేహితురాళ్లు, బంధువుల మధ్య చక్కని సంబంధ బాంధవ్యాలు పెంపొందించేందుకు ఈ నోములు ఉపకరిస్తాయి. ముఖ్యంగా పెళ్లయ్యాక మొదటి నోము అతివలకు ఎంతో విశిష్టమైనదిగా భావిస్తుంటారు. కొత్త కుండలను సైతం నోముకుంటారు. ఏవైనా స్టీల్, రాగి, ప్లాస్టిక్ వస్తువులు 13 సెట్లు తయారుచేసుకొని వాటికి ప్రత్యేక పూజ చేస్తారు. ఆ తర్వాత ముత్తయిదువులకు పంచుతారు. వీటితోపాటు పసుపు, కుంకుమ, నువ్వుల ఉండలను కూడా ఇస్తారు. తులసివనం, బృందావనం, కుచేల మూటలు, తమ్మునికి తలంబ్రాలు-మరదలికి మాణిక్యాలు.. ఇలా పలు ఆకర్షణీయమైన పేర్లతో నోములు ఉంటాయి. ఈ సారి మొక్కలను నోముకొని పర్యావరణ పరిరక్షణకు పాటుపడుదామంటూ ఈ మధ్య కొన్ని సామాజిక మాధ్యమాల్లో అతివల మధ్య చర్చ జరగడం విశేషం.

- ఈనాడు ప్రత్యేక విభాగం

వీళ్లంతా ఏమవుతున్నారు!



గంగిరెద్దులోళ్లు

సంక్రాంతి వచ్చిదంటే చాలు.. ధాన్యరాశులతో పాటే రకరకాల కళాత్మక జానపదులతో ఊరంతా కళకళలాడిపోతుంటుంది. ఒకప్పుడు రకరకరాల జానపదులు మనవైన సాంస్కృతిక కళా రూపాల్ని ఊరిలో ప్రదర్శించి.. తృణమోపణమో తీసుకుని సంతోషంగా జీవించేవారు. కానీ ఆధునిక వినోదాల తాకిడికి ఇప్పుడు చిక్కిశల్యమై.. రెపరెపలాడుతున్న ఈ కళాకారులను అక్కున జేర్చుకుని.. మన పిల్లలకు పరిచయం చేసి, మనవైన మూలాలను పొదివి పట్టుకోవటాన్ని మించిన పండగేముంటుంది?

● మెడలో దండ, చేతిలో చిడతలు, తంబూరాతో శ్రీమహావిష్ణువును స్తుతిస్తూ... 'హరిలో రంగ హరి.. హరిలో రంగ హరి' అంటూ ఇల్లిల్లూ తిరుగుతూ ఈ నెల రోజులూ పల్లెలో వీధివీధినా సందడి చేసే హరిదాసులు.

● రంగురంగుల పట్టు వస్త్రాలతో కాళ్ల నుంచి కొమ్ముల వరకూ బసవన్నలను అందంగా ఆలంకరించుకుని.. గుడ్డిబూరలూ, కోణంగి బుడ్డాళ్లతో సహా.. ఇంటింటికీ వచ్చి.. అయ్యావారికీ దండం పెట్టూ....అంటూ.. తమకు చిల్లర పైసలూ, ఎద్దుకు బుట్టెడు వడ్లూ అడుగుతూ.. పండగకే కళ తెచ్చే గంగిరెద్దుల వాళ్లు

● పాత గొడుగు వేసుకుని.. బుస్కోటు తొడుక్కుని.. బుడబుడక్ అంటూ డమరుకం వాయిస్తూ.. అంబ పలుకులతో ఇంటింటి భవిష్యవాణిని వినిపించే బుడబుక్కల స్వాములు...



బుడబుక్కలోళ్లు

● నీళ్లు నింపిన కడవ మూతిలో కత్తిగుచ్చి, దాన్ని ఓ కావిడికి కట్టి ఊరంతా ఊరేగించి కనికట్టుతో అందర్నీ ఆకట్టుకునే మాసాబత్తినవాళ్లు...

● చిన్న సంచికట్టుతో, విభూతి నామాలతో గడపలో తిష్టవేసి కనికట్టు, హస్తలాఘవం వంటి విద్యలతో అందర్నీ అచ్చెరువందించే విప్రవినోదులు...



గంటా సాహెబ్

● రోజుకో వేషం వేసుకుని, హాస్యం, భయంతో సహా సకల రసాలనూ పలికిస్తూ.. ఆఖరి రోజు శక్తివేషంతో ఊరంతటినీ ఉరికించి, వినోదం అందించే పగటి భాగవతులు...

● ఎత్తైన చెట్టు కొమ్మ మీద కూచుని.. కనిపించిన మేర దృశ్యాలను తన దైన వ్యంగ్య ధోరణిలో ప్రత్యక్ష వ్యాఖ్యానం చెప్పే కొమ్మదాసరిలు...

● ఇంటింటికీ తిరిగి సకల కులాల వారికీ తాతముత్తాల నుంచి గోత్రాల వరకూ.. పాటల రూపంలోనే వంశ మూలాలన్నీ విప్పి చెప్పే పిచ్చికుంట్లవారు...

● తలపై పెద్ద కిరీటం, చేతిలో గంట, నుదిటిపై విభూది పట్టీలు, మెడలో శంఖంతో వచ్చి.. గంట నిండా ధాన్యం పెట్టమంటూ శుభోదయం పలికే జంగం దేవర...

● భుజాన కావిడి, కావిడి బద్ద పొడుగునా గొట్టంతో వచ్చి, గొట్టం విప్పితే ఏయే తప్పులకు నరకంలో ఏయే శిక్షలో కళ్లకు కట్టిచెప్పే.. జనం ఇచ్చే సంభావనలు స్వీకరించే కాశీ బ్రాహ్మడు...

● నెమలీకలు తలకు కట్టుకుని.. గంభీరమైన వేషధారణలో పాట పాడుతూ.. కంచు శిబ్బెని మోగిస్తూ, శివయ్యను స్మరించే చెంచు దొరలు...

● ఒకప్పుడు ఊళ్లోకి ప్రవేశం లేక.. ఊరి పొలిమేర నుంచే ప్రత్యేక వాద్యం వాయిస్తూ పాటలు పాడే డొక్కల వారు...

● కోసిన కోత కొయ్యకుండా వసపిట్టలా బడాయి కబుర్లు చెబుతూ ఆబాల గోపాలాన్నీ ఆనందపరిచే పిట్టల దొరలు...



పిట్టల దొర

● గవ్వలతో కుట్టిన గొంగడి టోపీ ధరించి.. ఒంటికి గొంగడి వస్త్రాన్ని కప్పుకుని, పిల్లన గ్రోవి వాయిస్తూ భిక్షమెత్తుకునే గొరవయ్యలు...

● కనకదుర్గమ్మ పెట్టెతో, కొరడా ఝళిపిస్తూ, ఒంటిని కొరడాతో బాదుకుంటూ, వీధి మధ్యలో డోలు వాయిస్తూ సందడి చేసే పోతరాజులు...

కాటికాపర్లు.. కోతులు ఆడించేవారు.. ఎలుగును తెచ్చేవారు... ఇలా అనేకానేక వృత్తుల వారు, జానపదులు సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రతి పల్లెలోనూ సందడి చేసేవారు. ఇవన్నీ ఒకనాటి ముచ్చట్లు. గ్రామాల్ని పట్టణాలు కబళించాక.. పల్లెజీవి పట్టణ వాతావరణానికి అలవాటు పడ్డాక.. ఈ ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు కనుమరుగై పోతున్నాయి. సంక్రాంతి అంటే ఇవన్నీ ఉంటాయని తెలిస్తే మన పిల్లలు మాత్రం గంతులేస్తూ పల్లెలకు పరుగెత్తుకురారూ? మరి వీరందర్నీ కాపాడుకునే పని మనది కాదూ??




హరిదాసు

బొమ్మలు: బాలు

పట్నం పిలగాళ్లు!



పట్నం బడి పిల్లలకు ఈ బొమ్మలు చూపించి ఇవేమిటో గుర్తుపట్టగలరా? అంటే నూటికి తొంభైమంది తెల్లమొహాలు వేస్తారు. నిజానికి ఈ వస్తువులేవీ వాడకుండానే నేడు మన జీవితాలు గడిచిపోతుండొచ్చు. వీటి అవసరం నేడు లేదని మనం అనుకోవచ్చుగానీ.. మన సంస్కృతితో గాఢంగా పెనవేసుకుపోయిన ఇలాంటి వేలాది వస్తువులూ, భావాలూ తెలియకపోతే మన పిల్లలు ఏం నష్టపోతారో మాటల్లో చెప్పలేం. వీటి పరిచయం లేకపోతే మన సామెతలు తెలియవు. నుడికారాలు అర్థం కావు. సాహిత్యం బధిర శంఖారావమే అవుతుంది. మన తాతల మాటలే మనకు అర్థం కాని రోజులు వచ్చేస్తాయి. 'కందకు లేని దురద కత్తిపీటకెందుకు' అంటే ఏమిటో తెలీదు. 'డూడూబసవన్నలా తలూపుతావే..' అన్నా తెల్లముఖం వేయాల్సిందే. ఎవరన్నా నానా మాటలతో 'చెరిగేసినా', చివరికి 'కుంపటి పెట్టినా' కూడా తెలుసుకోలేని స్థితి! 'రోలు వెళ్లి రోకలితో మొరపెట్టుకుంది' అంటే అదేమిటనాల్సిందే. ఇలా ఒక తరం మాట మరో తరానికి అర్థం కాకపోవటం ఎంత విషాదం? ఇప్పటికీ ఇవన్నీ ఎంతోకొంత సజీవంగా ఉన్న పల్లెలకు తీసుకుపోయి.. పసి కూనలకు మన భాషాసంస్కృతులను పరిచయం చేయటానికి ఇదే సరైన సమయం!



ఈనాడు బిజినెస్ వారాంతం

అతిథి గృహానికి ఆహ్వానం



'హోమ్‌స్టే'కు పెరుగుతున్న ఆదరణ

14.4 శాతం విదేశీ పర్యాటకుల వార్షిక వృద్ధి

90 బి. డాలర్లు — 2015లో 30 బి.డాలర్లుగా ఉన్న వ్యాపార పర్యాటకం 2030 కల్లా మూడింతలవుతుందన్న అంచనాలున్నాయి.

4 బి. డాలర్లు — 2020 కల్లా భారత ఆన్‌లైన్ హోటల్ పరిశ్రమ విలువ. ఇందులో హోమ్ స్టేలకూ కొంత వాటా ఉంటుంది.

ఆమధ్య కేరళలోని తెక్కడికి వెళ్లిందో విదేశీ జంట.

వీధిలో నడుచుకుంటూ వెళుతూంటే అటూ ఇటూ 'హోమ్ స్టే' అన్న బోర్డులు.

సరే చూద్దామనుకుని ఓ ఇంటికి వెళ్లారు.

ఆత్మీయ ఆహ్వానం లభించింది.

పొద్దుటే పొగలుకక్కే కాఫీ.. రోజంతా మూలికలు కలిపిన నులివెచ్చటి నీళ్లు.. కమ్మటి స్థానిక ఫలహారంతో ఫిదా అయిపోయారు.

ఆ తర్వాత ఏనుగు సఫారీకి ఎలా వెళ్లాలో.. ద్రాక్ష తోటలకు ఎక్కడికి వెళ్లాలో.. కళరి సాయుధ పోరాటం, కథాకళి నృత్యం ఎక్కడ చూడొచ్చో తదితర వివరాలు కూడా అతిథేయులు చెప్పారు. ఆద్యంతం పర్యటన ఆహ్లాదంగా, ఆనందంగా గడిచిపోయింది.

ఇంతా చేసి.. ఇంటిని వదిలివెళ్లే సమయంలో వారు అడిగిన అద్దె కూడా నామమాత్రమే.

ఈ తరహా 'హోమ్ స్టే'లకు కేరళలోనే కాదు.. భారత్ అంతటా గిరాకీ పెరుగుతోంది. ప్రభుత్వం కూడా 'ఇన్‌క్రెడిబుల్ ఇండియా'ను దృష్టిలో ఉంచుకుని వారికి ప్రోత్సాహాన్ని ఇస్తోంది.

భారత్‌లో పర్యాటక ప్రదేశాలకు కొదువ లేదు. అందుకే 2020 కల్లా పర్యాటక విపణి 4800 కోట్ల డాలర్ల (దాదాపు రూ. 3,36,000 కోట్లకు)కు చేరుతుందన్న అంచనాలున్నాయి. అంటే ఈ అవకాశాలను అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పర్యాటకులకు ఆహ్లాదం కలిగించే వసతి కూడా ఇందులో కీలకమే. హోటళ్లకు తోడుగా ప్రత్యామ్నాయంగా గృహ వసతికి సైతం ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని పర్యాటక రంగ నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా ఏటా 15% చొప్పున పెరుగుతున్న విదేశీ పర్యాటకులకు ఇక్కడి సంస్కృతిని దగ్గరగా పరిశీలించేందుకు అవకాశం ఇచ్చే 'హోమ్ స్టే'కు గిరాకీ పెరుగుతోంది.

ఇదీ లెక్క..

పెరుగుతున్న ఆదాయం, పర్యాటక రంగానికి మద్దతునిచ్చే ప్రభుత్వ చర్యల వల్ల ఏ ఏడాదికాఏడాది పర్యాటకుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ప్రభుత్వ లెక్కల ప్రకారమే 2020 కల్లా ఆతిథ్య రంగంలో 25 లక్షల అదనపు గదులు కావాల్సి ఉంది. ఈ గిరాకీని తట్టుకునేందుకు అవసరమైన హోటళ్లు ఏర్పాటు చేయడం అంత సులువైతే కాదు. అందుకే హోమ్ స్టేలకు పలు ప్రోత్సాహకాలను సైతం కేంద్రం ప్రకటించింది.

ఇవీ ప్రోత్సాహకాలు..

గృహ వసతిని కల్పించే వారికి లైసెన్సింగ్ నిబంధనల్లో ప్రభుత్వం సడలింపునిచ్చింది. తమ గృహాలను ధ్రువీకృత వసతి గృహంగా మార్చుకోవడాన్ని సులువు చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సేవా పన్నులు, నీటి ఛార్జీలు, ఇతరత్రా వాణిజ్య ఛార్జీల నుంచి హోమ్ స్టేలకు మినహాయింపునివ్వాలని కేంద్రం కోరుతోంది. తద్వారా మరింత ఎక్కువ మంది ఈ రంగంలోకి అడుగుపెట్టడానికి వీలవుతుందన్నది ప్రభుత్వ ఉద్దేశంగా ఉంది. 'ఇన్‌క్రెడిబుల్ ఇండియా' ప్రాజెక్టు కింద ఈ వసతిని కల్పించేవారిని ప్రోత్సహించడమే కంకణంగా కట్టుకుంది. దేశీయ, విదేశీ పర్యాటకులకు ఒకే వసతిని కల్పించాల్సి ఉంటుంది. అయితే విదేశీ పర్యాటకులకు మన దేశ సంస్కృతిని పరిచయం చేసే విషయంలో ఉత్సాహం చూపడం ఇక్కడ ముఖ్యం.

వర్క్‌షాపులు సైతం..

హోమ్‌స్టేలను విరివిగా అభివృద్ధి చేయడం కోసం పర్యాటక శాఖ వర్క్‌షాపులను నిర్వహిస్తోంది. తన దేశీయ కార్యాలయాల ద్వారా వాటికున్న ప్రాధాన్యతను, స్పృహను పెంచుతోంది. ఇప్పటికే దేశంలో కేరళ వంటి ప్రాంతాల్లో ఈ గృహ వసతి పుంజుకుంది కూడా. అయితే భవిష్యత్‌లో ఇతర ప్రాంతాల్లోకీ వీటిని విస్తరించాల్సిన అవసరం ఉంది.

ఆసక్తికి కారణాలు ఇవీ..

'హోమ్‌స్టే'ల పట్ల విదేశీయులు ఆసక్తి కనబరచడానికి కారణాలు లేకపోలేదు.

- భారత్ విభిన్న సంస్కృతుల, సంప్రదాయల మేళవింపు అన్న సంగతి తెలిసిందే. దీనిని దగ్గరగా చూడాలంటే ఈ తరహా వసతి సావకాశమని చెప్పవచ్చు. ముఖ్యంగా మధురలో హోలీ సంబరాలు చూడాలన్నా.. పంజాబీ గృహాల్లో పరాఠాల రుచి చూడాలన్నా.. దక్షిణ భారత ఇడ్లీ, సాంబారు రుచి చూడాలన్నా.. హోమ్‌స్టేలో అయితే అది మరింత ఆసక్తిగాను, అద్భుతంగాను ఉంటుంది.
- స్థానికంగా ఉండే కొత్త ప్రదేశాలను వెతకాల్సిన అవసరం ఉండదు. ఆతిథ్యం ఇచ్చినవారు చక్కగా వివరిస్తారు. కావాలంటే దగ్గరుండి చూపిస్తారు కూడా. ఎంతైనా స్థానికులకు తెలిసినంతగా ఎవరికి తెలుస్తుంది చెప్పండి.
- స్థానిక సంప్రదాయాలే కాదు.. స్థానిక వంటల రుచి చూడడానికీ ఇవి అద్భుత అవకాశాన్ని ఇస్తాయి. కొత్త భాషను నేర్చుకోవడానికి కూడా ఇవి ఉపకరిస్తాయి. కనీసం ఎక్కువగా వాడే పది పదాలు.. పర్యటన పూర్తయినా గుర్తుండిపోతాయి కదా.
- అన్నిటికి మించి.. 'అతిథి దేవో భవ'కు అర్థంగా అతిథేయులు వారిని చూసుకుంటారు. ఎవరికైనా మనల్ని ప్రత్యేకంగా చూస్తుంటే ఆ మజానే వేరుకదా. ఇక వీటన్నికంటే చెప్పాల్సిందేమిటంటే.. వసతి, భోజనం, గైడ్ తదితరాలకు అయ్యే ఖర్చు కూడా చాలా తక్కువ. అనుభూతి మాత్రం ఎక్కువ.

డిజిటల్ అక్షరాస్యత అవసరం

హోమ్‌స్టే రంగం పుంజుకోవాలంటే.. గృహ యజమానులు కొంత డిజటల్ అక్షరాస్యతను సంపాదించాల్సిన అవసరం ఉంది. తమ మార్కెట్‌ను పెంచుకోవడానికి ఆన్‌లైన్‌లో తమ వసతి వివరాలను పొందుపరచడం వంటి విషయాలను తెలుసుకోవాలి. డిజిటల్ మాధ్యమాల్లోకి అడుగుపెడితేనే నేరుగా పర్యటకులతో మాట్లాడుకునేందుకు వీలు కలుగుతుంది. తమ సేవలు, టారిఫ్ వివరాల విషయంలో పారదర్శకతను కల్పిస్తే పర్యటకుల నుంచి మరింత ఆదరణ లభించడం ఖాయం.

గృహ యజమానులకూ ప్రయోజనమే..

కేవలం పర్యాటకులకే ఇది అనుభూతిని పంచేది కాదు. అతిథేయులకు కూడా ఆర్థికంగా ప్రయోజనాన్ని అందించేదే. అదీ కాక బడ్జెట్ హోటళ్లకు ఎక్కువ కొరత ఉన్న భారత్‌లో ఈ తరహా వసతికి భవిష్యత్‌లో మరింత గిరాకీ పెరిగే అవకాశం ఉంది. హోటళ్ల నిర్మాణానికి అధిక వ్యయాలు చేయాల్సి ఉంటుందన్న సంగతి తెలిసిందే. ఇక ఈ వసతి కలగజేయడం ద్వారా గృహ యజమానులు కాస్త చిన్న స్థాయి వ్యాపారవేత్తలుగా ఎదగడానికి అవకాశం ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో, కొత్త ప్రదేశాల్లో ఇది ఒక ఆదాయ వనరుగా కూడా మారుతుంది. ముఖ్యంగా మహిళలకు ఆర్థిక సాధికారతను కలగజేస్తుంది.

- ఈనాడు వాణిజ్య విభాగం

ఉద్యోగం కోసం వెళ్లి.. వ్యాపారవేత్తగా మారి..

- లక్ష్యాన్ని సాధించిన సమీర్ పెనకలపాటి
- అమెరికాలో విజయ ప్రస్థానం
- ఐటీ సేవల్లో మేటి సంస్థగా 'అవని'
- 'రోచెస్టర్ టాప్ 100'లో అగ్ర స్థానం

ఈనాడు - హైదరాబాద్

ఎక్కడో అనంతపురం జిల్లా అబ్బాయి. పేరు సమీర్ పెనకలపాటి. రెండు దశాబ్దాల క్రితం అమెరికా వెళ్లాడు. మంచి ఉద్యోగం... వచ్చే సంపాదనతో హాయిగా కాలం గడపవచ్చు. కానీ సొంత కాళ్లమీద నిలబడాలని, వ్యాపారవేత్తగా ఎదగాలని మనసు తహతహలాడింది. వ్యాపారం ప్రారంభించటానికి అవసరమైన డబ్బు లేదు. అయినా మిగుల్చుకున్న కొద్దిపాటి సొమ్ముతో ముందడుగు వేశాడు. అలా రూపుదిద్దుకున్నదే అవని టెక్నాలజీ సొల్యూషన్స్. ఈ ఐటీ సేవల కంపెనీ కొద్దికాలంలోనే శరవేగంగా ఎదిగింది. ఎంతగానంటే... 2018 సంవత్సరానికి 'రోచెస్టర్ టాప్ 100' కంపెనీల జాబితాలో మొదటి స్థానంలో నిలిచేంతగా. అత్యధిక వృద్ధి నమోదు చేస్తున్న వ్యాపార సంస్థల జాబితాను న్యూయార్క్‌లోని రోచెస్టర్‌లో ఏటా ప్రకటిస్తారు. దానికే 'రోచెస్టర్ టాప్ 100' అని ప్రసిద్ధి. అందులో స్థానం సంపాదించటమే కాకుండా మొదటి స్థానంలో నిలవటం అవని టెక్నాలజీస్ ప్రత్యేకత. ఇదే కాకుండా 'డెలాయిటీ ఫాస్ట్ 500' అవార్డు రెండుసార్లు లభించింది. ఈ విజయం వెనుక ఎన్నో కష్టాలు, నిద్రలేని రాత్రులు ఉన్నాయంటున్నారు సమీర్ పెనకలపాటి. అనంతపురం నుంచి అమెరికా వరకూ తన ప్రయాణాన్ని ఆయన 'ఈనాడు'తో పంచుకున్నారు.



అంకురం

డబ్బులేదు, వ్యాపార నేపథ్యం లేదు

బళ్లారిలో బీఈ పట్టా పుచ్చుకున్న సమీర్ బిట్స్-పిలానీలో ఎంఈ చేశారు. ఆ తర్వాత మూడేళ్లు ఇక్కడే ఐబీఎంలో ఉద్యోగం. 1999లో అమెరికా ప్రయాణం. తొలుత ఐటీ కన్సల్టెంట్‌గా పని. 2002లో న్యూయార్క్‌లోని రోచెస్టర్ వెళ్లి అక్కడ కోడక్, ఫైజర్ వంటి ప్రముఖ కంపెనీల్లో పనిచేశారు. ఈ ఉద్యోగాల కంటే ఇంకేదైనా చేయాలని అనిపించింది. ఆ ఆలోచనే అవని టెక్నాలజీస్‌కు పునాదిపడేలా చేసింది. 'నా దగ్గర వ్యాపారం ప్రారంభించడానికి అవసరమైన సొమ్ము లేదు. వ్యాపార నేపథ్యం అసలే లేదు. కానీ వ్యాపారం ప్రారంభించాలనే పట్టుదల ఉంది. అదే నన్ను ముందుకు నడిపించింది..' అంటారు సమీర్. చేతిలో ఉన్న ఉద్యోగం, సాఫీగా సాగుతున్న జీవితాన్ని వదులుకొని వ్యాపార రంగ ప్రవేశం అనేది రిస్కు అనిపించలేదా...? అనే ప్రశ్నకు స్పందిస్తూ పట్టుదల, ప్రణాళిక ఉంటే విజయం సాధించవచ్చని అనుకున్నట్లు చెప్పారు.

ఐటీ కన్సల్టింగ్ సేవలు

ఇంతకీ అవని టెక్నాలజీస్ ఏం చేస్తుంది? ఇది ఐటీ సేవల కంపెనీ. దాదాపు దశాబ్దకాలం పాటు ఐటీ రంగంలో పనిచేసిన అనుభవంతో సమీర్ అదే రంగంలో సేవలు అందించే సంస్థగా అవని టెక్నాలజీస్‌ను తీర్చిదిద్దారు. అందులోనూ భిన్నమైన ప్రాజెక్టులు నిర్వహించే నైపుణ్యాన్ని సాధించారు. ముఖ్యంగా ఇంజినీరింగ్ స్టాఫింగ్, అంకుర సంస్థల కోసం ఐటీ ప్లాట్‌ఫామ్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్, ఐటీ ప్రాజెక్ట్స్-కన్సల్టింగ్ విభాగాల్లో ప్రత్యేకత ప్రదర్శించారు. అందువల్ల అత్యంత వేగవంతమైన అభివృద్ధిని సాధించే అవకాశం లభించింది. ఏరోస్పేస్-డిఫెన్స్ రంగాల్లోని అంకుర సంస్థలకు అనువైన ఐటీ ప్లాట్‌ఫామ్‌ల రూపకల్పనలో అవని టెక్నాలజీస్ పేరు తెచ్చుకుంది.

ప్రయాణం ఎలా సాగింది..

ఎన్నో పరీక్షలు, మరెన్నో సవాళ్లు ఎదురయ్యాయని అంటారు సమీర్. ఎంతో నేర్చుకున్నా. ఏదైనా ప్రాజెక్టును విజయ వంతంగా పూర్తిచేసినప్పుడు చాలా సంతోషించే వాడ్ని.. అని వివరించారు. 'ప్రస్తుతం ఏటా 35-40 శాతం వృద్ధి సాధిస్తున్నాం. కెనడా, బ్రిటన్ దేశాలకు కార్యకలాపాలను విస్తరించేందుకు కసరత్తు చేస్తున్నాం' అంటూ వ్యాపార ప్రణాళికలను వివరించారు. 2020 నాటికి 100 మిలియన్ డాలర్ల వ్యాపారాన్ని నమోదు చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు వెల్లడించారు.

నిపుణుల లభ్యతే సమస్య

ఐటీ రంగంలో సమీప భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్ల విషయమై స్పందిస్తూ, మేం అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం అవసరమైన రంగంలో పనిచేస్తున్నాం. అవసరాలకు తగ్గట్లుగా ఐటీ నిపుణుల లభ్యతే పెద్ద సమస్యగా ఉంది- అన్నారు. ఇంకా వీసా ఆంక్షలు, వివిధ దేశాల్లో ఆర్థికాభివృద్ధి, వ్యాపారంలో హెచ్చుతగ్గులు...ఇతర సవాళ్లుగా వివరించారు.

భారత్‌లో...

అంకుర సంస్థలకు అనుకూల పరిస్థితులు భారతదేశంలో కనిపిస్తున్నాయి. నిపుణులకు, పరిశోధనలకు ఇక్కడ కొదవలేదు. కాకపోతే మూలధన లభ్యత, పటిష్ఠ విధానాలు, నిబంధనలు ఉంటే సాంకేతిక రంగంలో అద్భుతాలు సృష్టించవచ్చు. మా సంస్థ కార్యకలాపాలు ఇక్కడ బాగా విస్తరిస్తున్నాయి. భారత్‌లో మేం 20 మంది సిబ్బందితో ప్రారంభించి ఇప్పుడు 300 మందికి చేరుకున్నాం. మరో ఏడాది వ్యవధిలో 500 మందికి సిబ్బంది సంఖ్య పెరుగుతుంది.



కోడిగుడ్లు

5న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	447	వరంగల్	449
చిల్లరగా (ఒక గుడ్డు)	5.05	విశాఖపట్నం	458
బెంగళూరు	445	చెన్నై	455
6వ తేదీకి		చిత్తూరు	448
విజయవాడ/గోదావరి	453	నమక్కల్	440

స్టాక్ మార్కెట్.. ఓ కాలక్షేపం కాదు



కొత్త సంవత్సరంలో ఫలానా పని ప్రారంభించాలని.. ఫలానా లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఏవేవో భీష్మ ప్రతిజ్ఞలు చేస్తారు చాలామంది. ఓ 2, 3 రోజులు పాటిస్తారు.. ఆ తర్వాత షరా మామూలే. ఏదో ఒక వంక చెప్పి దాన్ని అటకెక్కించేస్తారు. మళ్లీ మరో కొత్త సంవత్సరం వచ్చినా ఇదే కథ.. ఇదే ముగింపు.. ఏళ్లు గడిచిపోతాయి తప్ప సాధించేదేమీ ఉండదు. జీవితాన్ని టైంపాస్ వ్యవహారంగా చూసినన్నాళ్లూ ఎదుగూబొదుగూ అనేదే ఉండదు. స్టాక్ మార్కెట్‌కూ ఇదే సూత్రం వర్తిస్తుంది. అదెలాగంటే..

పిట్టకథ

రాజయ్య, కమలమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. పిల్లలిద్దరికి ఏ పనీ చెప్పకుండా పెంచడంతో పెరిగి పెద్దయ్యాక వాళ్లు సోమరుల్లా తయారయ్యారు. కొన్నాళ్లకు రాజయ్యకు వయసు పైబడటంతో మునుపటిలా పనిచేసే శక్తి తగ్గింది. భర్త పడుతున్న ఇబ్బందిని చూసి పొలం పనిలో నాన్నకు సాయం చేయమని ఇద్దరు కొడుకులతో అంటుంది కమలమ్మ. అన్నయ్య చేస్తాడని తమ్ముడు, తమ్ముడు చేస్తాడని అన్నయ్య.. ఇద్దరూ తప్పించుకునేందుకే ప్రయత్నించారు తప్ప ఎవరూ ముందుకొచ్చేవారు కాదు. ఒక్కోటిగా జబ్బులూ చుట్టుముట్టడంతో రాజయ్య ఇంటికే పరిమితమయ్యాడు. ఆ సంవత్సరం పొలమంతా బీడుగా మారింది. జబ్బుల కంటే ఈ బాధే అతణ్ని తీవ్రంగా వేధించేది. దాంతో కొడుకులిద్దరిని ఎలాగైనా పొలం పనిలో దించాలని అనుకొని ఓ ఉపాయం ఆలోచించాడు. వాళ్లను పిలిచి 'నేను ఇన్నాళ్లూ రేయి అనక, పగలు అనక కష్టపడ్డానో తెలుసా..?' అని ప్రశ్నించాడు. డబ్బులు సంపాదించడానికే కదా.. అంటూ వాళ్లు బదులిచ్చారు. 'కాదు... మన పొలంలో ఓ నిధి ఉంది. ఈ విషయం నాకు మా తాత చెప్పాడు. ఇప్పుడు నేను మీకు చెబుతున్నా. ఇన్నాళ్లుగా నేను ఆ నిధి కోసమే వెతికాను. నాకు అదృష్టం లేకపోవడంతో దొరకలేదు. మీలో ఎవరో ఒకర్ని ఆ అదృష్టం వరించొచ్చు. అది మీరే తేల్చుకోండ'ని అంటాడు. అప్పట్నుంచి నిధి కోసం వాళ్లు పొలం దున్నడం మొదలెట్టారు. కాని చివరకు నిధి దొరకకపోవడంతో కోపంగా ఇంటికి వచ్చి అబద్ధం ఎందుకు చెప్పావంటూ తండ్రిని నిలదీశారు. నేను ఎన్నో ఏళ్లుగా నిధి కోసం ప్రయత్నించినా నాకు దొరకలేదు. అయినా నేను ఏనాడు మీలా నిరాశపడలేదు. మీరు ఒక్క సంవత్సరానికే ఇలా అయిపోతే ఎలా? ఎలాగూ పొలం దున్నేశారు కదా.. విత్తనాలు వేయండి. నిధి గురించి వచ్చే సంవత్సరం చూద్దాం అని చెబుతాడు. చేసేదేమీలేక ఆ రోజునుంచి ఇద్దరూ పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. నిధి అనే మాటే మరిచిపోయి రెక్కలుముక్కలు చేసుకొని కష్టపడ్డారు. ఆ ఏడాది మునుపెన్నడూ లేని విధంగా దిగుబడి రావడంతో వాళ్ల ఆనందానికి హద్దుల్లేకుండా పోయింది. పంటను అమ్మేసి నేరుగా తండ్రి వద్దకు వచ్చి ఆ డబ్బుల మూటను ఆయన చేతిలో పెట్టారు. కొడుకుల్లో వచ్చిన ఈ మార్పును చూసి రాజయ్యకు ఆనందభాష్పాలు ఆగలేదు. వెంటనే వాళ్లతో 'కష్టపడి సాధించిన ఫలితాన్ని కళ్లారా చూసినప్పుడు కలిగే ఆనందమే నిధి. ఇప్పుడు మీ కళ్లలో ఆ నిధే కనిపిస్తోంది. మీకు ఇంకే నిధితో పనిలేద'ని అంటాడు. తండ్రి మాటల్లో అసలు సత్యాన్ని గమనించిన కొడుకులిద్దరు 'దొరకని నిధి కోసం కాకుండా ఆనందాన్ని పంచే ఈ నిధి కోసమే ఎప్పుడూ పనిచేస్తామ'ని మాట ఇచ్చారు.



గుణ పాఠం

మార్కెట్ కథ

ప్రసాద్ ఏ పనీపాటా లేకుండా ఆవారాగా తిరుగుతూండేవాడు. తండ్రి పదవీ విరమణ చేశాక వచ్చే డబ్బులతో జీవితాన్ని హాయిగా గడిపేయొచ్చన్నది అతని ధీమా. ఎన్నో రోజులుగా అతను ఎదురుచూస్తున్న ఆ రోజు రానేవచ్చింది. తండ్రి పీఎఫ్ డబ్బులు బ్యాంకు ఖాతాలో పడటంతో వ్యాపారం చేసుకుంటానని చెప్పి ఓ రూ.10 లక్షలు ఇవ్వమని అడుగుతాడు. ఎలాగూ ఖాళీగా తిరుగుతున్నాడు కదా.. ఇలాగైనా దార్లోకి వస్తాడని తండ్రి కూడా డబ్బులు ఇచ్చాడు. అందులో రూ.5 లక్షలతో బేకరీ పెట్టి.. మిగిలిన రూ.5 లక్షలను వేటిల్లోనైనా పెట్టుబడి పెడదామని ప్రసాద్ అనుకున్నాడు. స్నేహితుడు రవి ఇచ్చిన సలహాతో మిగిలిన ఆ డబ్బులు పెట్టి షేర్లు కొంటాడు. స్టాక్ మార్కెట్‌పై అవగాహన లేకపోవడంతో ఏ షేర్లను ఎందుకు కొంటున్నాడో తెలియకుండా కొనేసేవాడు. పోనీ ఆ షేర్లను అట్టేపెట్టుకుంటాడా అంటే అదీ లేదు. ఇష్టమొచ్చినప్పుడు కొనడం.. ఇష్టమొచ్చినప్పుడు అమ్మడం చేసేవాడు. దీంతో కొన్ని రోజులకే రూ.3 లక్షల వరకు నష్టపోయాడు. అది తెలుసుకొని ప్రసాద్ తండ్రి చాలా బాధపడతాడు. అయినా కొడుకును ఏమీ అనకుండా.. ఇక నుంచైనా అలాంటి వాటికి దూరంగా ఉండమని జాగ్రత్తలు చెప్పాడు. తండ్రి కష్టపడి సంపాదించిన డబ్బు హారతి కర్పూరంలా కరిగిపోవడంతో ప్రసాద్‌కు కూడా బాధేసింది. తాను చేసిన తప్పులకు లోలోన తిట్టుకుంటూ పోయిన డబ్బును ఎలాగైనా సంపాదించాలని నిర్ణయించుకుంటాడు. అప్పటి నుంచి ఓ పది కంపెనీల షేర్లపై దృష్టి పెట్టడం ప్రారంభించాడు. ప్రతి రోజూ వాటినే గమనించేవాడు. ఆ కంపెనీల ఆర్థిక పరిస్థితిని, వాటిపై వచ్చే వార్తలను ఎప్పటికప్పుడు పరిశీలించేవాడు. ఓ పుస్తకం పెట్టుకొని ప్రతి విషయమూ రాసుకునేవాడు. ఏం చేస్తే లాభాలు వస్తాయో.. నష్టాల నుంచి ఎలా తప్పించుకోవాలో వ్యూహాలూ ఆలోచించేవాడు. అలా చాలానే హోంవర్క్ చేసి కొంత పట్టు సాధించాడు. అప్పటినుంచి ఏ షేర్లయితే పెరగడానికి ఆస్కారం ఉందో వాటిపైనే గురి పెట్టాడు. అప్పుడప్పుడు ఆ షేర్ల ధరలు పడిపోతున్నా.. పెద్దగా పట్టించుకోకుండా.. ఆయా కంపెనీల ఫండమెంటల్స్‌ను ఎప్పటికప్పుడు మదిస్తూ ముందడుగు వేశాడు. ఫలితంగా స్వల్ప వ్యవధిలోనే తాను పోగొట్టుకున్న డబ్బుల్ని సంపాదించడమే కాదు.. అధిక లాభాలనూ కళ్లజూశాడు.

నీతి

జీవితాన్నైనా.. స్టాక్ మార్కెట్‌నైనా ఆషామాషీగా తీసుకోకుండా కష్టపడితేనే ప్రతిఫలం దక్కుతుంది. ఏ పని మొదలుపెట్టినా అవాంతరాలు రావడం సర్వసాధారణం. వాటిని ఎదుర్కొని ముందుకెళ్తేనే విజేత అవుతారు. స్టాక్ మార్కెట్లో కూడా నష్టాలు పలకరించొచ్చు. అయితే ఎక్కడ వస్తున్నాయో.. ఏ తప్పులుచేస్తే వస్తున్నాయో.. గుర్తించడం ప్రధానం. తర్వాత ఆ మార్గంలో వెళ్లకుండా అనుభవాలనుంచి పాఠాలు నేర్చుకుంటూ ముందుకు సాగితే లక్ష్మీకటాక్షానికి అవకాశం ఉండొచ్చు. పైన మార్కెట్ కథలో ప్రసాద్ చేసింది అదే. సమయానుకూలంగా నిర్ణయాలు తీసుకుంటూ.. తాను పెట్టుబడులు పెడుతున్న కంపెనీల మూలాలను ఔపోసన పడుతూ ముందుకు సాగడం వల్ల లబ్ధి పొందగలిగాడు. లేదంటే మొదట్లో మాదిరి నష్టాలు మూటగట్టుకునేవాడే. మనవల్ల కాదనో.. మనకెందుకనో కష్టపడటం నుంచి పక్కకు తప్పుకోక.. పొరపాటు ఎక్కడ జరుగుతోందో గుర్తించి ముందడుగు వేస్తే మంచి ఫలితాలు పొందడం తథ్యం.

- ఈనాడు వాణిజ్య విభాగం

సిరి

ఈ రోజుల్లో అప్పు దొరకడం ఎంతో సులభం. అదే సమయంలో ఒక వ్యక్తి తాను తీసుకున్న రుణాలను సరిగ్గా చెల్లిస్తున్నారా లేదా అనే నిఘా కూడా పెరిగింది. కొత్త అప్పులు ఇచ్చేందుకూ.. రుసుములు రద్దు చేసేందుకూ.. వడ్డీలో కొంత రాయితీ కోసం.. ఇలా అనేక రకాలుగా క్రెడిట్ స్కోరు ప్రాధాన్యం పెరిగింది. రుణాల విషయంలోనే కాదు.. ఒక వ్యక్తి ఆర్థిక క్రమశిక్షణను పరిశీలించడానికీ ఇది ప్రామాణికంగా మారింది. ఉద్యోగాలు ఇచ్చేముందూ అభ్యర్థి రుణ చరిత్ర, క్రెడిట్ స్కోరును చూస్తున్నారు. అందుకే, కొత్తగా అప్పులు తీసుకున్న వారు తమ క్రెడిట్ స్కోరుపై దెబ్బపడకుండా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



స్కోరుంటేనే... అప్పు దొరికేను

కార్డులు.. కాస్త క్రమశిక్షణగా..

చేతిలో డబ్బులు లేకున్నా.. ఖర్చు చేసుకునే వెసులుబాటు కల్పిస్తాయి క్రెడిట్ కార్డులు. అయితే, వీటిని కాస్త క్రమశిక్షణగా వాడాల్సిందే. ముఖ్యంగా మొదటిసారి క్రెడిట్ కార్డులు వాడటం ప్రారంభించినప్పుడు అప్రమత్తంగా ఉండాల్సిందే. అప్పు తీసుకున్నప్పుడు దానిపై విధించే వడ్డీని రుణంలోనే కలిపి వాయిదాల పద్ధతిలో వసూలు చేస్తారు. క్రెడిట్ కార్డులపై అలాంటిది ఉండదు. మీరు సమయానికి బిల్లు చెల్లించకపోతేనే ఇక్కడ వడ్డీ అనే మాట వస్తుంది. అందుకే, తక్షణ అవసరానికి సంబంధించినంత వరకూ క్రెడిట్ కార్డులు చాలా ఉపయోగకరం. దీంతోపాటు క్రెడిట్ స్కోరు విషయంలోనూ ఇది కీలకం. ఇప్పటికీ మీకు క్రెడిట్ కార్డు లేకపోతే.. మీ ఖాతా ఉన్న బ్యాంకును సంప్రదించి, కార్డు తీసుకునే ప్రయత్నం చేయండి.

కొన్నిసార్లు ఆదాయం సరిపోయినంత లేకపోతే క్రెడిట్ కార్డులు ఇవ్వడానికి బ్యాంకులు ఇష్టపడవు. మీరుండే ప్రాంతం కూడా కార్డు ఇవ్వడానికి అవరోధం కావచ్చు. ఇలాంటప్పుడు కొత్తగా క్రెడిట్ కార్డు తీసుకోవాలనుకునే వారికి ఇబ్బందులు రావచ్చు. ఈ పరిస్థితుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను హామీగా చూపించి, క్రెడిట్ కార్డును తీసుకునే అవకాశం ఉంది. మీ ఎఫ్‌డీలో 90శాతం మేరకు పరిమితితో కార్డు లభిస్తుంది. నగదు తీసుకోవాలనుకుంటే.. మీ ఫిక్స్‌డ్ డిపాజిట్ మొత్తాన్ని పూర్తిగా తీసుకోవచ్చు. బ్యాంకు పూర్తి హామీతో ఈ కార్డులను జారీ చేస్తుంది కాబట్టి, మీ ఆదాయం, ప్రాంతం తదితర అంశాలతో పెద్దగా అవసరం ఉండదు. క్రెడిట్ స్కోరు తక్కువగా ఉన్నవాళ్లు కూడా ఇలాంటి అవకాశాలను పరిశీలించవచ్చు.

మీ అవసరానికి ఏ కార్డు సరిపోతుందో చూసుకోవడానికి ఆన్‌లైన్‌లో అనేక వెబ్‌సైట్లు ఉన్నాయి. వీటి ద్వారా వివిధ కార్డులను పోల్చి చూసుకోవడంతోపాటు, మీకు సరిగ్గా సరిపోయే క్రెడిట్ కార్డును ఎంచుకోవచ్చు.

అప్పుడప్పుడూ చూడండి..

కొన్నిసార్లు క్రెడిట్ నివేదికలో తప్పులు దొర్లే అవకాశం ఉంది. మీ వివరాలను నమోదు చేసేప్పుడు బ్యాంకు లేదా క్రెడిట్ బ్యూరో సంస్థల దగ్గర జరిగే పొరపాట్లు మీకు నష్టం చేకూరుస్తాయి. ఇతరుల అప్పులు మీ పేరమీదకు వచ్చి చేరవచ్చు. మీకు అవసరమై అప్పు చేయాలని అనుకుంటే.. అప్పటికే మీ రుణ నివేదికలో మీకు తెలియకుండానే ఉన్న ఒక భారీ అప్పు అందుకు అవరోధంగా మారవచ్చు. ఇలాంటి ఆశ్చర్యకరమైన సంఘటనలు ఎదురుకాకుండా ఎప్పుడూ జాగ్రత్తగా ఉండాలి. రుణ నివేదికలో తప్పుగా చేరిన రుణాల వల్ల మన ప్రమేయం లేకుండానే క్రెడిట్ స్కోరు దెబ్బతింటుంది. కొత్త రుణాలు తీసుకునేందుకు ఇబ్బందులు వస్తాయి. తరచూ క్రెడిట్ స్కోరు, రుణ చరిత్ర నివేదికలను తనిఖీ చేసుకోవడం ద్వారా పొరపాట్లు జరిగితే వెంటనే సరిదిద్దుకునేందుకు వీలవుతుంది.

30-40శాతానికి మించకుండా..

క్రెడిట్ కార్డును ఎంత పరిమితి మేరకు వాడుతున్నారనేదీ కీలకమైన విషయమే. మీ మొత్తం క్రెడిట్ కార్డు పరిమితి రూ. 50,000లు ఉందనుకుందాం. ఇందులో నుంచి మీరు రూ. 20,000లు ఖర్చు చేశారనుకుందాం. అప్పుడు మీ రుణ పరిమితి వినియోగం 40శాతం అన్నమాట. అధిక మొత్తం వినియోగిస్తే.. మీరు అప్పు కోసం ఆరాటపడుతున్నారని బ్యాంకులు అర్థం చేసుకుంటాయి. ఇలాంటి వారికి కొత్తగా రుణాలు ఇవ్వడానికైనా.. క్రెడిట్ కార్డులు ఇచ్చేందుకూ బ్యాంకులు కాస్త సందేహిస్తుంటాయి. కాబట్టి, క్రెడిట్ కార్డును వినియోగించేప్పుడు పరిమితిలో 30-40శాతానికి మించి వాడకుండా చూసుకోండి. ఒకవేళ మీరు తరచూ ఈ పరిమితిని దాటేస్తూ ఉంటే.. మీ బ్యాంకును సంప్రదించి, కార్డు పరిమితి మొత్తాన్ని పెంచాల్సిందిగా కోరండి. పరిమితి పెరిగితే.. రుణ వినియోగ నిష్పత్తి తగ్గుతుంది.

ఆలస్యం చేయొద్దు..

రుణ వాయిదాలు, క్రెడిట్ కార్డు బిల్లులను సకాలంలో చెల్లించడం ఆర్థిక క్రమశిక్షణను సూచిస్తుంది. ఈ చెల్లింపుల్లో ఆలస్యం చేస్తే రుణ చరిత్ర నివేదికలో ఆ విషయం నమోదవుతుంది. క్రెడిట్ స్కోరు నిర్మాణంలో ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తుంది కూడా. ఇలాంటి పరిస్థితులు ఎదురవకుండా.. రుణ వాయిదాలను, క్రెడిట్ కార్డు బిల్లును ఎప్పటికప్పుడు, పూర్తిగా చెల్లించేయాలి. క్రెడిట్ స్కోరు 750 పాయింట్లకు మించి ఉన్నప్పుడే కొత్త రుణాలు సులువుగా అందుతాయి. ఒకవేళ బిల్లు చెల్లింపు తేదీలను మర్చిపోతామనుకుంటే.. బ్యాంకు ఖాతాలో స్టాండింగ్ ఇన్‌స్ట్రక్షన్ ఇవ్వడం ద్వారా నేరుగా ఖాతాల నుంచే ఆ బిల్లులను చెల్లించేయండి.

అవసరం లేకుంటే అడగకండి

కొంతమంది అవసరం లేకపోయినా.. తరచూ రుణాల కోసం దరఖాస్తు చేస్తుంటారు. ఇది ఎప్పుడూ సరైన విధానం కాదు. మీకు నిజంగా రుణం తీసుకునే ఉద్దేశం ఉన్నప్పుడే.. దాని గురించి ఆరా తీయండి. మీరు రుణం కోసం అడిగినప్పుడల్లా.. రుణ సంస్థలు ఆ విషయాన్ని క్రెడిట్ బ్యూరోలకు చేరవేస్తుంటాయి. మీకు వాస్తవంగా రుణం, కార్డు అవసరం ఉన్నప్పుడు మీరు పదేపదే అడిగిన విషయాన్ని గుర్తించి, బ్యాంకులు మీకు రుణం ఇవ్వడానికి సందేహించవచ్చు. కాబట్టి, భవిష్యత్తులో మీకు రుణం, కార్డు అవసరం ఉంటే.. ఎలాంటి విచారణలూ చేయకండి. ముఖ్యంగా వెంటవెంటనే అడగకండి. ఒకవేళ మీకు ఎంత రుణం వస్తుంది అనే అంశాన్ని తెలుసుకోవాలని భావిస్తే.. ఆన్‌లైన్‌లో విచారించవచ్చు. ఇలా వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించినప్పుడు.. సాధారణ విచారణగా పరిగణించి, క్రెడిట్ నివేదికలో నమోదు చేయరు.

- రాధికా బినాని, చీఫ్ ప్రొడక్ట్స్ ఆఫీసర్, www.Paisabazaar.com

'నాకు ఏమీ అవదు' ఇలా చెప్పడం చాలా సులువే. కానీ.. వాస్తవంలో ఇది అసాధ్యమే. ఎప్పుడు ఏం జరిగినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండటమే మనం చేయాల్సిన పని. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు ఎన్నో కుటుంబాలను రోడ్డుమీద పడేస్తుంటాయి. అలాంటి పరిస్థితులు ఎదురవ్వకూడదనే ఇటీవల వాహన బీమాతోపాటు తప్పనిసరి వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీలు తీసుకొచ్చారు. దీని అవసరం ఏమిటి? భారం అనుకోకుండా ఎందుకు తీసుకోవాలో చూద్దాం...

ప్రమాద బీమా భారం కాదు.. బాధ్యత

'గతంలో వ్యక్తిగత ప్రమాద బీమా కోసం రూ. 100 ఉండేది.. ఇప్పుడు రూ. 750 వసూలు చేస్తున్నారు.. అవసరమా?' ఇటీవల కాలంలో కొత్తగా వాహన బీమా తీసుకున్నవారూ, పాలసీని పునరుద్ధరించుకునే వారూ ఈ ప్రశ్నే వేస్తున్నారు. ఇది భారం కాదు.. మన కుటుంబం పట్ల మన బాధ్యత అనుకోవాలి.. రోడ్డు ప్రమాదంలాంటి హఠాత్పరిణామాలు కుటుంబాలను ఆర్థికంగా కుంగదీస్తాయి.. ఆర్జించే వ్యక్తి ఒక్కసారిగా దూరమైనా.. గాయాలతో ఆసుపత్రిపాలైనా.. ఎంత కష్టమన్నది మాటల్లో చెప్పలేం. ఇలాంటి కష్టాల నుంచి కాసింతైనా భరోసానిచ్చేది వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీ.

ప్రమాదం వల్ల మరణం లేదా వైకల్యం సంభవించినప్పుడు వ్యక్తిగత ప్రమాద బీమా ఉపయోగపడుతుంది. ప్రమాదం వల్ల పాక్షిక, శాశ్వత వైకల్యం రావచ్చు.. ఇది వ్యక్తి సంపాదన సామర్థ్యాన్ని దెబ్బతీస్తుంది. జీవిత బీమా ఉంటే పాలసీదారుడు మరణించినప్పుడు మాత్రమే పరిహారం ఇస్తుంది. వైద్య బీమా ఉన్నప్పుడు పాలసీదారుడు ఆసుపత్రిలో చేరి, చికిత్స చేయించుకుంటే ఆ ఖర్చును నిబంధనల మేరకు భరిస్తుంది.

వేటికి వర్తిస్తుంది?

ప్రమాదం అనేక రకాలుగా ఉంటుంది. తీవ్ర గాయాలు కావచ్చు.. చేతులు, కాళ్లు విరగవచ్చు. తీవ్ర పరిస్థితుల్లో మరణం సంభవించవచ్చు. ప్రమాద బీమా పాలసీ తీసుకున్నప్పుడు ప్రమాద తీవ్రతతో సంబంధం లేకుండా పరిహారం పొందే అవకాశం ఉంటుంది. తీవ్ర గాయాల నుంచి, కాలు, చేతి ఎముకలు విరగడంలాంటివి కూడా ఇందులో వస్తాయి. సైకిల్ మీద నుంచి పడి చేయికి దెబ్బతగిలినా.. ఫుట్‌బాల్ ఆడుతున్నప్పుడు కాలు ఎముక విరిగినా ఈ ప్రమాద బీమాలో పరిహారం లభిస్తుంది.

పాక్షిక, శాశ్వత వైకల్యాల విషయాన్ని పాలసీ తీసుకునేప్పుడు ఏమాత్రం విస్మరించకూడదు. పాలసీ తీసుకునేప్పుడు మరణించిన సందర్భంలోనే పరిహారం లభిస్తుందా? వైకల్యం వచ్చినప్పుడు కూడా పరిహారం ఇస్తారా అనే విషయాలను తప్పనిసరిగా చూసుకోండి.



వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీలో ఈ రెండూ కలిసి ఉంటాయి. పైగా ఈ పాలసీని తీసుకోవడం పెద్ద ఖర్చు కూడా కాదు. పాలసీ తీసుకున్న క్షణం నుంచి రక్షణ అమల్లోకి వస్తుంది. ఏడాదికోసారి పునరుద్ధరిస్తే సరిపోతుంది.

తప్పనిసరి...

రోడ్డు మీద తిరిగే ప్రతి వాహనానికీ పూర్తిస్థాయి లేదా కనీసం థర్డ్ పార్టీ బీమా అయినా ఉండాల్సిందే. వీటితోపాటు ఇప్పుడు వాహనదారులకు వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీ కూడా ఉండాల్సిందే. బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏ) తీసుకొచ్చిన తప్పనిసరి వ్యక్తిగత ప్రమాద పాలసీ చాలామందికి ఆర్థికంగా ఓ పెద్ద భరోసా అనడంలో సందేహం లేదు. వాహనాన్ని సొంతంగా నడిపే యజమానికి తప్పనిసరిగా ప్రమాద బీమా (సీపీఏ) ఉండాలని నిబంధన విధించింది. ఇది కచ్చితంగా రూ. 15 లక్షలు ఉండాలని సూచించింది. ద్విచక్రవాహనం అయినా.. కారు అయినా.. ఈ పాలసీ కోసం రూ. 750 చెల్లించాల్సి ఉంటుంది. ప్రమాదంలో మరణం లేదా శాశ్వత వైకల్యం సంభవించినప్పుడు పరిహారం లభిస్తుంది.

ఇది తప్పనిసరి అయినప్పటికీ.. కొన్ని మినహాయింపులూ ఉన్నాయి. ఒక వ్యక్తికి ఒకటికి మించి వాహనాలు ఉన్నప్పుడు ఒక పాలసీ తీసుకుంటే చాలు. గతంలో వాహన బీమా తీసుకుంటే వ్యక్తిగత ప్రమాద బీమా కూడా తీసుకోవాలనే నియమం ఉండేది. దీన్ని ఐఆర్‌డీఏ తొలగించింది. అంతేకాదు.. ఒక వ్యక్తి సాధారణ బీమా సంస్థ నుంచి రూ. 15లక్షలకు సరిసమానమైన వ్యక్తిగత ప్రమాద బీమా తీసుకున్నప్పుడూ.. వాహన బీమాతో పాటు సీపీఏ అవసరం లేదు.

- శశి కుమార్ అదిదాము, సీటీఓ, బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్.

వచ్చే రాబడి సరిపోతుందా?

ఎప్పటికప్పుడు ధరలు పెరుగుతూనే ఉంటాయి. ఆర్థిక శాస్త్రం భాషలో చెప్పాలంటే దీన్నే ద్రవ్యోల్బణం అంటారు. మనకు వచ్చే ఆదాయంలో కొంత పొదుపు, పెట్టుబడి తప్పనిసరి. పెరుగుతున్న ఖర్చులను తట్టుకునే శక్తి రావాలంటే.. వాటిని సరైన చోట మదుపు చేయాల్సిందే. సాధారణంగా ఈ ద్రవ్యోల్బణం సందర్భాలను బట్టి మారుతుంటుంది. ఉదాహరణకు ఆరోగ్య ఖర్చులు ఏటా 10-12 శాతం పెరుగుతుంటాయి. పిల్లల చదువుల ఖర్చులు 15శాతం అధికమవుతుంటాయి. కానీ.. సగటున ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోనికి తీసుకుంటే.. 7-8శాతం వరకూ ఉంటుందని ఒక అంచనా. మరి, మన పెట్టుబడులు ద్రవ్యోల్బణానికి మించి కనీసం 2 శాతమైనా అధిక రాబడిని ఆర్జించాలి. అప్పుడే మనకు ఆర్థిక ఇబ్బందులు ఉండవు. సాధారణంగా ఎంపిక చేసుకునే పెట్టుబడి పథకాలు.. వాటి రాబడి శాతాలు.. ద్రవ్యోల్బణంతో పోలిస్తే అందే ఫలితాలు ఎలా ఉంటయానేది ఓ కన్నేద్దాం!

పథకం	రాబడి %	లాభనష్టాలు
బీరువాలో నగదు	0	డబ్బుకు ఏ మాత్రం విలువ పెరగదు. పైగా రోజులు గడుస్తున్న కొద్దీ క్షీణిస్తుంది. చివరకు విలువ సున్నా అవుతుంది.
పొదుపు ఖాతాలో నిల్వ	4	అవసరానికి మించి పొదుపు ఖాతాలో డబ్బు ఉంచడం వల్ల లాభం ఉండదు. డబ్బు కొనుగోలు శక్తి వేగంగా క్షీణిస్తుంది
ఫిక్స్‌డ్ డిపాజిట్లు	5.25–8	నష్టభయం ఉండదు. కచ్చితమైన రాబడి హామీ. వచ్చిన వడ్డీని ఆదాయంలో కలిపి చూపించి, పన్ను చెల్లించాల్సి ఉంటుంది. 30 శాతం పన్ను శ్లాబులో ఉన్నవారికి వీటివల్ల పెద్దగా రాబడి ఉండదు.
సంప్రదాయ బీమా పాలసీలు	6–7	చూడ్డానికి ఆకర్షణీయంగానే అనిపిస్తుంటాయి. కానీ, భవిష్యత్తులో ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కొనే శక్తిని ఇవ్వవు.
బంగారం	6–7	పసిడికి ద్రవ్యోల్బణానికి తట్టుకునే పెట్టుబడి పథకంగా పేరు. అయితే, గత మూడు నాలుగేళ్లుగా ఇందులో ఆశించిన ఫలితం అందడం లేదు
ప్రజా భవిష్య నిధి (పీపీఎఫ్)	8	పెట్టిన పెట్టుబడికి సెక్షన్ 80సీ నిబంధనల మేరకు పన్ను మినహాయింపు వర్తిస్తుంది. వచ్చిన వడ్డీకి కూడా పన్ను ఉండదు. దీర్ఘకాలిక పెట్టుబడి. ద్రవ్యోల్బణాన్ని కొంత మేరకు తట్టుకునే శక్తినిస్తుంది.
యూనిట్ ఆధారిత బీమా పాలసీలు (యులిప్)	8–12	పెట్టుబడి కోసం ఎంచుకున్న పథకాలను బట్టి, వచ్చే రాబడి ఆధారపడి ఉంటుంది. రుసుములు భరించాల్సి రావడం ప్రతికూలం. దీర్ఘకాలంలో కాస్త మంచి ఫలితాలనే ఇస్తాయి.
బ్యాలెన్స్‌డ్ ఫండ్లు	10–12	కాస్త నష్టభయం ఉన్నప్పటికీ.. దీర్ఘకాలిక లక్ష్యంతో మదుపు చేయడం మంచిది. ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కొనే శక్తినిస్తాయి.
ఈక్విటీ ఫండ్లు	12–15	నష్టభయం ఎక్కువే. కానీ, దీర్ఘకాలంపాటు పెట్టుబడిని కొనసాగించినప్పుడు సగటు రాబడి అధికంగా ఉండే అవకాశం ఉంది. వివిధ ఆర్థిక లక్ష్యాల సాధన కోసం, ద్రవ్యోల్బణాన్ని అధిగమించే రాబడినిచ్చే పెట్టుబడిగా దీన్ని చెప్పుకోవచ్చు.

(పెట్టుబడి పథకాలపై అవగాహన కోసమే. అవసరం, నష్టభయం భరించే శక్తిని బట్టి, పెట్టుబడి పథకాలను ఎంచుకోవాలి.)

పింఛను ఇచ్చే పాలసీ...

కొత్త పథకం

ఒకసారి ప్రీమియం చెల్లిస్తే.. జీవితాంతం వరకూ పింఛను ఇచ్చే పాలసీని టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ అందుబాటులోకి తెచ్చింది. దీనిపేరు టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ స్మార్ట్ యాన్యుటీ ప్లాన్. 45 ఏళ్ల వయసు నిండిన వారు ఎవరైనా ఈ పాలసీని ఎంచుకోవచ్చు. కనీస పెట్టుబడి రూ. 47,962. ఇందులో మూడు రకాల ఐచ్ఛికాలున్నాయి. వెంటనే పింఛను పొందడం, ఇప్పుడు పెట్టుబడి పెట్టి, నిర్ణీత కాలం పూర్తయ్యాక పింఛను వచ్చేలా ఏర్పాటు చేసుకోవచ్చు. జీవితాంతం పింఛను ఇచ్చి, తదనంతరం పెట్టుబడిని నామినీలకు ఇచ్చే ఏర్పాటు చేసుకోవచ్చు. మీరు ఎంచుకున్న ఐచ్ఛికాన్ని బట్టి, యాన్యుటీ ఎంతన్నది నిర్ణయిస్తారు. జీవిత భాగస్వామికి పింఛను వచ్చేలా కూడా దీన్ని తీసుకోవచ్చు.

రూ. 50వేలు మదుపు చేస్తే..

మార్గదర్శి



» పిల్లల ఉన్నత చదువుల అవసరాల కోసం ఉపయోగపడేలా నెలకు రూ.6,000 మదుపు చేయాలనుకుంటున్నాను. పీపీఎఫ్‌లో మదుపు చేస్తే.. 15 ఏళ్ల వరకూ వెనక్కి ఇవ్వరు కదా.. ఇది మంచి ఆలోచనేనా? నాకు నష్టభయం ఉండే పథకాల్లో పెట్టుబడి పెట్టడం ఇష్టం లేదు. సురక్షితంగా ఉండేలా ఇతర పథకాలేమైనా ఉన్నాయా? - ప్రశాంత్

మీ పిల్లల గురించి పెట్టుబడులు పెట్టేప్పుడు.. విద్యా ద్రవ్యోల్బణాన్ని మించి రాబడి వచ్చేలా చూసుకోవాలి. ప్రస్తుతానికి ప్రజా భవిష్య నిధి (పీపీఎఫ్)లో 8శాతం వడ్డీ లభిస్తోంది. మొత్తం పెట్టుబడిని దీనికే కేటాయించడం ద్వారా విద్యా ద్రవ్యోల్బణాన్ని తట్టుకోవడానికి వీలవదు. అధిక రాబడి రావాలంటే.. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేసుకోవడం ఒక మార్గం. వీటిల్లో కాస్త నష్టభయం ఉన్నా.. అధిక రాబడి వచ్చేందుకు అవకాశం ఉంది. రూ. 3,000 పీపీఎఫ్‌లో కొనసాగిస్తూ.. మిగిలిన రూ. 3,000లను ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో సిప్ చేయండి. ఈ విధంగా చేస్తే.. సగటున 11శాతం వార్షిక రాబడి వచ్చే వీలుంది. దీనికోసం మీరు ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఈక్విటీ ఫండ్, యాక్సిస్ బ్లూ చిప్ ఫండ్లను పరిశీలించవచ్చు.

» నేను ఒకేసారి రూ.50,000 మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టాలనే ఆలోచనతో ఉన్నాను. ఈ డబ్బుతో నాకు పెద్దగా అవసరాలేమీ లేవు. ఎంతకాలమైనా ఉంచగలను. ఇలా పెట్టుబడి పెట్టడానికి వీలుందా? ఏ పథకాలు ఎంచుకోవాలి? 15 ఏళ్లకు ఎంత అయ్యే అవకాశం ఉంది? - జోష్ణ

మీకు 15 ఏళ్ల వ్యవధి ఉంది కాబట్టి, నిరంభ్యంతరంగా మ్యూచువల్ ఫండ్లను ఎంచుకోవచ్చు. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో 13శాతం వరకూ రాబడి రావచ్చు. రూ. 50,000 పదిహేనేళ్లపాటు మదుపు చేస్తే సగటున 13శాతం వార్షిక రాబడితో.. రూ. 3,12,713 అయ్యే వీలుంది. దీనికోసం మీరు మిరే అసెట్ ఇండియా ఈక్విటీ ఫండ్, ఫ్రాంక్లిన్ ఇండియా ఈక్విటీ ఫండ్లను పరిశీలించవచ్చు.

» నేను ఐదు నెలల క్రితం యూనిట్ ఆధారిత బీమా పాలసీ (యులిప్) తీసుకున్నాను. రూ.50వేలు ప్రీమియం చెల్లించాను. ఇప్పుడు చూస్తే దాని విలువ రూ.39వేలే ఉంది. వచ్చే ఏడాది ప్రీమియం చెల్లించాలా? ఇప్పటికే ఆపేయాలా? నేను చెల్లించిన డబ్బులో ఏదైనా వెనక్కి వస్తుందా? ఇప్పటికే నేను రూ.50లక్షల టర్మ్ ప్లాన్ తీసుకున్నాను. సలహా ఇవ్వండి. - సుష్మ

మీరు యూనిట్ ఆధారిత బీమా పాలసీ (యులిప్) తీసుకున్నప్పుడు అందులో రకరకాల రుసుములు, ప్రీమియంపై జీఎస్‌టీలాంటివి ఉంటాయి. దాదాపు సంవత్సరం నుంచి స్టాక్ మార్కెట్‌లో నష్టాలే వచ్చాయి. రుసుములు, మార్కెట్ తగ్గడం తదితర కారణాలతో మీరు చెల్లించిన మొత్తం కన్నా తక్కువ కనిపిస్తోంది. దీన్ని ఇప్పుడు ఆపేయండి. అప్పుడు మీ పాలసీలో మొత్తం నుంచి కొంత రుసుములు మినహాయించుకొని, రద్దయిన పాలసీల ఖాతాల్లోకి ఆ డబ్బును మళ్లిస్తారు. దీనిపై నామమాత్రపు వడ్డీ వస్తుంది. పాలసీ తీసుకొని, ఐదేళ్లు గడిచిన తర్వాత ఈ మొత్తాన్ని వెనక్కి ఇస్తారు. మీ వార్షికాదాయాన్ని పరిగణనలోకి తీసుకొని, బీమా మొత్తాన్ని పెంచుకోండి. మీరు చెల్లించకుండా ఆపేసిన ప్రీమియాన్ని మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేసేందుకు ప్రయత్నించండి.

- తుమ్మ బాల్‌రాజ్, సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్



విద్యార్థి నాడి పడదాం

- కళాశాలలు, విశ్వవిద్యాలయాల విద్యార్థులపై పార్టీల దృష్టి
- వారితో ముచ్చటించేందుకు అగ్రనేతల ఆసక్తి
- తమ విధానాలు వివరించడం ద్వారా ఆకట్టుకునే యత్నాలు
- రాష్ట్రంలో ఓటుహక్కు అర్హత కలిగిన విద్యార్థులు 30 లక్షల మంది

తెదేపా టీఎన్ఎస్ఎఫ్

మరోపక్క తెదేపా అనుబంధ విద్యార్థి విభాగం టీఎన్ఎస్ఎఫ్... విద్యార్థుల్ని తమ పార్టీవైపు ఆకర్షించే ప్రయత్నాలు చేస్తోంది. ప్రతి శాసన సభ నియోజకవర్గం నుంచి 20 మంది విద్యార్థి నాయకుల్ని ఎంపిక చేసి శిక్షణనిస్తోంది.

రాష్ట్రంలో త్వరలో శాసనసభతో పాటు లోక్‌సభ ఎన్నికల జరగనున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలన్నీ తమ ఓటు బ్యాంకును పెంచుకునేందుకు వివిధరకాలుగా కృషి చేస్తున్నాయి. ఈ క్రమంలో కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులను వచ్చే ఎన్నికల్లో కీలకమైన ఓటర్లుగా రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు పరిగణిస్తున్నాయి. ఈ నవతరం ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. తమ పార్టీ పట్ల విద్యార్థుల్లో సానుకూల దృక్పథం నెలకొనేలా తెదేపా, వైకాపా, జనసేన పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయి. తెదేపా జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు, వైకాపా అధ్యక్షుడు జగన్, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నేరుగా విద్యార్థుల వద్దకే వెళ్లి వారితో ముచ్చటిస్తున్నారు. వివిధ రూపాల్లో సాగుతున్న ఆయా పార్టీల అధినేతల జిల్లా పర్యటనల్లో.. విద్యార్థులను కలవడం ఒక ప్రాధాన్యాంశంగా ఉంటోంది. ఇంజినీరింగ్, మెడిసిన్, డిగ్రీ కోర్సులు, పీజీ కోర్సులు చదువుతున్న విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని వీరు సమావేశాలు నిర్వహిస్తున్నారు. జిల్లాల వారీగా ప్రభుత్వం నిర్వహిస్తున్న జ్ఞానభేరి, వైకాపా నిర్వహించిన యువభేరి కార్యక్రమాలు, జనసేన కాలేజీల్లో విద్యార్థులతో నిర్వహిస్తున్న సమావేశాలు ఈ కోవలోనివే.

విద్యార్థులపైనే చూపు ఎందుకు?

- సాధారణంగా ఇంటర్మీడియెట్ పూర్తిచేసుకునేసరికి విద్యార్థులకు ఓటు హక్కు లభిస్తుంది. * విద్యార్థులు ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకునేలా ప్రోత్సహించేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో... కొత్త ఓటర్లు ఎక్కువగా పెరుగుతున్నారు.
- రాష్ట్రంలో ఏటా ఆరు లక్షల మంది విద్యార్థులు ఇంటర్మీడియెట్ పూర్తి చేసుకుంటున్నారు. వీరిలో ఐదు లక్షల మంది రాష్ట్రంలో చదువుతున్నారనుకున్నా... రాష్ట్రంలోని వివిధ డిగ్రీ, వృత్తివిద్యా కోర్సులు, పీజీ కోర్సులు చదువుతున్నవారి సంఖ్య సుమారు 25-30 లక్షల వరకు ఉంటుంది.
- విద్యార్థులంతా నవతరం కాబట్టి... ఏదో ఒక ప్రభావానికిలోనై ఓట్లు వేసేవారు తక్కువగా ఉంటారన్న భావన ఉంది. ఎక్కువ మంది స్వతంత్రంగా ఆలోచించి ఓటు వేసేందుకు అవకాశముంది.
- విద్యార్థులతో రాజకీయాల గురించి మాట్లాడకుండా... వారితో ఉపాధి, ఉద్యోగావకాశాలు వంటి ఇతర అంశాల్ని చర్చించడం ద్వారా ఆకట్టుకునేందుకు పార్టీలు ప్రయత్నిస్తున్నాయి.

జ్ఞానభేరి ద్వారా ఇలా

- రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జ్ఞానభేరి పూర్తిగా ప్రభుత్వ కార్యక్రమం.
- ప్రపంచంలో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో, ఉద్యోగాల్లో వేగంగా చోటు చేసుకుంటున్న మార్పుల గురించి విద్యార్థుల్లో అవగాహన కల్పించడం, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా వారిని సంసిద్ధం చేయడం, వారిలో స్ఫూర్తిని, పోటీతత్వాన్ని నింపడం, పరిశోధనల పట్ల ఆసక్తి రేకెత్తించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.
- జ్ఞానభేరిలో రాజకీయాల ప్రస్తావన ఎక్కడా ఉండకపోయినా... అంతర్లీనంగా విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల్ని వివరించి, వారిని ఆకట్టుకోవడమే ప్రధాన లక్ష్యం.

వైకాపా యువభేరి

- ప్రధాన ప్రతిపక్షం వైకాపా యువభేరి పేరుతో కొన్ని కార్యక్రమాలు నిర్వహించింది.
- జగన్ పాదయాత్ర మొదలవకముందు రాష్ట్రంలో 3-4 చోట్ల ఈ కార్యక్రమాలు జరిగాయి.
- వైకాపా కూడా రాజకీయాల్ని ప్రస్తావించకుండా.. . రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిన అవసరం, రాకపోతే జరిగే నష్టాల్ని విద్యార్థులకు వివరించి, వారిలో అవగాహన కల్పించడం లక్ష్యంగా యువభేరి నిర్వహిస్తున్నట్లు చెప్పింది.
- జగన్ పాదయాత్రలో కూడా ఒకటి రెండు చోట్ల విద్యార్థులతో ప్రత్యేకంగా ముచ్చటించారు.
- ఆ పార్టీ విద్యార్థి విభాగం రాజకీయ కార్యకలాపాల ద్వారా విద్యార్థులను ఆకర్షించే ప్రయత్నం చేస్తోంది.

జనసేన ఇలా

- జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్... తన జిల్లా పర్యటనల్లో భాగంగా భీమవరం, రాజమహేంద్రవరం, అమలాపురం, జంగారెడ్డిగూడెం, ఏలూరు వంటి చోట్ల విద్యార్థులతో సమావేశాలు నిర్వహించారు.
- యువతకు ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి, రాష్ట్ర అభివృద్ధిలో యువత పాత్ర, తమ పార్టీ అధికారంలోకి వస్తే యువతకు ఏం చేస్తుంది? అన్న అంశాలపై ఆయన మాట్లాడుతున్నారు.
- భగత్‌సింగ్ పేరుతో ఏర్పాటు చేసిన ఆ పార్టీ విద్యార్థి విభాగం వీటిని సమన్వయం చేస్తోంది.

– ఈనాడు, అమరావతి



దిల్లీలో ద్వారకా తిరుమలేశుని కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

నేత్రపర్వం.. వేంకటేశ్వరుడి కల్యాణం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: దేశ రాజధానిలోని తితిదే ఆలయం (ధ్యానమందిర్)లో.. పశ్చిమగోదావరి జిల్లా ద్వారకాతిరుమల దేవస్థానం ఆధ్వర్యాన శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. తొలుత పచ్చిపూలతో సర్వాంగసుందరంగా అలంకరించిన మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వధూవరులుగా కొలువుదీర్చి హారతులు ఇచ్చారు. అనంతరం ప్రధాన అర్చకుడు పెద్దింటి రాంబాబు నేతృత్వంలో అర్చకుల బృందం మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ కల్యాణ క్రతువును నిర్వహించారు. ద్వారకాతిరుమల దేవస్థానం ఛైర్మన్ తరపున ఆయన కుమారుడు నివృతరావు, ఈవో దంతులూరు పెద్దిరాజులు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు.

జగన్‌ను అడ్డంపెట్టుకొని కేంద్రం కుట్ర

- కోడికత్తి కేసు ఎన్ఐఏకు ఎలా అప్పగిస్తారు: యనమల

బిక్కవోలు, న్యూస్‌టుడే: జగన్‌ను అడ్డంపెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లడానికి కేంద్రం ప్రయత్నిస్తోందని మంత్రి యనమల రామకృష్ణుడు ఆరోపించారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం బలభద్రపురంలో శనివారం నిర్వహించిన విలేకరులతో మాట్లాడారు. కోడికత్తి కేసును ఎన్ఐఏకు కేంద్రం ఎలా అప్పగించిందని ప్రశ్నించారు? శాంతిభద్రతలకు విఘాతం కలిగినా, జాతీయ భద్రతకు సంబంధించిన విషయాల్లో మాత్రమే ఎన్ఐఏకు బదిలీ చేస్తారని, కోడికత్తి కేసు అలాంటిది కాదని అభిప్రాయపడ్డారు. జగన్‌పై 11 కేసుల్లో ఛార్జిషీట్ దాఖలు చేస్తే అందులో ఇప్పటి వరకు మూడు కేసులు విచారణకు వచ్చాయని పేర్కొన్నారు. మిగిలిన కేసుల్లో కేంద్రం తీవ్ర జాప్యం చేస్తోందని తెలిపారు. రాజకీయ నాయకులు, ఆర్థిక నేరగాళ్లపై ఎలాంటి కేసులున్నా వాటిని ఏడాది లోపు పరిష్కరించాలని సుప్రీంకోర్టు తీర్పిచ్చినా కేంద్రం దాన్ని కూడా పట్టించుకోవటం లేదని విమర్శించారు.

హత్యా రాజకీయాల చరిత్ర మీదే: మంత్రి ఆనంద్‌బాబు


ఈనాడు డిజిటల్, అమరావతి: హత్యా రాజకీయాల చరిత్ర భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ, ఆయన రహస్య స్నేహితులదేనని.. తెదేపా సంస్కృతి కాదని మంత్రి నక్కా ఆనంద్‌బాబు స్పష్టం చేశారు. రక్తపు టేరులు పారిన నేల మీద గలగలా నీళ్లు పారించి పచ్చని పంటలు పండేలా చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదని గుర్తుచేశారు. రహస్య మిత్రుల కోసం రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన తీసుకువచ్చేందుకు కన్నా ప్రయత్నిస్తున్నారని శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు.

ఏపీలో భాజపా నేతలకు రక్షణ కల్పించాలి: విష్ణు

హైదరాబాద్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు బెదిరించిన 24 గంటల్లోపే భాజపా రాష్ట్ర అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ ఇంటిపై దాడి చేశారని, కేంద్ర పథకాల అమలుపై తమ పార్టీ కార్పొరేటర్ ప్రసన్న ప్రశ్నిస్తే జైల్లో బంధించారని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ..కన్నా ఇంటిపై దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేసి భాజపా నేతలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

సీఎం దృష్టికి వివిధ సమస్యలు: సినీనటుడు శివాజీ

ఈనాడు, అమరావతి: చుక్కల భూముల సమస్యలపై సీఎం చంద్రబాబును కలిసి చర్చించినట్లు సినీ నటుడు శివాజీ చెప్పారు. అలాగే పట్టణాల్లో భూముల క్రమబద్ధీకరణ, రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన అంశాన్ని కూడా ఆయన దృష్టికి తీసుకెళ్లానన్నారు. అన్నింటినీ ఈ నెలలో పరిష్కరిస్తామని సీఎం చెప్పారన్నారు.



నీటిచుక్క లేక వెలవెలబోతున్న గండిపాళెం జలాశయం

అన్నదాత ఆశలు.. అడియాశలు

వర్షాలు ముఖం చాటేశాయి.. నీటిచుక్క లేక జలాశయాలు కళతప్పాయి. దీంతో వాటిమీదే ఆధారపడిన అన్నదాతల ఆశలూ అడియాశలయ్యాయి.. ఇదీ నెల్లూరు జిల్లాలోని పడమర ప్రాంతం రైతుల దీనస్థితి.. ఉదయగిరి మండలం మాసాయిపేట గ్రామానికి చెందిన రైతు వెంకటయ్య.. తనకున్న 4 ఎకరాల్లో రబీలో వరి సాగుచేసేందుకు ఎంతో ఆశతో నారు పోశారు.. వరుణుడి జాడ లేకపోవడంతో కళ్లెదుటే నారు ఎండిపోవడంతో తీవ్రంగా కలత చెందారు. ఈ క్రమంలో ఉబికివస్తున్న కన్నీటిని దిగమింగుకున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో.. పశువుల మేతకైనా ఉపయోగపడుతుందని భావించి నారు అంతటినీ కోశాడు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలోని ఉదయగిరి, వరికుంటపాడు మండలాలకు ప్రధాన సాగునీటి వనరు అయిన గండిపాళెం జలాశయం పూర్తిగా అడుగంటింది.. ఈ నేపథ్యంలో దాని ఆయకట్టు కింద సాగయ్యే 16 వేల ఎకరాలు ప్రస్తుతం బీడుగా మారాయి.

- ఈనాడు, నెల్లూరు..



ఎండిపోయిన వరినారును కోస్తున్న రైతు వెంకటయ్య

కొత్తవారికే 60శాతం టిక్కెట్లు

- ఎన్నికల ఖర్చు రూ.2000 కోట్లు కావాలంటున్నారు
- కాన్షీరాం స్ఫూర్తితో డబ్బు లేకుండానే గెలుస్తాం
- జనసేన అధినేత పవన్‌కల్యాణ్



ఈనాడు, అమరావతి: వచ్చే ఎన్నికల్లో 60 శాతం మంది కొత్త వారికే జనసేన టిక్కెట్లు ఇస్తుందని ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటించారు. 'ఈ ఎన్నికల్లో పోటీకి దిగాలంటే రూ.2000 కోట్లు కావాలని చాలామంది అంటున్నారు. ప్రస్తుత రాజకీయపక్షాలు ఇందుకు సిద్ధంగా ఉన్నాయనీ' చెబుతున్నారని పేర్కొంటూ.. కాన్షీరాంను ఆదర్శంగా తీసుకున్న జనసేన పార్టీ డబ్బు లేకుండానే ఎన్నికల్లో గెలుస్తుందన్నారు. గెలవడానికి డబ్బులు అవసరం లేదని రుజువు చేసిన మహానేత ఆయన. కారు టైర్లనే చెప్పులుగా చేసుకుని రాజకీయాల్లో తిరిగిన ఆయనే తనకు ఆదర్శమన్నారు. విజయవాడలో శనివారం చిత్తూరు, ప్రకాశం జిల్లా సమన్వయకర్తలు, కార్యకర్తలతో జరిగిన సమావేశాల్లో పవన్ వివిధ అంశాలపై మాట్లాడారు. ప్రజారాజ్యం పార్టీ అనుభవంతోనే తాను పార్టీ కమిటీలను నియమించలేదన్నారు. తెదేపా, వైకాపాలకు నిజమైన బూత్ కమిటీలు ఉన్నాయా అని ప్రశ్నించారు. కమ్యూనిస్టు పార్టీలు, భాజపా వంటి పార్టీలకు ఇప్పటికే కొంత మేర బూత్ స్థాయి కమిటీలున్నాయని, మరి వారు ఎందుకు గెలవడం లేదని పవన్ ప్రశ్నించారు. తన అభిమానులకు, తనకు అనుసంధానం ఉందని.. యువత, మహిళలు జనసేన పార్టీని ప్రజల్లోకి బాగా తీసుకువెళ్తున్నారని చెప్పారు. పార్టీని క్రమక్రమంగా విస్తరిద్దామని, ప్రస్తుతం పార్లమెంట్ స్థాయి కమిటీలు వేద్దామని అన్నారు. ఈ ఎన్నికలు మనకు మొదటి ఎన్నికలో, చివరి ఎన్నికలో కావని, ఇది ప్రారంభం మాత్రమేనని- భవిష్యత్తు జనసేనదేనన్నారు. మొదట్లో ఏ మాత్రం గుర్తించడానికి ఇష్టపడని తెదేపా, వైకాపాలు ఇప్పుడు జనసేన తమతో కలిసి వస్తోందని ప్రచారం చేసుకోవడమే తొలి విజయమని పవన్ పేర్కొన్నారు.

తెదేపా, భాజపా వర్గాల పిడిగుద్దులు

- గుంటూరులో కన్నా నివాసం వద్ద తెదేపా నేతల ధర్నా
- అడ్డుకున్న భాజపా కార్యకర్తలు
- వివాదం ముదరడంతో ఇరువర్గాల ఘర్షణ
- పోలీసుల రంగ ప్రవేశంతో సద్దుమణిగిన వ్యవహారం
- ధర్నాను ఖండించిన కన్నా



నగరంపాలెం ప్రధాన రహదారిపై వాగ్వాదం చేసుకుంటున్న తెదేపా, భాజపా కార్యకర్తలు



తెదేపా లీగల్‌సెల్ నాయకుడు వేదవ్యాస్‌పై పిడిగుద్దులు కురిపిస్తున్న భాజపా కార్యకర్తలు

ఈనాడు, గుంటూరు: తెదేపా, భాజపా కార్యకర్తల మధ్య మాటల యుద్ధం పెరిగి చివరకు ఘర్షణకు దారితీసింది. శనివారం ఉదయం గుంటూరులో నడిరోడ్డుపై ఇరుపార్టీల కార్యకర్తలు బాహాబాహీకి దిగి పిడిగుద్దులు గుద్దుకున్నారు. శుక్రవారం కాకినాడలో సీఎం కాన్వాయ్‌ను భాజపా కార్యకర్తలు అడ్డుకోవటాన్ని నిరసిస్తూ విజయవాడకు చెందిన తెదేపా లీగల్‌సెల్ విభాగం నాయకుడు ఎర్నేని వేదవ్యాస్ నేతృత్వంలో పలువురు కార్యకర్తలు శనివారం ఉదయం గుంటూరులోని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ నివాసం ముందు ఆందోళనకు దిగారు. ఇంట్లోనే ఉన్న కన్నా లక్ష్మీనారాయణ బయటకు వచ్చి ధర్నా చేయడం సరికాదన్నారు. 'మీకు ఏం కావాలో అడగండి చెబుతా' అంటూ ఆయన వారికి ఎదురుగా నివాసంలోనే మెట్లపై బైఠాయించారు. హోదా ఇవ్వకుండా రాష్ట్రంలోని భాజపా నాయకులు అడ్డుకుంటున్నారని నినాదాలు హోరెత్తిస్తుండగా.. కన్నా పైకి లేచి ఆందోళనకారులను ఇక్కడి నుంచి పంపించేయాలని పోలీసులను కోరారు. దీంతో పోలీసులు తెదేపా కార్యకర్తలకు నచ్చజెబుతుండగా 'సీఎంను మీ పార్టీ కార్యకర్తలు అయితే అడ్డుకోవచ్చా?' అని కన్నాను ప్రశ్నించారు. ఈ క్రమంలో కన్నా నివాసం వద్ద పెద్దసంఖ్యలో ఉన్న భాజపా నేతలు, కార్యకర్తలు చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేయటం ఇరు పార్టీల కార్యకర్తల మధ్య ఉద్రిక్తతకు దారితీసింది. అదే సమయంలో కన్నా తనయుడు, గుంటూరు నగర మాజీ మేయర్ నాగరాజు రావడంతో భాజపా కార్యకర్తలు అక్కడకు చేరుకుని తెదేపాకు, చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తెదేపా కార్యకర్తలపై విరుచుకుపడ్డారు. రోడ్డుపై పరిగెత్తించి కొట్టడంతో పోలీసులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని ఇరు పార్టీల కార్యకర్తలను చెదరగొట్టారు. భాజపా కార్యకర్తలు గట్టిగా ప్రతిఘటించటంతో తెదేపా కార్యకర్తలు విజయవాడ వెనుదిరిగారు. వీరు ధర్నాకు వస్తున్న విషయం స్థానిక తెదేపా నాయకులు, కార్యకర్తలకు తెలియదని చెబుతున్నారు. భాజపా కార్యకర్తల దాడి విషయమై తెదేపా వర్గాలు ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

ఖండించిన కన్నా..

తన ఇంటి ముందు తెదేపా కార్యకర్తలు ధర్నా చేయడాన్ని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ఖండించారు. తనను అంతమొందించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఘటన అనంతరం కన్నా తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. 'తెదేపా ప్రభుత్వం విపక్షాలు వినతులు ఇవ్వటానికి వస్తుంటే పోలీసులతో అడ్డుకుంటున్నారు. కనీసం సమస్యలు చెప్పుకునే పరిస్థితి లేకుండా పోయింది. కాకినాడలో పోలీసుల అనుమతి తీసుకుని తమ పార్టీ నాయకులు వినతిపత్రం ఇవ్వటానికి వెళితే వారిని అడ్డుకుని దుర్భాషలాడారు. ఒక మహిళా ప్రజాప్రతినిధి అని కూడా చూడకుండా సాక్షాత్తు ముఖ్యమంత్రి ఫినిష్ చేస్తామనడం ఎంతవరకు సమంజసం. ఇంతకు ముందు పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాను అడ్డుకున్నారు. రాష్ట్రంలో పాలనా వ్యవస్థలు దిగజారాయని. . జోక్యం చేసుకోవాలని కోరుతూ గవర్నర్‌కు వినతి పత్రం సమర్పిస్తాం' అని కన్నా స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి కాన్వాయ్‌ను అడ్డుకోవడాన్ని నిరసిస్తూ శనివారం సాయంత్రం గుంటూరు జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు ఈడే మురళీకృష్ణ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కన్నా లక్ష్మీనారాయణ నివాసం ముందు తెదేపా కార్యకర్తలు ధర్నా చేయటాన్ని నిరసిస్తూ భాజపా నేత కన్నా నాగరాజు ఆధ్వర్యంలో మార్కెట్ సెంటర్‌లో నిరసన తెలియజేశారు.

కన్నా లక్ష్మీనారాయణకు వినతిపత్రం ఇచ్చేందుకు ఆయన ఇంటికి వెళ్లిన తెదేపా న్యాయవిభాగం సభ్యులపై భాజపా గూండాలు దాడి చేశారని తెదేపా న్యాయ విభాగం రాష్ట్ర నాయకుడు ఎర్నేని వేదవ్యాస్ శనివారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు..

ఎన్ఐయేతో దర్యాప్తు రాజకీయ కుట్ర: కాలవ

రాయదుర్గం, న్యూస్‌టుడే: జగన్‌పై దాడి కేసును జాతీయ దర్యాప్తు సంస్థకు అప్పగించటం ఒక రాజకీయ కుట్ర అని మంత్రి కాలవ శ్రీనివాసులు విమర్శించారు. శనివారం అనంతపురం జిల్లా రాయదుర్గంలో మంత్రి విలేకరులతో మాట్లాడారు. దాడితో జగన్‌కు ఏపీలో సానుభూతి రావాలని, తద్వారా ఎన్నికల్లో లబ్ధి చేకూరాలనే ప్రణాళికతో దాడి ఘటన జరిగిందని మంత్రి వివరించారు. దాడి చేసిన నిందితుడు శ్రీనివాసరావు, అతని కుటుంబ సభ్యులు తాము జగన్ అభిమానులమని తెలిపారని, నిందితుడు పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో ఇదే విషయాన్ని తెలిపాడని పేర్కొన్నారు.

కోడికత్తి కేసు చంద్రబాబుపై నెట్టే పన్నాగం: లోకేశ్

పీలేరు, న్యూస్‌టుడే: కోడికత్తి కేసును ముఖ్యమంత్రి చంద్రబాబుపై నెట్టేందుకు కుట్ర జరుగుతోందని, ఇందులో భాగంగానే కేసును ఎన్ఐఏకు అప్పగిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని లోకేశ్ అన్నారు. శనివారం రాత్రి తిరుపతికి వెళ్తూ మార్గమధ్యలో లక్కిరెడ్డిపల్లిలో ఆగారు. అక్కడి స్థానిక నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. ప్రధాని మోదీ రాష్ట్ర ప్రభుత్వంపై కక్ష కట్టి చంద్రబాబుకు చెడ్డపేరు తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు.

ఎన్ఐయే విచారణ అంటే ఎందుకు భయం: రోజా

హైదరాబాద్, న్యూస్‌టుడే: జగన్‌పై హత్యాయత్నానికి పాల్పడి కుట్ర పన్నిన వారంతా ఈ కేసును ఎన్ఐఏకు బదలాయించడంతో వణికిపోతున్నారని వైకాపా ఎమ్మెల్యే రోజా అన్నారు. హైదరాబాద్‌లోని వైకాపా కేంద్ర కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రానికి సీబీఐ, ఈడీ, ఐటీ అధికారులు రావొద్దని చెప్పిన చంద్రబాబు తాజాగా ఎన్ఐఏ కూడా రావొద్దని అంటున్నారా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో వ్యవస్థలను నాశనం చేసి జగన్‌పై హత్యాయత్నం చేయించింది చంద్రబాబేనని ఆరోపించారు.

అప్పుల బాట పట్టిన హెచ్ఏఎల్

- వేతనాలు, ఇతర అవసరాల కోసం రూ.వెయ్యి కోట్లు సమీకరణ
- మార్చి 31 నాటికి రూ.6వేల కోట్లకు చేరనున్న లోటు

దిల్లీ: ప్రభుత్వ రంగ విమాన తయారీ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) ఆర్థికంగా గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది. 20 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా రూ.వెయ్యి కోట్ల అప్పు చేయాల్సి వచ్చింది. ఉద్యోగుల వేతనాల చెల్లింపు, తక్షణ ఖర్చుల కోసం సంస్థ యాజమాన్యం ఈ చర్యను చేపట్టింది.

"మా చేతిలో చిల్లి గవ్వలేదు. ఓవర్‌డ్రాఫ్ట్ కింద రూ.వెయ్యి కోట్లు తీసుకోవాల్సి వచ్చింది. ఈ ఏడాది మార్చి 31 నాటికి ఈ లోటు రూ.6వేల కోట్లకు చేరుకుంటుంది. ఇది భరించలేని భారం. రోజువారీ అవసరాల కోసం అప్పు చేయగలం కానీ ప్రాజెక్టు కొనుగోళ్ల కోసం అప్పు చేయలేం" అని హెచ్ఏఎల్ సీఎండీ ఆర్. మాధవన్ పేర్కొన్నారు. ఏడాదిన్నరగా సంస్థ పరిస్థితి దిగజారుతోందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఇప్పుడు తెచ్చుకున్న రూ.వెయ్యి కోట్ల సొమ్ము ఒకటి, రెండు నెలలకు మించి సరిపోదని చెప్పాయి. అప్పుడు మరోసారి అప్పు కోసం వెళ్లక తప్పదని వివరించాయి. తాజాగా తీసుకున్న రూ.వెయ్యి కోట్లలో రూ.358 కోట్లను వేతనాల చెల్లింపు కోసం, తక్షణం కొనుగోలు చేయాల్సిన కొన్ని సాధనాల కోసం వెచ్చించాల్సి ఉంటుందని తెలిపాయి. హెచ్ఏఎల్ చరిత్రలో ఇలాంటి దుస్థితి ఎన్నడూ లేదని వాపోయాయి. వేగంగా తరగిపోతున్న సంస్థ ఆర్థిక వనరుల గురించి 'ఉన్నతస్థాయి వ్యవస్థల' దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపాయి. అయినా ఆదుకునేందుకు ఏ చర్యలూ చేపట్టలేదని వివరించాయి.

హెచ్ఏఎల్ పరిస్థితి ఇలా కావడానికి ప్రధాన కారణం వైమానిక దళం నుంచి రావాల్సిన రూ.14,500 కోట్లు అందకపోవడమే. ఈ ఏడాది మార్చి 31 నాటికి సంస్థకు రావాల్సిన బకాయిలు రూ.20వేల కోట్లకు చేరే అవకాశం ఉంది. వైమానిక దళానికి తోడు తీరరక్షక దళం, నౌకాదళం, సైన్యం హెచ్ఏఎల్ వద్ద కొనుగోళ్లు చేస్తుంటాయి. ఇటు భారత వైమానిక దళ పరిస్థితి కూడా భిన్నంగా ఏమీ లేదు. డబ్బు కోసం కటకటలాడుతోంది. ఈ దళం తన అవసరాల కోసం గత ఏడాది రూ.1,14,526 కోట్లు అడిగిందని, కానీ బడ్జెట్‌లో రూ.65,891 కోట్లను మాత్రమే ప్రభుత్వం కేటాయించిందని రక్షణ వ్యవహారాల పార్లమెంటరీ స్థాయీ సంఘం పేర్కొంది.

పీఎస్‌యూల ఊపిరి తీస్తున్నారు: కాంగ్రెస్

ఇష్టులైన కొద్దిమంది కోసం హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్), ఓఎన్‌జీసీ వంటి ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)ల ఆస్తులను కేంద్రంలోని మోదీ సర్కారు దుర్వినియోగం చేస్తోందని కాంగ్రెస్ శనివారం ఆరోపించింది. వేతనాలు కూడా చెల్లించలేని స్థితిలో హెచ్ఏఎల్ రూ.వెయ్యి కోట్ల మేర అప్పు చేయాల్సి వచ్చిందని ఆ పార్టీ సీనియర్ నేత అహ్మద్ పటేల్ ట్విటర్‌లో పేర్కొన్నారు. "ఈ సంస్థ ఒక్కటే కాదు.. ఓఎన్‌జీసీ, ఎల్ఐసీ, హెచ్‌పీసీఎల్ తదితర ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తులను కేంద్రం దుర్వినియోగం చేస్తోంది" అని విమర్శించారు. మోదీ హయాంలో దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ రక్షణ సంస్థ అయిన హెచ్ఏఎల్‌లో వేతనాల చెల్లింపునకు డబ్బు లేదని కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధి రణదీప్ సుర్జేవాలా ఎద్దేవా చేశారు. అయినా ఆ సంస్థకు రఫేల్ యుద్ధవిమానాల కాంట్రాక్టును ఇవ్వకపోవడం విచారకరమన్నారు.

ఏపీ ఎంసెట్‌పై తొలగని ఉత్కంఠ

ఈనాడు, అమరావతి: తెలంగాణ ఎంసెట్ తేదీలను ప్రకటించిన నేపథ్యంలో ఏపీ ఎంసెట్ ఎప్పుడనే దానిపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఉత్కంఠ నెలకొంది. తెలంగాణలో మే మూడో తేదీ నుంచి ఇంజినీరింగ్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈసారి ఏపీలో ఇంతవరకు ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించేందుకు ఏజెన్సీ ఎంపికనే పూర్తికాలేదు. ఏపీ ఆన్‌లైన్, టీసీఎస్‌కు ఉమ్మడి ప్రవేశ పరీక్షల బాధ్యతలు అప్పగించాలని పేర్కొంటూ ఉన్నత విద్యామండలి ప్రభుత్వానికి దస్త్రం పంపింది. దీనిపై ఇంతవరకు ఎలాంటి నిర్ణయం వెల్లడించలేదు. గతేడాది ఏపీలో ఏప్రిల్ 22నుంచి 25వరకు ఎంసెట్ నిర్వహించారు. ఫిబ్రవరి 28 నుంచి దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు.

మే 3 నుంచి తెలంగాణ ఎంసెట్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ఎంసెట్‌ను మే 3 నుంచి నిర్వహించనున్నారు. గత ఏడాది తరహాలోనే ఈసారి కూడా మొత్తం పరీక్షలన్నీ మే నెలలోనే జరగనున్నాయి. గతేడాది మే 2 నుంచి ఎంసెట్ ప్రారంభం కాగా, ఈసారి ఒక రోజు ఆలస్యంగా మొదలవుతోంది. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య తుమ్మల పాపిరెడ్డి శనివారం ప్రవేశ పరీక్షల కాలపట్టికను విడుదల చేశారు.

ఆత్మీయ స్పర్శతో సగం జబ్బు నయం

- నాడి పట్టి ఆరోగ్య సలహాలివ్వండి
- రంగరాయ వైద్యకళాశాల పూర్వ విద్యార్థుల సంఘం స్వర్ణోత్సవ సభలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచన

ఈనాడు, కాకినాడ, అమరావతి: 'డాక్టరు దగ్గరకెళ్తే మాట్లాడటం లేదని.. చేయి పట్టుకుని చూడడం లేదని.. రాగానే స్కానింగులు రాసేస్తున్నారని... ఈ మధ్య ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. అనారోగ్యంతో వచ్చిన వారి జబ్బుకు మందు ఇవ్వడంతోపాటు ఆరోగ్యంపై సలహాలు ఇవ్వాలి. వారితో ఆత్మీయంగా మాట్లాడితే సగం జబ్బు తగ్గిపోతుంది' అని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు వైద్యులకు సూచించారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాలలో పూర్వ విద్యార్థుల సంఘం(రాంకోసా) స్వర్ణోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ మానవాళి మనుగడలో విద్య, వైద్యం ముఖ్యమన్నారు. యోగా శరీరానికి, మెదడుకు ఉత్తేజాన్నిస్తుందని పేర్కొన్నారు. ప్రతి వైద్యుడు ఒక మానసిక నిపుణుడు కావాలని.. మనోనిబ్బరంతో సమస్యలు ఎలా ఎదుర్కోవచ్చో వివరించాలని సూచించారు. వేదికపై రాంకోసా అధ్యక్ష, కార్యదర్శులతోపాటు సమాజానికి సేవలందించిన సంకురాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, విశాఖపట్నంలోని హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ రఘునాథరావు, ఐ ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వ్యవస్థాపకుడు డాక్టర్ వి.కె.రాజులను సత్కరించారు. రంగరాయ వైద్య కళాశాల గొప్పతనం



కాకినాడలో నిర్వహించిన రాంకోసా స్వర్ణోత్సవ సభలో మాట్లాడుతున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు. వేదికపై ఉపముఖ్యమంత్రి చినరాజప్ప తదితరులు



విజయవాడలో జరిగిన లయోలా కళాశాల వ్యవస్థాపక ప్రిన్సిపల్ ఫాదర్ తియో మత్తయాస్ శతజయంతి సభలో ఉపరాష్ట్రపతిని సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

వివరిస్తూ మాధవపెద్ది సురేష్ సంగీత సారథ్యంలో ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఆలపించిన గీతం సీడీని, గుళ్లపల్లి సురేంద్ర రూపొందించిన ఆంధ్రచరిత్ర సీడీని, డాక్టర్ ఎం.వి.వి.ఆనంద్ రూపొందించిన సావనీర్‌ను, కళాశాల ఆచార్యులు డాక్టర్ గిడుపర్తి సుందరశివరావు విగ్రహాన్ని ఉపరాష్ట్రపతి ఆవిష్కరించారు. సినీ నటుడు, రచయిత తనికెళ్ల భరణి ఆలపించిన తెలుగు పద్యాలు, నిట్టల సిస్టర్స్ పాడిన గీతం ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు, మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్, డీజీపీ ఆర్.పి.ఠాకూర్, ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం వీసీ సీవీ రావు తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం

నేటి యువత మహనీయుల జీవితాల నుంచి స్ఫూర్తిని పొందాలని ఉపరాష్ట్రపతి సూచించారు. విజయవాడలోని ఆంధ్ర లయోలా కళాశాల వ్యవస్థాపక ప్రిన్సిపల్ ఫాదర్ తియో మత్తయాస్ శతజయంతి సభను శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. 60 ఏళ్లుగా విజయవాడ లయోలా కళాశాల క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తోందన్నారు. ఫాదర్ మత్తయాస్ ఓ గొప్ప దార్శనికుడని కొనియాడారు. విద్య అనేది కేవలం డిగ్రీలు, పట్టాలు పుచ్చుకునేందుకు కాదని.. పాశ్చాత్య అలవాట్లకు దూరంగా ఉండి, విలువలతో కూడిన మన పురాతన విద్యావిధానాన్ని తిరిగి పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ తియో మత్తయాస్ గుర్తుగా ప్రత్యేక పోస్టల్ కవర్, పుస్తకాన్ని ఆవిష్కరించారు.

కోర్టులో సవాల్ చేసే యోచన!

- జగన్ కేసు ఎన్ఐయేకు అప్పగింత వ్యవహారం
- డీజీపీ, ఏజీలతో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ

ఈనాడు, అమరావతి: వైకాపా అధ్యక్షుడు జగన్‌పై విశాఖ విమానాశ్రయంలో దాడి కేసు దర్యాప్తును ఎన్ఐయేకి అప్పగిస్తూ కేంద్ర హోంశాఖ తీసుకున్న నిర్ణయాన్ని కోర్టులో సవాల్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వ తదుపరి కార్యాచరణ, అనుసరించాల్సిన న్యాయపరమైన ప్రక్రియలు, ఇతర అంశాలపై చర్చించేందుకు శనివారం రాత్రి ఉండవల్లిలోని ప్రజావేదికలో డీజీపీ ఆర్పీ ఠాకూర్, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్‌లతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. మరికొందరు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఎలాంటి వ్యూహం అనుసరించాలన్న విషయంలో ఇంకా తుది నిర్ణయానికి రాలేదని విశ్వసనీయవర్గాల సమాచారం. కేంద్ర హోంశాఖ చర్యపై తన అసమ్మతిని తెలియజేస్తూ ఒక లేఖ రాయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇదే అంశంపై ఆదివారం ఉదయం డీజీపీ, అడ్వకేట్ జనరల్ తదితరులతో ముఖ్యమంత్రి మరోసారి సమావేశమవుతున్నారు.

విచారణ ప్రారంభించనున్న ఎన్ఐయే

ఈనాడు, విశాఖపట్నం: జగన్‌పై దాడి కేసుకు సంబంధించి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్.ఐ.ఎ.) విచారణను ప్రారంభించనుంది. పలువురిని విచారించడానికి రంగం సిద్ధం చేసుకుంటోంది. ఈ కేసు దర్యాప్తు బాధ్యతలను ఎన్ఐఏకు అప్పగించాలని ఇటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సిట్ అధికారులకు సూచనలు రాలేదు. కోడికత్తి, జగన్ చొక్కా తదితర సాక్ష్యాలను ఇప్పటికే సిట్ అధికారులు ఫోరెన్సిక్ నిపుణులకు పంపారు. ఆ నివేదిక రాగానే ఛార్జిషీట్ వేయాలని భావిస్తున్నారు. సాక్ష్యాలన్నింటినీ సమగ్రంగా విచారించిన పోలీసులు ఇప్పటికే కేసును ఓ కొలిక్కి తెచ్చారు.



తానా చైతన్య స్రవంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

రైతన్నకు వెన్నుదన్నుగా తెదేపా

- రాజంపేటలో తానా చైతన్య స్రవంతి

రాజంపేట, న్యూస్‌టుడే: అన్నం పెట్టే రైతన్నకు తెదేపా ప్రభుత్వం వెన్నుదన్నుగా ఉంటుందని వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. కడప జిల్లా రాజంపేటలో శనివారం తానా ఆధ్వర్యంలో చైతన్య స్రవంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా రాజంపేట పట్టణం నుంచి అన్నమయ్య 108 అడుగుల విగ్రహం వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి సోమిరెడ్డి మాట్లాడుతూ కష్టపడే రైతన్నలకు తానా అండగా నిలవడం అభినందనీయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 వేల మందికి వీటిని అందజేయాలని లక్ష్యంగా పెట్టుకోవడం రైతులకు వరమన్నారు. ప్రభుత్వ విప్‌లు పయ్యావుల కేశవ్, మేడా మల్లికార్జునరెడ్డి, తెలంగాణ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, సినీనటుడు సునీల్, తానా అధ్యక్షుడు వేమన సతీశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తితిదే కళాకారులు అన్నమయ్య కీర్తనలను ఆలపించారు. తెలంగాణ కళాకారులు జానపద గేయాలతో అలరించారు. అనంతరం వెయ్యిమంది కర్షకులకు తానా ఆధ్వర్యంలో రైతు రక్షణ కిట్లను పంపిణీ చేశారు.

సలహాల పేరిట స్వాహా

- షేర్‌మార్కెట్ సలహా కంపెనీల ముసుగులో మోసం

ఈనాడు, హైదరాబాద్: షేర్‌మార్కెట్ సలహా కంపెనీల ముసుగులో మదుపర్ల నుంచి రూ.వేల కోట్లు కొల్లగొట్టిన నలుగురిని సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. మూడేళ్లలో వీరు దేశవ్యాప్తంగా సుమారు రూ.మూడు వేల కోట్లదాకా స్వాహా చేసుంటారని అంచనా వేస్తున్నారు. ఈ వివరాలను సైబరాబాద్ కమిషనర్ సజ్జనార్ శనివారం వివరించారు. తాము సూచించినట్లు షేర్‌మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే లాభాలు ఆర్జించవచ్చని స్వప్నిల్ ప్రజాపతి, అఖిలేష్ రఘువంశీ, సంతోష్‌సింగ్, సాగర్‌సాహు ఈ మోసాలకు పాల్పడ్డారు. వీరు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో హైబ్రో మార్కెట్ రీసెర్చ్ ఇన్వెస్టిమెంట్ అడ్వైజ్ ప్రైవేట్ లిమిటెడ్ (వేస్2క్యాపిటల్.కాం), ది ఈక్విటీకాం ఫైనాన్షియల్ రీసెర్చ్ ప్రైవేట్ లిమిటెడ్ (ది ఈక్విటీకాం.కాం), ట్రేడ్ బిజ్ రీసెర్చ్ (ట్రేడ్‌బ్రిజ్ ఇండియా.కాం), సఫల్ రీసెర్చ్ (సఫల్‌రీసెర్చ్.కాం) సంస్థలను నెలకొల్పారు. షేర్‌మార్కెట్‌పై తమకున్న పరిజ్ఞానంతో డీమ్యాట్ ఖాతాలున్నవారికి పది రోజులపాటు ఉచిత సలహాలనిచ్చేవారు. వీరి సలహాలపై నమ్మకం కుదిరిన బాధితులను షేర్ ట్రేడ్ సలహాల కోసం తమ సంస్థల్లో పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పేవారు. వార్షిక, అర్ధ సంవత్సర, త్రైమాసికం ప్యాకేజీ పేరుతో రూ.ఐదు లక్షల వరకు వసూలు చేసేవారు. కొద్దినెలల్లోనే 20వేల మంది సభ్యులయ్యారు.

షేర్‌మార్కెట్‌లో నష్టాలొస్తే తమ బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తే తామే నేరుగా పెట్టుబడులు పెడతామని, లాభాలే వస్తాయని నమ్మించేవారు. తమ ఖాతాల్లో రూ.లక్షలు జమ చేయించుకునేవారు. వీరి చేతిలో మోసపోయిన హైదరాబాద్ వాసులు పలువురి ఫిర్యాదు మేరకు సైబర్‌క్రైం పోలీసులు ఇండోర్‌కు వెళ్లారు. నిందితులను అరెస్ట్ చేసే సమయంలో బౌన్సర్లను అడ్డుగా ఉంచారని, రెండుగంటల తర్వాత అదుపులోకి తీసుకోగలిగామని పోలీసులు తెలిపారు.

ఆకాశంలో ఉండగా పనిచేయని ఇంజిన్

- పెద్ద శబ్దంతో ఊగిపోయిన ఇండిగో విమానం

ముంబయి: చెన్నై నుంచి కోల్‌కతాకు ప్రయాణిస్తున్న 'ఇండిగో' విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో విమానాన్ని చెన్నై విమానాశ్రయంలో అత్యవసరంగా దింపేశారు. ఆకాశంలో ఉండగానే ఎయిర్‌బస్ ఏ320 విమానం ఇంజిన్ పనిచేయలేదని, పొగలు కక్కుతూ పెద్దశబ్దంతో విమానం ఊగిపోయిందని సమాచారం. ఇంజిన్ బ్లేడ్లు పాడైపోవడంతో తిరిగి విమానాశ్రయానికి తీసుకొచ్చి నిలిపివేశారు. గురువారం జరిగిన ఈ సంఘటనపై మంగళవారం సమీక్షించనున్నట్లు కేంద్ర పౌరవిమానయాన మంత్రిత్వశాఖ కార్యదర్శి ఆర్.ఎన్.చౌబే తెలిపారు. అమెరికాకు చెందిన విమానాల తయారీసంస్థ 'ఎ320'విమానంలో వినియోగిస్తున్న కొత్తరకం ఇంజిన్లను 'ప్రాట్ అండ్ విట్నీ' అనే కంపెనీ తయారుచేస్తోంది. ఈ ఇంజిన్లను ఉపయోగిస్తున్న విమానాల్లో సాంకేతికలోపాలు సర్వసాధారణమయ్యాయి.

ప్రధాన నౌకాశ్రయాలు అభివృద్ధి సాధించాలి

- పోర్టు ట్రస్ట్ ఛైర్మన్ ఎం.టి.కృష్ణబాబు

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: దేశంలోని ప్రధాన నౌకాశ్రయాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలున్నా కార్గో హ్యాండ్లింగ్ ఎగుమతులు, దిగుమతుల్లో చైనా వంటి దేశాలతో, ప్రైవేటు పోర్టులతో పోటీ పడలేక పోతున్నామని విశాఖ పోర్టు ట్రస్ట్ ఛైర్మన్ ఎం.టి.కృష్ణబాబు పేర్కొన్నారు. విశాఖలోని పోర్టు సీతారామ కల్యాణమండపంలో శనివారం భారతీయ పోర్ట్ అండ్ డాక్‌మజ్దూర్ మహాసంఘ్ జాతీయ మహాసభలు శనివారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కృష్ణబాబు మాట్లాడుతూ.. ప్రైవేటురంగం నుంచి ఎంత పోటీ ఉందో కార్మికులు అర్థం చేసుకోవాలని సూచించారు. హిందుస్థాన్ షిప్‌యార్డు సీఎండీ ఎల్.వి.శరత్‌బాబు, బీఎంఎస్ జాతీయ కార్యదర్శి బి.సురేంద్రన్, పోర్టు ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు పి.జి.ఉపర్కార్, ఎం.జగదీశ్వరరావు, వెంకప్పనాయక్, ఎమ్మెల్సీ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర పాలనపై పుస్తకాన్ని ఆవిష్కరించిన సీఎం

ఈనాడు డిజిటల్, అమరావతి: 'సుస్థిర పాలన-అభివృద్ధి, ప్రజాస్వామ్యం' అంశాలుగా రచించిన పుస్తకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. దిల్లీలోని సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ ఎన్.భాస్కర్‌రావు రచించిన ఈ పుస్తకాన్ని సీఎం శనివారం ఉండవల్లిలో ఆవిష్కరించారు.

మమతకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన జగన్

పశ్చిమబెంగాల్ సీఎం మమతాబెనర్జీకి వైకాపా అధ్యక్షుడు జగన్ ట్విటర్‌లో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



పోటీల్లో విజేతలకు బహుమతులు, ధ్రువపత్రాలు అందజేస్తున్న ఐ.వెంకటేశ్వరరావు. పక్కన విట్(ఏపీ) ఉపాధ్యక్షుడు శంకర్‌విశ్వనాథన్, రిజిస్ట్రార్ శివకుమార్, ఉపకులపతి శుభాకర్

విట్(ఏపీ) వర్సిటీలో విటోపియా సందడి

- కార్యక్రమాన్ని ప్రారంభించిన ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు

ఐనవోలు(తుళ్ళూరు), న్యూస్‌టుడే: రాజధాని అమరావతి అంతర్జాతీయ క్రీడా వేదికగా మారబోతోందని బాక్సింగ్ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం విట్-ఏపీ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన విటోపియా-2019 ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విట్‌లో ఉన్నత ప్రమాణాలతో విద్యా బోధన చేయటమే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయని పేర్కొన్నారు. రెండు రోజుల పాటు జరిగే విటోపియాలో మొదటిరోజు పాటలు, నృత్యాలు, కార్పొరేట్ ఫ్యాషన్ వాక్ ప్రిలిమినరీ పోటీలు, బ్యాటిల్ ఆఫ్ బ్యాండ్స్ వంటి కార్యక్రమాలు జరిగాయి. 50 విద్యాసంస్థల నుంచి విద్యార్థులు పాల్గొని తమ క్రీడానైపుణ్యాలను ప్రదర్శించారు. ప్రముఖ సినీసంగీత దర్శకుడు తమన్ బృందం వివిధ భాషల పాటలతో విద్యార్థులను ఉత్సాహపరిచింది. కార్యక్రమంలో విట్-ఏపీ ఉపాధ్యక్షుడు శంకర్‌విశ్వనాథన్, ఉపకులపతి డా.శుభాకర్, రిజిస్ట్రార్ సీఎల్వీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి 5,252 అదనపు బస్సులు

- హైదరాబాద్ నగరం నలుదిక్కుల నుంచి సేవలు
- ఈ నెల 9 నుంచి నడిపేందుకు టీఎస్ఆర్టీసీ సన్నాహాలు

ఈనాడు, హైదరాబాద్: సంక్రాంతి పండగ సందర్భంగా తెలంగాణలోని జిల్లాలతో పాటు. .ఆంధ్రప్రదేశ్‌లోని ముఖ్య పట్టణాలకు బస్సులు నడిపేందుకు టీఎస్ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. రోజూ వెళ్లే బస్సులకు అదనంగా ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు 5,252 సర్వీసులను నడిపేందుకు చర్యలు తీసుకుంది. ఎంజీబీఎస్, జేబీఎస్ నుంచే కాకుండా.. హైదరాబాద్ నగరం నలుదిక్కుల నుంచి ఎటువైపు బస్సులు అటే వెళ్లేలా ఏర్పాట్లు చేసింది. ఇలా దూర ప్రాంతాలకు బయల్దేరే బస్సులను అందుకోవడానికి జేబీఎస్, ఎంజీబీఎస్ నుంచి సిటీ బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ రంగారెడ్డి రీజినల్ మేనేజర్ యాదగిరి తెలిపారు. ప్రత్యేక బస్సు సేవలకు సంబంధించి శనివారం ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక బస్సుల్లో ఎప్పటిలాగే 50 శాతం అదనపు ఛార్జీ ఉంటుందన్నారు. www.tsrtconline.in ద్వారా ఆన్‌లైన్ రిజర్వేషన్ చేసుకోవచ్చని.. ఇప్పటికే 300 బస్సులకు రిజర్వేషన్లు పూర్తయ్యాయని చెప్పారు.

పూర్తి వివరాలకు.. ఎంజీబీఎస్ 8330933419, 8330933537, 8330933532, జేబీఎస్ 04027802203 నంబర్లలో సంప్రదించాలి.

పశువుల మేతకూ 'కత్తెర'

- మొక్కజొన్న సాగుకు దెబ్బ
- పడిపోయిన పాతరగడ్డి ఉత్పత్తి
- లక్ష్యంలో 25 శాతమే సరఫరా
- రాయలసీమలో కొరత తీవ్రం

కత్తెరపురుగు ప్రభావం పంటల పైనే కాదు. . పశుగ్రాసం పైనా పడింది. మొక్కజొన్న ఆధారిత పాతరగడ్డి(సైలేజి) సరఫరా పడిపోయింది. ఫలితంగా రాయలసీమ జిల్లాల్లో గడ్డి కొరత తీవ్రమవుతోంది. లక్ష్యం మేర పంపిణీ సాగడం లేదు. కరవు పరిస్థితులకు ఆలవాలమైన అనంతపురం జిల్లాలో ఈ ఏడాదికి నిర్ణయించిన లక్ష్యంలో 10శాతం కూడా ఇవ్వలేదు. కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లోనూ 25 శాతానికి మించి అందించలేకపోయారు. దీంతో రైతులు పశువులను తెగనమ్ముకోవాల్సిన దుస్థితి తలెత్తుతోంది.

సాకలేక.. గడ్డి కొనలేక

రాయలసీమలో వరి పండించే చోట నుంచి వర్షాభావ ప్రాంతాలకు గడ్డిని తీసుకెళ్లాలి. కర్ణాటక నుంచో కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచో వచ్చే వరిగడ్డిని కొనుక్కోవాలి. లారీ లోడుకు రూ.25వేల వంతున వెచ్చించాలి.



అసలే కరవు పరిస్థితులు.. పంటలన్నీ ఎండిపోయి అప్పులపాలైన రైతులు ఇంత ధరతో గడ్డి కొనలేకపోతున్నారు. చూడికొచ్చినవాటితో పాటు పాడిగేదెలు, ఆవుల్ని గతిలేని పరిస్థితుల్లో సంతలకు తోలుకెళ్తున్నారు. అరకదున్నే ఎడ్లనూ సగం ధరకే తెగనమ్ముకుంటున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే.. రాబోయే వేసవిలో కొరతను తట్టుకునేదెలా? అనే ప్రశ్న రైతాంగాన్ని కలవరపరుస్తోంది.

పంపిణీ 27 శాతమే..

పాతరగడ్డిని కిలో రూ.2చొప్పున రైతులకు అందిస్తున్నారు. గ్రామాల స్థాయిలో పశుమిత్రలు, గోపాలమిత్రల ద్వారా సరఫరా చేస్తున్నారు. కొరత ప్రాంతాల్లోని రైతులకు ఈ పథకం అనుకూలంగా ఉంది. రాయలసీమ ప్రాంతం నుంచి డిమాండు అధికంగానే ఉంది. అయితే అందుకు తగ్గ సరఫరా లేదు. అనంతపురం జిల్లాకు 65వేల టన్నులు సరఫరా చేయాల్సి ఉంటే ఇప్పటికి 6వేల టన్నులైనా పూర్తికాలేదు. గుంటూరు, గోదావరి జిల్లాలు మాత్రం కొంత మెరుగ్గా ఉన్నాయి. మొత్తంగా చూస్తే.. 27 శాతమే లక్ష్యం సాధించినట్లయింది.

కత్తెర పురుగు కారణంగానే

పాతరగడ్డి తయారీకి మొక్కజొన్న పంటనే వినియోగిస్తారు. దీన్ని ముక్కలుగా కత్తిరించి ఇతర పదార్థాలు కలిపి బేళ్లుగా తయారుచేస్తారు. ఖరీఫ్‌లో కత్తెర పురుగు కారణంగా మొక్కజొన్న రైతులు పెద్దఎత్తున నష్టపోయారు. పాతరగడ్డికి మొక్కజొన్న దొరకని పరిస్థితి నెలకొంది. పంట లేనప్పుడు తామేం చేయగలమంటూ సరఫరాదారులు చేతులెత్తేశారు.

ఇక జనవరి మూడో వారం నాటికి..

కత్తెర పురుగు నియంత్రణలో భాగంగా రబీలో మొక్కజొన్న సాగు తగ్గించాలని వ్యవసాయశాఖ ప్రచారం చేసింది. రైతులు సైతం ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టిపెట్టారు. గతేడాది డిసెంబరు నాటికి 3.65 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేయగా.. ఈ ఏడాదది 2.10లక్షల ఎకరాలకు పడిపోయింది. ఈ నేపథ్యంలో మున్ముందూ పాతరగడ్డికి అవసరమైన మొక్కజొన్న సర్దుబాటు అవుతుందా? అనేది ప్రశ్నార్థకంగా తయారైంది. కొంతమేర వచ్చినా.. జనవరి మూడోవారం దాకా ఆగాల్సిందేనని అధికారులు పేర్కొంటున్నారు.

డిసెంబరు 27 దాకా జిల్లాల వారీగా లక్ష్యం.. పంపిణీ (టన్నుల్లో)

జిల్లా	2018 లక్ష్యం	పంపిణీ
గుంటూరు	40,000	26,747
పశ్చిమగోదావరి	10,000	6,587
తూర్పుగోదావరి	10,000	6,059
ప్రకాశం	60,000	23,364
కృష్ణా	15,000	4,845
నెల్లూరు	20,000	4,588
కడప	25,000	5,262
చిత్తూరు	65,000	11,143
విశాఖపట్నం	20,000	3,338
కర్నూలు	30,000	4,803
విజయనగరం	20,000	2,881
శ్రీకాకుళం	20,000	2,866
అనంతపురం	65,000	5,978
మొత్తం	4,00,000	1,08,461

ఈనాడు – అమరావతి

రొబోటిక్స్, మెకట్రానిక్స్‌లో తొలివిడత శిక్షణ

- ఈనెల 8 తర్వాత ప్రారంభం
- ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ, సీఈవో కృతికా శుక్లా

ఈనాడు, అమరావతి: ఇంజినీరింగ్ విద్యార్థులకు రొబోటిక్స్, మెకట్రానిక్స్ విభాగంలో ఈనెల 8 తర్వాత నుంచి తొలివిడత శిక్షణ ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ) ఎండీ, సీఈవో కృతికాశుక్లా తెలిపారు. జర్మనీకి చెందిన యూరోపియన్ సెంటర్ ఫర్ మెకట్రానిక్స్(ఈసీఎం)తో కలిసి మొత్తం 40 ఇంజినీరింగ్ కళాశాలల్లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. మెకట్రానిక్స్, రొబోటిక్స్ విభాగంలో అడ్వాన్స్‌డ్ అప్లైడ్ రొబోటిక్ కంట్రోల్ 1.0, 2.0, 3.0 కోర్సుల్లో శిక్షణ ఇస్తారు. ప్రతి ప్రయోగశాలలో రెండు ఐగూస్ రొబోలను అందుబాటులో ఉంచనున్నారు. 3నెలలపాటు శిక్షణ కొనసాగుతుంది. మొదటి విడత శిక్షణకు 5వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేయగా.. 2,419మందికి ప్రాథమిక పరీక్ష నిర్వహించి 900మందిని ఎంపిక చేశారు. వీరందరికీ 11ఇంజినీరింగ్ కళాశాలల్లో ఈనెల 8 తర్వాత శిక్షణ ప్రారంభించనున్నారు. ఇప్పటికే 11 కళాశాలలకు చెందిన 24 మంది అధ్యాపకులను జర్మనీకి తీసుకువెళ్లి 10రోజులు శిక్షణ ఇప్పించారు.

రెండో విడతకు దరఖాస్తు ఇలా..: రెండో విడతలో 29 ఇంజినీరింగ్ కళాశాలల్లో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. ఆసక్తి కలిగిన ఇంజినీరింగ్ విద్యార్థులు http://engineering.apssdc.in/ecm వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కృతికాశుక్లా వెల్లడించారు. ఈనెల చివరి నాటికి శిక్షణకు అవసరమైన రొబోలను అందుబాటులో తీసుకురానున్నారు.

అబద్ధాల ప్రధానిగా మోదీ

- ఏపీ యూసీలపై నీతిఆయోగ్ లేఖ తెలియదా?
- కేంద్రం తీరుపై రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు ధ్వజం

ఈనాడు, అమరావతి: అబద్ధాల ప్రధానిగా నరేంద్రమోదీ, తప్పుడు పార్టీగా భాజపా చరిత్రలో నిలిచిపోతాయని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు సి.కుటుంబరావు శనివారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని వెనుకబడిన జిల్లాలకు కేటాయించిన రూ.1,050 కోట్లకు యూసీలు ఇవ్వలేదని ఐదు పార్లమెంటు స్థానాల వీడియో సమావేశంలో ప్రధాని మోదీ ప్రస్తావించడం పచ్చి అబద్ధమని పేర్కొన్నారు. నీతిఆయోగ్ నుంచి కేంద్ర ఆర్థిక శాఖకు 2018 డిసెంబరు 18న పంపిన లేఖలో ఏపీ ప్రభుత్వం రూ.1,049.34 కోట్లకు యూసీలు ఇచ్చినట్లు స్పష్టంగా పేర్కొందని, రాజ్యసభలో కేవీపీ రామచంద్రరావుకు ఇచ్చిన జవాబులో 2018 జనవరి వరకు రూ.946.50 కోట్లకు ఏపీ ప్రభుత్వం యూసీలు ఇచ్చినట్లు ఆర్థిక మంత్రి చెప్పారని కుటుంబరావు వివరించారు. ఆ తరువాత ఇచ్చిన యూసీలను కూడా క్రోడీకరించి నీతిఅయోగ్ కేంద్ర ఆర్థిక శాఖకు లేఖ రాసిందని తెలిపారు. నీతిఆయోగ్ ఛైర్మన్‌గా ఉన్న ప్రధాని నరేంద్రమోదీకి లేఖ తెలియదంటే ప్రభుత్వాన్ని ఆయన ఏవిధంగా నడుపుతున్నారో అర్థమవుతుందని పేర్కొన్నారు. రాజ్యసభలో ఆర్థిక మంత్రి ఇచ్చిన సమాధానం కూడా తెలియదంటే పీఎంవో నిర్వాకమో, భాజపా రాజకీయమో ప్రజలే అర్థం చేసుకోవాలని విమర్శించారు. విద్యాపన్ను కింద వసూలుచేసిన రూ.82 వేల కోట్లు ఇప్పటివరకు ఎందుకు ఖర్చు చేయలేదో నరేంద్రమోదీ చెబుతారా? అని ప్రశ్నించారు. యూసీలు ఇవ్వడంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో ఉందని కేంద్ర ఆర్థికశాఖ వెబ్‌సైట్‌లో వెల్లడించడం ప్రధానికి తెలియదా? భాజపా పాలిత రాష్ట్రాలకు యూసీలు ఇస్తేనే నిధులిస్తున్నారా? గుజరాత్, మహారాష్ట్ర ఎన్ని యూసీలు ఇచ్చిందని భారీగా నిధులిస్తున్నారని కుటుంబరావు ధ్వజమెత్తారు. ఏపీ పట్ల వివక్షకు మూల్యం చెల్లించక తప్పదని పేర్కొన్నారు.

నాలుగేళ్ల చిన్నారిపై పాఠశాల వ్యానులో అత్యాచారం

- ఉపాధ్యాయుడి దాష్టీకం

ప్యారిస్, న్యూస్‌టుడే: కనురెప్పలా రక్షణ కల్పించాల్సిన ఉపాధ్యాయుడు కామాంధుడిగా మారి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. పాఠశాల వ్యానులో నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారానికి ఒడిగట్టాడు. ఈ దారుణ ఘటన తమిళనాడులోని తిరునెల్వేలి జిల్లాలో చోటుచేసుకుంది. జిల్లాలోని తెన్‌కాశి వద్ద ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో నాలుగేళ్ల చిన్నారి చదువుతోంది. ప్రతిరోజు ఆమె వ్యానులో పాఠశాలకు వెళ్లి వస్తుంది. శుక్రవారం యథావిధిగా పాఠశాలకు వెళ్లిన ఆ చిన్నారి సాయంత్రం తిరిగి వచ్చినప్పుడు అనారోగ్యంగా ఉన్నట్లు గమనించి తల్లి ఆరా తీసింది. దీంతో వ్యానులో వస్తున్నప్పుడు ఓ ఉపాధ్యాయుడు అత్యాచారం చేసిన విషయం వెలుగుచూసింది. బాధితురాలి తల్లి ఫిర్యాదుమేరకు పోలీసులు విచారణ చేపట్టారు. ఘటన సమయంలో బాలికతో పాటు వ్యానులో విరుదునగర్ జిల్లా రాజపాళెయానికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు ఇళయరాజా(39) ఉన్నట్లు తేల్చారు. నిందితుడిని శనివారం ఉదయం కోర్టులో హాజరుపరిచి పాళై జైలుకు తరలించినట్లు తెలిపారు.

మహిళల సారథ్యంలో కీలక పరిశోధనలు

- ఇన్ఫోసిస్ పురస్కారాల ప్రదానంలో నారాయణమూర్తి

ఈనాడు డిజిటల్, బెంగళూరు: విజ్ఞాన రంగంలో మరిన్ని అద్భుత పరిశోధనలు కొనసాగాలంటే మహిళలు కీలక పాత్ర పోషించాల్సి ఉందని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్.ఆర్.నారాయణమూర్తి పిలుపునిచ్చారు. ఇన్ఫోసిస్ సైన్స్ ఫౌండేషన్ విజ్ఞాన పురస్కారాల ప్రదానోత్సవం శనివారం బెంగళూరులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్లారివేటివ్ అనలిటిక్స్ నివేదిక ప్రకారం ప్రపంచస్థాయి ఐదు వేల సమర్థులైన పరిశోధకుల్లో పదిమంది మాత్రమే భారతీయులున్నారని, వీరిలో ఒక్కరే మహిళ అని వివరించారు. విశ్వవిద్యాలయాల స్థాయిలో స్వర్ణ పతకాలు పొందుతున్న వారిలో పురుషులకంటే మహిళలే ఎక్కువగా ఉన్నా పరిశోధనల వైపు వీరు ఆసక్తి చూపడం లేదని అన్నారు. ప్రఖ్యాత ఆర్థికవేత్త అమర్త్యసేన్ మాట్లాడుతూ గత దశాబ్దిలో భారతీయ యువత ఆలోచనల్లో వైవిధ్యం నెలకొందని అన్నారు. ఇన్ఫోసిస్ సైన్స్ ఫౌండేషన్-2018కిగాను వివిధ రంగాల్లో వినూత్న స్థాయి సేవలు, పరిశోధనలు చేపట్టిన ఆరుగురికి ముఖ్య అతిథులు పురస్కారాలు అందించారు. హ్యూమానిటీస్ నుంచి కవితా సింగ్ (జేఎన్‌యూ-న్యూదిల్లీ), లైఫ్‌సైన్సెస్‌లో రూప్ మల్లిక్ (టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్-ముంబయి), గణితంలో నళిని అనంతరామన్ (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీ- స్ట్రాస్‌బర్గ్, ఫ్రాన్స్), భౌతికశాస్త్రంలో ఎస్.కె.సతీశ్ (ఐఐఎస్సీ, బెంగళూరు), సామాజిక శాస్త్రంలో సెంథిల్ ముల్లైనాథన్ (కంప్యూటైజేషన్ అండ్ బిహేవియరల్ సైన్స్), ఇంజినీరింగ్ అండ్ కంప్యూటర్ విభాగంలో నవకంత భట్(ఐఐఎస్సీ బెంగళూరు)లకు పురస్కారాలను అందించారు.





పురస్కారాలు స్వీకరించిన యువ శాస్త్రవేత్తలతో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు అమర్త్యసేన్, ఎస్.కె.సతీశ్, నళిని అనంతరామన్, కవితాసింగ్ తదితరులు ★ హాజరైన ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్.ఆర్.నారాయణమూర్తి

మాల్యా ఆర్థిక నేరగాడే

- ప్రత్యేక న్యాయస్థానం స్పష్టీకరణ
- తీర్పు నిలుపుదలకు నిరాకరించిన కోర్టు
- నూతన చట్ట నిబంధనల కింద తొలి ప్రకటన

ముంబయి

బ్యాంకులకు రూ.9000 కోట్ల రుణాలు చెల్లించకుండా విదేశాలకు పారిపోయిన ప్రముఖ వ్యాపారవేత్త విజయ్ మాల్యాను 'పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడు' (ఎఫ్ఈవో)గా ప్రత్యేక న్యాయస్థానం ప్రకటించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చేసిన విన్నపం మేరకు 'అక్రమ నగదు చలామణి నిరోధక చట్ట న్యాయస్థానం' శనివారం ఈ నిర్ణయాన్ని వెలువరించింది. గత ఏడాది ఆగస్టులో అమల్లోకి వచ్చిన 'పరారీలోని ఆర్థిక నేరగాళ్ల చట్టం-2018' నిబంధనల కింద ఎఫ్ఈవోగా ముద్ర పడిన తొలి వ్యాపారవేత్త మాల్యాయే. ప్రస్తుతం యూకేలో ఉన్న మాల్యాను ఎఫ్ఈవోగా ప్రకటించి, ఆస్తుల్ని స్తంభింపజేసి, నూతన చట్టం కింద కేంద్ర ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకురావాలని ఈడీ కోరింది.



ఇరువర్గాలు వినిపించిన సుదీర్ఘ వాదోపవాదనలను ఆలకించాక న్యాయమూర్తి ఎం.ఎస్.ఆజ్మీ తీర్పునిచ్చారు. మాల్యాను మన దేశానికి రప్పించేందుకు అన్ని ప్రయత్నాలు చేసినా విఫలమయ్యామని ఈడీ తరఫు న్యాయవాదులు తెలిపారు. హైకోర్టులో అపీలుకు వెళ్లేందుకు వీలుగా తీర్పును నాలుగు వారాలపాటు నిలుపు చేయాలని మాల్యా చేసిన విజ్ఞప్తిని న్యాయస్థానం తిరస్కరించింది. తమ తీర్పుపై తామే స్టే ఇవ్వలేమని స్పష్టంచేసింది. ఆస్తుల స్వాధీనం చేసుకునే అంశంపై విచారణ ఫిబ్రవరి 5 నుంచి ప్రారంభం కానుంది. బ్యాంకు రుణాల ఎగవేతతో పాటు అక్రమ నగదు చలామణికి పాల్పడినట్లు అభియోగాలు ఎదుర్కొంటున్న మాల్యా 2016 మార్చిలో మన దేశం నుంచి పరారయ్యారు.

అవినీతిపై పోరాటంలో ఇదో మైలురాయి: భాజపా

మాల్యాను ఎఫ్ఈవోగా ప్రకటిస్తూ ముంబయి న్యాయస్థానం ఇచ్చిన తీర్పును భాజపా ఆహ్వానించింది. అవినీతిపై పోరులో ఇదో మైలురాయిలా నిలిచిపోతుందని పార్టీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా విలేకరుల సమావేశంలో చెప్పారు. మాల్యాలాంటివారిని చట్టం ముందు నిలబెట్టడానికే ఎన్డీయే సర్కారు ఇలాంటి చట్టాన్ని తీసుకువచ్చిందని చెప్పారు. మాల్యాను కాంగ్రెస్ సర్కారే పెంచి పోషించిందని, దివాలా తీసిన తర్వాతా రుణాలు ఇచ్చిందని ఆరోపించారు.

కేసు నేపథ్యం ఇదీ...

విజయ్‌మాల్యా మన దేశంలోని బ్యాంకుల నుంచి తీసుకున్న రూ.9000 కోట్ల రుణాలను తీర్చడం లేదు. దీనికితోడు అక్రమ నగదు చలామణి అభియోగాలనూ ఎదుర్కొంటుండడంతో నిందితుడిని తమకు అప్పగించాలంటూ మన దేశం కోరుతూ వస్తోంది. దీనిపై ఈడీ, సీబీఐ వేర్వేరుగా కేసులు నమోదు చేశాయి. లండన్‌లో మాల్యాకు ఉన్న భవంతిని స్వాధీనం చేసుకోవచ్చని వేరే కేసులో బ్రిటన్ హైకోర్టు గత నవంబరులో తీర్పునిచ్చింది. రుణ ఎగవేతకు పాల్పడి లండన్‌లో ఉన్న మాల్యాను భారత్‌కు అప్పగించాలని గత నెలలో వెస్ట్ మినిస్టర్ మేజిస్ట్రేట్స్ కోర్టు (లండన్) ఆదేశించింది. ప్రస్తుతం ఆ వ్యవహారం బ్రిటన్‌లోని విదేశీ వ్యవహారాల శాఖ వద్ద ఉంది. ఈ నేపథ్యంలో తాజా తీర్పు వెలువడింది. భారత్ నుంచి విదేశాలకు పరారైన వ్యాపారవేత్తలు, ఆర్థిక నేరగాళ్లు 27 మంది ఉన్నారు.

నూతన చట్టంలో ఏముందంటే...

రూ.100 కోట్లకు పైబడిన ఆర్థిక నేరానికి పాల్పడి, అరెస్టు వారెంటు జారీ అయిన వ్యక్తి న్యాయ విచారణ నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించినా, విదేశాలకు వెళ్లిపోయి మన దేశానికి వచ్చేందుకు నిరాకరిస్తున్నా వారిని ఎఫ్ఈవోగా ప్రకటించవచ్చని నూతన చట్టం చెబుతోంది. ఈ చట్టం కింద ఒకసారి 'పరారీలోని ఆర్థిక నేరగాడు'గా ముద్ర పడితే వారి ఆస్తుల్ని స్వాధీనం చేసుకునే అధికారాలు దర్యాప్తు సంస్థకు దఖలు పడతాయి. మాల్యా కేసును విచారించిన న్యాయస్థానమే నీరవ్ మోదీ, మెహుల్ ఛోక్సీల కేసుల్నీ విచారిస్తోంది.

భద్రతా భయం ఉంది.. అందుకే భారత్‌కు రాలేను: నీరవ్‌మోదీ

ముంబయి: భద్రతాపరమైన ఇబ్బందుల దృష్ట్యా తాను భారత్‌కు తిరిగి రాలేనంటూ విదేశాల్లో ఉన్న వజ్రాల వ్యాపారి నీరవ్‌మోదీ శనివారం ప్రత్యేక న్యాయస్థానానికి తెలియచేశారు. తన స్వీయరక్షణకు సంబంధించిన సమస్య మాత్రమే కాకుండా తన కేసును రాజకీయం చేసిన దృష్ట్యా కూడా భారత్‌కు రాలేనని చెప్పారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ)ను భారీ ఎత్తున మోసం చేశారన్న కేసులో ఆయనపై ఈడీ కేసు నమోదు చేసేలోగానే దేశం విడిచి పారిపోయిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఆయన తరఫున న్యాయవాది సమాధానాన్ని శనివారం దాఖలు చేశారు. సాధారణంగా జరిగే బ్యాంకులావాదేవీలకు కూడా తన విషయంలో పీఎన్‌బీ క్రిమినల్ రంగు పులిమిందని నీరవ్‌మోదీ చెప్పారు. పీఎన్‌బీ తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఈ చర్యకు పాల్పడిందని ఆరోపించారు.



టూనా... రూ.21 కోట్లు పలికింది

జపాన్‌లోని టోక్యో కొత్త చేపల మార్కెట్‌లో సంచలనం! నూతన సంవత్సరం సందర్భంగా ఇక్కడ నిర్వహించిన వేలంలో... 278 కిలోల భారీ టూనా చేప సుమారు రూ.21.5 కోట్లు (333.6 మిలియన్ యెన్‌లు) పలికింది! జపాన్ తూర్పు తీరంలో చిక్కిన ఈ మత్స్యాన్ని 'టూనా కింగ్'గా పేరొందిన సుషీ చైన్ రెస్టారెంట్ అధిపతి కియోషి కిమురా సొంతం చేసుకున్నారు. ధర చాలా ఎక్కువే అయినా... తన వినియోగదారులు లొట్టలు వేసుకుని భుజించాలన్న సంతృప్తి కోసమే దీన్ని కొనుగోలు చేసినట్టు ఆయన వెల్లడించారు. 2013లోనూ ఆయన ఓ టూనాకు 155 మిలియన్ యెన్‌లు చెల్లించి వార్తల్లో నిలిచారు.

ఆ రెండు ప్రశ్నలను అందరూ అడగండి

రఫేల్‌పై రాహుల్ ట్వీట్

దిల్లీ: రఫేల్ వ్యవహారంపై పార్లమెంటులో తాను లేవనెత్తిన ప్రశ్నలనే ప్రతి ఒక్క భారతీయుడూ ప్రధాని మోదీ, ఆయన మంత్రులపై సంధించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కోరారు. ఈ మేరకు ఆయన శనివారం ట్వీట్లు చేశారు. "ఆర్ఎం (రక్షా మంత్రి) రెండు గంటలసేపు పార్లమెంటులో మాట్లాడారు. కానీ నేనడిగిన రెండు చిన్న ప్రశ్నలకు ఆమె సమాధానం ఇవ్వలేదు" అంటూ ట్వీట్ చేశారు.

1. అనిల్ అంబానీకి ఎవరు ఆఫ్‌సెట్ కాంట్రాక్టు ఇచ్చారు?
2. తమ ప్రమేయం లేకుండానే ప్రధాని ఒప్పందం కుదుర్చుకున్నందుకు రక్షణ మంత్రిత్వ శాఖ అధికారులు అభ్యంతరం చెప్పారా? అంటూ రెండు ప్రశ్నలు సంధించారు.

పార్లమెంటులో ఈ ప్రశ్నలే తాను రక్షణ మంత్రిని అడిగానంటూ అందుకు సంబంధించిన వీడియోను జత చేశారు. "ఈ వీడియోను చూసి షేర్ చేయండి. ప్రతి ఒక్క భారతీయుడూ ప్రధానినీ ఆయన మంత్రులనూ ఈ ప్రశ్నలను అడగండి" అని కోరారు.

నిరాశలో గుజరాత్ రైతాంగం

గుజరాత్‌లో భావ్‌నగర్ జిల్లాలో సున్నపుగనుల తవ్వకానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న రైతులతో పోలీసులు ఘర్షణపడడంపై రాహుల్ స్పందించారు. "గుజరాత్‌లోని రైతుల పరిస్థితి చూడండి. వారు నిరాశతో ఉన్నారు. గనుల తవ్వకం వల్ల వ్యవసాయం, నీటిపారుదల వ్యవస్థపై దుష్పరిణామాలు ఉంటాయని ఆందోళనకు దిగారు." అని ఫేస్‌బుక్‌లో వ్యాఖ్యానించారు.

దేశంలో పెరుగుతున్న 'నిరుద్యోగుల సైన్యం'

కేంద్ర ప్రభుత్వ వైఫల్యాల కారణంగా దేశంలో 'నిరుద్యోగుల సైన్యం' పెరుగుతోందని రాహుల్ ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో నిరుద్యోగం, ఆరోగ్య సౌకర్యాల కొరతే ప్రచార అస్త్రాలు అవుతాయని తెలిపారు. దేశ యువతను ఉద్దేశించి ఆయన చేసిన ప్రసంగం వీడియోను ఆ పార్టీ ట్విట్టర్లో పెట్టింది.

యూపీలో ఎస్పీ, బీఎస్పీల పొత్తు!

లఖ్‌నవూ: కీలకమైన ఉత్తర్‌ప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)ల మధ్య సూత్రప్రాయంగా పొత్తు కుదిరింది. కొన్ని చిన్న పార్టీలను కలుపుకొని కూటమి ఏర్పాటు దిశగా ముందుకెళుతున్నాయి. ఉభయ పక్షాల పొత్తుకు సంబంధించి ఆ పార్టీల అధినేతలు అఖిలేశ్ యాదవ్, మాయావతి అనేక దఫాలుగా సమావేశమవుతూ వస్తున్నారు. వీరిద్దరూ శుక్రవారం కూడా భేటీ అయ్యారు. అనంతరం రెండు పార్టీలు పొత్తుకు ఒక అంగీకారానికి వచ్చినట్లు ఎస్పీ జాతీయ ప్రతినిధి రాజేంద్ర చౌధరీ శనివారం తెలిపారు. ఇందుకు సంబంధించి ఇరు పార్టీలు ఈ నెలాఖరులో లాంఛనంగా ప్రకటన చేసే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు. ఇతర చిన్న పార్టీలను చేర్చుకునే విషయమై చర్చలు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ కూటమిలో కాంగ్రెస్ కలిసే విషయాన్ని అఖిలేశ్, మాయావతి నిర్ణయిస్తారని తెలిపారు. అయితే కాంగ్రెస్ అగ్రనేతలకు విడిచిపెడుతూ అమేథీ, రాయ్‌బరేలీల్లో మాత్రం తమ కూటమి పోటీచేయదని స్పష్టం చేశారు. మొత్తం 80 లోక్‌సభ స్థానాలున్న యూపీలో ఎస్పీ, బీఎస్పీలు చెరో 37 స్థానాల్లో పోటీచేసే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. యూపీలో ఎస్పీ, బీఎస్పీల మైత్రిని అవకాశవాద, ప్రజా వ్యతిరేక పొత్తుగా భాజపా రాష్ట్ర ప్రతినిధి హీరో బాజ్‌పేయి విమర్శించారు. యూపీలో ఒంటరిగా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు కాంగ్రెస్ నేత, రాజ్యసభ సభ్యుడు పునియా తెలిపారు.

రైతులు ఓటు బ్యాంకులు కాదు

- రుణ మాఫీ హామీతో తప్పుదోవ పట్టిస్తున్న కాంగ్రెస్
- ప్రధాని మోదీ విమర్శలు

డాల్టన్‌గంజ్ (ఝార్ఖండ్), బరిపద (ఒడిశా): తమ ప్రభుత్వం రైతులను అన్నదాతలుగా గుర్తించి వారి నిజమైన సంక్షేమానికి నిజాయితీగా కృషి చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. గత ప్రభుత్వాలు రైతులను కేవలం ఓటు బ్యాంకుగా భావించాయని చెప్పారు. అప్పుడు రైతుల్ని అప్పుల పాలయ్యేలా చేసి, ఇప్పుడు రుణమాఫీ అంటూ తప్పుడు హామీలు ఇస్తున్నాయని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో శనివారం ఝార్ఖండ్, ఒడిశా రాష్ట్రాల్లో పర్యటించి పలు అభివృద్ధి పథకాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

ఝార్ఖండ్‌లోని డాల్టన్‌గంజ్ వద్ద జరిగిన బహిరంగ సభలో మోదీ మాట్లాడుతూ కాంగ్రెస్ ఇస్తున్న రుణ మాఫీ హామీ తప్పుదోవ పట్టించేదిగా ఉందని విమర్శించారు. "నేను కూడా రైతులను ఓటు బ్యాంకుగా భావించి ఉంటే రూ.లక్ష రుణాన్ని మాఫీ చేసి ఉండేవాడిని. అది వారికి తాత్కాలిక ఉపశమనం మాత్రమే కలిగిస్తుంది. తరతరాలకు లబ్ధి చేకూర్చే సౌకర్యాలను కల్పించి, తద్వారా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే మా ప్రాధాన్యం" అని చెప్పారు. ఈ సందర్భంగా ఝార్ఖండ్, బిహార్ రాష్ట్రాలకు సాగునీరు అందించే కోయల్ కరో మండల్ ఆనకట్ట పనులకు శంకుస్థాపన చేశారు. మరికొన్ని నీటిపారుదల ప్రాజెక్టులు, అభివృద్ధి పనులకు పునాది రాయి వేశారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద నిర్మించిన ఇళ్ల లబ్ధిదారులకు తాళాలు అందజేశారు. ఇళ్ల నిర్మాణంలో గతంలో దళారీల ప్రమేయం ఉండేదని, ఇప్పుడు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోనే సొమ్ము జమ అవుతోందని ఈ సందర్భంగా ప్రధాని అన్నారు.



డాల్టన్‌గంజ్‌లో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద నిర్మించిన ఇల్లు తాళం చెవి, పత్రాలను మహిళకు అందిస్తున్న ప్రధాని మోదీ, పక్కన ఝార్ఖండ్ ముఖ్యమంత్రి రఘువర్ దాస్

చౌకీదార్ అంటే కాంగ్రెస్‌కు భయం

రక్షణ కొనుగోళ్లలో అవినీతికి పాల్పడిన కాంగ్రెస్ నేతలకు చౌకీదార్ అంటే భయం ఆవహించిందని మోదీ అన్నారు. ఒడిశాలోని బరిపద పట్టణంలో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ దళారీల ప్రయోజనం కోసం పనిచేస్తూ సైన్యాన్ని బలహీనపరిచిందని విమర్శించారు. అప్పట్లో వారు చేసిన తప్పులను వెలుగులోకి తెస్తున్నందువల్లనే బాధతో ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. వారి హయాంలో ప్రధాని కార్యాలయంలో జరిగే వ్యవహారాలన్నీ తొలుత దళారులకే తెలిసేవని చెప్పారు. "వారు ప్రభుత్వాన్ని నడిపారో, మిషెల్ మామ సొంత దర్బారును నడిపారో తెలియదు" అని వ్యాఖ్యానించారు. చౌకీదార్ ఉన్నంతకాలం వారి ఆటలు సాగబోవని అన్నారు. బరిపదలో రూ.4,500 కోట్లు విలువ చేసే కేంద్ర ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రారంభించారు. ఆ రాష్ట్రంలో ఆయన పర్యటించడం గత 15 రోజుల్లో ఇది రెండోసారి. డిసెంబరు 24న భువనేశ్వర్, ఖుర్దాల్లో పర్యటించారు. జాతీయ రహదారులు, రైల్వేలు వంటి ప్రాజెక్టులు ఇందులో ఉన్నాయి. ఇవన్నీ ఒడిశా ప్రజలకు నూతన సంవత్సర కానుకలని ప్రధాని అభివర్ణించారు. పలు పట్టణాల్లో ఏర్పాటు చేసిన పాసుపోర్టు సేవా కేంద్రాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు.



సిర్మౌర్ లోయలో పడిన బస్సు

హిమాచల్‌లో లోయలో పడిన బస్సు

ఆరుగురు విద్యార్థులు, డ్రైవర్ దుర్మరణం

సిమ్లా: హిమాచల్‌ప్రదేశ్‌లో విద్యార్థులతో వెళుతున్న ఓ ప్రైవేటు బస్సు శనివారం ఉదయం అదుపు తప్పి లోయలోకి దొర్లిపడడంతో ఆరుగురు బడి పిల్లలు, డ్రైవర్ మృతి చెందారు. సిర్మౌర్ జిల్లా సంగ్రాహ్‌లో జరిగిన ఈ ప్రమాదంలో మరో 12 మంది విద్యార్థులు గాయపడ్డారు.

జ్యుడిషియల్ కస్టడీకి మిషెల్

దిల్లీ: అగస్టావెస్ట్‌లాండ్ హెలికాప్టర్ల కొనుగోలు కుంభకోణం కేసులో మధ్యవర్తి క్రిస్టియన్ మిషెల్‌ను దిల్లీ కోర్టు శనివారం జ్యుడిషియల్ కస్టడీకి పంపింది. మిషెల్‌ను ప్రత్యేక కోర్టు జడ్జి ఎదుట హాజరుపరచగా మనీలాండరింగ్ కేసులో దర్యాప్తు నిమిత్తం జ్యుడిషియల్ కస్టడీకి అప్పగించాలని ఈడీ కోరింది. ఈడీ కేసులో ఫిబ్రవరి 26దాకా, సీబీఐ కేసులో ఫిబ్రవరి 27దాకా కోర్టు జ్యుడిషియల్ కస్టడీ విధించింది. ఇప్పటి వరకూ దర్యాప్తు ఫలవంతంగానే ఉందని ఈడీ కోర్టుకు తెలిపింది..

మేఘాలయకు రూ.వంద కోట్ల జరిమానా

గనుల అక్రమ తవ్వకాలపై ఎన్‌జీటీ ఆగ్రహం

దిల్లీ: నిబంధనలను తోసిరాజని అక్రమార్కులు యథేచ్ఛగా గనులు తవ్వుకుంటున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న మేఘాలయ రాష్ట్ర ప్రభుత్వంపై జాతీయ హరిత ట్రైబ్యునల్(ఎన్‌జీటీ) కన్నెర్ర చేసింది. ప్రభుత్వ నిష్క్రియాపరత్వాన్ని తప్పుబడుతూ శనివారం రూ.వంద కోట్ల జరిమానా విధించింది. 'కేంద్రీయ కాలుష్య నియంత్రణ మండలి' వద్ద రెండునెలల్లోగా డబ్బును జమ చేయాలని ఎన్‌జీటీ ఛైర్‌పర్సన్ ఎ.కె.గోయెల్ ఆదేశించారు. ఈ రూ.వంద కోట్లను మేఘాలయలో అక్రమంగా గనులు తవ్వుతున్న అక్రమార్కులు, వారిని అడ్డుకోవడంలో విఫలమైన అధికారుల నుంచి జరిమానాలుగా వసూలు చేసుకోవచ్చని రాష్ట్రప్రభుత్వానికి సూచించారు.

8,9 తేదీల్లో బ్యాంకుల సమ్మె

దిల్లీ: ప్రభుత్వరంగ బ్యాంకులకు చెందిన కొందరు సిబ్బంది జనవరి 8, 9 తేదీల్లో దేశవ్యాప్త సమ్మె చేయనున్నారు. దేశవ్యాప్తంగా పది కార్మిక సంఘాలు ఇదే తేదీల్లో చేస్తున్న సమ్మెకు తామూ సంఘీభావం తెలుపుతున్నట్లు భారతీయ బ్యాంకు సంఘాని(ఐబీఏ)కి అఖిలభారత బ్యాంకు ఉద్యోగుల సంఘం(ఏఐబీఈఏ), బ్యాంకు ఉద్యోగుల భారతీయ సంఘం నోటీసులు ఇచ్చాయి. ఫలితంగా ఆయా తేదీల్లో కొన్ని బ్రాంచిల్లో సేవలకు ఇబ్బంది కలిగే అవకాశం ఉందని ఐబీబీఐ బ్యాంకు, అలహాబాద్ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడా శనివారం బీఎస్ఈకి సమాచారం అందించాయి.

యూజీసీ నెట్ ఫలితాలు వెల్లడి

దిల్లీ: యూజీసీ నిర్వహించే జాతీయ అర్హత పరీక్ష (నెట్) ఫలితాలు శనివారం వెల్లడయ్యాయి. జాతీయ పరీక్షా సంస్థ (ఎన్‌టీఏ) తొలిసారిగా ఈ పరీక్షల నిర్వహణను చేపట్టింది. గత నెల 18-22 తేదీల మధ్య దేశవ్యాప్తంగా వీటిని నిర్వహించారు. మొత్తం 85 సబ్జెక్టుల్లో రెండు విడతలుగా జరిగిన ఈ పరీక్షలకు 6,81,930 మంది హాజరయ్యారు. వీరిలో సహాయ ఆచార్య పోస్టులకు 44,001 మంది; జేఆర్ఎఫ్-సహాయ ఆచార్య పోస్టులకు 3,883 మంది అర్హత సాధించారు.

అఖిలేశ్‌పై సీబీఐ దర్యాప్తు!

- ఇసుక అక్రమ తవ్వకాల కేసులో తనిఖీలు
- తెలుగు ఐఏఎస్ అధికారి చంద్రకళ నివాసాలు సహా పలుచోట్ల సోదాలు

దిల్లీ: ఇసుక అక్రమ తవ్వకాల కేసులో ఉత్తర్‌ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్‌యాదవ్‌పై సీబీఐ దర్యాప్తు చేపట్టే అవకాశముంది. శనివారం బయటికొచ్చిన సీబీఐ ఎఫ్ఐఆర్ ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో భాజపాకు వ్యతిరేకంగా ఎస్పీ, బీఎస్పీ చేతులు కలిపిన రోజే ఈ వ్యవహారం వెలుగులోకి రావడం విశేషం. 2012-16 మధ్య యూపీలోని హమీర్‌పూర్ జిల్లాలో ఇసుక, కంకర వంటి లఘు ఖనిజాల అక్రమ తవ్వకం ఆరోపణలపై దర్యాప్తులో భాగంగా ఎఫ్ఐఆర్‌లో నమోదైన 11 మందికి సంబంధించి 14 చోట్ల సీబీఐ శనివారం సోదాలు నిర్వహించింది. ఇందులో తెలుగువారైన ఐఏఎస్ అధికారి బి.చంద్రకళ ఒకరు.

అవినీతి వ్యతిరేక పోరాటంతోనే ప్రాచుర్యం!

2012-14 మధ్య చంద్రకళ హమీర్‌పూర్ జిల్లా మేజిస్ట్రేట్‌గా పనిచేశారు. ఆ సమయంలో జిల్లాలో గనుల కేటాయింపులో ఈ-టెండర్ వ్యవస్థను ఉల్లంఘించినట్లు ఎఫ్ఐఆర్ పేర్కొంది. అవినీతి వ్యతిరేక పోరాటం ద్వారానే ఆమె సామాజిక మాధ్యమాల్లో విశేష ప్రాచుర్యం పొందడం గమనార్హం. గనుల తవ్వకం కాంట్రాక్టుల కేటాయింపునకు సంబంధించి కొత్త లీజులు ఇవ్వడం, పునరుద్ధరణల్లో చంద్రకళ ఇతర అధికారులతో కలిసి నేరపూరిత కుట్రకు పాల్పడ్డారని, అప్పటికే ఉన్న లీజుదారులకు అడ్డంకులు సృష్టించారని, ఈ-టెండర్ వ్యవస్థను ఉల్లంఘించారని ఎఫ్ఐఆర్ స్పష్టం చేస్తోంది.



తెలంగాణలోనూ సోదాలు

చంద్రకళతోపాటు, సమాజ్‌వాది పార్టీ ఎమ్మెల్సీ రమేశ్‌కుమార్ మిశ్ర, సంజయ్‌దీక్షిత్‌ల పేర్లు కూడా ఎఫ్ఐఆర్‌లో ఉన్నాయి. ఈ మేరకు దేశ రాజధాని దిల్లీతోపాటు, యూపీలోని పలు జిల్లాల్లో సోదాలు జరిగాయి. ఈ సోదాల్లో రూ.12.5 లక్షల నగదు, ఆస్తిపత్రాలు, 1.8 కిలోల బంగారం స్వాధీనం చేసుకున్నారు. నోయిడా, లఖ్‌నవూలతో పాటు, తెలంగాణలోని చంద్రకళ నివాసాల్లోనూ సోదాలు చేపట్టారు. అక్రమాలు జరిగిన సమయంలో గనుల మంత్రుల పాత్రను కేసు దర్యాప్తులో పరిశీలించనున్నట్లు ఎఫ్ఐఆర్ పేర్కొంది. 2012-13 మధ్యలో నాటి యూపీ సీఎం అఖిలేశ్ గనుల శాఖను పర్యవేక్షించడంతో ఆయన పాత్రను కూడా పరిశీలించనున్నారు. అఖిలేశ్ తర్వాత మంత్రిత్వ శాఖ బాధ్యతలు చేపట్టిన గాయత్రి ప్రజాపతిని కూడా ప్రశ్నించే అవకాశం ఉంది. గనుల తవ్వకాలపై జాతీయ హరిత ట్రైబ్యునల్ నిషేధం ఉన్నా, 2012-16 మధ్య అక్రమ తవ్వకాలకు ప్రభుత్వ అధికారులు అనుమతులు ఇచ్చారని, లైసెన్సుల్ని పునరుద్ధరించారనే ఆరోపణలు ఉన్నాయి. 2016లో అలహాబాద్ హైకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ దర్యాప్తు చేపట్టింది. 2017లో పలు సెక్షన్ల కింద రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయగా, తాజాగా ఈనెల 2న మూడో ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.

చంద్రకళ స్వస్థలం రామగుండం



ఆరోపణలు ఎదుర్కొంటున్న చంద్రకళ స్వస్థలం తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా రామగుండం. ఆమె తండ్రి 'భారత ఎరువుల సంస్థ'లో విశ్రాంత సీనియర్ టెక్నీషియన్ కాగా భర్త ఎ.రాములు ఎస్సారెస్పీలో డిప్యూటీ ఈఈ. ఆమె ఇంటర్ వరకు రామగుండంలో చదివారు. కోఠిమహిళా కళాశాల నుంచి పట్టభద్రురాలయ్యారు. పీజీ చేశాక 2008లో తొలి ప్రయత్నంలోనే ఐఏఎస్ సాధించారు. యూపీ క్యాడర్ పొందారు.

మా దగ్గరే ఉండండి: ట్రంప్



వాషింగ్టన్: చదువు పూర్తయ్యాక కూడా విదేశీ విద్యార్థులు అమెరికాలోనే ఉండాలని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విజ్ఞప్తి చేశారు. అమెరికా సంస్థల వృద్ధికి దోహదపడాలని అభ్యర్థించారు. ప్రస్తుతం అనుసరిస్తున్న 'తెలివితక్కువ' వలస విధానం కారణంగా తమ దేశం గొప్ప మేధావులను దూరం చేసుకుంటోందని ట్రంప్ అన్నారు. ''దేశంలో ఎన్నో సంస్థలు ఏర్పాటవుతున్నాయి. వాటి కోసం మేధావులు కావాలి. అయితే ఇన్నేళ్లూ వస్తున్నట్లుగా వలసదారులు రాకూడదు. ప్రతిభ ఆధారంగానే వారికి ప్రవేశం కల్పించాలి. ఎక్కడెక్కడి నుంచో వచ్చి అమెరికాలోని అత్యుత్తమ విద్యాసంస్థల్లో చాలా మంది చదువుకుంటున్నారు. చదువు పూర్తయ్యాక తిరిగి సొంత దేశాలకు వెళ్తున్నారు. వారిని మనం ఇక్కడ ఉండనివ్వడం లేదు'' అని ట్రంప్ అన్నారు.

'అత్యవసర పరిస్థితి' ప్రకటిస్తా

సరిహద్దుల్లో భారీ గోడను నిర్మించేందుకు అవసరమైతే జాతీయ అత్యవసర పరిస్థితి ప్రకటిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. గోడ నిర్మాణం కోసం నిధులను మంజూరు చేసేందుకు కాంగ్రెస్ నిరాకరిస్తుండటంతో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అనుమతితో నిమిత్తం లేకుండా తనకు లభించే అత్యవసర అధికారాల ద్వారా గోడను నిర్మించవచ్చని ఆయన అన్నారు. మెక్సికో నుంచి అక్రమ వలసలను అడ్డుకునేందుకు అమెరికా దక్షిణ సరిహద్దుల్లో భారీ గోడను నిర్మిస్తానని ట్రంప్ ఎన్నికలప్పుడే హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఈ ఏడాది దీని కోసం సుమారు రూ.39 వేల కోట్ల నిధులను మంజూరు చేసేందుకు కాంగ్రెస్ నిరాకరిస్తోంది. ఈ కారణంతోనే ఇటీవల ప్రభుత్వ వ్యయ బిల్లును తిరస్కరించింది. ఫలితంగా రెండు వారాలుగా ట్రంప్ ప్రభుత్వం పాక్షికంగా మూతపడింది. బిల్లు నుంచి గోడ నిర్మాణ అంశాన్నీ తొలగించేందుకు ట్రంప్ అంగీకరించట్లేదు. ఈ నేపథ్యంలో స్తబ్దతను తొలగించేందుకు ప్రతిపక్ష డెమోక్రటిక్ పార్టీ అగ్ర నేతలతో ఆయన తాజాగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అత్యవసర పరిస్థితి ప్రకటించి గోడ నిర్మించే అవకాశం తనకు ఉన్నట్లు ట్రంప్ వ్యాఖ్యానించినట్లు డెమోక్రటిక్ నేతలు తెలిపారు.

కన్నూర్‌లో బాంబుల మోత!

- కేరళలో భాజపా, సీపీఎం పరస్పర దాడులు

కోచి, కన్నూర్, తిరువనంతపురం: శబరిమల అయ్యప్ప ఆలయంలోకి 50 ఏళ్ల వయసు లోపు మహిళలను అనుమతించడాన్ని వ్యతిరేకిస్తూ హిందూ సంస్థలు చేపడుతున్న నిరసన ఇంకా హింసాత్మకంగానే కొనసాగుతోంది. శనివారం కన్నూర్‌లో భాజపా-ఆర్ఎస్ఎస్, సీపీఎం కార్యకర్తలు పరస్పరం దాడులకు పాల్పడ్డారు. ఇళ్లు, దుకాణాలపై బాంబులు విసురుకున్నారు. సీపీఎం శాసనసభ్యుడు షంశీర్, ఆ పార్టీ కన్నూర్ జిల్లా కార్యదర్శి పి.శశి, భాజపా రాజ్యసభ సభ్యుడు మురళీధరన్ నివాసాలపైకి శుక్రవారం అర్ధరాత్రి బాంబులు విసిరారు. ఈ ఘటనల్లో ఎవరూ గాయపడలేదని పోలీసులు వెల్లడించారు. ఘర్షణలు, దాడులతో కోజికోడ్, మళప్పురం, అదూర్, పథనంథిట్ట తదితర ప్రాంతాలు అట్టుడికిపోతున్నాయి. అల్లర్లకు సంబంధించి ఇప్పటివరకు 1,286 కేసులు నమోదుచేసి, 3,282 మందిని అరెస్టు చేసినట్టు డీజీపీ లోక్‌నాథ్ బెహరా వెల్లడించారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితిని గవర్నర్ పి.సదాశివం శనివారం కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌కు వివరించారు.

మీరే కారణం... కాదు మీరే...

రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు భాజపా-ఆర్ఎస్ఎస్‌లు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయనీ, ఆలయాల్లోనూ, ఆ పార్టీ నేతల ఆధ్వర్యంలో నడిచే విద్యా సంస్థల్లోనూ ఆయుధాలను నిల్వ చేశాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్ ఆరోపించారు. మరోవైపు- భాజపా జాతీయ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. శబరిమల ప్రాంతంలో చెలరేగిన నిరసనలను సమర్థంగా చల్లార్చడం మాని, ప్రభుత్వమే వాటిని దగ్గరుండి హింసాత్మకంగా మార్చేసిందని ఆరోపించారు.

కశ్మీరును కప్పేసిన మంచుదుప్పటి



శ్రీనగర్‌లో పడవపై పడిన మంచును సరస్సులోకి తోస్తున్న కశ్మీర్‌వాసి

శ్రీనగర్, జమ్ము: జమ్మూకశ్మీరులో శ్రీనగర్, కశ్మీరులోయను మంచుదుప్పటి కప్పేసింది. శుక్రవారం సాయంత్రం నుంచి మొదలైన హిమపాతం కారణంగా శ్రీనగర్, కశ్మీరులోయను చేరే అన్ని జాతీయ రహదారులపై వాహనాల రాకపోకలను నిలిపివేశారు. జమ్మూ విమానాశ్రయంలో విమానాల రాకపోకలను రద్దు చేశారు. పలుచోట్ల 10-17 అంగుళాల మేర మంచు పేరుకుపోయింది. విపరీతంగా కురుస్తున్న మంచు కారణంగా గాల్లో ఆక్సిజన్‌శాతం తగ్గిపోయి(అస్ఫిక్సియేషన్) ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు శనివారం ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఎనిమిదేళ్లు, ఐదేళ్లుగల ఇద్దరు చిన్నారులు ఉన్నారు. మరోవైపు ఇంటిపై పేరుపోయిన మంచును తొలగించే ప్రయత్నంలో ముంతాజ్ అహ్మద్ అనే వ్యక్తి కింద పడి మరణించారు.



మార్కెట్ కూడలిలో కారుపై మంచును తొలగిస్తున్న మహిళ

ఛాంపియన్స్



ప్రైజ్‌మనీ
విజేత బెంగళూరు బుల్స్‌కు రూ.3 కోట్లు,
రన్నరప్ గుజరాత్ జట్టుకు రూ.1.8 కోట్లు

ఈసారి అత్యధికం..
ట్యాకిల్ పాయింట్లు- నితేశ్ కుమార్ (100, యూపీ యోధ)
సూపర్ రైడ్‌లు- పవన్ షెరావత్ (12)
సూపర్ 10లు- పర్దీప్ నర్వాల్ (15, పట్నా పైరేట్స్)
సూపర్ ట్యాకిళ్లు- విశాల్ భరద్వాజ్ (9, తెలుగు టైటాన్స్)
అత్యధిక పాయింట్లు సాధించిన జట్టు- బెంగళూరు బుల్స్ (887)

బుల్స్ కుమ్మేసింది

పీకేఎల్- 6 విజేత బెంగళూరు



271
ఈ సారి లీగ్‌లో పవన్ షెరావత్ సాధించిన పాయింట్లు. టోర్నీలో టాప్ స్కోరర్ అతడే.

ఫైనల్లో గుజరాత్‌పై విజయం

క్షణక్షణానికి ఉత్కంఠ... పాయింటు పాయింటుకు చేతులు మారే ఆధిపత్యం.. నిమిషాలు గడుస్తున్న కొద్దీ పెరిగే గుండె వేగం... ఇదీ బెంగళూరు, గుజరాత్ మధ్య ప్రొ కబడ్డీ ఫైనల్ సాగిన తీరు. హోరాహోరీ పోరులో చివరికి బెంగళూరే పైచేయి సాధించింది. పవన్ షెరావత్ మాయతో చివరి పంగాలో విజయం సాధించిన బుల్స్.. తొలి సారి పీకేఎల్ ఛాంపియన్‌గా అవతరించింది. మూడు నెలల పాటు అలరించిన ప్రొ కబడ్డీ రసవత్తర పోరుతో ముగిసింది.

ముంబయి

ప్రొ కబడ్డీ ఆరో సీజన్‌కు అసలు సిసలైన ముగింపు లభించింది. ఆద్యంతం హోరాహోరీగా సాగిన ఫైనల్లో విజయం సాధించిన బెంగళూరు బుల్స్ కొత్త ఛాంపియన్‌గా అవతరించింది. సూపర్ ఫామ్‌లో ఉన్న పవన్ షెరావత్ 22 రైడ్ పాయింట్లు సాధించి ఒంటిచేత్తో బెంగళూరుకు విజయాన్ని అందించాడు. శనివారం జరిగిన ఫైనల్లో ఆ జట్టు 38-33 తేడాతో గుజరాత్ ఫార్చ్యూన్‌జెయింట్స్‌పై గెలుపొంది సగర్వంగా ట్రోఫీని ముద్దాడింది. పీకేఎల్‌లో బెంగళూరు విజేతగా నిలవడం ఇదే తొలిసారి. మరోవైపు గుజరాత్ వరుసగా రెండోసారి రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. గత సీజన్ ఫైనల్లో గుజరాత్.. పట్నా చేతిలో ఓడిన సంగతి తెలిసిందే.

ఒకేఒక్కడు: పీకేఎల్ ఆరో సీజన్ విజేతగా నిలిచి బెంగళూరు సంబరాల్లో మునిగిపోవడానికి.. గుజరాత్ ఓటమి బాధతో నిరాశలో కూరుకుపోవడానికి ప్రధాన తేడా ఒకే ఒక్కడు.. అతనే పవన్ షెరావత్. ఈ సీజన్‌లో అత్యధిక పాయింట్లు సాధించిన రైడర్ల జాబితాలో అగ్రస్థానంలో ఉన్న పవన్ ఫైనల్లో అసాధారణ ప్రదర్శనతో మ్యాచ్ గమనాన్ని మార్చేశాడు. వెనకబడ్డ జట్టును ముందుకు నడిపి చివరకు విజయాన్ని అందించాడు. మ్యాచ్ ఆరంభంలో రెండు జట్లు నువ్వా-నేనా అన్నట్లు తలపడ్డాయి. పాయింట్ల కోసం ఆటగాళ్లు తీవ్రంగా పోటీపడడంతో 11 నిమిషాల ఆట ముగిసే సరికి స్కోరు 7-7తో సమమైంది. అయితే సచిన్ (10), ప్రపంజన్ (5) రాణించడంతో గుజరాత్ 16-9 ఆధిక్యంతో తొలి అర్ధభాగాన్ని ముగించింది. విరామం తర్వాత కూడా ఆ జట్టు వరుస పాయింట్లు సాధించి ఓ దశలో 19-14తో నిలిచింది. దాంతో బెంగళూరు ఓడిపోయేలా కనిపించింది. కానీ అప్పుడే పవన్ మాయ మొదలైంది. సూపర్ రైడ్‌లతో విరుచుకుపడిన అతను జట్టు స్కోరును పెంచాడు. ప్రత్యర్థిని ఆలౌట్ చేసి బెంగళూరు మరో పది నిమిషాల్లో ఆట ముగుస్తుందనగా 23-22తో తొలిసారి ఆధిక్యాన్ని సాధించింది. ఆ తర్వాత రెండు జట్ల ఆటగాళ్లు పాయింట్ల కోసం పోరాడడంతో ఆధిపత్యం చేతులు మారుతూ వచ్చింది. మరో నాలుగు నిమిషాల ఆట మాత్రమే ఉందనగా స్కోరు 29-29తో సమమైంది. ఆ దశలో పవన్ మళ్లీ విజృంభించాడు. వరుసగా పాయింట్లు తెచ్చి గుజరాత్‌ను మరోసారి ఆలౌట్ చేయడంలో కీలక పాత్ర పోషించాడు. దాంతో చివరి రెండు నిమిషాల ఆట ఉందనగా 36-29తో ఆధిక్యంలోకి దూసుకెళ్లిన బెంగళూరు చివరకు మ్యాచ్ సొంతం చేసుకుంది.



రోహిత్‌ను అడ్డుకునే ప్రయత్నంలో గుజరాత్ ఆటగాళ్లు

సెమీస్‌లో ముంబయి రాకెట్స్

అహ్మదాబాద్: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ నాలుగో సీజన్‌లో ముంబయి రాకెట్స్ సెమీస్‌కు దూసుకెళ్లింది. శనివారం ముంబయి 5-0 తేడాతో చెన్నైపై గెలిచింది. ముంబయి ట్రంప్ మ్యాచ్‌గా ఎంచుకొన్న పురుషుల సింగిల్స్‌లో సమీర్ వర్మ 12-15, 15-13, 15-9తో కశ్యప్‌పై గెలిచి జట్టుకు విజయాన్ని ఖరారు చేశాడు. అంతకుముందు చెన్నై ట్రంప్ మ్యాచ్‌గా ఎన్నుకొన్న మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ ముంబయి నెగ్గింది. మరో మ్యాచ్‌లో బెంగళూరు 4-3తో నార్త్ ఈస్టర్న్‌పై నెగ్గింది.

ఫైనల్లో నిఖత్‌జరీన్



విజయనగర: జాతీయ మహిళల బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ అమ్మాయి నిఖత్ జరీన్ ఫైనల్లోకి ప్రవేశించింది. శనివారం జరిగిన 51 కేజీల విభాగాల సెమీస్‌లో నిఖత్ 5-0తో వన్‌లై దుతి (ఏఐపీ)ని చిత్తు చేసింది. ఫైనల్లో ఆమె.. పింకీ జంగ్రాతో అమీతుమీ తేల్చుకోనుంది. మరో సెమీస్‌లో పింకీ 5-0తో మీనాక్షిని ఓడించింది.

థాయ్‌లాండ్‌తో భారత్ ఢీ

అబుదాబి: ఏఎఫ్‌సీ ఆసియా కప్ ఫుట్‌బాల్‌లో ఆదివారం జరిగే గ్రూప్-ఎ తొలి మ్యాచ్‌లో భారత్.. థాయ్‌లాండ్‌తో తలపడనుంది. ఫిఫా ర్యాంకింగ్స్‌లో భారత్ 97వ స్థానంలో ఉంటే.. థాయ్‌లాండ్ 118వ ర్యాంకులో ఉంది. చివరిగా 2010లో ఈ రెండు జట్లు రెండుసార్లు తలపడగా.. థాయ్‌లాండే గెలిచింది. మొత్తం 24 జట్లు ఆడుతున్న ఈ టోర్నీలో నాకౌట్ దశకు చేరేందుకు భారత్‌కు మంచి అవకాశాలున్నాయి. 1964లో రన్నరప్‌గా నిలవడమే టోర్నీలో భారత జట్టు అత్యుత్తమ ప్రదర్శన.

దక్షిణాఫ్రికా లక్ష్యం 41

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాతో మూడు టెస్టుల సిరీస్ పాకిస్థాన్ చేజారినట్లే. తొలి టెస్టులో ఓటమి పాలైన పాక్.. రెండో టెస్టులోనూ పరాజయం అంచున నిలిచింది. ఈ మ్యాచ్‌లో ప్రత్యర్థి ముందు ఆ జట్టు కేవలం 41 పరుగుల లక్ష్యాన్ని నిలిపింది. తొలి ఇన్నింగ్స్‌లో 254 పరుగులు వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన పాక్.. 294 పరుగులకు ఆలౌటైంది. షాన్ మసూద్ (61), అసద్ షఫీక్ (88), బాబర్ అజామ్ (72) పోరాడినా.. మిగతా బ్యాట్స్‌మెన్ విఫలమవడంతో పాక్ 40 పరుగుల ఆధిక్యమే సాధించగలిగింది. రబాడ (4/61), స్టెయిన్ (4/85) ఆ జట్టును దెబ్బ తీశారు. పాక్ ఇన్నింగ్స్ ముగియడంతోనే మూడో రోజు ఆటకు తెరపడింది. అంతకుముందు 382/6తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా 431 పరుగులకు ఆలౌటైంది. ఆదివారం దక్షిణాఫ్రికా 41 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి సిరీస్‌లో 2-0 ఆధిక్యం సాధించడం లాంఛనమే కావచ్చు.

తిసార పోరాటం వృథా



తిసార

వన్డే సిరీస్ న్యూజిలాండ్‌దే

మౌంట్ మౌంగనుయ్ (న్యూజిలాండ్): తిసార పెరీరా (140; 74 బంతుల్లో 8×4, 13×6) అసాధారణంగా పోరాడినా శ్రీలంకకు ఓటమి తప్పలేదు. ఉత్కంఠభరిత రెండో వన్డేలో 21 పరుగుల తేడాతో నెగ్గిన న్యూజిలాండ్ మరో వన్డే ఉండగానే మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0తో సొంతం చేసుకుంది. 320 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన లంక 46.2 ఓవర్లలో 298 పరుగులకు ఆలౌటైంది. 26.5 ఓవర్లలో 128/7తో ఘోర పరాజయం తప్పదనుకున్న లంకను విధ్వంసకర ఇన్నింగ్స్‌తో పెరీరా విజయానికి చేరువ చేశాడు. ఐతే.. భారీ షాట్ కొట్టే ప్రయత్నంలో అతడు ఔటవడంతో లంక కథ ముగిసింది. సోధి (3/55), హెన్రి (2/52) లంకను కట్టడి చేశారు. అంతకుముందు మన్రో (87), రాస్ టేలర్ (90), నీషమ్ (64) చెలరేగడంతో కివీస్ 7 వికెట్లకు 319 పరుగులు చేసింది.

వికెట్ నుంచి పెద్దగా సహకారం లేదు. బంతి పెద్దగా బౌన్స్ కావట్లేదు. తిరగట్లేదు. ఆస్ట్రేలియా ఓపెనర్లు సాధికారికంగా ఆడేస్తున్నారు. ఆట సాగుతున్న తీరు చూస్తే ఆస్ట్రేలియా కూడా భారీ స్కోరే చేసేలా కనిపించింది. మ్యాచ్ డ్రా దిశగా సాగేలా కనిపించింది. కానీ పిచ్ ఎలా ఉన్నా.. క్రమశిక్షణతో బౌలింగ్ చేస్తే.. ఒత్తిడి పెంచితే.. వ్యూహాలు సరిగ్గా అమలు చేస్తే వికెట్లు వాటంతటవే వస్తాయని రుజువు చేసింది భారత బృందం. ఫలితం.. చివరి టెస్టులో మూడో రోజు ఆట ఆఖరుకు ఆస్ట్రేలియా స్కోరు 236/6. వాతావరణం అనుకూలించక గంటకు పైగా ఆటకు నష్టం వాటిల్లింది కానీ.. లేదంటే శనివారమే ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ ముగిసేదేమో! ఐతే రెండు రోజుల ఆట మిగిలున్న నేపథ్యంలో భారత బౌలర్లు పట్టుదల కొనసాగిస్తే.. 3-1తో సిరీస్ విజయం సాధ్యమే!

సిడ్నీ మనవైపే!

వరుణుడు కరుణిస్తే...



కుల్‌దీప్ 3/71

- బ్యాటింగ్ వికెట్‌పై స్పిన్నర్ల అద్భుత బౌలింగ్
- ఆస్ట్రేలియా 236/6

సిడ్నీ

ఆస్ట్రేలియాలో తొలి సిరీస్ విజయం దిశగా టీమ్‌ఇండియా వడివడిగా అడుగులు వేస్తోంది. చివరిదైన సిడ్నీ టెస్టును డ్రాగా ముగించినా సిరీస్‌ను సొంతం చేసుకునే స్థితిలో ఉన్న భారత్.. విజయం పైనే కన్నేసింది. తొలి ఇన్నింగ్స్‌లో కంగారూల ముందు కొండంత స్కోరును నిలబెట్టిన కోహ్లీసేన.. బంతితోనూ రాణించి ప్రత్యర్థిని కట్టడి చేసింది. స్పిన్నర్లు కుల్‌దీప్ యాదవ్ (3/71), రవీంద్ర జడేజా (2/62) సత్తా చాటడంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా 236/6తో నిలిచింది. ఓపెనర్ మార్కస్ హారిస్ (79; 120 బంతుల్లో 8×4) జట్టుకు మంచి ఆరంభాన్నిచ్చినా.. ఆసీస్ సద్వినియోగం చేసుకోలేకపోయింది. హాండ్స్‌కాంబ్ (28 బ్యాటింగ్), కమిన్స్ (25 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. 4 వికెట్లే చేతిలో ఉన్న ఆ జట్టు ఇంకా 386 పరుగులు వెనుకబడి ఉంది. వాతావరణం అనుకూలించకపోవడంతో శనివారం 73.3 ఓవర్లే పడ్డాయి.

అదరగొట్టిన హారిస్: ఓవర్‌నైట్ స్కోరు 24/0తో శనివారం ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా.. తొలి సెషన్లో ఆధిపత్యం చలాయించింది. గత మ్యాచ్‌లో తమను ఉక్కిరి బిక్కిరి చేసిన బుమ్రా సహా.. భారత బౌలర్లందరినీ ఓపెనర్లు హారిస్, ఖవాజా సమర్థంగా ఎదుర్కొన్నారు. ముఖ్యంగా హారిస్ ఆట మూడో రోజు ఆటకే హైలైట్. ఈ సిరీస్ మొత్తంలో ఒక ఆస్ట్రేలియా బ్యాట్స్‌మన్ ఆడిన అత్యుత్తమ ఇన్నింగ్స్ ఇదే అని చెప్పొచ్చు. మిగతా ఆసీస్ బ్యాట్స్‌మెన్‌కు భిన్నంగా ఆత్మవిశ్వాసంతో ఆడిన హారిస్.. పేసర్లు, స్పిన్నర్లను దీటుగా ఎదుర్కొన్నాడు. కుల్‌దీప్, జడేజాల బౌలింగ్‌లో చూడముచ్చటైన కట్ షాట్లు, లాఫ్టెడ్ షాట్లతో అతను అలరించాడు. క్రీజులో కుదురుకున్నాక ఖవాజా కూడా షాట్లకు దిగాడు. ఐతే భారత బౌలర్లు ప్రయత్నం ఆపలేదు. క్రమశిక్షణ కొనసాగించారు. జట్టు స్కోరు 72/0 వద్ద కుల్‌దీప్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించిన ఖవాజా (27).. మిడ్‌వికెట్లో పుజారాకు దొరికాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన లబుషేన్ (38) నుంచి హారిస్‌కు చక్కటి సహకారం అందింది. ఇద్దరూ వికెట్ ఇవ్వకుండా తొలి సెషన్‌ను ముగించారు. స్కోరు 122/1.

24 పరుగులు.. 3 వికెట్లు: 30 ఓవర్లు.. 98 పరుగులు.. ఒక వికెట్. తొలి సెషన్ కచ్చితంగా ఆస్ట్రేలియాదే. కానీ రెండో సెషన్ నుంచి కథ మారింది. లంచ్ విరామం తర్వాత హారిస్ ఔటవడం ఆటలో మలుపు. స్పిన్నర్ల బౌలింగ్‌లో చక్కటి కట్ షాట్లు ఆడిన హారిస్.. జడేజా బంతికి అలాగే ప్రయత్నించాడు. బంతిని వికెట్ల మీదికి ఆడుకున్నాడు. కాసేపటికే అనుభవజ్ఞుడు షాన్ మార్ష్ (8)ను జడేజా బుట్టలో వేశాడు. ఉన్నంతసేపూ చక్కటి షాట్లు ఆడిన లబుషేన్ సైతం షమి బౌలింగ్‌లో ఔటైపోయాడు. 24 పరుగుల తేడాలో మూడు వికెట్లు కోల్పోయిన ఆసీస్.. 152/4తో కష్టాల్లో పడింది. ఈ దశలో హెడ్ (20)తో కలిసి హాండ్స్‌కాంబ్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. ఆసీస్ కాస్త పుంజుకుంటున్నట్లే కనిపించింది కానీ.. టీ విరామానికి కొన్ని నిమిషాల ముందు హెడ్‌ను కుల్‌దీప్ బోల్తా కొట్టించాడు. అతడి ఫుల్‌టాస్ బంతికి హెడ్ షాట్ ఆడబోగా గురి తప్పింది. చక్కటి రిటర్న్ క్యాచ్‌తో కుల్‌దీప్ అతడిని పెవిలియన్‌కు పంపించాడు. టీ విరామం తర్వాత పైన్ (5).. కుల్‌దీప్‌కు వికెట్ ఇచ్చాడు. పాదం కదపకుండా కుల్‌దీప్ ఆఫ్ కటర్‌ను డ్రైవ్ చేయబోగా.. అనూహ్యంగా టర్న్ అయిన బంతి వికెట్లను గిరాటేసింది. తర్వాత కూడా భారత బౌలర్లు ఒత్తిడి కొనసాగించారు కానీ.. హాండ్స్‌కాంబ్, కమిన్స్ పట్టుదలతో ఆడి వికెట్లు కాపాడుకున్నారు. తమ ప్రధాన బ్యాట్స్‌మెన్‌కు పాఠాలు నేర్పేలా కమిన్స్ మరోసారి సాధికారతతో బ్యాటింగ్ చేశాడు. వెలుతురు తగ్గిపోవడం, కొద్దిగా జల్లులు మొదలవడంతో అంపైర్లు గంట ముందే ఆట ముగించారు.

భారత్ తొలి ఇన్నింగ్స్: 622/7 డిక్లేర్డ్

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: హారిస్ (బి) జడేజా 79; ఖవాజా (సి) పుజారా (బి) కుల్‌దీప్ 27; లబుషేన్ (సి) రహానె (బి) షమి 38; షాన్ మార్ష్ (సి) రహానె (బి) జడేజా 8; హెడ్ (సి) అండ్ (బి) కుల్‌దీప్ 20; హాండ్స్‌కాంబ్ బ్యాటింగ్ 28; పైన్ (బి) కుల్‌దీప్ 5; కమిన్స్ బ్యాటింగ్ 25; ఎక్స్‌ట్రాలు 6 **మొత్తం:** (83.3 ఓవర్లలో 6 వికెట్లకు) **236;** **వికెట్ల పతనం:** 1-72, 2-128, 3-144, 4-152, 5-192, 6-198; **బౌలింగ్:** షమి 16-1-54-1; బుమ్రా 16-4-43-0; జడేజా 27.3-9-62-2; కుల్‌దీప్ 24-6-71-3

వర్షం దెబ్బ కొట్టడు కదా!

సిడ్నీ టెస్టులో ప్రస్తుత స్థితిలో టీమ్‌ఇండియా ఘనవిజయం ఖాయం! ఇన్నింగ్స్ ముగియడానికి మరీ ఎక్కువ సమయం పట్టకపోవచ్చు. ఈసారి ఆస్ట్రేలియాను ఫాలోఆన్ ఆడించే అవకాశాలే ఎక్కువ. భారత్ ఇన్నింగ్స్ విజయం సాధించడానికి మంచి ఛాన్సే ఉంది. కానీ వరుణుడు భారత్‌ను భయపెడుతున్నాడు. చివరి రెండు రోజుల్లో ఆటకు వర్షం ముప్పు ఉంది. ఓ మోస్తరు వర్షమైతే పర్వాలేదు. లేదంటే ఆటకు నష్టం వాటిల్లి ఆస్ట్రేలియా డ్రాతో బయటపడే అవకాశముంది. కాబట్టి భారత్ సిరీస్‌ను 3-1తో గెలుస్తుందా.. లేక 2-1తో సొంతం చేసుకుంటుందా అన్నది వరుణుడి చేతుల్లోనే ఉంది.

500 ఏళ్ల సంప్రదాయం

శివభక్త రెహ్మాన్!



అసోం: తరతరాలుగా ఆ ముస్లిం కుటుంబం శివుని సేవలో తరిస్తూ మత సామరాస్యానికి ప్రతీకగా నిలిచింది. గువాహటీలోని రంగమహల్ శివాలయం నిర్వహణ బాధ్యతలను ఆ కుటుంబమే చూసుకుంటూ వస్తోంది. రెహ్మాన్, ఆయన కుటుంబీకులు ఉదయం నిద్ర లేచినప్పటి నుంచీ ఆలయ పరిసరాలను శుభ్రం చేయడం, పూజకు సామగ్రి సిద్ధం చేయడం వంటి పనుల్లోనే కాలం గడుపుతుంటారు. అర్చకుడు లేని సమయంలో వారే దీపారాధన చేసి ప్రత్యేక పూజలు చేస్తుంటారు. తమ తండ్రులు, తాత ముత్తాతల నుంచి ఈ సంప్రదాయం వారసత్వంగా వచ్చిందని రెహ్మాన్ చెబుతుంటారు. 500 ఏళ్లుగా తమ వంశీకులు ఈ ఆచారాన్ని పాటిస్తున్నట్లు తెలిపారు. హిందువులు, ముస్లింలు వచ్చి ఇక్కడ పూజలు జరుపుతుంటారని చెప్పారు. ఆలయాన్ని పరిశుభ్రంగా ఉంచడం, సోదరభావాన్ని పెంపొందించడమే తమ అభిమతంగా రెహ్మాన్ చెబుతుంటారు.

1799 ప్రారంభం

చెప్పుకోవాల్సిన చరిత్ర

పశ్చిమబెంగాల్: ఎక్కడైనా ఏవైనా దుకాణాలు, సంస్థలు ప్రారంభించి 25, 50, 75, 100 ఏళ్లు పూర్తయితే సంబరాలు చేసుకుంటాయి. కానీ కోల్‌కతాలోని ఓ పాదరక్షల దుకాణం మాత్రం ఏకంగా 'ద్విశతాబ్ది'ని దాటేసింది. 1799లో ప్రారంభించిన ఈ దుకాణం దాదాపు 220 ఏళ్ల చరిత్రతో మహానగరంలో అప్రతిహతంగా కొనసాగుతోంది. బెంటింక్ వీధిలోని 'డీ-షీన్ అండ్ కో' పేరుతో ఉన్న ఈ దుకాణం అత్యంత ప్రాచీనమైనదిగా పేరొందింది. ఎప్పటికప్పుడు మార్పులు చేస్తూ నిర్వాహకులు దీన్ని కొత్త దుకాణంలా ఉంచుతుంటారు. అన్ని రకాల మోడళ్లూ ఇక్కడ అందుబాటులో ఉంటాయి. బౌద్ధాలయ నమూనాలు, చెక్క బొమ్మలు, ఏడో శతాబ్దపు చైనీయుల చరిత్రకు సంబంధించిన పలు ప్రాచీన వస్తువులు కూడా ఉంటాయి. వర్తకం కోసం వచ్చి కోల్‌కతాలో స్థిరపడిన చైనీయుల్లో ఒకరైన లిమ్‌క్యాయ్ వీ అప్పట్లో ఈ దుకాణాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన వారసులు దీన్ని కొనసాగిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం లిమ్, జాన్‌లు నిర్వహిస్తున్నారు. తమ వంశంలో ఎవరికీ తిరిగి బీజింగ్ వెళ్లాలనిపించలేదని, తాము బెంగాలీ చైనీయులమని ఆ కుటుంబీకులు గర్వంగా చెబుతున్నారు. సత్యజిత్ రే, బిధాన్ చంద్రరాయ్, గోగా కపూర్ వంటి ప్రముఖులు తమ దుకాణంలోనే బూట్లు కొనేవారని ఆనందం వ్యక్తం చేస్తుంటారు.

ఈటీవీ భారత్



2019 సంబరం

మోదీ పతంగం!



గుజరాత్: పతంగుల పండగంటే గుజరాత్ ప్రత్యేకంగా నిలుస్తుంటుంది. ఏటా ఇక్కడ జరిగే అంతర్జాతీయ ఉత్సవాలకు ఎప్పటికప్పుడు వైవిధ్యభరిత ఇతివృత్తాలతో గాలిపటాలను తయారు చేస్తుంటారు. ఈ ఏడాది నిర్వహించే '2019 ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్' కోసం రంగురంగుల పతంగుల సందడి మొదలైంది. వీటి విక్రయానికి పెద్ద ఎత్తున దుకాణాలు కూడా వెలిశాయి. ఈసారి మార్కెట్‌లో నరేంద్ర మోదీ, ఏకతా విగ్రహం, నోట్ల రద్దు, మెరుపుదాడుల చిత్రాలతో రూపొందించిన పతంగులు బాగా ఆకర్షిస్తున్నాయి. ఇలాంటి పతంగులు హాట్‌కేకుల్లా అమ్ముడవుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ప్రధానంగా రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక కేంద్రాలైన కచ్, వడోదర, అహ్మదాబాద్, సూరత్ ప్రాంతాల్లో వీటికి మంచి ఆదరణ లభిస్తోంది.

ఆంధ్రప్రదేశ్‌లో తెదేపాకు రెండు సీట్లే

- జగన్‌పై దాడిని చిన్న అంశంగా చూపుతున్నారు
- భాజపా రాజ్యసభ సభ్యుడు జి.వి.ఎల్.నరసింహారావు

ఈనాడు, దిల్లీ: తెలంగాణలో మాదిరే ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లోనూ తెదేపాకు రెండు సీట్లే వస్తాయని భాజపా రాజ్యసభ సభ్యుడు జి.వి.ఎల్.నరసింహారావు అన్నారు. దిల్లీలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో ఓటమి తర్వాత చంద్రబాబులో అసహనం పెరిగిపోయిందన్నారు. ఓటమి భయంతోనే చంద్రబాబు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. భాజపా మహిళా నాయకురాలిపై దారుణంగా వ్యవహరించారని ఆరోపించారు. ప్రతిపక్ష నేత ఎన్ఐఏ దర్యాప్తు చేస్తే వాస్తవాలు బయటకు వచ్చి జాతకాలు తారుమారవుతాయని చంద్రబాబు భయపడుతున్నారని ఆయన పేర్కొన్నారు. జగన్‌పై దాడిని ఆయన చిన్న అంశంగా చూపుతున్నారన్నారు. ఎన్ఐఏ దర్యాప్తునకు ఆయన ఎందుకు భయపడుతున్నారో తెలపాలన్నారు. శబరిమలలో భక్తుల మనోభావాలు దెబ్బతినేలా కేరళ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు.



హనుమాన్ చాలీసా కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు.. చిత్రంలో మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, గణపతి సచ్చిదానందస్వామి తదితరులు

ధర్మ రక్షణకు సంకల్పించాలి

- హనుమాన్ చాలీసా పారాయణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

కృష్ణలంక(విజయవాడ), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రజలంతా హనుమంతుడి ఆశీస్సులతో ధర్మాన్ని రక్షించేందుకు సంకల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. విజయవాడలోని పద్మావతి ఘాట్‌లో శనివారం హనుమాన్ చాలీసా పారాయణంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. కృష్ణా నదీ తీరంలో దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆధ్వర్యంలో ఈ యజ్ఞాన్ని చేపట్టడం ఆనందంగా ఉందని అన్నారు. దేశంలోని ఐదు అగ్ర నగరాల్లో అమరావతి నిలిచేలా నిర్మించడమే ప్రస్తుతం తన సంకల్పమని, దీనికి హనుమంతుడి ఆశీస్సులు తోడుంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి తమలపాకులతో దేవుడి పూజలు చేశారు. ముఖ్యమంత్రి వెళ్లాక జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దాదాపు గంటసేపు భక్తులతోపాటు వేదికపై కూర్చొని చాలీసా పారాయణం చేశారు.

నేడు గంటసేపు కేబుల్ ప్రసారాల నిలిపివేత

- కృష్ణా సంయుక్త కలెక్టర్ అనుచిత వ్యాఖ్యలపై ఆపరేటర్ల నిరసన

పటమట/కరెన్సీనగర్(విజయవాడ), న్యూస్‌టుడే: కేబుల్ ఆపరేటర్లు, ఎంఎస్‌ఓలను కృష్ణా జిల్లా సంయుక్త కలెక్టర్ విజయ్ కృష్ణన్ పరుష పదజాలంతో దూషించడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు కేబుల్ ప్రసారాలను నిలిపివేస్తున్నట్లు ఏపీ మల్టీ సిస్టమ్ ఆపరేటర్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ అధ్యక్షుడు పొట్లూరి సాయిబాబు తెలిపారు. విజయవాడలో శనివారం రాత్రి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాధ్యతగల పదవిలో ఉన్న విజయ్‌కృష్ణన్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. దీన్ని రాష్ట్రంలోని ఆపరేటర్లు, ఎంఎస్‌ఓలు అందరూ ఖండిస్తున్నారని చెప్పారు. తమ బాధను వ్యక్తపరచడానికే ప్రసారాలను నిలిపివేస్తున్నామని, ప్రేక్షకులు సహకరించాలని కోరారు. ఏపీ కేబుల్ ఆపరేటర్స్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కేవీ శ్రీనివాసరావు, గుంటూరు సిటీకేబుల్ ఎండీ కృష్ణమోహన్ మాట్లాడారు.

మా ప్రసారాలు యథాతథం

సమాఖ్య ఇచ్చిన బంద్‌లో తాము పాల్గొనట్లేదని, ఆదివారం ఉదయం కేబుల్ ప్రసారాలు యథాతథంగానే కొనసాగుతాయని ఏపీఎంఎస్‌ఓల వెల్ఫేర్ సంఘం గౌరవ అధ్యక్షుడు కడియాల బుచ్చిబాబు అన్నారు. జేసీ వ్యాఖ్యలు తమను ఉద్దేశించినవి కావని శనివారం రాత్రి విజయవాడలో ఆయన విలేకర్లతో అన్నారు.

పెట్రోల్ బంకుల్లో ఫాస్ట్‌ట్యాగ్‌ల విక్రయం

ఈనాడు, దిల్లీ: జాతీయ రహదారుల టోల్‌గేట్ల వద్ద ఆటోమేటిక్‌గా చెల్లింపులు జరిపేందుకు ఉద్దేశించిన ఫాస్ట్‌ట్యాగ్‌లను పెట్రోలు బంకుల వద్ద విక్రయించడానికి వీలుగా ఇండియన్ హైవేస్ మేనేజ్‌మెంట్ కంపెనీ శనివారం ప్రభుత్వ రంగ చమురు సంస్థలతో ఒప్పందం చేసుకొంది. ఈ కంపెనీ జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) ఆధ్వర్యంలో నడిచే సంస్థ. తొలిదశలో వీటిని దిల్లీ, ఎన్‌సీఆర్ పరిధిలోని 50 పెట్రోల్ బంకుల్లో విక్రయిస్తారు. తర్వాత దేశవ్యాప్తంగా విక్రయిస్తారు. ఈ సంస్థ 2016 ఏప్రిల్ నుంచి 'ఫాస్ట్‌ట్యాగ్' పేరుతో కొత్త ఎలక్ట్రానిక్ చెల్లింపు విధానాన్ని తీసుకొచ్చింది. దేశవ్యాప్తంగా 450 టోల్‌ప్లాజాల వద్ద ఫాస్ట్‌ట్యాగ్ చెల్లింపులు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఈ ట్యాగ్‌లను అధీకృత బ్యాంకులు మాత్రమే టోల్‌ప్లాజాల వద్ద పాయింట్ ఆఫ్ సేల్, ఆన్‌లైన్ ద్వారా విక్రయిస్తున్నాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఫాస్ట్‌ట్యాగ్-జీఎస్‌టీని కలిపి దేశంలోని అన్ని టోల్‌ప్లాజాల వద్ద అనుమతించే ఏర్పాటు చేసింది. దీనివల్ల ఫాస్ట్‌ట్యాగ్‌ల అవసరం బాగా పెరగడంతో వినియోగదారులకు సులభంగా అందుబాటులోకి తేవడానికి పెట్రోల్ బంకుల్లో కూడా విక్రయించాలని నిర్ణయించారు.

ఆర్టీసీలో కారుణ్య నియామకాల భర్తీ

దరఖాస్తుల ఆహ్వానం

ఈనాడు డిజిటల్, అమరావతి: కారుణ్య నియామకాల కింద పలు పోస్టులు భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీఎస్‌ఆర్టీసీ కార్యనిర్వాహక సంచాలకులు ఎ.కోటేశ్వరరావు తెలిపారు. వీటిని 5 దఫాలుగా భర్తీ చేయాలని నిర్ణయించినట్లు శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. డ్రైవర్, కండక్టర్, శ్రామిక్ పోస్టుల నియామకాలను ఇప్పటికే మొదలుపెట్టామని, అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేసి వారి జాబితాను పంపాలని అన్ని డిపోల మేనేజర్లను కోరినట్లు తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలన, శారీరక పరీక్షల అనంతరం అర్హుల జాబితాను సంస్థ చీఫ్ మేనేజర్‌కు పంపాలని అందులో సూచించారు.

ఆర్జిత సెలవుల బకాయిల చెల్లింపునకు అంగీకారం

2016 సంవత్సరానికి సంబంధించి సిబ్బందికి ఆర్జిత సెలవుల(ఈఎల్) బకాయిలను చెల్లించేందుకు ఏపీఎస్‌ఆర్టీసీ అంగీకారం తెలిపింది. జనవరి 11లోగా అన్ని రీజియన్‌ల సెలవుల రికార్డులను లెక్కించి ఎన్‌క్యాష్‌మెంట్ బిల్లుల్ని సమర్పించాలని ఆర్టీసీ ఈడీ ఎ.కోటేశ్వరరావు శనివారం తెలిపారు.

మరో నాలుగు సువిధ ప్రత్యేక రైళ్లు

ఈనాడు, హైదరాబాద్: సంక్రాంతి సమయంలో మరో నాలుగు సువిధ ప్రత్యేక రైళ్లను రాయనపాడు మీదుగా నడపనున్నట్లు ద.మ.రైల్వే శనివారం తెలిపింది. ఈ నెల 11న సికింద్రాబాద్ నుంచి విశాఖకు, తిరుగుప్రయాణం 12న విశాఖ నుంచి సికింద్రాబాద్‌కు 2 సర్వీసులు నడపనున్నట్లు సీపీఆర్వో సీహెచ్.రాకేశ్ తెలిపారు. 17న కాకినాడ నుంచి భీమవరం మీదుగా హైదరాబాద్‌లోని లింగంపల్లి వరకు, 20న మచిలీపట్నం నుంచి సికింద్రాబాద్‌కు మరో రెండు సర్వీసులు అందుబాటులో ఉంటాయన్నారు.

ఒకే కుటుంబంలో ఆరుగురి బలవన్మరణం

- ఉరేసుకుని భర్త..విషం తాగి భార్య, నలుగురు ఆడపిల్లల మృతి

గంగావతి, న్యూస్‌టుడే: ఆ కుటుంబాన్ని ఏ కష్టం వేధించిందో తెలీదుకానీ ఆరుగురు ఒకేసారి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఇంటి యజమాని ఉరేసుకొని ప్రాణాలు తీసుకోగా..ఆ ఇల్లాలు, నలుగురు ఆడపిల్లలు విషం తాగి మృతిచెందారు. గుండెలు పిండేసే ఈ దారుణ ఘటన శనివారం కర్ణాటకలోని కొప్పళ జిల్లా మెతగల్ గ్రామంలో వెలుగు చూసింది. మెతగల్‌లో నివాసముంటున్న శేఖరయ్య బిడనాళ(42)కు భార్య జయమ్మ(39), నలుగురు ఆడపిల్లలు ఉన్నారు. వీరిలో బసమ్మ(23), గౌరమ్మ(20)లకు వివాహంకాగా, సావిత్రి(18), పార్వతి(16) అవివాహితులు. భార్య, నలుగురు పిల్లలు విషం తాగారు. శేఖరయ్య ఉరేసుకుని మృతి చెందారు. శుక్రవారం సాయంత్రం నుంచి ఇంటి తలుపులు వేసుకున్నారు. రాత్రి సమయంలో బలవన్మరణానికి పాల్పడి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. శనివారం ఉదయం తలుపులు తెరవకపోవడంతో ఇరుగు పొరుగువారు వెళ్లి చూడటంతో మొత్తం కుటుంబం ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. గ్రామస్థులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వీరి బలవన్మరణానికి గ్రామస్థులు విభిన్న కారణాలు చెబుతున్నారు. బ్యాంకులు, ప్రైవేటు వ్యక్తుల వద్ద రూ.5 లక్షల దాకా అప్పులు ఉన్నాయని అవి తీర్చే దారి లేక మృతి చెందారని కొందరు పేర్కొనగా.. కుటుంబ కలహాలు పొట్టనబెట్టుకున్నాయని మరి కొందరు అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీట్ల పెంపు!

ఈనాడు, అమరావతి: రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీట్లు పెరిగే అవకాశాలు ఉన్నాయి. శ్రీకాకుళం, అనంతపురం, కడప రిమ్స్‌లో ఎంబీబీఎస్‌లో సీట్ల పెంపునకు వైద్య విద్య సంచాలక కార్యాలయం ప్రతిపాదించింది. ఈ మేరకు ఏర్పాట్లు ఉన్నాయా లేవా అనే అంశంపై జాతీయ వైద్య మండలి ద్వారా తనిఖీలు నిర్వహిస్తున్నారు. వీటి ఆధారంగా శ్రీకాకుళం, అనంతపురం రిమ్స్‌లో ప్రస్తుతం వంద చొప్పున ఉన్న ఎంబీబీఎస్ సీట్లు 150కి పెరిగే అవకాశాలు ఉన్నాయని వైద్య విద్య సంచాలకులు ప్రొఫెసర్ బాబ్జీ తెలిపారు. కడప రిమ్స్‌లో 150 సీట్లు ఉండగా అదనంగా 50 ఇవ్వాలని అధికారులు ప్రతిపాదించారు. ఇది జరగకపోవచ్చునని భావిస్తున్నారు. పీజీ వైద్య సీట్ల కోసం శ్రీకాకుళం రిమ్స్‌లో 14 పీజీ, ఒంగోలు రిమ్స్‌లో 4 చొప్పున పీజీ వైద్య సీట్లకు ఎంసీఐ నుంచి ఇప్పటివరకు సానుకూలత వచ్చినట్లు తెలిసింది. ఇంకా మరికొన్ని విభాగాల్లో సీట్లు రావచ్చునని భావిస్తున్నారు. శ్రీకాకుళం రిమ్స్‌లో ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, అనెస్తీషియా, సోషల్ అండ్ ప్రివెంటివ్ మెడిసిన్, ఇతర కేటగిరిల్లో సీట్ల పెంపునకు ఎంసీఐ నుంచి స్పష్టత వచ్చినట్లు తెలిసింది.

శ్రీగంధం దొంగల అరెస్టు

- భారీగా నగదు, నగలు స్వాధీనం చేసుకున్న బెంగళూరు పోలీసులు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: కర్ణాటక రాజధాని నగరం బెంగళూరు, ఆ చుట్టుపక్కల విస్తరించిన శ్రీగంధం చెట్లను నరికి దుంగలను విక్రయించే కీలక ముఠా సభ్యులు సయ్యద్ రియాజ్ (49), ఆయన తనయుడు సయ్యద్ షేర్ అలీ అలియాస్ బాబా(27)లను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. నగర సమీప కట్టిగేనహళ్లికి చెందిన నిందితులు చాన్నాళ్లుగా పోలీసులను తప్పించుకుని తిరుగుతున్నారు. ఆ ఇద్దరూ నగర శివార్లలోని ఓ ప్రాంతంలో ఉన్నారనే సమాచారం అందుకున్న బెంగళూరు కేంద్ర నేర నియంత్రణ విభాగం (సీసీబీ) అధికారులు శనివారం తెల్లవారుజామున 200 మంది సాయుధ రక్షకులను రంగంలోకి దింపి అదుపులోకి తీసుకున్నారు. శ్రీగంధం చెట్ల నరికివేతకు సంబంధించి నిందితులపై పలు కేసులు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి ఎర్రచందనం దుంగలను తీసుకొచ్చి నగరంలోని వ్యాపారులకు విక్రయించడంలోనూ వీరి పాత్ర ఉన్నట్లు గుర్తించారు. నిందితుల నుంచి రూ.35 లక్షల నగదు, 350 గ్రాముల ఆభరణాలు, 9 కిలోల గంధం చెక్కలు, 4 కార్లు, 12 కార్ల నంబరు ప్లేట్‌లు స్వాధీనపరచుకున్నారు.



శ్రీగంధం దొంగల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు. చిత్రంలో నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నగదు, ఆభరణాలు

జన్మభూమిలో 1.19 లక్షల వినతులు

ఈనాడు, అమరావతి: జన్మభూమి-మా ఊరులో భాగంగా ఈ నాలుగు రోజుల్లో 1.19 లక్షల వినతులు అందాయి. ఇందులో శనివారం ఒక్కరోజే 26,024వచ్చాయని ఆర్టీజీఎస్ తెలిపింది. జన్మభూమిపై 78.31 శాతం మంది సంతృప్తిని, 21.69 శాతం మంది అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇప్పటివరకూ మొత్తం 62,189 గ్రామసభలు జరగగా 6,46,242 మంది చర్చావేదికలకు హాజరయ్యారు. 1,08,399 వైద్య శిబిరాల్లో చికిత్స పొందారు. మొత్తం 1,19,177 వినతులు రాగా వాటిల్లో సత్వరమే 931లను పరిష్కరించారు. 24,972 వినతులను పరిశీలించి మంజూరు చేయాలి. ఇంకా 69,614 పరిశీలించాలి. 1,805లను తిరస్కరించారు. ఇప్పటికే దరఖాస్తు చేయగా మళ్లీ వచ్చినవి 21,855 ఉన్నాయి.

నేడు అండమాన్‌ను తాకనున్న తుపాను

ఈనాడు, విశాఖపట్నం: పబుక్ తుపాను ఆదివారం సాయంత్రం అండమాన్ దీవులను తాకుతుందని వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. ఈ సమయంలో గాలులు గంటకు 70 నుంచి 90 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని తెలిపారు. ఆది, సోమవారాల్లో అండమాన్ ప్రాంతంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించారు. తుపాను తీరాన్ని దాటాక ఉత్తర, ఆగ్నేయంగా ప్రయాణించి తిరిగి ఈశాన్యంవైపు దిశను మార్చుకుని ఈనెల 7, 8 తేదీల్లో మయన్మార్ తీరం వైపు వెళ్తుందని అంచనా వేస్తున్నారు. 8వ తేదీనాటికి క్రమంగా బలహీనపడుతుందని చెబుతున్నారు. మరోపక్క రాష్ట్రంలో తూర్పు, ఈశాన్య గాలుల ప్రభావం కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

యువతిపై నగరి మాజీ మున్సిపల్ కమిషనర్ దాడి

- చితకబాది పోలీసులకు అప్పగించిన ప్రయాణికులు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: ఓ యువతిని లైంగికంగా వేధించడమే కాకుండా ఆమెపై చేయి చేసుకున్న నగరి మున్సిపాలిటీ మాజీ కమిషనర్ బాలాజీయాదవ్‌ను ప్రయాణికులు చితకబాదారు. ఈ ఘటన శనివారం తిరుపతి బస్టాండులో చోటుచేసుకుంది. తిరుపతికి చెందిన ఓ యువతి పుత్తూరు సమీపంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. ఈమె అవివాహిత. తండ్రి లేరు. తల్లితో పాటు తిరుపతిలో నివాసం ఉంటున్నారు. వివిధ ఆరోపణలతో రెండేళ్ల క్రితం ఉద్యోగం నుంచి సస్పెండైన బాలాజీయాదవ్ ఆరు నెలలుగా ఆమె వెంట పడుతున్నాడు. తన కోర్కె తీర్చాలంటూ వేధిస్తున్నాడు. శనివారం ఉదయం ఆమె పుత్తూరు వెళ్లేందుకు తిరుపతి బస్టాండ్‌కు రాగా.. అక్కడికి చేరుకున్న బాలాజీ యాదవ్ అందరిముందూ బెదిరించాడు. 'ఏదో ఒకటి తేల్చు..' అంటూ కేకలేశాడు. ఆమె భయపడి మిన్నకుండిపోవడంతో.. దాడికి పాల్పడ్డాడు. అక్కడున్న ప్రయాణికులు ప్రశ్నించగా.. వారితోనూ వాగ్వాదానికి దిగాడు. దీంతో ప్రయాణికులంతా కలిసి బాలాజీయాదవ్‌ను చితకబాది.. తిరుపతి తూర్పు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. బాలాజీ యాదవ్ గతంలో స్థానిక ఎమ్మెల్యే రోజాతోనూ వాగ్వాదానికి దిగి వివాదంలో ఇరుక్కున్నాడు.



నిందితుడు బాలాజీయాదవ్

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

మాకో ఫొటో స్టూడియో ఉండేది

సంక్రాంతి గురించి ఎంత ఎక్కువ చెప్పినా తక్కువే. పెద్ద పండగ అదే కదా? పైగా మా ఇంట్లో ఆడ పిల్లల హడావిడి చాలా ఎక్కువ. సంప్రదాయాల్ని బాగా పాటిస్తాం. ఇంట్లో నిత్య పూజలు జరుగుతుంటాయి. పండగ పూటైతే ఇంకాస్త ఎక్కువగానే ఉంటాయి. చిన్నప్పుడు సంక్రాంతి అనగానే గాలిపటాలు, కొత్త సినిమాలే గుర్తొచ్చేవి. వయసొచ్చాక, బాధ్యతలు పెరిగాక కాస్త మారాను. ఊర్లో మాకో ఫొటో స్టూడియో ఉండేది. పండగ పూట కొత్త దుస్తులు కట్టుకుని స్టూడియోలో ఫొటోలు తీయించుకోవాలన్న సరదా చాలామందికి ఉంటుంది. అందుకే.. ఈ రోజుల్లో నేను ఇంకాస్త బిజీగా ఉండేవాడ్ని. ఇప్పుడంటే మాంసాహారం అనేది సాధారణమైపోయింది. అప్పట్లో పండక్కో, పబ్బానికో, ఆదివారం పూటో.. వాటి జోలికి వెళ్లేవాళ్లం. ముక్కనుమ రోజున తినే ముక్కల కోసం ఎదురుచూపులు మొదలైపోయేవి. నాటుకోడి, గారెలు... ఇష్టంగా తినేవాళ్లం.

బ్యాంకు బ్యాలెన్స్ పెరిగిపోయేది

నేను బాగుండాలి.. డబ్బులు సంపాదించాలి అని అనుకుంటే.. నా బ్యాంకు బ్యాలెన్సు ఎవరూ ఊహించనంత పెరిగిపోయేది. కానీ అది నా స్వభావం కాదు. డబ్బుల వెనుక పరిగెట్టను. అందుకే నిదానంగా సినిమాలు చేస్తున్నా. స్పీడు పెంచితే.. నేను బాగుంటానేమో. నిర్మాతలు నష్టపోతారు. ఇతర భాషా చిత్ర పరిశ్రమల నుంచి అవకాశాలు వస్తున్నాయి. కానీ నా హీరోల్ని విడిచి వెళ్లలేను. నాకు చరణ్ కావాలి, బాలయ్య కావాలి, బన్నీ కావాలి.. అందరూ కావాలి. ముందు వీళ్లతో పని చేశాకే.. బయటి చిత్ర పరిశ్రమ గురించి ఆలోచిస్తా"

లైట్స్ ఆన్...
స్టార్ట్ కెమెరా...
యాక్షన్....

అంటూ మొదటి ఫ్రేమ్‌లోనే సినిమాలోని పవర్‌నంతా మనకు చూపించే దర్శకుడెవరు? మాస్ పల్స్ బాగా తెలిసినోడురా... అని మనం అనుకునేదెవర్ని? ఉగ్గుపాలతోనే మాస్ పట్టి ఉంటారేమో ఈయనకి? అని వ్యాఖ్యానించేది ఎవరి గురించి? ఇంకెవరు దర్శక సింహా బోయపాటి శ్రీను గురించే కదా! ఆ మాస్ మాంత్రికుడు బోయపాటి కుటుంబం, సంక్రాంతి కబుర్లు, సినిమా ముచ్చట్లు 'హాయ్'తో పంచుకున్నారు.

బోయపాటి...
మాస్ ఘనాపాఠీ



"ఓ అద్భుతమైన ఆయుధం తయారు అవ్వాలంటే భూమిలోంచి ఇనుము తీయాలి. దాన్ని ముక్కలుగా తెగ్గొట్టాలి. కొలిమిలో కాల్చాలి. సాన బెట్టాలి. అప్పుడు దాంతో యుద్ధం చేయాలి. ఊరికే వచ్చిన ఏ ఆయుధమూ.. పోరాడ్డానికి పనిచేయదు. ఇనుప ముక్క తీసుకెళ్లి ట్రైన్ ట్రాక్‌పై పెడితే అది కూడా ఆయుధం అవుతుంది. కానీ.. దాంతో యుద్ధం చేయలేవు. ఆయుధమే అన్ని కష్టాలు పడి తయారైతే.. మనం మనుషులం. ఇంకెంత కష్టపడాలి? పురిటినొప్పులు పడిన తరవాతే.. ప్రసవంలోని సుఖం, బిడ్డని కన్న ఆనందం అనుభవంలోకి వస్తాయి. పరిశ్రమలో ఏ ఒక్కరూ సులభంగా విజయాల్ని అందుకోరు. దాని వెనుక చాలా కష్టం ఉంటుంది. దానికి విలువ ఇవ్వాలి."

సెట్లో నేను సింహాన్నే

● సంక్రాంతి పండక్కి మీ సినిమా వస్తోంది. ఈ సీజన్‌లో మీ సినిమా రావడం ఇదే తొలిసారి కదా..?

అవును. అటు పండగ.. ఇటు సినిమా. ఆ సంబరాలు రెట్టింపు అవుతాయని నా నమ్మకం. 'వినయ విధేయ రామ' పండగలాంటి సినిమా. సంక్రాంతి పండగ ఎంత బాగుంటుందో మా సినిమా అంత బాగుంటుంది. మా సినిమాతో పాటు వస్తున్న మరో మూడు చిత్రాలు విజయం సాధించాలని కోరుకుంటున్నా.

● మీ సినిమాలనగానే యాక్షన్, హీరోయిజంతో పాటు ఫ్రేమ్ పట్టనంత మంది పాత్రధారుల్ని చూపిస్తుంటారు. ఇదంతా.. మీరు పుట్టి పెరిగిన వాతావరణం ప్రభావం అనుకోవచ్చా?

నూటికి నూరుపాళ్లు. ఈరోజుల్లో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పతనం అయిపోయింది. అలాంటి కుటుంబాల్ని తెరపై చూపిస్తే.. 'అరె.. ఉమ్మడి కుటుంబంలో ఇంత అందం ఉందా' అనే భావనైనా చాలామందిలో కలుగుతుందని చిన్న నమ్మకం. సినిమాలు చూసి జనాలు మారతారా? అనేది పక్కన పెడితే ఆ బాధ్యతైతే దర్శకుడిగా నాపై ఉందని బలంగా నమ్ముతా. మానవ సంబంధాలకు విలువ ఇవ్వడం అనేది భారతీయత. అమ్మానాన్న, అక్క, తమ్ముడు.. ఇలా ప్రతీ బంధానికీ విలువ ఇస్తాం. అందుకే అలాంటి అంశాల్ని బలంగా చెప్పాలని ప్రయత్నిస్తుంటా.

● దర్శకుడు ముత్యాల సుబ్బయ్య దగ్గర మీరు శిష్యరికం చేశారు. ఆ అనుభవాలు మీకెంత ఉపయోగపడ్డాయి.?

ఓ కుటుంబ కథని ఎలా చెప్పాలి? భావోద్వేగాల్ని ఎలా జోడించాలి? అనేది ఆయన దగ్గర్నుంచే నేర్చుకున్నా. దానికి మించి నా జీవితం చాలా నేర్పింది. ఇప్పటికీ నాపై నా కుటుంబం, ఆ అనుబంధాలు ప్రభావం చూపిస్తుంటాయి.

● ఫొటోగ్రాఫర్‌గా, పాత్రికేయుడిగా పనిచేశారు. ఇప్పుడు తెలుగు నాట అత్యధిక పారితోషికం తీసుకునే దర్శకులలో మీరొకరు. ఈ ప్రయాణం, నడిచొచ్చిన దారి ఇప్పటికీ గుర్తున్నాయా?

నాకు ఎక్కువ గుర్తొచ్చేవి ఆ రోజులే. వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ మర్చిపోలేను. నాకంటే చదువుకున్నవాళ్లు, మేధావులు ఈ పరిశ్రమలో ఉన్నారు. వాళ్లకు లేని అవకాశం దేవుడు నాకిచ్చాడు. అమ్మానాన్నల ఆశీర్వాదం, 'నేను బాగుండాలి' అని కోరుకునే శ్రేయోభిలాషుల వల్ల నేనీ స్థాయిలో ఉన్నాను. ప్రతి సినిమా మొదటి సినిమానే. ప్రాణం పెట్టి పని చేస్తా. సినిమా సినిమాకీ, విజయం విజయానికీ బాధ్యత పెరుగుతూనే ఉంది. ఈ స్థాయికి చేరుకోవడానికి ఎన్ని కష్టాలు పడ్డానో నాకు తెలుసు. అవి చెప్పుకొనేవి కాదు. పనిపై ప్రేమ పెరిగింది తప్ప ఎన్నడూ తగ్గలేదు. ఇప్పటికీ నా స్క్రిప్టు నా స్వహస్తాలతో నేనే రాసుకుంటుంటా. ఆఖరి వెర్షన్ వరకూ.. రాస్తా.

● మొదటి సినిమా చేస్తున్నప్పుడు లక్ష్యాలు, ఆశయాలు ఏమైనా ఉండేవా? అవి తీరాయా, లేదా?

తీరడం అనేది ఉండదు. ఏ నిమిషంలో ఏం జరుగుతుందో ఎవరం ఊహించలేం. ఊరి నుంచి ఇంత మందిని, ఇన్ని బంధాల్ని వదిలేసి ఇక్కడికి వచ్చాను. పరిస్థితులకు ఎదురొడ్డి పోరాడాను. ఓ దర్శకుడ్ని అవ్వాలన్నదే కల. అయ్యాను. మంచి దర్శకుడిగా నిలబడాలి, ఇంకా మంచి సినిమాలు తీస్తూనే ఉండాలి. 'భద్ర' సమయంలో పెద్ద కోరికలు ఉండేవి కావు. 'ఇంతొస్తే చాల్లే జీవితం సెటిల్ అయిపోతుంది' అనుకునేవాడ్ని. మన ఆలోచనలతో పాటు ఆశలూ మారుతుంటాయి. నా దృష్టిలో ఆశ, ఆశయం డబ్బుతో ముడిపడి ఉండవు. పేరు, ప్రఖ్యాతులు ముఖ్యమే. శిఖరం అంచుల వరకూ ప్రయాణం చేస్తూనే ఉండాలి. అది చేరుకున్న తరవాత.. ఎంత గొప్పగా నిష్క్రమించాలో కూడా తెలిసుండాలి.

ఇప్పుడు సినిమా ఓ భాగం

"పెదరాయుడు', 'పెద్దరికం', 'బలరామకృష్ణులు' ఈ సినిమాలంటే నాకు చాలా ఇష్టం. నేను స్వతహాగా పెద్దాయన ఎన్టీఆర్‌గారి వీరాభిమానిని. కథానాయకుడిగానే కాదు, రాజకీయ నాయకుడిగానూ ఆయన పద్ధతులు, విధివిధానాలూ బాగా నచ్చేవి. కృష్ణగారి సినిమాలూ విపరీతంగా చూసేవాడ్ని. అప్పట్లో వినోదానికి ఏకైక మార్గం సినిమానే. ఈ రోజు చాలా దారులు ఉన్నాయి. సినిమా ఓ భాగంగా మారిపోయింది. మిగిలిన మార్గాల నుంచి.. జనాల దృష్టి సినిమావైపు మళ్లించడం చాలా కష్టంగా మారిపోయింది.

మోక్షజ్ఞ తొలి సినిమా నాతో కాదు

బాలకృష్ణ కుమారుడు మోక్షజ్ఞ తొలి సినిమాకి నేను కరెక్ట్ కాదు. నాతో సినిమా అనగానే అభిమానులు ఏవేవో ఆశిస్తారు. తొలి సినిమాకే అవన్నీ చూపించకూడదు. తను కొన్ని సినిమాలు చేశాక అయితే... బాగుంటుంది.

అలా కలిసొచ్చిందంతే

నేనొచ్చి 'యాక్షన్' చెప్పగానే సినిమా మొదలవుతుంది. 'కట్' అనగానే సినిమా పూర్తవుతుంది. 'సింహా'లో సరదాగా ట్రై చేశాను. అది బాగా కలిసొచ్చింది. ఇప్పుడు కొనసాగిస్తున్నాను.

నేనేదో సాధిస్తానని నమ్మింది వాళ్లే

నా కుటుంబమే నా బలం. నా ఆయుధం. సినిమాల్లో నేనేదో సాధిస్తానని నమ్మింది వాళ్లే. మరీ ముఖ్యంగా అక్క, అన్నయ్యల ప్రోత్సాహం మర్చిపోలేనిది. అన్నయ్యగారి అబ్బాయి బలరాం నా దగ్గరే సహాయకుడిగా పనిచేస్తున్నాడు. అర్ధాంగి పార్వతి నాకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తుంటుంది. ఆమెపై నాకున్న ప్రేమ, మా ఇద్దరి అనుబంధం.. 'వినయ విధేయ రామ'లో కొన్ని పాత్రల్లో కనిపిస్తుంది. హర్షిత్, జోషిత, వర్షిత్ నా ముగ్గురు పిల్లలు. వాళ్లే నా ప్రపంచం.



● సెట్లో బోయపాటి నియంతలా ఉంటాడని మీతో పనిచేసినవాళ్లు చెబుతుంటారు. అది నిజమేనా?

అక్షరాలా నిజం. అలానే ఉండాలి కూడా. మన చేతికి ఉన్న వేళ్లే ఒకలా ఉండవు. అలాంటిది నా యూనిట్‌లో 170 నుంచి 200 మంది ఉంటారు. అవుట్‌డోర్‌కు వెళ్తే ఇంకో 500 మంది అదనంగా కనిపిస్తారు. అంతమందిని ఎలా కంట్రోల్ చేయాలి. 'సార్. సార్.. ఇలా నిలబడండి సార్.. అలా వెళ్లండి సార్' అంటే పని జరుగుతుందా? నా సినిమా షూటింగ్ అంటే రోజుకి 12 నుంచి 20 లక్షలు అవుతుంది. ఒకొక్క షాట్‌కీ పది నిమిషాలు ఆలస్యం అయితే.. గంటలు గంటలు వృథా అవుతాయి. ఆ డబ్బంతా ఎవరు తిన్నట్టు? నిర్మాత బాగుండాలని కోరుకునే దర్శకుడ్ని నేను. తను బాగోపోతే నేనెలా బాగుంటా? అందుకే సెట్లో పనులు స్పీడుగా జరగాలి. తప్పదు.. నా సెట్లో నేను సింహంలానే ఉంటా. అలాగని నా యూనిట్‌పై ఈగ కూడా వాలనివ్వను.

ఫిబ్రవరిలో బాలయ్యతో సినిమా

బాలయ్య బాబుతో నా అనుబంధం ప్రత్యేకమైనది. సినిమాలకు అతీతంగా ఈ బంధం సాగుతుంది. నేను ఏ విషయంలోనైనా స్పష్టంగా ఉంటా. దాగుడుమూతలు ఇష్టం ఉండదు. మొహమాటం కొద్దీ ఏదో మాట్లాడడం నచ్చదు. ఓ వ్యక్తి ముందు.. నా సమక్షంలో లేని మరో వ్యక్తి గురించి తక్కువగా మాట్లాడను. సరిగ్గా.. ఇలాంటి లక్షణాలే బాలకృష్ణగారిలో కనిపిస్తాయి. అందుకే నేనంటే ఆయనకు ప్రత్యేకమైన అభిమానం. మా నుంచి మూడో సినిమా వస్తోంది. ఫిబ్రవరిలో లాంఛనంగా మొదలెడతాం. ఇదేం రాజకీయ ప్రధానమైన చిత్రం కాదు. సామాజిక అంశాలతో సాగేదే. వాటిలో అంతర్లీనంగా పాలిటిక్స్ కూడా ఉండొచ్చు.

■ నేను రాసుకునే ప్రతీ కథ దాదాపుగా చిరంజీవిగారికి వినిపిస్తుంటా. ఆయన విలువైన సలహాలు ఇస్తుంటారు. 'వినయ విధేయ రామ' కథ ఆయనకు బాగా నచ్చింది. 'సైరా' తరవాత రెండు కొత్త సినిమాలు చేస్తున్నారాయన. అది పూర్తయ్యాకే నా సినిమా ఉండొచ్చు.

● ఓ హీరో వంద మందిని మట్టికరిపించడం, కొడితే... భూమ్మీద బంతిలా లేచి పడడం.. ఇవన్నీ ఇప్పటికీ జనం చూస్తారని మీరు నమ్ముతున్నారా?

సినిమా అనేది ఓ కల. మనం చేయాలని, చేయలేని విషయాలు కొన్నుంటాయి. అవి తెరపై కథానాయకుడు చేస్తుంటే.. ప్రేక్షకులు ఆనందిస్తుంటారు. వాళ్లేం లెక్కలేసుకుని చూడరు. లాజిక్కులు వేసుకోరు. నిజ జీవితంలో ఓ అమ్మాయి 'ఐ లవ్ యూ' చెబితే... అబ్బాయి రోడ్డు మీద అప్పటికప్పుడు డాన్స్ చేసుకుంటూ పాట పాడుతుంటాడా? ఇవేం నిజ జీవితంలో జరగవని ప్రేక్షకులకు తెలుసు. కానీ వాళ్లు ఆస్వాదిస్తున్నారంటే అర్థం ఏమిటి? యాక్షన్ కోసమే యాక్షన్ అన్నది నాకు ఇష్టం ఉండదు. సన్నివేశాన్ని బట్టి, సందర్భాన్ని బట్టి.. నా హీరో విజృంభిస్తుంటాడు.

● ఈ దారి మార్చాలి.. అని ఎప్పుడూ అనిపించలేదా?

నేను వెళ్లేదారి సరిగా ఉన్నప్పుడు మారాల్సిన అవసరం ఏముంది? 'జయ జానకి నాయక' సినిమా విడుదల రోజున.. ఇంట్రవెల్ వరకూ చూసి ఓ పెద్దాయన ఫోన్ చేశాడు. 'ఏంటి? ఇంత స్లోగా వెళ్లావేంటి? సినిమా ఇంత సాఫ్ట్‌గా తీశావేంటి' అని అడిగాడు. 'మీరు సెకండాఫ్ చూసి ఫోన్ చేయండి' అన్నాను. సినిమా పూర్తయ్యాక.. 'ఇదీ బోయపాటి సినిమా అంటే' అని ఊగిపోయాడు. నన్నో యాక్షన్ సినిమాల దర్శకుడిలా చూస్తారు. అయితే కథల పరంగా కొత్తదారిలోనే వెళ్తా. ఏ కథ మరో కథలా ఉండదు. టక్కున మారిపోయి.. పక్కా లవ్ స్టోరీలు తీయడం కూడా సరైంది కాదు.

– మహమ్మద్ అన్వర్, ఫొటోలు: జయకృష్ణ

వెన్నెల'కంటిపాప'

అప్పుడే నాన్న పేరు చెప్పా

రాకేందు మౌళి...అనే పాటల రచయిత తెలుసా?
... పోనీ డబ్బింగ్ ఆర్టిస్ట్? ... లేకపోతే సింగర్? ... కాకపోతే హీరో?
ఎవరండీ బాబు అంటారా?
రాకేందు వెన్నెలకంటి... ఇప్పుడు గుర్తొచ్చాడా? ఈ మల్టీ టాలెంటెడ్ యువకుడు మన పాటల రచయిత వెన్నెలకంటి కుమారుడే. ఉత్తమ రచయిత, సింగర్‌గా అవార్డు అందుకున్న వేదిక మీదనే తొలిసారిగా నేను ఫలానా వారి అబ్బాయినని గర్వంగా చెప్పుకొన్నాడు రాకేందు. నటుడిగా.. రాణిస్తూనే రచయితగా, గాయకుడిగా కొనసాగుతున్నాడు. అతని సినీ ప్రయాణం, అనుభవాలు.. ఇవీ..

ఇంజినీరింగులో నేను, మణికంఠన్ క్లాస్ మేట్స్. మణికంఠన్ 'విక్రమ్ వేద' సినిమా మాటల రచయిత. 'కాలా' సినిమాలో రజనీకాంత్ చిన్న కొడుకుగా నటించాడు. ఇద్దరం కలిసి ఇంజినీరింగును మధ్యలో ఆపేద్దామనుకున్నాం. ఆపేసి సినిమాల్లో అదృష్టాన్ని పరీక్షించుకుందాం అనుకున్నాం. నేను ట్రాక్ సింగింగ్‌తో ప్రయాణం మొదలుపెట్టాను. అందాల రాక్షసి మ్యూజిక్ డైరెక్టర్ రతన్ పిలిస్తే ట్రాక్ సింగింగ్‌కి వెళుతుండేవాణ్ని. ఆ సమయంలో రాసిన పాటలే... 'ఏమిటో...', 'మనసు పలికే'. ఆ రెండు పాటలు నచ్చి డైరెక్టర్ హను రాఘవపూడి వాటిని ఆ మూవీలో వాడారు. గీత రచన అరంగేట్రం అలా జరిగింది.

ఆ వేదికపై

అందాల రాక్షసి చిత్రంలో పాటకు ఉత్తమ గీత రచయిత, ఉత్తమ గాయకుడిగా రెండు అవార్డులు వచ్చాయి. ఆ రోజు వేదిక మీద అవార్డులు తీసుకున్న తర్వాత... నేను "వెన్నెలకంటి గారబ్బాయిన"ని తొలిసారిగా చెప్పుకొన్నా. అప్పటిదాకా నేను ఆ విషయం ఎవరికీ ఎక్కడా చెప్పలేదు. అలా ఎందుకు చేశానంటే ఒక గౌరవప్రదమైన వేదిక మీద నాన్న గారి పేరును పరిచయం చేసుకోవడం మంచిదనిపించింది. అలానే చేశాను.

సినిమా రిలీజ్ కాలేదు


డబ్బింగ్ సినిమాలకు పనిచేసే సమయంలో అన్నయ్య శశాంక్ వెన్నెలకంటికి నేను ఉడతా భక్తిగా సహకరించేవాణ్ని. ఎస్పీ చరణ్ తను తీస్తున్న 'మూడు ముక్కలాట'లో హీరోగా నటించమని అడిగారు. అది విడుదల కాలేదు. అయితే, ఆ సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన వ్యక్తి... నన్ను గౌతంమేనన్‌కు పరిచయం చేశారు. ఆ రకంగా 'సాహసం శ్వాసగా సాగిపో...' సినిమాలో మంచి పాత్ర చేసే అవకాశం లభించింది. అందులో షోకిల్లా... పాట రాసింది నేనే. తొలి తెలుగు ర్యాప్ సాంగ్ అది.

కంట్రోల్ ఆల్ట్ డిలిట్

ఆ తర్వాత తమిళంలో ఓ వెబ్ సిరీస్ చేశా. నిజానికి వెబ్ సిరీస్ అన్నది మొదలుపెట్టిందే మేమే. దాని పేరు "కంట్రోల్ ఆల్ట్ డిలీట్". అదొక క్రేజీ వెబ్ సిరీస్. అలా వెబ్ సిరీస్‌లకు తొలి టేకాఫ్ ఇచ్చింది మేమే. ఆ తర్వాత నేను, మణికంఠన్ కలిసి టాక్ షో కూడా చేశాం. ఆ తర్వాత "కిర్రాక్ పార్టీ" చేశాను. ఇప్పుడు "పల్లెవాసి" చేస్తున్నా.

మరిచిపోలేని అనుభూతి

చాలాకాలంగా రెహమాన్ గారికి పాటలు రాస్తూనే ఉన్నాను. సాధారణంగా రెహమాన్ గారు ఓ తమిళ సినిమాకు తెలుగు రచయితను మొదట పిలిపించరు. తమిళంలో ముందు రాయించి తర్వాత తెలుగులో రాయిస్తారు. అయితే మణిరత్నం గారి 'నవాబ్' సినిమాకు తెలుగులో మొదట రాయించారు. ట్యూన్ వినిపించి, సిరియా యుద్ధం మొదలుకుని యుగాంతం దాకా నేపథ్యంగా తీసుకుని రాయమన్నారు.



అలా రాసిందే భగభగ అనే పాట. ఓ వారం తర్వాత మణిరత్నం గారు ఫోన్ చేసి చాలా బాగా రాశావన్నారు. ఆ తర్వాత మణిరత్నం గారు పిలిపించి అదే సినిమాకు మరోపాట రాయించుకున్నారు. ఓ డబ్బింగ్ సినిమాకి ముందు తెలుగులో రాయించి, ఆ తర్వాత తమిళంలో రాయించుకోవడం అన్నది నిజంగా మరిచిపోలేని అనుభూతి.

– నాగరాజ్


ఈనాడు సినిమా



ఎన్టీఆర్ అంటేనే చరిత్ర!

ఆయన కథని సినిమాగా తీయాలనుకోవడం, దానికి ఆయన కన్నకొడుకే అంకురార్పణ చేయడం, ఒకేసారి రెండు భాగాల్ని తెరకెక్కించడం... ఇదంతా మరో చరిత్ర!

'చరిత్ర సృష్టించాలన్నా మేమే.. దాన్ని తిరగరాయాలన్నా మేమే' అంటూ వెండి తెరపై ఆ చరిత్రని సువర్ణాక్షరాలతో లిఖించడానికి సిద్ధమయ్యారు నందమూరి బాలకృష్ణ. 'ఎన్టీఆర్' బయోపిక్‌కి కర్త కర్మ క్రియ అన్నీ ఆయనే. నిర్మాతగా బాధ్యతలు మోస్తూ, 'కథానాయకుడు'గా అడుగులు వేస్తూ, 'మహా నాయకుడు'గా ఎదుగుతూ ఈ ప్రయాణాన్ని పూర్తి చేశారు. తొలి భాగం 'కథానాయకుడు'ని సంక్రాంతి కానుకగా విడుదల చేయడానికి సిద్ధమవుతున్న తరుణంలో బాలకృష్ణతో ముచ్చటించింది 'ఈనాడు సినిమా'. ఆ కబుర్లు ఇవీ..!



గొప్ప చిత్రకారుడు

నాన్నగారిలో గొప్ప చిత్రకారుడే కాదు, గొప్ప ప్లానర్ కూడా కనిపించేవారు. పౌరాణిక చిత్రాలంటే మేం బొట్టు లేకుండానే సెట్‌కి వెళ్లేవాళ్లం. ఎప్పుడు ఆలోచించేవాళ్లో ఏంటో, వచ్చి స్వయంగా తిలకం దిద్ది, సినిమా మొత్తం ఇదే ఫాలో అవ్వండి అని చెప్పేవారు. నేనున్న ఇల్లు కూడా ఆయన డిజైన్ చేసిందే. మా ఇల్లు ఒక్కటే కాదు, తెలుగు లలిత కళాతోరణం ఉంది కదా. దాని నిర్మాణం మొదట 90 రోజుల్లో పూర్తి కాదన్నారట. నాన్న దగ్గరుండి కట్టించారు. అవన్నీ ఈ సినిమాలో ఉంటాయి.

"నాన్న చేసిన పాత్రలు కొన్ని చేస్తే చాలనుకొనేవాణ్ని. కాని ఆయన పాత్రనే పోషిస్తానని అనుకోలేదు. నాన్న మిగిల్చిన పాత్రలు ఏమీ లేవు. 'గౌతమీపుత్ర శాతకర్ణి' కూడా చేయాలనుకొని ఆగిపోయారు. అది నేను చేశా. తెలుగు జాతికి వన్నె తెచ్చిన మహానుభావులు గౌతమీపుత్ర శాతకర్ణి, ఎన్టీఆర్. ఒకరు ప్రాచీన ఆంధ్ర చరిత్ర సృష్టికర్త అయితే, మరొకరు ఆధునిక ఆంధ్ర చరిత్ర సృష్టికర్త. ఆ ఇద్దరి పాత్రల్ని చేయడం నా అదృష్టం. 'ఎన్టీఆర్'... అమ్మానాన్నల మధ్య జరిగే కథ. ప్రపంచ చరిత్రలోనే ఒక కొడుకు తండ్రి పాత్రని పోషించడం, ఆ జీవిత చిత్రాన్ని స్వయంగా నిర్మించడం ఇదే మొదటిసారి".

నేనైతే న్యాయం చేయలేకపోయేవాణ్ని!



ఎన్టీఆర్ జీవిత చరిత్ర తెరకెక్కడానికి బీజం ఎక్కడ పడింది?

స్థలమహిమ అంటాం కదా. అదే ఈ సినిమాకి బీజం వేసిందని నా నమ్మకం. ఆసుపత్రిని ప్రారంభించడానికి నాన్నగారు పుట్టి పెరిగిన నిమ్మకూరుకు వెళ్లా. అక్కడే అనుకోకుండా నాన్నగారి సినిమా చేయాలనుందని చెప్పా. అంతే.. అన్నీ అలా కుదిరిపోయాయి.

ఈ సినిమా ప్రయాణంలో మీకు ఛాలెంజింగ్‌గా అనిపించిన సందర్భం ఏదైనా ఎదురైందా?

నటుడిగా నాన్న ప్రభావం బలంగా ఉంటుంది నాపైన. అలాగని ఆయన బిడ్డగా నేను ఏది పడితే అది చేయలేదు. ఆయన జీవిత సారాంశం, ఆయన సందేశాన్ని సినిమాలో చూపించాం. అయితే మళ్లీ ఈ గెటప్ చేస్తానో లేదో అని ఒకట్రెండు సార్లు ఆవేశంతో చేసినా, వాటిని పక్కనపెట్టాం (నవ్వుతూ). భవిష్యత్తులో అవసరమైతే వాటిని జోడించి చూపిస్తాం. ఇందులో నాన్నతో అనుబంధం ఉన్న చాలామంది పాత్రలు ఉండవు. అందరి పాత్రలు చూపించాలంటే సాధ్యం కాదు. అలాగని మేం కనిపించలేదే అనుకోవడానికి ఆస్కారం లేకుండా అలరిస్తుందీ చిత్రం. నాన్న జీవితంలో ఏ సందర్భంలోనైతే అద్భుతాలు జరిగాయో వాటిని ఆవిష్కరించుకుంటూ వెళ్లారు దర్శకుడు.

ఎన్టీఆర్ వాడిన కొన్ని వస్తువుల్ని కూడా ఈ సినిమా కోసం వినియోగించారని తెలిసింది. ఏయే వస్తువులు వాడారు?

నాన్న కళ్ల జోడుని, 'సీతారామ కళ్యాణం' సమయంలో ఆయన చేయించిన కుర్చీని ఇలా కొన్నింటిని వాడాం.

ఎన్టీఆర్ పాత్రలోకి పరకాయ ప్రవేశం చేసిన తొలి రోజు జ్ఞాపకాల్ని మాతో పంచుకొంటారా?

ఈ సినిమా కోసం మేం క్రోనోలాజికల్ ఆర్డర్‌లోనే వెళ్లాం. నాన్న మద్రాస్‌లో దిగడం నుంచి మొదలు పెట్టాం. ఆ సన్నివేశాల కోసమే తొలిసారి నేను నాన్నగారి వేషం ధరించాను. అక్కడ తాతినేని ప్రకాశరావు, రామారావు గారు, యోగానంద్ గారు, టి.వి.రాజుగారు ఇలా వాళ్లంతా రూమ్‌మేట్స్‌గా ఎలా ఉన్నారు? ఎలాంటి కష్టాలు పడ్డారనేది ఈ చిత్రంలో చూపించారు. అక్కడే హెచ్.ఎమ్. రెడ్డి పాత్ర కూడా పరిచయమవుతుంది.

చిత్రబృందంలో ఎన్టీఆర్ గురించి మీకే ఎక్కువ తెలిసి ఉంటుంది. మీరిచ్చిన సమాచారమెలాంటిది?

ఎన్టీఆర్ గురించి ప్రేక్షకులకు ఎంత తెలుసో, నాక్కూడా అంతే తెలుసు. నాన్నకి మేకప్ లేని సమయంలో ఆయన జీవితంలో జరిగిన సంఘటనల పైనే దృష్టిపెట్టి ఈ చిత్రం చేశాం. వారసుడిగా నాన్న గారిని దగ్గర్నుంచి చూసినవాణ్ని కాబట్టి కొన్ని తెలిసిన విషయాలు చెప్పాను. మిగతా విషయాలన్నీ దర్శకుడు పరిశోధించి కథ రాసుకొన్నారు. ఆహార్యం, ఆంగికం, వాచికం పరంగా నేనే జాగ్రత్తల్నీ తీసుకొన్నా.

బసవతారకం పాత్ర కోసం విద్యాబాలన్‌కు మీ అమ్మ గారి గురించి ఇన్‌పుట్స్ ఇచ్చారా?

మా పెద్దక్క ఆమెకు చాలా విషయాలు చెప్పింది. విద్యాబాలన్ కూడా కొంత పరిశోధన చేసింది. నాన్న గారు 'బసవతారకం' క్యాన్సర్ ఆసుపత్రి ఎందుకు నిర్మించాల్సివచ్చింది? అనే విషయాలు ఈ సినిమాలో ఉన్నాయి. వాటి గురించి ముందే క్షుణ్నంగా ఆమె అధ్యయనం చేసింది. విద్యాబాలన్ గొప్ప నటి. జాతీయ అవార్డులు అందుకున్నారామె.

అలా పెంచడమే మంచిదైంది

నాన్న మమ్మల్ని ఎప్పుడూ గారాబం చేయలేదు. అలాగని ఆయన జీవితంలో పడిన కష్టాలన్నింటినీ మా ముందు చెప్పుకొని బాధపడింది లేదు. ఆయన దర్శకత్వంలో సినిమా చేస్తున్నప్పుడు కూడా తన బిడ్డగా, ప్రత్యేకంగా అస్సలు చూసేవారు కాదు. నాకు ఇప్పటికీ గుర్తు. 'విశ్వామిత్ర' సినిమా చేస్తున్నాం. కపాల మోక్షం పొందే నేపథ్యంలో సన్నివేశాలు తీస్తున్నారు. నా కాలు దగ్గర ఒక టపాసు పేలాలి. కానీ అది పేలలేదు. ఇంతలో మరొకటి విసరండి అన్నారు. అప్పుడు దాంతో పాటు అంతకు ముందు వేసింది కూడా పేలింది. కాలికి గాయమైంది. అయినా నేను కదల్లేదు. కదిలితే షాట్ పూర్తవదని. అప్పుడు నా కాలికి గాయమైందని చూసినా, ఆయన నెక్ట్స్ షాట్ అంటూ వెళ్లిపోయారు. వేరేవాళ్లయితే ఎంత హడావుడి చేసేవారో. మమ్మల్ని అలా పెంచడం మంచిదైంది. జీవితంలో కష్టాల్ని భరించే ధైర్యం వచ్చింది.

ఈ సినిమాలో మోక్షజ్ఞ ఉంటే బాగుంటుందని అభిమానులు భావించారు..?

నేనేమీ అనుకోలేదు. వాడిపై ఒత్తిడి చేయదలచుకోలేదు. అయితే మా మనవడు నటించాడు. వాడికేమో ఏడు నెలలు. తనకు బెస్ట్ డెబ్యూ అనిపించింది. సెట్లో కంగారు పడతాడేమో అని భయపడ్డాం. కానీ.. అస్సలు ఏడ్వనే లేదు. ఎవరు మాట్లాడితే వారి వంక చూస్తున్నాడు. సెట్లో లైట్స్ వేడి తట్టుకోవడం కష్టం అనుకుంటాం కానీ.. చక్కగా నటించి వెళ్లిపోయాడు. వాడి ముత్తాత స్థాయిలో నటించాడు.

ముందు తేజని దర్శకుడిగా ఎంచుకున్నారు? మరి ఈ సినిమాలోకి క్రిష్ ఎలా వచ్చారు?

తేజని అనుకున్నాం. షూటింగ్ కూడా మొదలెట్టాం. కానీ 'ఇంత బరువు మోయలేను' అని సతమతమయ్యారు. ఇదే విషయం విద్యాబాలన్‌గారికి చెప్పడానికి ముంబయి వెళ్లా. 'సినిమాలో మార్పులు జరుగుతున్నాయి. మీరేం కంగారు పడొద్దు' అని చెప్పా. అదే సమయంలో 'మణికర్ణిక' షూటింగ్‌లో భాగంగా క్రిష్ అక్కడే ఉన్నారు. సాయంత్రం నా దగ్గరకు వచ్చి.. 'బాబూ నేను డైరెక్ట్ చేయనా' అని అడిగారు. అక్కడికక్కడ రెండు నిమిషాల్లో నిర్ణయం తీసేసుకున్నా. తెలుగు సాహిత్యం చదివిన వ్యక్తి ఆయన. బయోగ్రఫీలు బాగా చదివారు. అలాంటి దర్శకుడు నా సినిమాకి న్యాయం చేస్తాడనిపించింది. ఓ దశలో ఈ చిత్రానికి నేనే దర్శకత్వం వహిద్దామనుకున్నా. కానీ నేనైతే న్యాయం చేయలేకపోయేవాణ్నేమో.

సొంత సంస్థ స్థాపించారు. ఇన్నేళ్లలో లేని ఆలోచన ఇప్పుడే ఎందుకు వచ్చింది?

నిమ్మకూరు వెళ్లినప్పుడు 'ఎన్టీఆర్' చిత్రాన్ని ప్రకటించాం. అప్పుడే నిర్మాతగా మారాలన్న ఆలోచన వచ్చింది. 'రౌడీ ఇన్‌స్పెక్టర్' సమయంలోనే నిర్మాతగా మారాలన్న ఆలోచన వచ్చింది. ఎందుకో కుదర్లేదు. ఇన్నాళ్లకి నాన్నగారి సినిమా తీస్తున్నప్పుడే అది సాధ్యమైంది.

నాన్నగారి పేరుతో ఇంకొన్ని బయోపిక్‌లు సిద్ధమవుతున్నాయి. వాటిపై మీ అభిప్రాయం ఏమిటి?

నేను వాటి గురించి పట్టించుకోను. 'ఎన్టీఆర్'ని మాత్రం నేను లాభ నష్టాల్ని బేరీజు వేసుకుని తీయలేదు. నాన్నగారి పేరును చిరస్థాయిగా నిలబెట్టాలన్నది మా ప్రయత్నం. ఇక ఆయన వ్యక్తిగత విషయాలు, సొంత విషయాలు పక్కన పెట్టి చూడాలి. కానీ అటువంటి వాటిని కూడా క్యాష్ చేసుకుంటున్నారు. ఆ స్థితికి నేను వెళ్లను. దిగజారను. కొంతమంది తమ ఉనికిని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. లోకం తీరే అంత. అంతెందుకు నా గురించి కూడా రకరకాలుగా చెబుతుంటారు. అభిమానిని కొట్టానంటారు. నేను వెళ్లింది దేనికి? ఎన్నికల ప్రచారానికి. సినిమా సభకీ, ఎన్నికలకూ తేడా తెలియాలి కదా? అప్పుడే అభిమాని కూడా రాజకీయంగా ఎదుగుతాడు. నేనిచ్చినన్ని ఫొటోలు ఏ హీరో అయినా ఇస్తాడా? నా కోసం ఎక్కడెక్కడి నుంచో వస్తారు, అప్పులు చేసి మరీ నన్ను చూడాలనుకుంటారు. అలాంటప్పుడు వాళ్లకో తీపి జ్ఞాపకంగా ఫొటో ఇవ్వాలనిపిస్తుంది.

బోయపాటి చిత్రం ఎప్పుడు?

ఫిబ్రవరిలో లాంఛనంగా మొదలవుతుంది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక రెగ్యులర్ షూటింగ్ గురించి ఆలోచిస్తా. క్రిష్, బోయపాటి, పూరి.. ఇలాంటి దర్శకులతో హాయిగా ఉంటుంది. నన్ను బాగా అర్థం చేసుకుంటే ఎవరికీ ఏ టెన్షన్ ఉండదు. కెలకాలని చూస్తే మాత్రం సునామీనే (నవ్వుతూ).

పేట కోసం వేట

సెట్లో సందడి



కార్తీక్ సుబ్బరాజు, రజనీకాంత్

రజనీకాంత్ పక్కన బొద్దుగా.. ముద్దుగా ఓ వ్యక్తి కనిపిస్తున్నారు కదా? ఆయన రజనీ తాజా చిత్రం 'పేట'లో కొత్త కమెడియన్ అనుకుంటున్నారేమో.? భలేవారే. తనే ఈ సినిమాకి దర్శకుడు. పేరు కార్తీక్ సుబ్బరాజు. చూడ్డానికి ఇంటర్‌లో తుంటరి వేషాలేసే కుర్రాడిలా కనిపిస్తున్నాడు కానీ మహా దిట్ట. రెండు సినిమాలకే రజనీకాంత్‌ని డైరెక్ట్ చేసే అవకాశం దక్కించుకున్నాడు. అందుకే కార్తీక్ పేరు తమిళనాట మార్మోగిపోతోంది. తనంత అదృష్టవంతుడు లేడని అక్కడి ఫిల్మ్‌నగర్ వర్గాలు గొప్పగా చెప్పుకుంటున్నాయి. వచ్చిన అవకాశాన్ని ఎంతవరకు అందిపుచ్చుకున్నాడో తెలీదు కానీ, ఇప్పటికే 'పేట' ప్రచార చిత్రాలు, అందులో రజనీ డైలాగులు అభిమానుల్ని కిర్రెక్కిస్తున్నాయి. 'కుర్రాడు కొత్తోడే కదా..' అనుకునే రకం కాదు రజనీ. సెట్లో దర్శకుడే కెప్టెన్ అనే విషయాన్ని ఆయన నమ్ముతారు. అందుకే కెప్టెన్ మాట ఫాలో అవుతూ సన్నివేశంలో లీనమైపోయేటప్పుడు ఇలా క్లిక్‌మంది ఫొటో. అశోక్ వల్లభనేని నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రం 10న విడుదల కానుంది.

మొదటి చిత్రం మారింది

అప్పటి ముచ్చట!



కె.విశ్వనాథ్

అన్నపూర్ణ వారి 'పూలరంగడు' (24-11-1967) అదే సంస్థ నిర్మించిన 'ఆత్మగౌరవం' (18-03-1966) కన్నా ముందే తెరకెక్కి ఉండాల్సింది. అంతేకాదు దర్శకుడిగా కె.విశ్వనాథ్‌కి 'పూలరంగడు' తొలి చిత్రం కావాల్సింది. కానీ అలా జరగకపోవడం వెనుక ఓ కథ ఉంది. అదేంటంటే తొలుత అనుకున్న 'పూలరంగడు' కథ హీరో ఏఎన్నార్‌కి నచ్చలేదు. కథను ఎంపిక చేసుకొని తర్వాత టైటిల్‌ని ఖాయం చేయడం అన్నపూర్ణ అధినేత దుక్కిపాటి మధుసూదనరావుకి అలవాటు. దీనికి విరుద్ధంగా ఆయనకి 'పూలరంగడు' టైటిల్ నచ్చి, కె.విశ్వనాథ్‌ని దర్శకుడిగా తీసుకొని, టైటిల్‌కి అనుగుణంగా కథ రాయమని ముళ్లపూడిని కోరారట. ముళ్లపూడి అల్లిన కథ విషాదాంతం కావడంతో ఏఎన్నార్‌కి నచ్చక పోవడంతో చిత్రం వాయిదా పడింది. హీరోకి నచ్చేలా కథ రూపొందేవరకు దుక్కిపాటి కసరత్తులు మొదలు పెట్టారు. ఆలోగా యద్దనపూడి సులోచనారాణి రాసిన 'ఆత్మగౌరవం' కథ రంగ ప్రవేశం చేసింది. అది అందరికి నచ్చటంతో నిర్మాణ రథం కదిలింది. దర్శకుడిగా విశ్వనాథ్‌కి మొదటి చిత్రంగా 'పూలరంగడు' బదులు 'ఆత్మగౌరవం' రికార్డులోకి ఎక్కింది.

– శ్రీవత్స

బాలీవుడ్ అగ్రకథానాయకులుగా వెలుగొందుతున్న ఖాన్ త్రయం షారుఖ్, సల్మాన్, ఆమీర్‌ల సరసన నటించాలని ప్రతి కథానాయిక ఎదురుచూస్తుంటుంది. అందుకు అగ్రకథానాయికలూ మినహాయింపు కాదు. మరి ఒకే ఏడాదిలో ముగ్గురు ఖాన్‌లతోనూ నటించే అవకాశం వస్తే ఇక ఆ నాయిక ఆనందానికి హద్దేముంటుంది? కత్రినా కైఫ్‌కు 2018 అలాంటి సువర్ణావకాశాన్నే అందించింది. ఆ ఏడాది షారుఖ్, ఆమీర్‌లతో కత్రినా నటించిన చిత్రాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. ఇక సల్మాన్‌తో నటిస్తున్న చిత్రం గతేడాదే మొదలైంది. ఈ ఏడాది ఆ చిత్రం విడుదలవుతుంది. 2018లో కత్రినా సినిమాల ముచ్చట్లివీ.

ఖాన్‌లతో నటించినా కలసిరాలేదు




- 2018లో ఆమీర్ ఖాన్‌తో 'థగ్స్ ఆఫ్ హిందుస్థాన్', షారుఖ్ ఖాన్‌తో 'జీరో' చిత్రాల్లో నటించింది కత్రినా కైఫ్. వాటిపై ఎన్నో ఆశలు పెట్టుకుందామె. అయితే భారీ అంచనాలతో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రాలు పరాజయం పాలవడంతో ఆమెకు నిరాశే ఎదురైంది. అయినప్పటికీ ఆ రెండు చిత్రాల్లో తన అందచందాలతో అలరించడంతో పాటు అభినయంతో ఆకట్టుకుంది.
- 'ధూమ్ 3' తర్వాత ఆమీర్‌తో కత్రినా కలసి నటించిన రెండో చిత్రం 'థగ్స్..'. ఇందులో సురైయ్యా అనే నర్తకి పాత్రలో కనిపించిందామె. పాటల్లో తన డ్యాన్సులతో ఉర్రూతలూగించింది. మరీ ముఖ్యంగా 'సురైయ్యా..' అనే పాటలో కత్రినా గ్లామర్, స్టెప్పులు యువతకు తెగ నచ్చేశాయి. థియేటర్లలోనే కాదు.. ఆ పాటను ఆన్‌లైన్‌లో విడుదల చేసినప్పట్నుంచి అనూహ్య స్పందన వస్తోంది. ఇప్పటికే 1.51 కోట్ల మందికి పైగా ఆ గీతాన్ని వీక్షించారు. 'మంజూర్ ఇ ఖుదా' అనే పాటలోనూ కత్రినా అందాలతో వేడెక్కించింది.
- 'జబ్ తక్ హై జాన్' తర్వాత షారుఖ్ సరసన కత్రినా నటించిన రెండో చిత్రం 'జీరో'. బబితా కుమారి అనే సినీ కథానాయిక పాత్రలో నటించింది కత్రినా. ఇందులోనూ అందాలు ఆరబోసి అలరించిందామె. 'హుస్న్ పర్చమ్..' అనే పాటలో కత్రినా కళ్లుచెదిరే స్టెప్పులు వేసి వహ్వా అనిపించింది. ఆ గీతాన్ని ఆన్‌లైన్‌లో 3.5 కోట్ల మందికి పైగా వీక్షించడం విశేషం. షారుఖ్‌తో భావోద్వేగ సన్నివేశాల్లో తన అభినయంతో మెప్పించింది. అయితే ఈ రెండు చిత్రాలు ప్రేక్షకాదరణకు నోచుకోకపోవడంతో వచ్చే ఏడాది రాబోతున్న సల్మాన్ చిత్రం 'భారత్'పైనే ఆశలుపెట్టుకుంది కత్రినా.
- సల్మాన్ నటిస్తున్న భారీ చిత్రం 'భారత్'లో నాయికగా కనిపిస్తోంది కత్రినా. 'ఏక్ థా టైగర్', 'టైగర్ జిందా హై' లాంటి విజయవంతమైన చిత్రాల తర్వాత సల్మాన్‌తో మరోసారి జోడీ కట్టింది. ఆమెకు ఈ అవకాశం అనుకోకుండా వచ్చింది. మొదట ఈ చిత్రంలో ప్రియాంక చోప్రాను నాయికగా ఎంచుకున్నారు. అయితే ఆమె చివరి క్షణంలో ఈ సినిమా నుంచి తప్పుకుంది. దీంతో కత్రినాకు ఆ పాత్ర దక్కింది. ప్రస్తుతం ఆ సినిమా చిత్రీకరణలో తలమునకలైంది కత్రినా.

వసుంధర

ఈ పోలీసులెంతో ఫ్రెండ్లీ

వాళ్లిద్దరూ పోలీసులు. ఒకరికి అధికార హోదా ఉంటే మరొకరు సాధారణ కానిస్టేబుల్. అయితేనేం ఇద్దరూ తమ ప్రత్యేకతల్ని చాటుకున్నారు అధికారిణి ఇంటివద్దకే పోలీసుసేవల్ని అందుబాటులోకి తెస్తే... కానిస్టేబుల్ అమ్మతనాన్ని చాటుకుంది. ఇంతకీ వాళ్లెవరూ... ఏం చేశారో చూద్దామా..

అమ్మగా స్పందించింది



పోలీస్‌లవి కరకు మనసులు అనుకుంటారు చాలామంది. కానీ వారిలోనూ మనలానే ఓ సున్నిత కోణం ఉంటుంది. అదే నిరూపించింది హైదరాబాద్‌కు చెందిన కానిస్టేబుల్ ప్రియాంక. ఆమె బేగంపేట మహిళా పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తోంది. ఆమె భర్త రవీందర్ అఫ్జల్‌గంజ్ ఠాణాలో కానిస్టేబుల్. డిసెంబర్ 30 ఆదివారం రోజున రవీందర్‌ది నైట్ డ్యూటీ. అర్ధరాత్రి సమయంలో గుక్కపట్టి ఏడుస్తున్న నెలన్నర పాపను ఓ వ్యక్తి స్టేషన్‌కి తీసుకొచ్చాడట. ఆ పసి గుడ్డుకు ప్యాకెట్ పాలు పోసినా తాగలేదు. ఏం చేయాలో అర్థంకాలేదు పోలీసులకు. అదే సమయంలో చిన్న ప్రమాదం వల్ల సెలవులో ఉన్న ప్రియాంక భర్త రవీందర్‌కి ఫోన్ చేసింది. అప్పుడు సమయం అర్ధరాత్రి ఒంటిగంట. పాప ఏడుపు వినిపించడంతో ఆరా తీసింది. పసిపాప విషయం తెలియడంతో ఆమె పేగు కదిలినట్టైంది. ఎందుకంటే తను కూడా తల్లే. ఎనిమిది నెలల క్రితమే ఆమెకి ప్రసవమైంది. బిడ్డకు పాలిస్తోంది. అందుకే ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా తన కొడుకుని తల్లికి అప్పగించింది. సికింద్రాబాద్ ప్యారడైజ్ ప్రాంతం నుంచి అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌కి క్యాబ్‌లో బయల్దేరింది. ఓ తల్లిగా పసి గుడ్డుకు పాలు పట్టింది. ఆ చిన్నారి పాలు తాగి ఆమె ఒడిలో సేదతీరింది. తరువాత ఆ బిడ్డని ఆసుపత్రిలో చేర్పించారు. ఆ బిడ్డకి పాలివ్వడం ఏ మాత్రం ఆలస్యమైనా ప్రాణానికే ప్రమాదముండేదని.. సమయానికి పాలు పట్టడంతో అది తప్పిందని వైద్యులు చెప్పారు. 'నిజంగా అది విని నేను షాక్ అయ్యా. ఆ బిడ్డని బతికించాననే సంతోషం మిగిలింది. ఇలాగైనా ప్రజలకి పోలీసులపై మంచి అభిప్రాయం కలుగుతుందని నేను భావిస్తున్నా. నేను పాలిచ్చి కాపాడిన బిడ్డ ఎంత ముద్దుగా ఉందో. ఓ తల్లి నిర్లక్ష్యం వల్ల ఆ పరిస్థితి వచ్చింది. నాకు ఇచ్చినా సంతోషంగా పెంచుకునేదాన్ని. ఆరోజు ఆసుపత్రిలో తల్లికి అప్పగిస్తోంటే నాకు కొంచెం బాధగా అనిపించింది. కాసేపట్లోనే ఆ పసిదానితో ప్రేమలో పడిపోయా. మా ఇద్దరిదీ తల్లిపాల బంధం' అని అంటోంది ప్రియాంక.

ప్రజల వద్దకే పోలీసు



పోలీస్‌స్టేషన్ అంటే ఇప్పటికీ చాలామంది చెప్పే మాట త్వరగా న్యాయం జరగదనీ, పదే పదే తిప్పిస్తుంటారని. అలాంటి అపోహలకు చుక్కపెట్టేందుకు సిద్ధమయ్యారు మహారాష్ట్రకు చెందిన ఓ పోలీసు ఉన్నతాధికారిణి. ప్రజల ముందుకే పోలీస్ స్టేషన్ సేవల్ని తీసుకెళ్లారు. చాలా తక్కువ కాలంలో లక్షన్నర మంది గ్రామస్థుల సమస్యలను తీర్చారు. ఆమే వినీతా సాహు. బాంద్రా జిల్లా ఎస్పీ. ఎంతో మంది గ్రామస్థులు సమస్యలున్నా పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం గమనించారామె. పోలీసులంటే ఉన్న భయం, అపోహలు, స్టేషన్‌కి వెళితే పరువు పోతుందనే భావన... వంటివన్నీ అందుకు కారణాలని తెలుసుకున్నారు. వాటన్నింటినీ దూరం చేయాలని అనుకున్నారు. అలా 'సమస్య ఉంటే మాకు చెప్పండి... మేమే మీ ఇంటికొస్తాం' అని ప్రచారం చేయించారు. ప్రజలందరికీ ఇది తెలిసేలా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక స్వచ్ఛంద సంస్థల్నీ ఇందులో భాగస్వాముల్ని చేశారు. వారి ద్వారా మహిళలు, చిన్నారులకు న్యాయం జరిగేలా ఏర్పాట్లు చేశారు. అలా 2017 జనవరి 28న ప్రతి గ్రామంలో బడి లేదా పంచాయతీ కార్యాలయంలో మొబైల్ పోలీస్‌స్టేషన్లు, కొందరు పోలీసు అధికారుల్ని అందుబాటులో ఉంచారు. అక్కడ 24/7 గ్రివెన్స్ లేదా ఫిర్యాదు చేసేలా ఏర్పాట్లు చేశారు. ఇప్పుడు మొబైల్ పోలీస్ స్టేషన్ రూపురేఖలు మారిపోయాయి వాహనంపై డిజిటల్ తెరలతో పోలీసుల సేవల గురించి వివరిస్తూ ఫిర్యాదు తీసుకుంటున్నారు. యాప్ ద్వారా కూడా సామాన్యులకు అందుబాటులో ఉంటున్నారు. వినీతా సాహు తరచూ మొబైల్ స్టేషన్లు సందర్శిస్తూ... ఎంత వరకూ ఫిర్యాదులు పరిష్కారమవుతున్నాయో గమనిస్తున్నారు. ఇతర సిబ్బంది కూడా చాలా అప్రమత్తంగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అలా ఈ రెండేళ్లలో లక్షన్నర కేసులు పరిష్కారమయ్యాయి.



తల్లి తనకేమైనా భరిస్తుంది... ఎన్ని కష్టాలైనా పడుతుంది. అదే తన బిడ్డకి ఏదైనా అయితే అస్సలు సహించదు. అందుకు కారణమైన వారి మీద సివంగిలా విరుచుకుపడుతుంది. పులిలా పంజా విప్పుతుంది. ముంబయికి చెందిన మంజేరీ సిన్హా కూడా అలానే చేశారు. తన బిడ్డ వైకల్యానికి కారణమైన ఓ ఆసుపత్రిపై పోరాటం చేశారు. తన ఆవేదనకి మూల్యంగా కోర్టు తీర్పు ద్వారా ముప్ఫై ఒక్క లక్షల రూపాయల నష్టపరిహారం అందుకున్నారు. ఇంతకీ ఎవరీ మంజేరీ... ఏంటా కథ అనుకుంటున్నారు కదా... చదవండి ఆమె మాటల్లోనే!

అమ్మే గెలిచింది



నా పాపకి నిధి అని పేరు పెట్టుకున్నా. తనకిప్పుడు ఇరవై ఏళ్లు. ముంబయిలోని సెయింట్ జేవియర్స్ కాలేజీలో బీఏ చదువుతోంది. ఎయిమ్స్‌లో చికిత్స తరువాత చేయి మామూలుగా ఎదిగింది కానీ... పక్షవాతం వచ్చింది. ఎడమ చేయి ఉన్నా లేనట్టే. ఈ కేసు కోసం నేను ఎంత వ్యయప్రయాసలు పడ్డానో. నా జీతమంతా దీనికోసమే కేటాయిస్తే మా వారి జీతంతోనే కుటుంబం గడిచింది. నాభర్త ప్రోత్సాహంతోనే ఈ విజయం సాధించా. మరోవైపు నేను పోరాటం చేస్తూ ఉద్యోగినిగా నా విధుల్ని సక్రమంగా నిర్వహించా. చాలా తక్కువ కాలంలోనే పదోన్నతులు వరించాయి. ఈ కేసు గెలవడం వల్ల అందే ముప్ఫై ఒక్క లక్షల రూపాయల నష్టపరిహారాన్ని మా నిధి చదువు కోసమే ఉపయోగిస్తా. దాన్ని ప్రయోజకురాల్ని చేసి తన ఆత్మన్యూనతను దూరం చేయాలనుకుంటున్నా.

నిజంగా మేం ఈ కొత్త సంవత్సరాన్ని ఎంతో సంతోషంగా ఆహ్వానించాం. ఎందుకంటే డిసెంబర్ 26న వచ్చిన కోర్టు తీర్పు మాలో ఉత్సాహాన్ని నింపింది. ఏ తల్లికీ అలాంటి కష్టం రాకూడదు. కానీ వైద్యులు చేసిన పొరబాట్లకు పిల్లలే కాదు.. తల్లులూ ఎంతో బాధపడతారు. తిరిగి పూడ్చలేనంత నష్టమూ కలుగుతుంది. అందుకే నేను నా బిడ్డ వైకల్యానికి కారణమైన వైద్యుల నిర్లక్ష్యాన్ని భరించలేకపోయా. నా పాపని ఆసుపత్రుల చుట్టూ తిప్పిన ఖర్చును రాబట్టాలని, ఇక మీద ఎవరూ ఇలాంటి తప్పు చేయకూడదని ప్రసవం చేసిన ఆసుపత్రి మీద కేసు వేసి గెలిచా. అసలేం జరిగిందంటే... నేను ముంబయిలోని సెంట్రల్ రైల్వేస్‌లో సీనియర్ క్లర్క్‌గా విధుల్లో చేరా. ప్రస్తుతం చీఫ్ సూపరింటెండెంట్ హోదాలో ఉన్నా. మా వారు కూడా ప్రభుత్వ ఉద్యోగి. 1999లో నేను మొదటిసారి గర్భవతినయ్యా. మా ఇంటికి దగ్గర్లో ఉన్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ మెమోరియల్ ఆసుపత్రిలో డాక్టర్ సక్సేనా వద్ద చూపించుకునేదాన్ని. నాకు ఆడపిల్లలంటే చాలా ఇష్టం. నా తోడబుట్టిన వాళ్లకీ ఆడపిల్లలు లేరు. బిడ్డ గురించి ఎన్నో కలలు కన్నా.

థియేటర్ తాళం పోయింది: తొమ్మిది నెలలు నిండాయి. అది 2000 సంవత్సరం ఏప్రిల్ 5. తెల్లవారు జామున నొప్పులు మొదలయ్యాయి. దాంతో ఆసుపత్రికి వెళ్లా. అక్కడ నా పరిస్థితి చూసి 'వెంటనే ఆపరేషన్ చేసి బిడ్డను తీయాలి' అని అన్నారు. అయితే ఆపరేషన్ థియేటర్‌కి తీసుకెళ్లడానికి సిద్ధం చేశారు. కానీ అక్కడ థియేటర్ తాళాలు ఎంత వెతికినా కనిపించలేదు. దాంతో అక్కడ ఆపరేషన్ చేసే పరిస్థితి లేకపోయింది. చివరకు అక్కడున్న సిబ్బంది లేబర్ రూంకి తీసుకెళ్లి నార్మల్ డెలివరీ చేయడానికి ప్రయత్నించారు. బిడ్డ బయటకు రావడం కష్టమైంది. ఆ సమయంలో ఫోర్సెప్స్ ఉపయోగించి బిడ్డను బయటకు తీశారు. ఆడపిల్ల పుట్టిందని ఎంతో సంతోషించా. కానీ ప్రసవ సమయంలో ఫోర్సెప్స్ వల్ల బ్రెకియల్ ప్లెక్సస్.. వ్యవస్థ దెబ్బతింది. అది చేతిలో చాలా కీలక వ్యవస్థ కావడంతో పక్షవాతం వచ్చే పరిస్థితి ఏర్పడింది. మరోవైపు పాప ఎదుగుతున్నా... చేతిలో ఎదుగుదల లేదు.

ఏం చేయాలో అర్థం కాలేదు: పండంటి ఆడపిల్ల పుట్టిందనే సంతోషం లేకపోవడంతో ఎంతో ఏడ్చా. డాక్టర్ల నిర్లక్ష్యం వల్ల నా కూతురికి వైకల్యం మిగిలిందా అని బాధపడని రోజులేదు. ప్రసవమైన మొదట్లో ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపా. నా కుటుంబం అండంగా ఉండటంతో ఆ డిప్రెషన్ నుంచి బయట



ఎయిమ్స్‌లో చికిత్స

తొమ్మిదినెలలు కష్టపడ్డాక దిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స చేస్తారని తెలిసి వెళ్లాం. అక్కడ మా అమ్మాయి పరిస్థితి ఆపరేషన్‌తో మెరుగవుతుంది అని చెప్పడంతో కొత్త ఆశలు పుట్టుకొచ్చాయి. అక్కడ ఆపరేషన్ విజయవంతమైంది. పాప చేయి మామూలుగా పెరిగింది. కానీ ఆ చేయి ఏ పని చేయడానికీ సహకరించదని తరువాత తెలిసింది. నేను పాపని బాగు చేసుకునే క్రమంలో సెలవులు పెట్టాల్సి వచ్చేది. కొన్నిసార్లు లాస్ ఆఫ్ పే కూడా అయింది. కానీ బిడ్డ కోసం తప్పలేదు. మా ఉన్నతాధికారులు నన్ను అర్థం చేసుకున్నారు. ఎలాంటి రిమార్క్ పరిగణించకుండా సెలవు ఇచ్చేవారు. అయితే నా బిడ్డకు అలాంటి పరిస్థితి తెచ్చిన వారిని వదలకూడదని ఆ ఆసుపత్రి మీద ముంబయిలోని రాష్ట్ర వినియోగదారుల పరిష్కార కమిషన్‌లో కేసు వేశా. ఓ న్యాయవాదిని నియమించుకున్నా. చాలామంది 'నీకెందుకు... బిడ్డ ఎంతో కొంత మెరుగైంది కదా' అని అన్నారు. కానీ నాలా మరే తల్లికీ ఇలాంటి బాధ కలగకూడదు. వైద్యుల నిర్లక్ష్యం జీవితాలను తల్లకిందులు చేస్తుంది. అందుకే నేను ఆలోచించకుండా కేసు వేశా.

పడ్డా. దేశంలో పేరున్న ఎన్నో ఆసుపత్రుల్లో చూపించా. ఎక్కడా ఫలితం లేదని చెప్పారు. అయినా వదల్లేదు. అప్పులు చేసి మరీ వైద్యం చేయించేవాళ్లం.

మావారిదే తప్పన్నారు: ఆసుపత్రి మాత్రం తప్పంతా మాదేనంటూ మరో కేసు దాఖలు చేసింది. నా భర్త సంతకం పెట్టడం ఆలస్యం కావడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. చాలా కాలంపాటు వాదోపవాదాలు జరిగాయి. ముంబయిలో ఓ పేరున్న వైద్యుడి వద్ద పాపకి పరీక్షలు చేయించా. ఆ నివేదికలోనూ వైద్యుల నిర్లక్ష్యం వల్లే పాపకి వైకల్యం వచ్చిందని తేలింది. దాంతో ఆ వైద్యుడు కూడా మాకు అండగా నిలబడటానికి ముందుకొచ్చారు. నాకు కొంచెం బలం వచ్చినట్టు అనిపించింది. దాదాపు ఓ పద్నాలుగేళ్లు ఈ కేసు పరిశీలన, వాదోపవాదాలతోనే గడిచింది. నాకు ఒకవైపు బాధ.. మరోవైపు ఏమవుతుందా అనే ఒత్తిడి. అయితే 2014లో నా కేసును రాష్ట్ర వినియోగదారుల కమిషన్ పక్కన పెట్టింది. ఆరా తీస్తే ఆసుపత్రి వాళ్ల వల్లే అలా అయిందని తెలిసింది. నేను సహించలేకపోయా. ఎలాగైనా ఈ కేసును గెలిచి వైద్యుల నిర్లక్ష్యం బయటపెట్టాలనుకున్నా.

జాతీయ స్థాయిలో: జాతీయ కమిషన్‌లో ఫిర్యాదు చేశా. నా వాదనను, డెలివరీ సమయంలో ఇచ్చిన మందులు, బిల్లులు, గర్భవతిగా ఉన్నప్పుడు బిడ్డ ఎగుదలకు సంబంధించిన స్కానింగులు, రిపోర్టులు... అన్నీ అందజేశా. నా పోరాటానికి కొందరు వైద్యులు కూడా తోడయ్యారు. నా సమస్య పూర్వాపరాలు పరిశీలించిన జాతీయ కమిషన్... మళ్లీ కేసును పునఃప్రారంభించాలని రాష్ట్ర కమిషన్‌ను ఆదేశించింది. 2015 నుంచి కాస్త ముమ్మరంగా కేసు వాదోపవాదనలు జరిగాయి. చివరికి వినియోగదారుల ఫోరం ఇద్దరు వైద్యులతో ఓ కమిటీ వేసింది. ఆ వైద్యులు రెండు వైపులా వాదనలు విన్నారు. నా కూతురి పరిస్థితిని గమనించారు. నా వైపే న్యాయం ఉందని తేల్చారు. అంతేకాదు పన్నెండు లక్షల నష్టపరిహారాన్ని తొమ్మిది శాతం వడ్డీతో ఇరవై ఏళ్లకు ఎంత అవుతుందో అంత మొత్తం అందివ్వాలనీ, వ్యాజ్యం కింద పాతిక వేల రూపాయలు చెల్లించాలని రాష్ట్ర వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ ఆసుపత్రిని ఆదేశించింది. నిజంగా ఆ తీర్పు నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. నన్ను హేళన చేసినవారంతా... ఇప్పుడు పొగుడుతుంటే ఎంతో గర్వంగా ఉంది.

– పద్మ వడ్డె


నడుమునొప్పి... ఏం చేయాలి?

నాకు నలభైఏళ్లు. ఇద్దరు పిల్లలు. రెండో ప్రసవం తరువాత నడుమునొప్పి మొదలైంది. కొద్దిదూరం నడిచినా, ఎక్కువసేపు నిల్చున్నా నొప్పి వచ్చేస్తుంది. మందులు వేసుకుంటా కానీ... వ్యాయామంతో ఏదయినా పరిష్కారం చెప్పొచ్చా...

- ఓ సోదరి

ఫిట్ మంత్ర

కచ్చితంగా పరిష్కారం ఉంది. కొన్నిరకాల ఆసనాలు వేస్తే గనుక ఈ నొప్పి నుంచి బయటపడొచ్చు. మీరు మొదట వేయాల్సి మార్జాలాసనం. బోర్లా ఉండి, మోకాళ్లు, తుంటి భాగాన్ని ఒక వరుసలో వచ్చేలా, అరచేతులు, భుజాలు ఒక వరుసలో వచ్చేలా పెట్టాలి. ఆ తరువాత గాలి పీలుస్తూ, తల, నడుము పైకెత్తే ప్రయత్నం చేయాలి. తరువాత వీపుభాగం ఆంగ్ల యు ఆకృతిలో వచ్చేలా చూసుకోవాలి. ఇలా కొన్ని సెకన్ల పాటు ఉండి విశ్రాంత స్థితిలోకి రావాలి.



వీటన్నింటినీ ఆరుసార్ల చొప్పున చేయాల్సి ఉంటుంది. నెలరోజులు క్రమం తప్పకుండా చేస్తే గనుక నడుము నొప్పి తగ్గడమే కాదు, వెన్నెముక కూడా దృఢంగా మారుతుంది. పైగా వీటిని ఎవరైనా ప్రయత్నించొచ్చు.

● మీరు వేయాల్సిన రెండో ఆసనం ద్విపాదపీఠం. వెల్లకిలా పడుకుని కాళ్ల వెనక్కి మడవాలి. ఆ తరువాత రెండు చేతుల్ని చిత్రంలో చూపించినట్లుగా కలిపి గాలి పీలుస్తూ నడుమును పైకెత్తాలి. మళ్లీ గాలి వదులుతూ కిందికు వంచాలి.

● మూడో ఆసనం జఠరపరివృత్తి. కాళ్లు మడిచి లేదా తెరిచి చేయొచ్చు. రెండు కాళ్లు ఒకవైపు తీసుకొస్తూ మెడను రెండోవైపు తిప్పాలి. చేతులు నేలపై ఉంచాలి. అదే విధంగా రెండోవైపు చేయాలి.

ఈ మూడు అయ్యాక అపానాసనం వేయాలి. వెల్లకిలా పడుకుని మోకాళ్లను చుబుకం దాకా తీసుకొచ్చేందుకు ప్రయత్నించాలి. దీన్ని కాస్త వేగంగా చేయాల్సి ఉంటుంది.

డా॥ మణిపవిత్ర
యోగా నిపుణురాలు

బంగారం వెండి

5న ముగింపు-క్రితం



	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	32,970	32,970	32,500	32,690
ఆర్నమెంట్	30,790	30,790	30,150	30,300
వెండి (కిలో)	40,200	40,200	40,200	40,500

	ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం	
బంగారం(24క్యా)	32,450	32,600	32,660	32,860
ఆర్నమెంట్	30,900	30,700	30,240	30,480
వెండి (కిలో)	40,000	40,100	40,000	40,100

	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	32,150	32,820	-------	-------
ఆర్నమెంట్	30,240	30,530	3,024	3,048 గ్రా
వెండి (కిలో)	39,700	39,700	42.20	42.40 గ్రా

రంగవల్లిక

16 చుక్కలు, 4 వరుసలు. 4 వచ్చేవరకు.



- నరమనేని స్వర
వత్సవాయి, కృష్ణాజిల్లా

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ జనవరి 4, 2019 విజేతలు

ముత్యాల ముగ్గుల పోటీ

1. ఎం.అరుణ దండమూడి, గుంటూరు, 2. డి.చందన, కొండరాజుపల్లి, 3. పి.మణి, మాచర్ల, 4. ఏ.యుక్తశ్రీ, కావలి, 5. ఎస్.వాసవి, కృష్ణపట్నం, 6. జి.బిందుశ్రీ, మంచికల్లు, గుంటూరు, 7. కె.వెంకటేశ్వరి, ఒంగోలు, 8. వి.భానుకుమారి, చీరాల 9. జి.సుజిత, ప్రొద్దుటూరు, 10. ఎన్.లక్ష్మీదేవి, బనగానపల్లి



- టి.శ్రావణి
అమలాపురం



15 చుక్కలు, 5 వరుసలు, 5 వచ్చేవరకూ.

మా చిరునామా:
వసుంధర,
ఈనాడు
ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలిం సిటీ,
అబ్దుల్లాపూర్‌మెట్ మండలం,
రంగారెడ్డి జిల్లా - 501 512.
email: vasundhara@eenadu.net

ఆహా! ఈనాడు
aha@eenadu.in
.. ఏమి రుచి
విజయవాడ
ఆదివారం జనవరి 6, 2019

ప్ర- జ

బిర్యానీలో అత్తరు!

బిర్యానీలో మీఠా అత్తరు వేస్తే రుచి పెరుగుతుందని నా స్నేహితురాలు చెప్పింది. దీన్ని ఎన్ని చెంచాలు వేస్తే బిర్యానీ రుచి పెరుగుతుంది?

– రజనీ మిట్టపల్లి





మీఠా అత్తరు అనేది తినే పరిమళం. ఎడిబుల్ పెర్ఫ్యూమ్ అన్నమాట. మొఘలాయి వంటకాల్లో ఎక్కువగా వాడుతుంటారు. ముఖ్యంగా బిర్యానీల్లో వాడుతుంటారు. వివిధ రకాల పూలు, హెర్బల్స్ నుంచి ఈ అత్తరుని తయారు చేస్తారు. వెజ్, నాన్ వెజిటేరియన్, స్వీట్లలో వాడుకోవచ్చు. మొఘలాయి వంటకాలైన.. బిర్యానీలు, పులావులు, మటన్ చాప్స్, చికెన్ చాప్స్, కుర్మాలు, కబాబ్స్‌లో వేస్తే వాటి రుచి చాలా ప్రత్యేకంగా ఉంటుంది. చాలా తక్కువగా ఐస్‌క్రీంలు, మిల్క్‌షేకుల్లో కూడా వాడుకోవచ్చు. ఇక దీనిని ఎంత వాడుకోవచ్చు అంటే.. మీరన్నట్టుగా చెంచాల లెక్కన వేయరు. చిన్న దూది ఉండను తీసుకుని అత్తరులో ముంచి ఉడుకుతున్న రైస్‌లో ఉంచి తీసేస్తారు. అలా కాదు చెంచాతోనే వెయ్యాలి అనుకుంటే ఒకటి రెండు చుక్కలు చెంచాలో వేసి ఆ చెంచాని బిర్యానీలో ముంచి తీసేయాలి. దీని వల్ల రుచి, వాసన రెండూ బాగుంటాయి.

– శ్రీదేవి, హోటల్ మేనేజిమెంట్ నిపుణురాలు

పొరుగింటి పుల్లకూర

జడలబర్రె చీజ్ వేడివేడి తుక్పా!



ఎప్పుడో ఒకసారి పలకరించి.. చక్కిలిగింతలు పెట్టే చలిని తట్టుకోవడం ఫర్వాలేదు.. ఏడాది పొడవునా చలి గాఢంగా కౌగిలించుకుని, మంచుదుప్పటి కప్పుకున్నట్టుగా ఉండే లద్దాఖ్ ప్రాంతంలోని ప్రజలు ఆ చలిని ఎలా తట్టుకుంటారో తెలుసా? వేడివేడి నూడుల్స్‌తో చేసే తుక్పా, అద్భుతమైన గుర్‌గుర్ చాయ్... యాక్‌చీజ్‌లు వంటివి తీసుకుంటూ చలిలో ఉపశమనం పొందుతారు...



లద్దాఖ్ అంటే ముందుగా గుర్తొచ్చేది తుక్పా వంటకం. పేరేంటి ఇలా ఉంది అనుకుంటున్నారు కదూ...తుక్పా అంటే మనం సూపీ నూడుల్స్ అంటాం కదా! అవే. ఏ సమయం అయినా సరే చికెన్ లేదా మటన్‌తో చేసిన సూప్ మార్కెట్లో వేడివేడిగా దొరుకుతుంది. నాన్‌వెజ్ వద్దనుకునే వారికి అన్ని రకాల కాయగూరలు వేసి చేసిన సూప్ కూడా దొరుకుతుంది... అందులో ఉడికించిన నూడుల్స్ వేసుకుంటే అదే తుక్పా. చలిని నుంచి రక్షించుకోవడానికి ఏ సమయంలో అయినా సరే దొరికే వంటకం ఈ తుక్పా.

చాయ్ తాగాలనుకుంటే బటర్ టీ, గుర్‌గుర్ చాయ్, ఖావా వంటివి ప్రత్యేకంగా చేస్తారు. బటర్‌టీ ఇక్కడ ప్రత్యేకం. అయితే మనం తాగే చాయ్‌లా ఇది పల్చగా ఉండదు. చాలా చిక్కగా... నోటికి ఉప్పగా తగులుతుంది. చలికి



పెదాలు పగిలి రక్తం రాకుండా చేసే ఈ బటర్ చాయ్‌ని యాక్ పాల బటర్ వాడి చేస్తారు. మంచుపర్వతాల్లో ఉండే యాక్స్(జడలబర్రెలు) ఇక్కడ ప్రధాన జంతువులు. వీటి పాల నుంచి తయారుచేసిన చీజ్‌ని చుర్‌పీ అంటారు. ప్రతి దుకాణంలో ఇవి తోరణాల మాదిరిగా వేలాడుతూ ఉంటాయి. లేత గులాబీరంగులో ఉండే ఈ బటర్ చాయ్‌ని తాగడానికి పర్యాటకులు మక్కువ చూపిస్తూ ఉంటారు. దేశీపాస్తాగా పేరొందిన స్కూ వంటకం తినాలంటే లడాఖ్‌లోని లేహ్ ప్రాంతానికి వెళ్లాల్సిందే. గోధుమపిండితో బిళ్లలని చేసి నీటిలో ఉడికించి వాటిని చికెన్, మటన్ లేదా కాయగూరలతో గ్రేవీతో కలిపి ఈ వంటకాన్ని వడ్డిస్తారు. లడాఖీ పులావ్, పులియబెట్టిన బ్రెడ్‌తో చేసే టింగ్‌మోలు కూడా ఎంతో రుచిగా ఉంటాయి.

నేను నువ్వే ఆరోగ్యం!



దానమిస్తే దోషాలు పోతాయంటారు. అదే పంటవేస్తే క్షేత్రం బాగుపడుతుందని చెబుతారు. ఆ నువ్వులే వంటల్లో వాడితే.. కొత్త రుచులు రువ్వుతాయి. జిహ్వకు రుచిని స్తాయి. ఒంటికి వేడినిస్తాయి. జఠరాగ్నిని ఉత్తేజం చేస్తాయి. కీళ్లకు సత్తువనిస్తాయి. అందుకే మన పెద్దోళ్లు నువ్వుల పొడిని వంటల్లో తప్పనిసరి చేశారు. కాయగూరల్లో.. మాంసాహారంలో.. తియ్యటి చక్కీల్లో.. ఇలా ఎందెందు వెదికినా అందందే కనిపించేలా అనుగ్రహించారు. ఆ నువ్వులు వాడి వేడిగా, కమ్మగా చేసుకునే వంటకాల వివరాలు మీ కోసం..



తెలగపిండికూర...

కావాల్సినవి: తెలగపిండి- కప్పున్నర, ఎండురొయ్యలు- అర కప్పు, ఉప్పు- తగినంత, ఎండుమిర్చి- ఆరు, ధనియాలు- రెండు చెంచాలు, దంచిన వెల్లుల్లిపాయలు- ఐదు, పచ్చిమిర్చి- నాలుగు, నూనె- తగినంత, జీలకర్ర- అరచెంచా, మినప్పప్పు- అరచెంచా, అల్లం తరుగు- అరచెంచా, ఉల్లిపాయ ముక్కలు- మూడు చెంచాలు, పసుపు- పావుచెంచా, కరివేపాకు- రెండు రెమ్మలు

తయారీ: ఒక పాత్రలో కొద్దిగా ఉప్పు వేసి రెండు కప్పుల నీళ్లు వేసి మరిగించుకోవాలి. తెలగపిండిలో కొన్ని నీళ్లు కలుపుకొని ఉండకట్టకుండా మెత్తగా చేత్తో కలిపి.. అప్పుడు మరుగుతున్న నీళ్లలో వేసుకుని ఉడికించుకోవాలి. కాసేపటి తర్వాత పచ్చిమిర్చి కూడా వేసుకుని మధ్యలో కలుపుతూ ఉంటే పిండి ఉడికి కోడిగుడ్డు ఉక్కిరి మాదిరిగా అవుతుంది. ఈ లోపు వేరే కడాయిలో ధనియాలు, ఎండుమిర్చి, వెల్లుల్లిపాయలు వేసి దోరగా వేయించుకుని చల్లారాక రోట్లో వేసుకుని మెత్తగా దంచుకోవాలి. ఇప్పుడు కడాయిలో నూనె వేసుకుని జీలకర్ర, మినప్పప్పు, అల్లం తరుగు, ఉల్లిపాయ ముక్కలు, కరివేపాకు, దంచిన ధనియాల మిశ్రమం వేసుకుని వేయించుకోవాలి. అవి వేగాక ఎండు రొయ్యలు కూడా వేసి దోరగా వేయించాలి. చివరిగా ఉడికిన తెలగపిండి, ఉప్పు వేసుకుని బాగా కలిపితే చాలు.



టోస్ట్

కావాల్సినవి: రొయ్యలు- పావుకిలో, వెల్లుల్లి రేకలు- ఐదు, సన్నగా తరిగిన అల్లం- చెంచాడు, ఎగ్‌వైట్- ఒకటి, బ్రౌన్‌షుగర్- అరచెంచా, సోయాసాస్- చెంచా, అంచులు తీసేసిన బ్రెడ్ స్లైసులు- మూడు, నువ్వుల నూనె- వేయించడానికి తగినంత, నువ్వులు- 100గ్రా

తయారీ: రొయ్యలు, వెల్లుల్లి, అల్లం, గుడ్డులోని తెల్లసొన, పంచదార, సోయా అన్నింటినికలిపి మిక్సీలో మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఈ ముద్దను అరగంటపాటు ఫ్రిజ్‌లో పెట్టి ఉంచాలి. ఈ మిశ్రమాన్ని సమానంగా పరిచి పైన నువ్వులని ముద్దగా అద్దాలి. నువ్వులు చెదిరిపోకుండా నూనెలో జాగ్రత్తగా బ్రెడ్స్‌ని వేయించుకోవాలి. సాస్‌తో కలిపి వడ్డించుకుంటే రుచిగా ఉంటాయి.



- **నువ్వుల్లో గుండెకు మేలు చేసే పాలీఅన్‌శాచురేటెడ్ కొవ్వులు, ఒమెగా6 అధికంగా ఉంటాయి. పీచు, ఇనుము, క్యాల్షియమ్, అధికంగా ఉండే కొవ్వులు చలికాలంలో శరీరం వేడిని పెంచడానికి సహకరిస్తాయి. శాకాహారులకు కావాల్సిన ప్రొటీన్లు కూడా అందుతాయి.**
- **చిన్న వయసులో జుట్టు తెల్లబడే సమస్య నుంచి నువ్వుల నూనె ఉపశమనం కలిగిస్తుంది. జుట్టు పొడవుగా ఎదగడానికి కూడా నువ్వులు ఉపకరిస్తాయి. చర్మం, దంతాల ఆరోగ్యానికి ఇవి పెట్టింది పేరు.**

బర్ఫీ

కావాల్సినవి: నువ్వులు- అరకప్పు, నెయ్యి- చెంచా, కోవా- పావుకప్పు, పంచదార- అరకప్పు, నీళ్లు- అరకప్పు

తయారీ: ముందుగా మందపాటి కడాయిలో నువ్వులని దోరగా రంగు మారేంతవరకూ వేయించుకోవాలి. ఒక పాత్రలో నెయ్యి, కోవా వేసి రెండూ ఒకదానితో ఒకటి కలిసేటట్టుగా బాగా వేయించుకోవాలి. ఈ మిశ్రమానికి వేయించిన నువ్వులని కలిపి కాస్త చల్లారనివ్వాలి. ఇప్పుడు ఒక పాన్‌లో నీళ్లు, పంచదార వేసి తక్కువ మంట మీద పంచదారని పూర్తిగా కరగనివ్వాలి. కొద్దిగా పంచదార పాకం తీసుకుని చిన్న ఉండలా చేయడానికి ప్రయత్నించాలి. అది చక్కగా ఉండలా అయితే మీకు పాకం సరిగ్గా కుదిరినట్టు అన్నమాట. ఈ పాకాన్ని వెంటనే కోవా నువ్వుల మిశ్రమంతో వేసి బాగా కలపాలి. వెడల్పాటి పాత్రకి నెయ్యి రాసి ఆ పాత్రలో ఈ నువ్వుల మిశ్రమాన్ని వేసి అన్నివైపులా సమానంగా పరుచుకునేట్టు చేయాలి. చల్లారిన తర్వాత సమానంగా ముక్కలుగా కత్తిరించి పెట్టుకోవాలి.



గానుగ నూనె మంచిదా?

ఫిట్‌నెస్ గురూలు, పోషకాహార నిపుణులు 'కోల్డ్‌ప్రెస్డ్‌ఆయిల్' అని ఇంగ్లిష్‌లో అంటుంటే అదేదో ఆకాశం నుంచి ఊడిపడ్డ పదార్థం అన్నట్టు ఆశ్చర్యంగా చూడొద్దు. అది మన అమ్మమ్మలు, అమ్మలు వాడిన అచ్చమైన గానుగనూనె అంటే ఆశ్చర్యంగా ఉందా? శుద్ధి చేసిన రిఫైండ్ నూనెలని వదలి ఆరోగ్యానికి మంచిదంటూ కట్టె గానుగనూనె బాటపడుతున్నారు ఆహార, ఆరోగ్య ప్రియులంతా! గానుగ అంటే ఏంటో అర్థం కూడా తెలియని ఈ తరానికి ఇప్పుడు మళ్లీ కొత్తగా గానుగలని పరిచయం చేసే తీరు ఒకటి మొదలయ్యిందండోయ్! సాధారణంగా నువ్వులు, వేరుసెనగ, ఆముదం గింజలని గానుగలో వేసి వాటి నుంచి నూనె తీస్తారు. ఎద్దులు చుట్టూ తిరుగుతూ ఉంటే మధ్యలో వాటికి అమర్చిన బలమైన మొద్దులాంటి కట్టె ఒకటి నువ్వులని రుబ్బి నూనె తీస్తుంది. దీనినే గానుగ నూనె అంటారు. స్వచ్ఛమైన, ఘుమఘుమలాడే గానుగ నూనెను దోసెలపైనో, ఇడ్లీలపైనో వేసుకుని తింటే ఆ రుచిముందు నెయ్యి కూడా తీసికట్టే అంటారు ఆ రుచి తెలిసిన వాళ్లు. ఇంతకీ మామూలు నూనెలకి ఈ గానుగ నూనెకి పోషకాల్లో వ్యత్యాసం ఎక్కడ వస్తుందనే అనుమానం మీకు రావొచ్చు. వేగంగా తిరిగే యంత్రంలోకన్నా ఎద్దులతో తిరిగే గానుగ నూనెలో ఎక్కువ పోషకాలు ఉంటాయి. కారణం యంత్రాల్లో ఎక్కువ ఉష్ణోగ్రత ఉత్పన్నమై ఆ కారణంగా నూనెలోని సూక్ష్మ పోషకాలు కోల్పోతుంటాయి. గానుగనూనెలో కొలెస్ట్రాల్ తక్కువగా ఉంటుంది. అలాగే నూనె తీయగా మిగిలిన పిప్పిని తెలగపిండి అంటారు. పాలిచ్చే తల్లులకు నువ్వుల తెలగపిండితో చేసిన వంటకాలు ఎంతో మేలు చేస్తాయి.



నువ్వుల పులుసు

కావాల్సినవి: ఉల్లిపాయ ముక్కలు- అరకప్పు, వేయించిన నువ్వులు- అరకప్పు, చింతపండు గుజ్జు- కప్పు, ఉప్పు- తగినంత, పచ్చిమిర్చి- ఐదు, పసుపు- చిటికెడు, వెల్లుల్లిపాయలు- నాలుగు, జీలకర్ర- అరచెంచా ఆవాలు- అరచెంచా, ఎండుమిర్చి- మూడు, నూనె- తగినంత, కరివేపాకు- రెండు రెమ్మలు, కొత్తిమీర- కొద్దిగా

తయారీ: ముందుగా పచ్చిమిర్చిని చిన్న ముక్కలుగా చేసుకుని పాన్‌లో వాటిని పొడిగా వేయించుకోవాలి. నూనె వేయకూడదు. మిక్సీలో వేయించిన పచ్చిమిర్చి, పచ్చి వెల్లుల్లిపాయలు, పసుపు, వేయించిన నువ్వులు, కాసిని నీళ్లు వేసుకుని మెత్తగా పేస్ట్‌లా చేసుకోవాలి. ఈ పేస్టుని చింతపండు గుజ్జులో తగినన్ని నీళ్లు, ఉప్పు వేసి పల్చగా కలుపుకోవాలి. దీనిపై ఎండుమిర్చి, ఆవాలు, జీలకర్రతో తాలింపు వేసుకుని పచ్చి ఉల్లిపాయలు కలుపుకుంటే సరి.



మకర సంక్రాంతినే 'తిల్ సంక్రాంతి' అని కూడా పిలుస్తారు. తిల్ అంటే నువ్వులు. నువ్వులకు అంతటి ప్రాముఖ్యత ఉంది. దక్షిణాది, ఉత్తరాది అని తేడా లేకుండా దేశవ్యాప్తంగా బెల్లం, నువ్వులు కలిపి చేసిన 'తిల్ గుల్' లడ్డూలని ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకుంటారు.

అస్త్రం

రాసుకునే క్లిప్పులు..



కవర్ చింపి డబ్బాల్లోకి పోసిన తర్వాత ఇడ్లీరవ్వకి, బొంబాయి రవ్వకి తేడా తెలియదు. మైదా పిండికీ, మొక్కజొన్న పిండికి తేడా చెప్పమంటే చెప్పలేం. మరెలా కనిపెట్టేది. చిట్టీలు రాసి డబ్బాలకు అతికించడం పాత పద్ధతి. నోట్ క్లిప్స్‌పైన రాసి పెట్టుకోవడం కొత్త పద్ధతి. కవర్‌ని చింపిన తర్వాత వేరే డబ్బాలోకి పోయాల్సిన అవసరం లేకుండా ఆ కవర్‌కే ఈ క్లిప్‌ని పెట్టేయొచ్చు. గాలి చొరబడకుండా ఉంటుంది. క్లిప్‌పైన పదార్థాల పేర్లని స్కెచ్ పెన్‌తో రాసి పెట్టుకోవచ్చు. అవసరం అయితే వాటిని రాసి చెరుపుకునే అవకాశం కూడా ఉంది.



భలే వంటకం

అన్నం బొమ్మలు



ఆనిగిరీ... అబ్బే ఇదేదో గాంధీగిరీ లాంటిదని అనుకోకండి. మన అన్నం ముద్దనే జపాన్‌లో ఆనిగిరీ అంటారు. కాకపోతే ఈ అన్నం ముద్దలు చాలా కళాత్మకంగా ఉంటాయి. యుద్ధ సమయంలో వండుకోవడానికి ఉండదు కాబట్టి ఉప్పు వేసిన అన్నం ముద్దలని తమ వెంటపెట్టుకుని వెళ్లేవారట యుద్ధవీరులు. ఆ అన్నం ముద్దలే కాస్త వన్నెలద్దుకుని ఆనిగిరీగా



మారాయి.

తర్వాతి కాలంలో ఈ అన్నం ముద్దలకి సముద్ర నాచుని అలంకరించి వివిధ రకాల బొమ్మలు చేయడం మొదలుపెట్టారు. అందుకేనేమో జపాన్‌లో అన్నం తినను మారాం చేసే పిల్లలు చాలా తక్కువట. పాండాలు, యాంగ్రీబర్డ్స్, పోకోమాన్ వంటి అన్నం బొమ్మలని చూస్తూ ఇష్టంగా తినేస్తారు.

